UNIVERSAL
LIBRARY
OU_204202

UNIVERSAL
LIBRARY

ప్రచురణ

డిసెంబరు, 1968

మూల్యం

రూ 4/-

ముద్రణ

టి ఎన్ ఆర్ ప్రెస్,

హైదరాబాదు-4.

అంకితం

మధుర మందహాస భాసితులు,

సరసులు, సాహిత్య ప్రియులు,

జాతీయవాది, ప్రముఖ విద్యావేత్త,

సుప్రసిద్ధ వైద్య విద్యా ప్రవీణులు,

శస్త్రవైద్య నిపుణులు, ఉదారులు,

నిరాడంబరులు, దయార్ద్ర హృదయులు,

వైద్యకళాశాల ప్రధాన అధ్యాపకులు,

డాక్టర్ పిన్నమనేని నరసింహారావుగారికి

కృతజ్ఞతాపూర్వకంగా-

మురయా

న మ స్సు లు

ఈకథలు ఇంతకు పూర్వం ప్రచురించిన భారతి, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, యువ పత్రికాధిపతులకూ, సంపాదకులకూ,

ఈ పుస్తకం అంకితం పుచ్చుకోడానికి దయతో అంగీకరించిన గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా॥ పిన్నమనేని నరసింహా రావుగారికీ,

కోరిన వెంటనే ముఖచిత్రం చిత్రించి ఇచ్చిన మిత్రుడు, కవి, ప్రముఖ చిత్రకారుడు శ్రీ మడిపడగ బలరామాచార్యులుగారికీ,

అడిగిన వెంటనే నాయందభిమానంతో పీఠిక వ్రాసి ఇచ్చిన ఉస్మానియా విశ్వవిద్యాలయ కళాశాల అధ్యాపకులు, మిత్రులు శ్రీ మొదలి నాగభూషణశర్మగారికీ,

ఉత్తమ కళాకారులు, శిల్పి, నయవినయ గుణసంపన్నులు, కీ॥ శే॥ మడిపడగ రాజయ్యగారి పేరిట నెలకొల్పబడిన రాజ్యశ్రీ ప్రచురణ సంస్థ నిర్వాహకులకూ,

ఈ పుస్తకం ప్రచురణకు అనేక విధాలుగా సహాయం చేసిన మిత్రులు శ్రీ ములుకాల సంజీవరావుగారికీ, శ్రీ చందా రాజేశ్వరరావు గారికీ,

ఈ పుస్తకం చక్కగా ముద్రించిన టి ఎన్ ఆర్ ముద్రణాలయాధిపతులు, కవి పండిత పోషకులు శ్రీ టి. నాగేశ్వరరావు, B.Sc., (Agr) గారికి – నమస్సులు.

మురయా

నిత్య మల్లి

‘ఇక పిల్లవిషయమంటారా రత్నం అనుకోండి. అందచందాల విషయంలో విరోధం ఉన్న వాళ్ళుకూడా వంక పెట్టలేరనుకోండి. నాపిల్ల విషయం ఇల్లాఅనక మరోలా ఎల్లాఅంటాను అనికాదు నామట్టుకు నేను ప్రాణంమీదకువచ్చినా అబద్ధమన్నది ఆడను. ఇంతెందుకూ మీరు వచ్చి చూడండి. చూచి, నేనన్నదాంట్లో. ఒక్క అక్షరం పొల్లుంటే అప్పుడుఅక్కడే నాలుగుజాడించి వేయచ్చు ఆ అందుకేమీ అభ్యంతరంలేదు.

‘అయినా అబద్ధాలాడేదాకానూ, హెచ్చులు పోయేదాకానూ నా కేంపని!

‘కానైతే మీరు ఓరకంగా అనుమానించవచ్చు. అంతఅందమైన మీ అమ్మాయికి అందులో నాలుగువేలు కట్నం ఇస్తామంటూఉంటే మంచిసంబంధం ఎందుకురాలేదూఅని. ఆమాటకొస్తే సంబంధాలు రాకపోలేదు. చాలావచ్చాయి. ఎన్నిచోట్లకో వెళ్ళివచ్చాను. కాని అన్నివిధాలా అనువైనది ఒక్కటీ నాకంటపడలేదు. ఆస్తిఉంటే చదువు ఉండదు. కాస్త చదువుంటే సెంటుపొలం ఉండదు. రెండూఉంటే పిల్లవాడు బుద్ధిమంతుడుగా ఉండడు. కాదు ఈ మూడూ ఓమోస్తరుగా ఉన్నాయిలే అనుకొని సర్దిచెప్పుకొని వాళ్ళ గుమ్మంముందుకు వెళితే వాళ్ళు గొంతెమ్మకోరికలు కోరుతూ కొండెక్కి కూర్చుంటారు. అందుకూ సిద్ధపడ్డాను. కాని సంప్రదాయం! కాస్త విచారించేసరికి ఆ సంబంధంకోసం పడ్డశ్రమంతా వృథాఅయిపోయె. చదువుకొన్నవారు మీరుచెప్పండి—కుటుంబ సంప్రదాయం అన్నది బాగుండకపొయ్యాక ఇంక ఆ పైని ఎన్నిఉండి ఏం ప్రయోజనమూ అంట! ఏమంటారు?’

ఆయన ఒక్క క్షణంఆగి సమాధానంకోసం అతని వంక చూచారు. కొత్త ఆపేక్షగా, ఆశగా చూచారు. ఇంతవరదాకా. ఎవరా ఈవ్యక్తి ఇంతచనువుగా మాటాడుతున్నాడని ఆశ్చర్యపడుతూ కూర్చున్నాడు మోహన్.

మోహను కొత్త వెనకాముందూ ఆలోచించుకోవడానికి సావకాశం చిక్కలేదు, గత అర్ధగంటనుంచీ. ఆయన మోహనుగదిలోకి ప్రవేశిస్తూనే తల్లిదండ్రుల యోగక్షేమాలను విచారించారు. కుర్చీలో కూర్చుంటూనే “మాది నాయనా నువ్వు ఎరుగవుగానీ మీ పెదనాయనగార్ని వాళ్లనూ బాగా ఎరుగుదును. యోగ్యతఅన్నా సత్సంప్రదాయమన్నా వారిదే. మీ తాతగారి కాలంనుంచీకూడా అంతే. పీళ్ళు ఆయన పేరు నిలిపారు. అన్నట్లు మరచాను మీరెంతమంది అన్నదమ్ములూ?” అంటూ పరామర్శ మొదలుపెట్టారు. అతను సమాధానం చెప్పకముందే ఆయనే అందుకొని “అవునవును ... మీరు రెండోవారు కదూ. ఏమిటో వయస్సు మళ్లిన కొద్దీ జ్ఞాపకశక్తి తగ్గిపోతున్నది. అదీగాక చూడండీ రాకపోకలు లేక పోతే దగ్గర బంధుత్వాలనే మర్చిపోతాము. అలాంటిది స్నేహాలు ఎన్నాళ్ళుంటాయీ......” ఆయన అలాచెప్పుకు పోతున్నప్పుడు మోహను ఆయనకూ తన కుటుంబానికీ స్నేహం ఉండివుంటుందనీ, అది తనకు తెలియదనీ అనుకున్నాడు. అందువల్ల వీధిలోకి వెళదామని ప్రయాణమయిన వాడు ఆయన కెదురుగా కుర్చీలో కూర్చుని ఆయన చెప్పేమాటలు తాపీగా వినడానికి సిద్ధమయాడు.

ఆయన ఆ కొత్త అవకాశం వినియోగించుకుని అంతసేపూ మాటాడాడు. కుశల ప్రశ్నాదికాలయిన తర్వాత నెమ్మదిగా పెండ్లివిషయం ప్రస్తావించాడు. పిల్లవిషయం వివరంగా చెప్పాడు. అంతసేపూ తానే మాటాడాడు.

అప్పటికి కాస్త అలుపు వచ్చింది. అందుకే అన్నట్లు సంప్రదాయాన్ని గురించి ప్రశ్న వేశాడు.

"కాదుటండీ మరి! అందులో మనదేశంలో !" అన్నాడు మోహన్ —ఆ ప్రశ్న తన్ను ఉద్దేశించిందేనని నిర్ధారణకు వచ్చాక. ఓ క్షణం ఆలస్యంగా అన్నా అతనామాట కాస్త హుందాగా, స్పష్టంగా అనడంచేత ఆయన సంతోషించి, మరింత ఉత్సాహంతో మళ్ళీ అందుకొన్నాడు. "మంచిమాట అన్నారు. ఈనాడు జనం మరీ ఇలా దిరగబడి పోతున్నారుగానీ పూర్వం ఎంత ఆచారం పాటించేవారు. మంచి సంప్రదాయాన్ని ఎంతగా గౌరవించేవారూ! ఇంకా ఆ పాతకాలపు కుటుంబాలు ఒకటి రెండైనా ఉన్నాయి గనుకనే మాబోటివాళ్ళం కొంత సంతృప్తి చెందగల్గుతున్నాం. ఇంతకూ చెప్పవచ్చిందేమంటే మంచి సంప్రదాయం గల కుటుంబంలోని పిల్లవాడు దొరక్కనే గత మూడేళ్ళనుంచీ తిరుగుతున్నాను. సరే ఇంతకూ...అని కాసేపు నీళ్ళునమిలి, అసలు విషయంలోకి వస్తూ "ఇంతకూ మీ రావిషయం ఏమీఅననేలేదు" అన్నాడు.

"నేను చెప్పేదేముంది పెద్దవాళ్ళున్నారుగదా" అని మోహన్ అనీ అనకముందే ఆయన అందుకొని, "సరిగ్గా అనవలసిన మాట అన్నావు. అలా అంటావని నాకు తెలుసు. అయితే చూస్తూ కొంతమంది అంతా విని ఇప్పట్లో పెళ్ళి చేసుకోవాలని లేదండీ అంటారు. అదీ విన్నాను. అతనామాట అన్నాక ఇంక ఇంటికి వెళ్ళినా లాభం ఉండదు. ముందుగా వాళ్ళ యింటికి వెళితే "అబ్బాయి ఉద్దేశం ఎల్లా ఉన్నదో కనుక్కోలేదండీ అంటాడాపెద్దమనిషి. సరే ఏమైనా కొంత కాలాన్నిబట్టి పోవాలిగదా! మిగతా విషయాలు మేం పెద్దవాళ్ళం చూచుకుంటాం. ముందుమీరు పిల్లను చూడండి. పిల్లను పిల్లవాడూ పిల్లది, పిల్లవాణ్ణీ చూచుకోవడం ఒక రివాజు అయిందిగా ఈ రోజుల్లో.... మంచిదే. అలానే చేయండి" అన్నాడాయన.

"అట్నే—అందుకయినా ముందు మా వాళ్ళతో మాట్లాడిరండి.'' అన్నాడు మోహను.

"మాంచి భేషైన మాట అన్నావయ్యా. జరగవలసిన పనే అది. అందరూ కలిసివస్తే ఒక్కమాటే అంతా పిల్లను చూసినట్లవుతుంది. ఆ తరువాత విషయాలు అక్కడే మాట్లాడేసుకోవచ్చును. ఇరువురికీ సుళువైనపని. అవునదే బాగుంటుది. లేకపోతే ముందు కుర్రవాడు వచ్చి చూడడం, చూచాక, ఏమయ్యా అంటే మావాళ్ళు చూడాలండీ అనడం వాళ్ళు ఒక్కొక్కళ్ళే, రావడం వెళ్ళడం. ఇదంతా కాలయాపనాన్నూ, అనవసరమూన్నూ. అయితేచూడు నాయనా ఇక్కడేదైనా బావీ అదీ ఉన్నదీ?''

"బావి లేకపోవడమేమండీ ఉన్నది. ఏం ఎందుకండీ స్నానం చేస్తారా?'' అని అడిగాడు మోహను ఆశ్చర్యపడుతూ.

"అవును మరి చెయ్యద్దూ? సంధ్యవేళ కావస్తుందే?'' అన్నా రాయన ఏదో మరచిపోయిన విషయం అతనికి జ్ఞాపకం చేస్తున్నట్టు.

"అయితే అల్లాగే వేద్దురుగాని లేవండి'' అని మోహన్ తువ్వాళ్ళు అందించాడు. ఆయన వాటిని అందుకొని పెంపరా మెల్లవైపుకు వెళుతూ మధ్యలో ఓసారి వెనక్కు తిరిగి "చూడు నాయనా ఇవ్వాళ ఇక్కడే సంధ్య వార్చుకొంటాను'' అన్నాడు.

మోహనుకు వెంటనే అర్థం స్ఫురించలేదు. "అల్లాగేనండీ. దానికేం భాగ్యం, అంటూ అతను ఆయనవెంటకొంతదూరం వెళ్ళి, బావికి దారి చూపించి, తిరిగి గదిలోకి వచ్చాడు నవ్వుకొంటూ. కుర్చీలో కూర్చుని "అవును, వార్చుకోనీ. ఇందులో నాకేం అభ్యంతరం ఉంటుందీ ఓమూల కూర్చుని సంధ్య వార్చుకొని వెళ్ళడానికి నాకు చెప్పడం దేనికీ? ఒట్టి

చాదస్తుడిలా ఉన్నాడీయన" అనుకొన్నాడు మోహన్. అంతలో విషయం స్ఫురణకు వచ్చింది. 'అబ్బే ఆయనేం ఛాందసుడు కాదు. 'అనుకొని మొత్తంమీద చిక్కే తెచ్చిపెట్టాడే ! ఏంచెయ్యటం ఇప్పుడు ?' అని వితర్కించుకొంటూ క్రిందకు వెళ్ళాడు.

ఈయన్ను కనుక హోటలుకు తీసుకొని వెళితే మిత్రులంతా చూస్తారు. మడికట్టుకొని విడిగా కూర్చుని భోజనం చేస్తానంటాడు. ఎవర్రా ఈ ఛాందసుడని నలుగురూ అడక్క మానరు. అసలు వాళ్ళు అడక్క ముందేవిషయమంతా అందరితోనూ చెప్పేసేలాగున్నాడు'. ఇల్లాఅనుకొంటూ అతను క్రింద మెట్టుదగ్గరకు వచ్చాడు. అక్కడ ఆగి ఈ గొడవంతా ఎందుకూ పిన్నిగారితో బంధువని చెప్పేస్తే సరిపో తుంది అనుకొంటూ మెట్లు ఉన్న సందులోనుంచి వెనకవైపుకువెళ్ళి "ఏమండీ పిన్నిగారూ'' అనిపిలిచాడు నెమ్మదిగా. ఆయనకు భోజనం ఏర్పాటు చూడమని చెప్పాడు. ఎవరాయన అని ఆవిడ అడిగిన ప్రశ్నకు వెంటనే సమాధానం చెప్పక హోటల్లో కలిగే ఇబ్బందుల్ని గురించి చెప్పి, "ఆయనకు మరీ మడీ ఆచారమున్నూ, మా కాయన వేలిడిచిన పెద్ద మేన మామకు పెద్ద తండ్రి కొడుకు అవుతాడు లెండి'' అని తనకూ తెలియని బంధుత్వం కలుపుకోవాలని ప్రయత్నం చేశాడు. కాని ప్రయత్నపూర్వ కంగా చెప్పినట్లుగానే ఉన్నదా సమాధానం అతను ముఖం ఎంత అమాయికంగా పెట్టినా. ఆమె మొదట నవ్వుఆపుకొన్నది.

"అయితే మోహన్ మీ చినమేనమామ కేమవుతాడయ్యా'' అని పకాలున నవ్వేసింది. తన తెలివితక్కువతనాన్ని అంగీకరించేస్తున్నట్లు అతనూ నవ్వేశాడు.

"సరే పోనీ ఎవరైతే ఏంగాని రమ్మను.'' అని ఓ క్షణమాగి కాస్త అనునయంగా ఇంతకూ ఆయన ఏంపనిమీద వచ్చాడో చెప్ప కూడదుటయ్యా?" అని అడిగింది అతను ఏదో దాస్తున్నాడని పసిగట్టి.

"పెద్దపనేం కాదులెండి...సంబంధం వెతకడానికి వచ్చాడట" అన్నాడు మోహన్ చెప్పక తప్పదనుకొని.

"ఇంకేం వెదకబోయిన తీగె...మరి చెప్పవూ. అంతలో దాస్తావెందుకయ్యా? ఆ మాట చెప్పడానికే సిగ్గు పడుతున్నావా? అవునా?''అని నవ్వుతూ నిలవేసింది.

"అబ్బే లేదండీ.''

అతనీసారి నిజంగానే సిగ్గుపడ్డాడు.

అది గమనించి "చిన్నవయస్సులో సిగ్గు అన్నది మొగపిల్లల్లో కూడా ఎంత శోభిస్తుందో!'' అనుకొన్నదావిడ.

"అవున్లే ఇరవై యేళ్ళు వచ్చేదాకా పెళ్ళిళ్ళు కాకపోయ్యేసరికి ఈ రోజుల్లో ఆడపిల్లలు సిగ్గుపడడం మానేస్తున్నారు. అందుకని ఆ పని మనమైనా చేద్దామని మొగపిల్లలు నేర్చుకొంటున్నట్లున్నారు. అవునా?" అంటూ ఆవిడ లోపలకు వెళ్ళింది.

ఆయన అంతలో స్నానం పూర్తిచేసుకొని "ఇటు రావచ్చు కదమ్మా'' అంటూ చాలా పరిచయమున్న ఇంట్లోకి వచ్చినట్లుగా పెద్దపెద్ద అంగలువేస్తూ వంట ఇంట్లోకి వచ్చాడు. "అబ్బాయి ఇప్పుడే చెప్పాడు. మీరూ అతనికి బంధువులేటగా'' అంటూ గోడకానించిఉన్న పెద్ద పీటవేసుకొని కూర్చుని చెంబుతో మంచి నీళ్ళు ఉద్ధరిణా తెప్పించుకొని సంధ్య మొదలు పెట్టాడు.

ఆవిడ త్వరత్వరగా వంటపనులు పూర్తిచేసింది. దేవతార్చన మందిరం ప్రక్కగా పెద్దపీటవేసి, మంచి అరిటాకువేసి, ఆవిడ ఆ ముసలాయన్ను భోజనానికి పిలిచింది.విస్తట్లో అన్నీ వడ్డించి నెయ్యీ, పులుసూ,

మజ్జిగా కూడా అభిఘరించాక ఆయన పరిషేచనంచేసి భోజనానికి ఉపక్రమించాడు. "వారుకూడా ఉంటే బాగుండేది. యజమాని సహపంక్తిని లేకుండానే భోజనం చెయ్యవలసివచ్చిందే'' అంటూ ఆయన ఎంతో నొచ్చుకొన్నాడు. "క్యాంపునుండి ఇవ్వాళో రేపో వస్తారు మరి మీరు వస్తారని మాకు తెలియదుకదా" అని అంటూ ఆవిడ పప్పూ నెయ్యీ మారడిగింది. అవీ ఇవీ మారడుగుతూ మోహన్ను గురించి మంచిమాటలన్నది. "ఏంకావాలండీ'' అని అడిగి వినుక్కొంటూ "అతనూ వాళ్ళూ ఒప్పుకొంటే అంతకన్నా మీరు కాదు మరొకరు మాత్రం కోరవలసిందేముంటుందండీ" అని చెప్పించి ఆగింది. ఆయన సమాధానం చెప్పే అవకాశం ఇవ్వకుండా "చక్కనైన పిల్ల మా అన్నగారి దగ్గరో తమ్ముడు దగ్గరోఉంటే ఈ సంబంధం మీదాకా రానిచ్చేదాన్నా! అయితే మిమ్మర్నీ మీ సంప్రదాయాన్నీ చూశాక మంచిసంబంధం వచ్చిందని నాకూ సంబరంగానే ఉన్నది" అంటూ గోత్రాదికాలు అడిగి తెలుసుకొన్నది.

"మరింకేమండీ అన్నీ అనుకూలంగా ఉన్నాయి. మావాడని చెప్పడంకాదు పిల్లవాడు బుద్ధిమంతుడు. ఆస్తిపాస్తులు మీరు విచారించుకొన్నదేకదా. అంచక్కా చదువుకొంటున్నాడు, ఇంతకంటే మీరుమాత్రం పెద్ద సంబంధం తేగలరా చెప్పండి బాబాయిగారూ?" అన్నదావిడ.

ఆయన ఆ మాటలన్నీ సంతోషంగా విన్నాడు.

"అవునమ్మా అవును. నీవన్నమాట అక్షరాలా నిజం. నిజానికి నేను ఎన్ని సంబంధాలు చూశానో ఎన్నివిధాలతిప్పలు పడుతున్నానో ఎవరికి తెలుస్తుంది. తిరగలేక కాస్త బద్ధకిస్తే నాయింటిది క్షణం ఊరుకొంటుందా!" అన్నాడాయన.

"ఇంకెందుకూ. మీ కష్టాలన్నీ గట్టెక్కాయనుకోండి. మీరింక నిశ్చింతగా ఉండండి" అంటూ పులుసు వడ్డించింది ఆవిడ.

పులుసులో కొంచెం పంచదార అడిగి వేయించుకొన్నాడాయన. అది ఆప్యాయంగా సగంతిని, మిగతా సగం అవతలగా నెట్టి అట్టేపెట్టుకొని, దాన్ని పెరుగు అన్నంలో మధ్య మధ్య తిన్నాడాయన. పెరుగు అన్నం తింటూన్నప్పుడు చూచి ఆయింటావిడ 'ఈయనకు ఛాదస్తం ఉపాలు ఎక్కువే సుమా' అను కొన్నది. అలా అనుకొంటూ కాస్త పరీక్షగా చూచింది ఆయనవంక. ఎందుకో ఆయన వ్రేళ్ళు వణుకుతున్నాయి. ఒకసారి వెంట వెంటనే, మరోసారి ఏదోపరాకుగా, ముద్దలు నోట్లోపెట్టు కొంటున్నాడు. అల్లా కాసేపు దిక్కులుచూస్తూ కూర్చుని, నోట్లోఉన్న ముద్ద గుటుక్కున మ్రింగి, గబగబా ఉన్న కాస్త అన్నమూ కుక్కేసుకొని, విస్తరిచుట్టూ నీళ్ళు త్రిప్పి ఒక్కవిసురున లేచి దొడ్డి గుమ్మం దగ్గరకు వెళ్ళాడాయన.

ఆవిడ నిర్ఘాంతపోయి అలాచూస్తూ ఉండిపోయింది. ఏమనడానికీ ఆవిడకు తోచకపోయింది. ఒకవేళ ఏదైనా వికారపెట్టిందేమోనని అనిపించి వెంటనే లోపలకువెళ్ళి రెండువక్కలు తెచ్చి పీటమీద పెట్టి "వక్కలు పీటమీద ఉంచాను వేసుకోండి'' అని అంటే ఆయన అబ్బే వద్దమ్మా నా కలవాటు లేదని చెబుతూ చేతులూ, ముఖమూ భుజం మీద ఉన్న తడి కొల్లాయితో తుడుచుకొని కాళ్ళు అద్దుకొని "అమ్మాయ్ వసారాలో ఓ చాపవెయ్యమ్మా! కాస్త నడుంవాలుస్తాను" అన్నాడు.

ఆవిడ చావడిలో చాపవేసి జంపకానా పరచి, దిండుకూడా, ఇచ్చి "ఇక్కడ పడుకోండి. వసారాలో అయితే ఎవరో ఒకరు వస్తుంటారు." అని చెప్పి వెళ్ళింది. ఆయన చాలాసేపు మౌనంగా ఇంటి కప్పుకేసి అతిదీక్షగా చూస్తూ, ప్రక్కగదిలో పిల్లలు - అల్లరి

చేస్తున్నా. తప్పులతో సుమతీ శతకంలోని పద్యాలు పెద్దగా చదువుతున్నా. ఏమీ పట్టనట్టు నిద్ర పోయాడు. పైగా గుఱ్ఱుపెట్టాడు కూడానూ. మోహన్ మంచిగుడ్డలు వేసుకొని మామూలుకంటె కొంచెం ఎక్కువగా ముస్తాబై పుస్తకాలు పుచ్చుకొని రెండోపూట కళాశాల తరగతులకు అందు కొందామని వెళుతూ, ఆవిడనోసారి పల్కరించి పోదామని లోపలకు వచ్చాడు.

ఆవిడ తానే ముందుగా మాటాడుతూ "ఆయన నిద్రపోతున్నారు ——కాబోయే అల్లుడిగారి ముస్తాబంతా చూడకుండా అవునా?'' అని నవ్వింది. "పోన్లెండి ఏం ఎగతాళిచెస్తారు గానీండీ. ఎందుకంత ఎక్కువ పెట్టేశారు. పెరుగూ అదీ ఎక్కువయి నట్లుంది. అందుకేనా అంతవేగం నిద్రపోతున్నారు ' అన్నాడు మోహన్.

"అప్పుడే కాబోయే మామగారిపై పరిహాసాలా! సరే సాయంత్రం కాస్త పెందరాళే వచ్చేస్తావు కదూ" అన్నదావిడ. "అలాగే నండీ" అంటూ తలఊపుతూ ముసిముసి నవ్వులు నవ్వుకొంటూ వెళ్ళిపోయాడు మోహన్.

'పెళ్ళి అనేసరికి ఎవరికైనా సరదాగానే ఉంటుంది. ఏమీ పట్టనట్లు తిరిగే ఈ పిల్లవాడికికూడా పెండ్లి సంబంధం వచ్చే సరికి ఎంత కప్పిపుచ్చుకున్నా ఎంత సంతోషం కినపడిందో ముఖంలో! అంతే మరి!' అనుకొన్నదావిడ. ఆవిడ మరో మాటకూడా అనుకొన్నది. 'అవును ఇల్లానే ఉండాలి సరదా అన్నా సంతోషమన్నానూ. కాని ఈ రోజుల్లో కుర్రవాడు-ఎవర్తెనో ఏ రోడ్డుమీదనో, కాక ఏ పార్కులోనో చూస్తాట్ట. ఆపళంగా అతనికీ ఆ పిల్లకూ ప్రేమట. ఇక షికార్లకూ, సినిమాలకూ వేగించుకు పోవడం. ఏమిటో సంబంధం! విడ్డూరాలూ వెట్టి వేషాలున్నూ! అందుకే అవన్నీ ఎంత ఎబ్బెట్టుగా ఉంటాయో!'' అని.

మోహన్‌మీద అంతకు ముందు నుంచీ ఆమెకు ఉంటూ వచ్చిన గౌరవం ద్విగుణీకృతమైంది. ఆదరణా ఆపేక్షా మొగ్గ తొడిగాయి.

* * *

మధ్యాహ్నం ఆయన నిద్ర లేవంగానే కాఫీకి నీళ్ళుపెట్టి ఫలహారం చేసింది. పీటవేసి పెద్ద వెండి కంచంలో అవి వడ్డించి "రండి బాబాయి గారూ రెండు బజ్జీలు చేశాను'' అని గౌరవంగా పిల్చింది. సొంత వియ్యాల వారికి చేసినట్లుగా మర్యాద చేసింది. ఆయన ముఖం కడుక్కొనివచ్చి చాలా స్వల్పంగా తిన్నాడు. తిని లేవబోతుంటే ఉండండని కాఫీ కలుపు కొనివచ్చి ఇచ్చింది, ఆవిడ.

"కాఫీ త్రాక్కపోవడమేమిటండీ. తప్పదు బాబాయిగారూ తాగాల్సిందే. పోనీ మీకోసం కాకపోయినా కాబోయే అల్లుడికోసమైనా తాగాలి. మంత్రానికి కాఫీలేందే పూట గడవదు. కాఫీ త్రాగని మామగారు నాకు అక్కర్లేదని అనేయగలదు కూడానూ'' అని నవ్వుతూ ఎంతో బలవంతపెట్టిందావిడ.

"బాగానే ఉందమ్మా నీ బలవంతం! అయితే తెలియకడుగుతానూ కట్నాలూ కానుకలతో రత్నశలాకవంటి పిల్లనిచ్చి కాళ్ళు కడగడమే కాకుండా క్రొత్త అలవాట్లు కూడా చేసుకోవాలంటమ్మా? ఊఁ సరే అందులో సగం ఇవ్వు'' అన్నాడాయన. తానుకూడా నవ్వుతూ మరో గ్లాసులో అలా సగమే సర్ది ఇస్తే, ఆయన గ్లాసు ఎత్తి పట్టుకొని మంచితీర్థం నోట్లో పోసుకొన్నట్లు పోసుకొని గటగట త్రాగేశాడు.

"పాప పరిహారార్థం'' అనుకొంటూ బొడ్లోనుంచి తీసిన పొట్లంలో నుంచి చిటికెడు విభూతి నోట్లో వేసుకొని మింగాడాయన. అదిచూచి ఈవిడ వెనకాల నిల్చొన్న పదేళ్ళ పెద్దపిల్ల పెద్దగా నవ్వేసింది. ఆమె ఆ పిల్లను కేకలు వేయడానికిబదులు తనకూ నవ్వాగక పక్కన నవ్వే

సింది. పైపెచ్చు "అదేమండీ—అంత పూర్వకాలపు మనుష్యుల్లా కన్పించారంటే మా మోహన్ అసలు చూట్టానికే రానంటాడేమో సుమండీ'' అన్నది. ఆ మాటకాయన అందుకొని "చూడమ్మాయ్ ఒకటి అడగనా. ఇప్పుడు ఆయనగారు చూడవలసిందీ చేసుకోవలసిందీ నన్నా మా అమ్మాయినా?'' అని లోపల సంతోషిస్తూ పైకి నవ్వాడు. ఆ ముసలాయన ఆ నవ్వులో సంతోషాతిరేకాన్ని ప్రకటించాడు.

"అపుననుకోండి. కాని ఫలానావారు మామగారు అని అతను చెప్పుకోవాలిగదా. అందుకు మీరు కాస్త నవీనంగా కన్పించనక్కర్లేద అంట!'' అన్నదావిడ.

"ఏం నవీనమమ్మా...అల్లా అంటున్నారనే మా అమ్మాయికూడ ఫేషన్లు నేర్చింది. కాళ్ళకు చెప్పులూ వేస్తున్నది. చేతులకు మట్టిగాజులూ తొడుక్కొన్నది'' అని ఎంతో ఆశ్చర్యకరమైన విషయం చెబుతున్నట్లు ఆమెవంక చూచాడు.

"అవి చాలవండీ. చేతికి రిస్టువాచీ, కళ్ళకుజోడూ కూడా ఉంటేగాని మాకు నచ్చదు'' అన్నదావిడ చీరకొంగు సడుంచుట్టూ త్రిప్పి బొడ్డునదోపుకుంటూ.

"ఆహా బాగుందమ్మోయ్...ఇంకా నయం గిరజాల జుట్టుకూడ పెట్టుకోమన్నావ్ కాదు'' అని ఆగి చప్పున లేచినిలబడి "ఒక వేళ అన్నీ అనుకూలించి అబ్బాయి చేసుకొంటే...దానికీ అతనికీ ఇష్టమయితే ఎన్ని ఫేషన్‌లయినా చేసుకొంటుంది. కాని ఆ గిరజాలజుట్టు మాత్రం పెట్టుకోదు. బొందిలో ప్రాణముండగా జుట్టుముట్టుకోనిస్తుందా' ఆయన ఆమాట అని, ఎటోచూస్తూ కొంతసేపు మౌనంగా, పరాకుగా ఉండిపోయాడు. అంతలో చప్పున ముఖం మరోవైపుకు త్రిప్పుకొన్నాడు

గబగబా నాలుగడుగులు ముందుకువేసి అక్కడ కాసేపు ఆగి, వెనక్కు తిరిగి "ఆపనిమాత్రం చెయ్యదు'' అని స్పష్టంగా చెప్పేసి, గుమ్మం దాకా వెళ్ళి "చూడమ్మాయి...అన్నట్లు మరచాను నీ పేరేమిటో తెలుసు కొన్నానుగాదు" అన్నాడాయన.

"హైమవతండీ" అన్నదావిడ.

"చూడమ్మా, హైమవతీ, ఇకపైని భారమంతా నీపైన మోపి వెళుతున్నా" అని కొల్లాయిగుడ్డ దులిపి పైన వేసుకొని ఆమెవంక "ఏమంటావ్'' అన్నట్లు చూచాడు. ఆ చూపులో జాలికూడా కన్పించింది.

అది గమనించి ఆవిడ "అదేమిటండీ అలా వూరికేఇదవుతారూ ఏదో నవ్వులాటకు అనుకొన్న మాటల మీద పెరిగి ఆ మాట వచ్చింది. అయినా మీదంతా విచిత్రంకాని బాబాయిగారూ! ఎంత నవ్వులయితే మాత్రం మనలో ఈడొచ్చిన పిల్లకు షోకుకోసమె గిరజాలు పెట్టిస్తారా? అన లింటికూ ఉన్న విషయం చెప్పవలసివస్తే మా మోహానుకు మరీ ఫేషనుగా ఉండే పిల్లలంటే గిట్టదు. పైగా వెక్కిరిస్తాడు కూడానూ'' అని అంటూ ఆయనకు ధైర్యం చెప్పింది.

"అల్లాగాఅమ్మా, మీవాడు అంతబుద్ధిమంతుడా తల్లీ. నేనూ అతన్ని చూడగానే అలానే అనుకొన్నాను. సరయితే శుభం అను నేను సంతోషంగా వెళ్ళి వస్తాను" అన్నాడాయన మెట్లు దిగుతూ. వసారా చివరగా నిల్చుని ఆవిడ "శుభమ్. క్షేమంగా వెళ్ళిరండి. తర్వాత వ్యాపహారం కాస్తవేగం నడిపించండి'' అన్నది.

"అల్లాగేనమ్మాఅలాగే'' అంటూ ఆయన వీధిలోకి వెళ్ళాడు. కొంత దూరం వెళ్ళేదాకా మధ్యమధ్య వెనక్కుతిరిగి చూచి ఏదో అమూల్య

మైన వస్తువును పారవేసుకొన్న వాడిలా ఆత్రంగా చూచాడు. ఆతర్వాత చకచకా నడుస్తూ రెండుమూడు నిమిషాలో కనుచూపుమేర దాటి వెళ్ళి పోయాడు. సందు మలుపు తిరిగేదాకా ఆవిడ అక్కడే నిల్చుని, ఆయన్ను గురించేఆలోచిస్తూ ఉండి. పిల్లల కేకలువిని లోపలకు వెళ్ళింది. హైమవతమ్మ పిల్లలకు నీళ్ళుపోస్తూకూడా ఆ ముసలాయన విషయమే ఆలోచించింది. ఆయన ప్రవర్తనలో ఏదో అసాధారణత్వం కన్పించింది. ఆవిడ పొయ్యిరాజేసి,ఎసరు పడేసి, ముందుగదిలోకి వచ్చి, పెద్ద పిల్లకు జడ అల్లుతుండగా ఆయన మళ్ళావచ్చారు. ఇదేమిటి వెళ్ళి ఓ గంట అయినా కాలేదు మళ్ళా వచ్చా రేమిటబ్బా అనుకొంటూ వసారా లోకి వచ్చిందావిడ. ఆయన రిక్షావాడిచేత ఒక పెద్ద పళ్ళబుట్ట చావడిలో పెట్టించి, అక్కడ కుర్చీలో కాళ్ళు పైన పెట్టుకొని కూర్చున్నాడు. "అమ్మాయి! చిల్లర ఉంటే వాణ్ణి పంపించేయ్'' అన్నా డాయన ఏటో చూస్తూ. రిక్షావాణ్ణి పంపించి ఆవిడ లోపలకు వచ్చాక "చూడమ్మాయ్ ఏదైనా మంచి పళ్ళెంపట్రా అని. ఎందుకండీ అంటూనే ఆవిడ వెండిపళ్ళెం తెచ్చిఇస్తే, ఆ పళ్ళెంనిండా పళ్ళూ తమలపాకులూ, వస్త్రాలూ పెట్టి తీసుకోమన్నాడాయన. ఆవిడ కేమీ అర్థం కాలేదు. పెండ్లికొడుకూ అతని తరఫువాళ్ళూ పిల్లను చూడ్డానికి వెళ్లితే జరగవలసిన లాంఛనం ఇది. అది ఆయన చెయ్యడమేమా అని ఆశ్చర్యపడ్డది. పైగా ఆయన తానేమీ అనకముందే "పుచ్చుకో అమ్మా కాదనకు. నాకు చాలా కష్టంగా ఉంటుంది. అని అంటుంటే ఆమె కేమీ పాలుపోలేదు.

మాటాడకుండా తీసుకొన్నది ఆవిడ.

ఏంమాట్లాడాలో తెలియక "అదేమండీ ఒళ్ళో ఏదో దాచుకొని కూర్చున్నా రేమిటి?'' అని అడిగింది. ఆయన వెంటనే ఒళ్ళోంచి పెద్ద ఫోటో ఒకటి తీసి ఆమె చేతికి అందిస్తూ "అమ్మాయి ఫోటో ఒకటి

కబుర్లు పంపిస్తే వెంటనే మీ కిచ్చిపోదామనిపించి వచ్చానమ్మా. ఒట్టి చేతులతో ఎల్లారానూ అందుకని ఏవో నాలుగుపళ్లు తెచ్చాను.'' అన్నాడాయన.

ఆమె ఆ ఫోటో అందుకొని పైన ఉన్న ఉల్లిపొర కాగితం తొలగించి చూచింది. చూచి ఒక్కసారి చకిత అయింది. మోహానుకు ఇంత చక్కని చుక్క భార్యగా దక్కబోతున్నదిగదా అనీ, అంత అందమైన పిల్లను, నాలుగువేలు కట్నంతో కోడలుగా కుదిరించి పెట్టినందుకు మోహను తలితండ్రులు తన్ను ఎంతో మెచ్చుకొంటారనీ ఆమె ఎంతో సంబరపడ్డది. "చూడమ్మాయ్ పిల్ల విషయంలో నువ్వుగానీ, అబ్బాయి గానీ ఎటువంటి అనుమానాలు పెట్టుకోకండి. మరోటి, ఆ నగ లన్నీ దానివే.'' అని మరో క్షణమాగి "అవేకాదు నా ముసలిదానికి నగ లెందుకూ అవీ ఇచ్చేస్తుంది'' అన్నాడాయన.

అంతలో మళ్ళీ అందుకొని "చూడమ్మాయ్ ముందు నువ్వు ఓ పనిచెయ్యి. పిల్లవాణ్ణి వెంటపెట్టుకొని యింటికి వచ్చి పిల్లనుచూడు. అతనికి పిల్ల నచ్చితే'' అని అంటుంటే "మిగతా విషయాలు నేనుచూస్తా. అసలు నచ్చకపోవడం అంటూ జరగదుగా'' అన్న దావిడ తన సంతోషం వ్యక్తపరుస్తూ.

మోహన్ ఆ రోజుసాయంకాలం పెందరాళే ఇంటికి రావాలని కొంత ప్రయత్నం చేశాడు. కాని అది సాగలేదు. కళాశాలలో ఒక వాగ్వివాద పోటీసభ ఉండి అక్కణ్ణించి తెమల్చుకొని రాలేకపోయాడు. కళాశాలకు వెళ్ళినప్పటినుంచీ ఇంటికి వచ్చేయాలనే అనిపిస్తూ వచ్చింది. గదిలో కూర్చొని, తన పెళ్ళి విషయమై ఆలోచించుకొంటూ కాలం విశ్రాంతిగా గడపాలని అనిపించిం దతనికి. ఆ పగలంతా అతనాలో చిస్తూనే ఉన్నాడు.

'ఈ పిల్ల విషయంలో అందచందాదుల్లో, సంప్రదాయాదుల్లో కాకపోయినా ఎక్కడో ఏదో ఒక చిన్నలోపం ఉండిఉండాలి. కాకపోతే ఈ ముసలాయన అల్లాగా తిరగవలసిన పని ఉండదుగదా! బహుశః కట్నం అదీ తను అంటున్నంత నిజంగా ఇవ్వలేదేమో ! పైకి అల్లాగని అన్నా తీరావెళ్ళి పిల్ల నచ్చిందన్నాక సీళ్ళనమిలే బాపతు అయిఉండవచ్చు. కాదు ఆ పిల్లకు చదువు సంధ్యలు లేవని అతి నవ్యులయిన తోటివరుళ్ళు వెనకాడుతున్నారేమో అని అనుకొంటూ మొదట శంకించాడు. కాసేపు తర్కంలో పడ్డాడు.

తన అనుమానాలు నిర్హేతుకమైనవని కొంతసేపు తర్వాత నిష్కర్షగా అనిపించింది అతనికి.

ఇంక పూర్వంలా కాదు.

అమ్మా వాళ్ళో, అక్కయ్యావాళ్ళో తన పెండ్లి ప్రస్తావన తెచ్చి నప్పుడు—"ఇప్పుడప్పుడే చేసుకోను" అని నిక్కచ్చిగా గానీ, "మీ యిష్టం నాకుతెలియదు" అనిముఖావంగాగానీ సమాధానాలు చెప్పగూడదు. అంత భయందేనికీ? పిన్నిగారిచేత ముందుగా ఈ సంబంధం వివరాలు వ్రాయించి నాకు పిల్లనచ్చిందనికూడా ఒకముక్క కలపవచ్చు. అల్లా చేస్తాను' అల్లాగా అనుకొని అతనొక దృఢ నిశ్చయానికి వచ్చాడు. అతని కానిశ్చయం మనస్సులో నిలిచాక ఎంతో ఉత్సాహం కలిగింది. మంచి ధైర్యం వచ్చింది.

అందువల్లనే అతను తన కళాశాలలో చదువుకొంటున్న ఆడ పిల్లలవంక కాస్త ధైర్యంగా నిదానంగా చూచాడు. చూచి పైపై నాజూకులను సరిగానే పోల్చుకొని అచ్చమయిన సౌందర్యాన్ని చక్కగానే ఊహ చేశాడు.

"ఆపిల్లఇలా-ఇల్లాగా సన్నగా అనారోగ్యంగా ఉండి ఉంకకు.అల్లాగా గిటకబారినట్లుగా ఉండదు. ఎత్తు మడమల స్లిప్పర్లు వేసుకొని అల్లా తూలుతూ నడవదా పిల్ల." అని ప్రతి పిల్లనూ చూచి వంకలెన్నుతూ తన కొంటెతనానికి అంతలో తానే నొచ్చుకొంటూ, ఏమైనా తను చూడ బోయే వధువు వాళ్లలా ఉండదని, ఉండడానికి వీల్లేదని అనుకొన్నాడు. "అవును. వీళ్ళు మా మగపిల్లల్లాగా చదువు సంధ్యల్లో పడి నలుగుతూ, హాస్టలు భోజనాలు చేస్తూ కాలం గడుపుతున్నారయ్యే. ఆ పిల్ల యేమో ఇంటిపట్టున నీడలో పెరిగినదయ్యే. తేడా ఉండదూ?" అని తనకు తాను సమాధాన పరచుకొన్నాడు.

అతడు సాయంత్రం ఇంటికి తిరిగివచ్చేసరికి అతని మనస్సులో వధువు మనోహరమైన ఆకారం రూపు కట్టంది. అల్లాగా రూపు కట్టిన మనోహరాకారాన్నే మరల మరల తలచుకొంటూ మోహన్ విలాసంగా చేతులూపుతూ, పైగా సన్నగా ఈల వేస్తూ, మేడపైకి వెళ్ళ బోతుంటే చూచి హైమవతమ్మగారు సందు గుమ్మంలో నిలబడి "ఇల్లా రావయ్యా ఒకసారి" అని పిలిచింది. అతను అటూ ఇటో చూడడం గమనించి "ఆయన మధ్యాహ్నం కాసేపు పడుకొని నాలుగ్గంటలకు వెళ్లాడు. అయిదు గంటలకు మళ్ళీ వచ్చి పళ్లూ అవీ ఇచ్చి వెళ్ళాడు. నీకూ-బోయే మామగారి సొమ్ము అంతా నేనే పుచ్చేసుకోవడం ఏంబాగుంటుందీ" అని అంటూ లోపలకు వెళ్లింది. ఓ చిన్న వెండి పళ్లెంలో రెండు బజ్జీలు పెట్టి తెచ్చి అతని కందించింది. మంచినీళ్లు పిల్లను తెమ్మని తాను కొన్ని చక్రకేళీలూ, రెండు బత్తాయిపళ్ళూ పట్టుకొని వచ్చింది.

"ఓ క్షణం కూర్చో కాఫీ తెచ్చి ఇస్తాను." అని ఆయన మధ్యాహ్నం కాఫీ త్రాగడంలోని విశేషాలు చెబుతూ అతనికి కాఫీగ్లాసు అందించింది. మోహన్ "అబ్బే ఎందుకండీ ఇప్పుడే ఒక అర్ధగంట క్రిత మేనండీ త్రాగుతా. అప్పుడే మళ్ళీనా" అంటూనే అందుకొని వెళ్ళ

దిగా ఆప్యాయంగా చప్పరిస్తూ, కాఫీ త్రాగుతుండగా, ఆవిడ ప్రొద్దుట నుండీ జరిగిన సంగతులూ, తనకు కలిగిన అభిప్రాయాలూ అన్నీ వివరంగా చెప్పింది. చెప్పి "ఆయన రెండోసారి వచ్చి వెళ్ళినప్పుడు వాళ్ళమ్మాయి ఫోటో ఒకటి ఇచ్చి వెళ్ళాడు''అని దాన్ని అతని చేతికిస్తూ "ఆయన కూడా కాస్త నాగరికం నేర్చుకున్నాడయ్యోయ్!'' అని నవ్విందావిడ.

"అల్లాగేం" అని అతనూ చిరునవ్వు నవ్వుతూ ఆ ఫోటో అందుకొని, కుర్చీ చేతిమీద పెట్టి "మొత్తంమీద ముసలాయనకు వియ్యాల వారి మర్యాదలు జరిపారన్నమాట" అన్నాడు మోహన్.

"దానికేం భాగ్యం కానీ. అసలు విషయం చెప్పలేదు. రేపు మనం వెళ్ళి ఆ పిల్లను చూచిరావాలి. ఆయన మరీ మరీ చెప్పి సరేనంటేనే కాని వెళ్ళలా నిన్నెలా అయినా ఒప్పించి వెంట తీసుకొని రమ్మని బ్రతిమిలాడాడు. చివరకు నేను, తర్వాత మీ అమ్మతో సర్ది చెప్పుకోవచ్చునులే అని ధైర్యంచేసి, వస్తానని వాగ్దానం చేశాను. మరి నా మాట...'' అని ఆమె అంటుండగానే మోహన్ నవ్వుతూ "మీ మాట జవదాటడం కష్టమే కాని అలా చేశారేం? స్వతంత్రించాననుకోదూ ఇంటిదగ్గర తెలిస్తే?'' అన్నాడు

"ఊః—తెలియనిస్తానా, అయినా ఎందుకయ్యా అంతభయం నీకూ. నువ్వు ముందు పిల్లనుచూడు. నచ్చితే ఆపైని భారమంతా నాది. నేను తీసుకొని వెళ్ళిచూపించాను అని వ్రాస్తే మీ అమ్మగానీ, నాన్నగారు గానీ ఏమీ అనుకోరు. ఒక వేళ పిల నచ్చదూ ఇక్కడే తుంచేయవచ్చు వ్యవహారం. అయినా నేను మాత్రం పరాయిదాన్ని కాదుగా, నువ్వు సరేనను" అన్నదావిడ. మోహన్ లోపల కాస్త భయంగా ఉన్నా, మరో ప్రక్క అమిత సంతోషంగా ఉన్నా పైకి "ఊః సరేకానివ్వండి''

అని మాత్రమే అని ఊరుకొన్నాడు. ఒక్క క్షణం అలా ఊరికేనే కూర్చుని 'మరినేను వెళ్ళొచ్చుగా' అన్నట్లు చూస్తూ లేచి నిల్చుని ఆ ఫోటో అందుకొన్నాడు.

"ఇందాకటినుంచీ ఫోటో చూడనే లేదే! ఓహో అర్థమయ్యిందిలే. కాని చూచావబ్బాయ్ మా కోడలుకు ఘోషా పద్ధతులేవీ పట్టుబడడానికి వీలులేదు సుమా'' అని పకపకా నవ్వేసింది.

అందుకతనూ నవ్వుకొంటూ మేడపైకి వెళ్ళాడు. అతను తన గదిలోకి వెళ్ళి అప్రయత్నంగా తలుపులు వేసుకొన్నాడు కిటికీలోనుంచి అప్పటికే కావలసినంత వెలుతురు వస్తున్నా విద్యుద్దీపం వేశాడు. చాలా తాపీగా కుర్చీలోకూర్చుని, ఫోటో తీసుకొని పైన ఉన్న ఉల్లిపొర కాగితం నెమ్మదిగా తొలగించాడు. అతనొక్కసారి చకితుడయాడు అంతలో మరొక్కసారి ఆనందపరవశుడయాడు. తా నాపగలంతా ఊహచేసిన రూపాన్ని ప్రత్యక్షంగా తన ఊహలకు పదిరెట్లు అధికంగా చూచాడు. నూత్న వధువు ప్రథమదర్శనం చేశాడు.

అతను ఆ ఫోటో వంక అలాగే చూస్తూ కొంత సేపు మౌనంగా ఉండిపోయాడు.

వెన్నెల కాంతులను నలువైపులా వెదజలుతూ, కలువలను తట్టి నిద్రలేపుతూ అంతలోనే ప్రపంచమంతా తానై ప్రకాశిస్తూ చంద్రుడు వెలుగొందుచున్న సమయంలో, వియత్పథాలనుండి, వచ్చని తెల్లని అందమైన మేఘాలను ధరించి, క్రిందికి దిగివస్తూఉన్న అప్సరసవలె కన్పించిందామె. భూలోకంలో ఉన్న తన ప్రియునికై తొలిసారిగా తానుగా అభిసారికయై వస్తూ ఉన్న ఏ గంధర్వకన్యనో చూచి, పాలరాతిపై ప్రతిబింబాన్ని పట్టి చూపినట్లుగా ఉన్నదాచిత్రం.

ఆమె రూపురేఖలను అతను పరిశీలనగా చూచాడు. అంతటి సౌందర్యాన్ని ఒక్కసారిగా చూడలేకనూ పోయ్యాడు. అందువల్లనే తృప్తిగా హేలగా చూచాడు.

చూచి సంతోషించాడు. తనలో తను నవ్వుకొన్నాడు. సరిగ్గా తన మనస్సులో ముద్రితమైన రూపానికీ ఎదుట ఉన్న రూపానికీ అతి సన్నిహితమైన పోలికలు ఉండడం గమనించి, అతను మరింత సంతోషించాడు. సంబరపడ్డాడు.

ఇంత అందమైన పిల్లా!

వెంటనే నిశ్చయం చేసుకొంటే బాగుండును.

మరొకళ్ళెవరూ చూడకముందే తామే వెళ్ళి సంబంధం ఖాయం చేసుకొని వస్తే బాగుండు. అసలు పెళ్ళిగారింటికెళ్ళేకూడా ముందుగా పిల్లనోసారి చూచివస్తే?' అనుకొన్నాడు మోహన్.

"ఏబళ్ళోనో, ఏకళాశాలలోనో చదువుతున్న పిల్లయితే ఏదో వీలు చూసుకుని ఏగేటు దగ్గరో నిలబడి చూడవచ్చును కాని ఈపిల్ల విషయంలో అది కుదరదు" అని ఎవరో తన్ను ఉడికిస్తూ సమాధానం చెప్పినట్లయ్యింది.

తీయతీయగా, అతన్ని ఊరిస్తూ, ఉడికిస్తూ మధ్య మధ్య చక్కిలిగింతలు పెడుతూ, సమాధానపరుస్తూ ఎన్నో ఆలోచనలు అతని మనస్సులో మెదిలాయి. అవి మెల్లగా పిల్లగాలుల్లాగాసాగాయి. అల్లరిచేశాయి. అతన్ని కొంత అల్లరిపెట్టాయి. అతను తన ఆమాయకత్వానికి తానే నవ్వుకున్నాడు. కాసేపు విసుక్కున్నాడు. కొంతసేపు తర్వాత ఆయన భోగట్టా అంతా తెలుసుకుని వివరంగా, వేగంగా వ్యవహారం నడిపించని, నడిపించలేని తన తెలివితక్కువతనానికి తానే సిగ్గుపడ్డాడు.

'అట్నే అల్లా అనీ అడిగేస్తే నేనాయనకు చులకనై పోనూ! కాదూ ఒకవేళ ఇంటిగుర్తులవీ, తెలిస్తే మాత్రం ఎవ్వరికీ తెలియకుండా ఈ రాత్రికి రాత్రి వెళ్ళి చూచిరావడం పడుతుందా? ఇల్లా అని ఎవరైనా వింటే నవ్వి పోతారు' అనుకొంటూ అతను తన్ను తాను కూకలేసుకొని సమాధానపడ్డాడు. చప్పున పుస్తకాలు ముందేసుకుని కూర్చున్నాడు తలుపు చప్పుడయ్యేసరికి.

'ఎవరూ లేరు, గాలేకదా' అనుకొని మళ్ళీ ఏదో ఆలోచనలో పడ్డాడు. అంతలో క్రిందినుంచి హైమవతమ్మగారి కేక వినపడింది. అతను "ఏమిటండీ'' అంటూ క్రిందకు వెళ్ళాడు.

"ప్రొద్దుపోయింది, ఇప్పుడు హోటలుకేంపోతావుగాని ఈపూట ఇక్కడే భోజనంచేసి కాస్తపెందరాళే పడుకో'' అని అంటూ బలవంత పెట్టి, అతనికి అన్నం పెట్టింది. రేపు పెందరాళే నిద్రలేస్తే పిల్లలతో పాటు నీకూ వేడినీళ్ళిస్తాను. వీలైతే తలంటుకొందువుగాని" అన్నదావిడ. అతను ఏమీ మాటాడక, అన్నింటికీ ఊకొట్టి, త్వరత్వరగా భోజనం పూర్తి చేసి పైకివచ్చాడు. అతను పైకివస్తుంటే ఆమె మళ్ళీ ఓసారి హెచ్చరిక చేసింది "కాస్త పెందరాళే నిద్రపోవయ్యా'' అని. మోహనుకు రాత్రిళ్ళు బాగా ప్రొద్దుపోయేదాకా చదువుకోడం అలవాటు. ఒక్కోసారి ఒంటి గంటకూడా దాటవస్తున్నప్పుడు, హైమవతి భర్త వచ్చి "పడుకోవయ్యా మోహన్ ఇంకా ఏం చదువుతావ్'' అని కోప్పడిన సందర్భాలుకూడా ఉన్నాయి. అల్లాగా మరీ ప్రొద్దుపోయి పడుకొన్నప్పుడు మరునాడు ఉదయమంతా మధ్యాహ్నందాకా అతను కొంచెం మందకొడిగా కన్పించే వాడు.

ఆవిడకు ఈ విషయాలన్నీ జ్ఞాపకంవచ్చే ఆనాడు అతన్ని అలా హెచ్చరించింది. రెండోసారి అలా హెచ్చరికచేసి, లోపలకువస్తూ, ఆమె

మరొకటికూడా అనుకున్నది. అలాఅనుకొని అంతలో పెదవికరచుకొని 'కోడలుతో ముందుగానే చెప్పాలి. అబ్బాయికి అట్టే నిద్రాభంగం కలిగించకమ్మా అని' అనుకొని నవ్వుకొన్నది.

ఆ రాత్రికి మోహనుకు అంత తేలిగ్గా నిద్రపట్టిందికాదు. ఆలోచిస్తూనో, ఊరికే కలలుకంటూనో, కాలం వృధాచెయ్యాలని అతను అనుకోలేదు. భోజనం చేసి పైకి వచ్చాక ఎంతో బుద్ధిమంతుడిలాగా పుస్తకాలు ముందేసుకొన్నాడు. కాని తెరచి పెట్టిన లెక్కల పుస్తకం, నోట్సుపుస్తకం అట్లాగే ఉన్నాయి. చేతిలోఉన్న పెన్ను అలాగే ఉండి పోయింది. ఒక్క అంకెకూడా వెయ్యలేకపొయ్యాడు. విధానం తెలిసి ఉండికూడా చేద్దామనుకొన్న లెక్కసాగలేదు. అతను మరోపుస్తకం తీసి చదవడం మొదలుపెట్టాడు. కాని అదీ సాగలేదు. మనస్సు బల్లమీద రికార్డు పుస్తంలో దాచి ఉంచిన ఫొటో మీదకే పోతున్నది. ఇంక లాభం లేదని చదువు కట్టిపెట్టి, ప్రక్క పరచుకొని, ఇంకా దాపరికం దేనికని ఆ ఫొటోనుబల్లమీద తన కెదురుగా, బాగాకన్పించేలాగున అమర్చి, నడుం వాల్చాడు మోహను.

అతను పదిగంటలు దాటాక ఆలోచనల ప్రవాహాలకు అడ్డుకట్టలు వెయ్యాలని ప్రయత్నాలు చేస్తూ చేస్తూ, తన ప్రయత్నాలు వెను వెంటనే సఫలం కాకపోవడంచేత ఆ విషయాన్ని మొదటినుంచి కొనదాకా ఒక్క సారి సింహావలోకనం చేసి, తన అందచందాల విషయమై ప్రసక్తివచ్చి, తన కుటుంబంలో జరిగిన వివాహాది శుభకార్యాలలో వదినలు, మరదళ్ళూ, మేనత్తలూ తన్నుగురించి పలికిన ప్రశంసా వాక్యాలు జ్ఞాపకం చేసుకొని, తృప్తిపడి, 'ఇంక నిద్రపోవాలి, పిన్నిగారు అన్నిసార్లు చెప్పింది,' అని అనుకొంటూకూడా చాలా సేపు మేల్కొనే ఉండి చివరకు అప్రయత్నంగా నిద్రపోయాడు మోహన్. మంచినిద్రేపట్టింది అతనికి.

తామిద్దరూ వీధి గుమ్మంలోనే ఆగిపోయారు. ఆపిల్ల అవతల గుమ్మంలోనే ఆగిపోయింది. ఆ అమ్మాయి తెల్లని గ్లాస్గో చీరకట్టుకొన్నది. గ్లాస్గో రవిక పాతపద్ధతిలో కుట్టించినది తొడుక్కున్నది. పగటి పూట అయితే ఆమె శరీరగతమైన సర్వ సౌందర్యమూకాస్త పరీక్షగా చూడక ముందే కన్పించిపోను. అదే జరిగితే అతని గుండెల్లో రైళ్ళు పరుగెత్తి ఉండేవి. తికమక పడి ఉండేవాడు. హైమవతమ్మగారు "ఇదేం వస్త్రధారణమమ్మోయ్—మనకి తగునటమ్మా" అని ముఖంమీదే గుమ్మంలోనే అనేసిఉండేది.

కాని ఎందువల్లనో ఎవరూ ఏమీ మాటాడలేదు. పైగా వాతావరణమంతా పొగమంచు కమ్ముకొన్నట్లుగా ఉన్నది. అందువల్ల కాబోలు ఆమె ఏమీ అనలేదు. కాని మోహన్ ఆమె వంక ఆమె స్నిగ్ధతనూ,లావణ్యాన్నీ పరీక్షిస్తూ చూడడం గమనించింది. అతన్ని మందలిద్దామనుకుంటూనే ఆమెకూడా ఆపిల్ల వంక చూస్తూ ఉండిపోయింది. మంచులో ముంచి ఎత్తిన తెల్లని కలువపూవులా ఉన్న ఆమె ముఖంలో సౌందర్యం కొట్టవస్తూనే ఉన్నది. ఆమె పెదవులు లేత గులాబీ రేకలను ధిక్కరిస్తున్నాయి. స్నిగ్ధమూ, కోమలమూ అయిన ఆమె చెక్కిళ్ళపై, చెవులకున్న రాళ్ల దుద్దుల ఎఱ్ఱని కాంతులు సన్నగా, ప్రసన్నంగా ప్రతి ఫలిస్తున్నాయి. అంతలోనే ఆ కాంతులను ప్రన్నని ఆ మృదుకపోలాలు త్రోసివేస్తూ ఉన్నాయి. ఎంతో ఆకర్షిస్తూనే ఉన్నదా అమ్మాయి. దేవకన్యలా మెరసి పోతూనే ఉన్నదా పిల్ల./ బొడ్డుమల్లెలా అందాలు పోగేసుకొని కూర్చునట్లే ఉన్నది. తీగసంపెంగలా విలాసంగా, నాజూగ్గానే కన్పిస్తున్నది. మసకమసక కాంతిలో కూడా తళతళ మెరసిపోయే మంచి ముత్యాల్లాగా ఆ పిల్ల కళ్ళు మిలమిల మెరుస్తూనే ఉన్నాయి. ఆ పిల్ల ముందుకువచ్చినప్పుడు ఆ నడకలో యౌవన వయోవిలాసవతి నడకలో సహజంగా ఉండవలసిన మంద గమనం, ఆ ఒయారం, ఆ ఉలుకూ, ఆ సొగసూ స్పష్టంగా కన్పడుతూనే

ఉన్నది. అచ్చమూ,అమాయకమూ అయిన ఆమె ముఖోత్పలముపై ప్రేమ చంద్రుని కాంతులు ప్రసరించి అందంగా, ప్రతిఫలిస్తూనే ఉన్నాయి. నవ వధువులా సిగ్గు తెర అతిప్రయత్నం మీద తొలగించుకొని చూస్తున్నట్లూ ఉన్నది.

కాని...కాని....

కాని ఆమె సలా ఒక్కసారి పరీక్షగా చూచేసరికి ఎందువల్లనో నిశ్చలంగా నిలచిపోయింది. మరికొన్ని క్షణాల తర్వాత నిల్చునట్టే ఉండి, నిలుచున్న చోట కన్పించలేదు. అలాగని హైమవతమ్మగారికి ముందుగా అనిపించింది. ఆమెగారు విభ్రాంతిపడి నిలిచింది. "అదేమబ్బా'' అని సందేహంలో పడి, అతను అటూ ఇటూ చూచి,మళ్ళీ ఎత్తుగా ఎదురుగాఉన్న ఫొటోవంక కన్నార్పకుండా చూస్తూ ఉండిపోయాడు. హైమవతమ్మ గారు మోహన్ను 'నీక్కాదూ చెప్పేదీ, ఎందుకలా చూస్తావ్' అన్నటు ఉరిమి చూస్తూ మోచేత్తో పొడిచింది.

మోహనుకు చప్పున మెలకువ వచ్చింది. ఒక్క అర్ధక్షణం క్రితం తన్ను ఎవరో నిజంగానే మోచేత్తో పొడిచి హెచ్చరించి నట్లుగానే ఉన్నది. సరిగ్గా అలానే అనిపించింది. కలపూర్తిగా కరిగిపోయింది. నిలువెత్తు మంచు విగ్రహం నిమిషంలో చూస్తుండగానే కరగిపోయినట్లుగా అంత సౌందర్యమూ, అంతలోనే అదృశ్యమైనట్లుగా, అతని మనస్సు కాస్త చెదిరింది "ఏమిటీ కల? ఇలా వచ్చిందేమిటి?'' అని పలుసార్లు పశ్నించు కొన్నాడతను. కొంచెం చిరాకు పడ్డాడు. ఎంతకూ సమాధానం దొరక్కపోయే సరికి అతను వెంటనే ప్రక్కమీదనుంచి లేచివెళ్ళి గ్లాసుడు మంచినీళ్ళు త్రాగి, కాసేపు కుర్చీలో ఊరికే కూర్చున్నాడు. ఇదేమిటి 'ఇంత వెఱ్ఱివాణ్ణవుతున్నాను" అని అనుకొని తన్నుతాను సమాధాన పరచుకోవాలని ప్రయత్నిస్తూ చాలా సేపు అలాగే ఉండిపోయాడు.

అంతలో బుద్ధిపుట్టి పుస్తకంలోనుంచి ఆ ఫొటోతీసి దానివంకే చూస్తూ కూర్చున్నాడు.

యౌవన నవవిలాసం ! పూలపొదలపైన కొనలుతేలుతూ మంద మలయ పవనాలకు కూడా ఓర్వలేక ప్రక్కలకు ఒరిగిపోతూ ఒయారాలు పోతూ ఉన్న ఏలకీలతలాగా ఉన్నది. తమలపు తీవెలా చూచిన కొద్దీ నవ నవలు వెదజలుతూనేఉన్నది. తన బాహువులను ఆ లావణ్యలతకు ఆధా రంగా అందివ్వాలని అనిపించింది మోహనుకు. అల్లాగని అనుకొనే సరికే అతని ఒడలంతా ఒక్కసారి పులకరించింది.

"ఇప్పుడే ఇలా అనుకోవడం ధర్మంకాదు. ఎవరైనా చూస్తే బాగుండదు సుమా' అనుకొంటూ, ముసిముసి నవ్వులు నవ్వుకొంటూ, లేచి వెళ్ళి విద్యుద్దీపం తీసి నెమ్మదిగా ప్రక్కమీద నడుంవాల్చాడు. 'నీవల్లా అనుకోవడం తప్పుకాదూ?' అని ఎవరో ప్రశ్నించినట్లయి 'అబ్బే అంత తప్పేంకాదు. ఆ పిల్ల నన్నుకలలో కవ్వించింది. కనుక నేను ఇలలో భావనలో సరసమాడాను. మరేంతప్పు కాదు' అని సమాధానం చెప్పు కొన్నాడు. అందువల్ల అతనికి తృప్తికలిగింది. తృప్తిగా సుఖంగా నిద్ర పోయాడు.

అతనికి కొంచెం పెందరాళే మెలకువ వచ్చింది. మత్తెక్కించే సువాసనలు వెదజల్లే పూలపొదరిండ్ల ప్రక్కగా చాలాసేపు నడిచి వచ్చి నట్లున్నది. అతని కింకా.కొద్దిగా మత్తుగానే ఉన్నది. ఆమత్తుదనం కొంత చిత్రంగా, మధురంగా కన్పించింది. హృదయం తేలికగా ఉన్నట్లు అనిపించింది.

ప్రభాతవాయువులు మందమందంగా ప్రసరిస్తున్నాయి. అవి అప్పు డప్పుడే విడిపోతున్న పొగమంచు తెరలతో దోబూచులాడుతున్నాయి.

చెట్లగుబురులను తాకుతూ, సన్న సవ్వడుఅుచేస్తూ, ఆ గాలులు ఉషస్సులో ప్రకృతి కాంత ప్రపంచానికై పాడుతున్న మేలుకొల్పులకు తాము వంత పాటలు పాడుతున్నాయి. అవి నెమ్మదిగా శరీరాన్ని తాకి నూతనోత్సాహాన్ని కలిగిస్తున్నాయి. పులకరింతలు కలుగజేస్తున్నాయి. రాత్రంతా వెన్నెలలో, మంచులో నీటి అలలపై తేలుతూ, ఒయ్యారాలు పోతూ, ఒళ్ళు విరుచుకొంటూ కదలాడుతూ ఉన్న కలువలు ప్రభాత వాయువులను మరింత పరిమళవంతం చేస్తున్నాయి. శైత్యాన్ని చేకూరుస్తున్నాయి.

మోహను లేచి కూర్చున్నాడు.

రాత్రి తనకు కలిగినవిచిత్రానుభూతి ఏదో అస్పష్టంగా స్ఫురణకు వచ్చింది. రాత్రి తానాలోచించిన విషయం మరింత మధురంగా అనిపిస్తూ జ్ఞాపకం వచ్చింది. అతను మందహాసం చేశాడు. లోపల ఎంతో తృప్తిగా సంతోషంగా ఉన్నది.

మోహన్ గబగబా క్రిందకు వెళ్ళి త్వరత్వరగా కాలకృత్యాలు తీర్చుకొని కాఫీకి వెళ్ళి వచ్చాడు.

మోహన్ కాఫీకి వెళ్ళి తిరిగి వచ్చేసరికి అప్పుడే ఎనిమిది గంటలయింది. అతను సరాసరి ఇంటికి రాక, ఒకరిద్దరు మిత్రులతో ఉల్లాసంగా పిచ్చాపాటి మాటాడి ఆలస్యంగా వచ్చాడు. అతను ఇంటికి వచ్చేసరికి గుమ్మం ముందు గుఱ్ఱపుబండి ఒకటి ఆగిఉన్నది. అతనుపైకి వెళ్ళబోతుంటే ఆవిడ వసారాలోనే ఎదురై "ఎక్కడికి వెళ్ళావయ్యా ప్రొద్దున్నే-కాఫీ ఇక్కడ ఇవ్వకపోయినానా ___ సరెసరె, ఆయన వచ్చి చాలా సేపయ్యింది. నువ్వు వేగం వచ్చేయాలి" అంటూ తొందరపెట్టింది. రెండేసి మెట్లు ఒకేసారి ఎక్కుతూ మోహను ఒక్క నిమిషంలో పైగదిలోకి వెళ్ళాడు. కూజాలో నీళ్ళు వంచుకుని సబ్బుతో రెండుసార్లు ముఖం

కడుక్కొని, టర్కీ తువ్వాలతో ఒత్తితుడుచుకొని, పౌడరు రాచుకొని, తల దువ్వుకొన్నాడు. అతను తల దువ్వుకొని బట్టలు మార్చుకోడానికి దాదాపు పది నిమిషాలు పట్టింది. "ఇంకా కాలేదుటయ్యా నీ ముస్తాబూ'' అని క్రింద నుంచి హైమవతమ్మగారు రెండుసార్లు కేకలు పెట్టింది. అతను ముస్తాబు పూర్తి చేసుకొని గుమ్మందాకా వచ్చాక మళ్ళీ ఆ ఫోటో ఒకసారి చూడాలని అనిపించి, తలుపు దగ్గరగావేసి, అల్లాచూస్తూ నిలబడ్డాడు. అంతలో ఆవిడ నెమ్మదిగా తలుపు నెట్టుకొని లోపలకువచ్చి, అతన్ని చూచి ఒక్కసారి పకాలున నవ్వేసింది. "ఇందుకా ఇంత ఆలస్యం చేస్తా...సరె. సరె బయలుదేరు'' అన్నదావిడ. "అబ్బె లేదండీ నాదేం ఆలస్యంలేదు పదండి" అంటూ మెట్లుదిగాడతను. "చేయవలసిన ఆలస్యమంతా ఇందాకే చేశావులే...పద" అంటూ నవ్వుతూ ఆవిడ అతన్ని అనుసరించి క్రిందకువచ్చి, ప్రయాణపు ఏర్పాట్లు త్వరత్వరగా పూర్తిచేసింది. ఆఫీసు జవాన్ను "ఇల్లుజాగ్రత్త. నేను పది నిముషాల్లో వచ్చేస్తాను'' అంటూ హెచ్చరికలుచేసి, పెద్దపిల్లతో "ఎక్కడికీ వెళ్ళకండమ్మా'' అని చెప్పి, పళ్ళబుట్ట ముందు బండిలో పెట్టి, ఆవిడ బండి ఎక్కింది. ఆవిడ తర్వాత ఆయన నెమ్మదిగా బండిలో ఎక్కి కూర్చున్నాడు. మోహన్ తన దుస్తులు నలిగిపోతాయని వాళ్ళతోకాక వేరే రిక్షా చేయించుకొన్నాడు.

ఆయన దారిపొడుగూరా హైమవతమ్మగారితో ఏదో చెబుతూనే ఉన్నాడు.

పిల్లను చాలా గారాబంగా పెంచాడట తను. తన భార్యఅయినా ఎప్పుడైనా చిన్నప్పుడు కోపంవస్తే ఓదెబ్బ వేసి ఎరుగునటకాని తానెన్నడూ పల్లెత్తుమాట కూడా అనలేదట. అసలు మాట అనిపించుకోనే పిల్లకాదట ఆ పిల్ల. ఒక్కతేపిల్ల కావడంచేత తన కున్న ఆస్తిపాస్తులన్నీ క్రమంగా ఆపిల్లకే చెందుతవట. పిల్ల పైకికాస్త నాజూగ్గా కనిపించినా,

అవసరమైతే ఎంత చాకిరీఅయినా పైన వేసుకొని నిర్వహించుకొని పోగలదట. పెద్దపిల్ల అయినప్పటినుంచీ ఇంటి బాధ్యతలన్నీ స్వయంగా, చూచుకొంటున్నదట. అలాగా ఆయన తన బిడ్డనుగురించి వివరంగా ఎడతెగకుండా చెప్పుకొనిపోతూంటే మొదట కొంత కుతూహలం వల్లనూ, తర్వాత కొంత క్రొత్తవాడు, అందులో పెద్దవాడు—ఆయన చెబుతూ ఉండడంవల్లనూ హైమవతమ్మగారు సావధానంగానే విన్నది. చాలా సేపు ఓపిక వహించి ఊకొడుతూ కూర్చున్నది. కాని, పోను పోను ఆయన మాటలు మరీ పిచ్చిగా కనిపించేసరికి, ఆయన చెప్పిన విషయాలు మళ్ళీ మళ్ళీ చెప్పడం మొదలుపెట్టే సరికి, ఆవిడకు నిజంగా విసుగుపుట్టింది. చివరకావిడ "ఎందుకండీ బాబుగారూ మీరు ఇంత వివరంగా చెప్పాలా?—చూట్టానికే వస్తున్నాంగా. మీరు కాస్త విశ్రాంతిగా కూర్చోండి" అనేసింది. హైమవతమ్మగారామాట అన్నాక ఆ ముసలాయన చప్పున మాటాడడం ఆపేసి, ఇంక మళ్ళీ ఉలకనూ లేదు, పలుకనూ లేదు. బెల్లం కొట్టిన రాయిలా అలా కూర్చుండి పోయాడు. పైగా ఏదో దిగులుగా ఎటో చూస్తూ ఉండిపోయాడాయన. వాళ్ళ యింటి గుమ్మం ముందు బండి ఆగాక కూడా ఆయన నోరు మెదపలేదు. ఆయన మాటాడకుండా బండిదిగాడు. ఆవిడ నెమ్మదిగా బండిదిగి, బండివాడిచేత పళ్ళబుట్ట దింపించింది. "మీరు పదండి. నేను బండివాడికి డబ్బులిచ్చి వస్తాను" అని మూగసంజ్ఞలుచేసి చెప్పాడాయన. ఆ యింటి గుమ్మంముందు నిల్చుని ఆవిడ ఆయన ప్రవర్తనకు ముసి ముసి నవ్వులు నవ్వుకొన్నది.

ఆ యింటి ముందు ముత్యాలతో ముగ్గులు పెట్టినట్లయ్యింది.

మోహన్ను కలుపుకొని "బండి ఆగిన చప్పుడు వినిపించినా ఇంటి వాళ్లు బయటకు రాలేదేమా" అను కొంటూ దగ్గరగావేసి ఉన్న తలుపు

పెట్టుకొనిఆవిడ లోపలకు వెళ్ళింది. కాని చావడి ఖాళీగా ఉన్నది. చాపలైనా పరచిలేవు. ఒక క్షణం వీరిద్దరూ అక్కడే ఆగిపోయారు. "ఎవరండీ వస్తా?" అంటూ అవతల గదిలో నుంచి ముందుగదిలోకి వచ్చిందొక ముత్తయిదువ. మంచి దబ్బపండు ఛాయలో ఆమె అంత వయస్సులోకూడా ముచ్చటగానే ఉన్నది. ఆవిడ పెద్ద కుంకుమ బొట్టు పెట్టుకొన్నది. వంగపండు రంగు చీరకట్టుకొన్నది. సన్నని జరీ అంచుగల రవిక తొడుక్కున్నది. జుట్టు ముడివేసుకొన్నది. విశాలమైన ఆమె కళ్ళు ఎంతో ఆర్ద్రతను ప్రకటిస్తున్నాయి.

మోహన్ ఆవిడ ముందుగా కన్పించేసరికి ఒక్క క్షణం నిరుత్సాహ పడ్డాడు. ఎవరా వచ్చిందని పెండ్లికూతురేవచ్చి తన్ను చూచి లోపలకు తుర్రుమంటుందని అతనూహించాడు. 'వాళ్ళకు తెలుసుగదా మనం వస్తున్నామని. అందువల్ల ముస్తాబై లోపలే దాక్కొని ఉంటుంది' అని అనుకొని సమాధానపడ్డాడు. నిజంగా అదే బాగుంటుంది. ముందుగా కన్పించేస్తే పెళ్ళిచూపుల సొగసే ఉండదు, అని కూడా అనుకొన్నాడు మోహను. క్రిందటి వేసంగి సెలవుల్లో మిత్రుడొకడు పెళ్ళిచూపులకు వెళుతూ తన్ను తోడుతీసికొని వెళ్ళాడు. ఆనాటి దృశ్యమంతా అతని కొక్కసారి స్ఫురణకు వచ్చింది.

అంచక్కా అలంకారాలు చేసికొని వచ్చి తల్లో, మేనత్తో చెయ్యి పుచ్చుకొని తీసికొని వచ్చి కూర్చోబెడితే, ఎంతో సిగ్గు పడుతూ కూర్చుని, ఎన్ని విధాల మాటాడించినా మొదట్లో మాటాడకపోవడం, తర్వాత క్రమంగా మాటాడడమూ, అతి బలవంతంమీద ఒకటి రెండు పాటలుకూడా పాడడమూ ఇది సహజంగా జరిగేవిషయం. వధూవరులు-ఎవరూ తమ్ము చూడనప్పుడు, అప్రయత్నంగా కొన్నిసార్లూ, ప్రయత్న పూర్వకంగా మరికొన్నిసార్లూ చూచుకొంటూ సిగ్గుపడడం.

సిగ్గుపడుతూనే చూచుకోవడం. అతను తనవంక చూడటం లేదనుకొని, భ్రమపడి పెండ్లికూతురు ధైర్యంచేసి పెండ్లికొడుకువంక చూడడం — చూపులు కలియడం — ఆపి నిలువునా సిగ్గుపడి పోవడం— ఇలాంటి సంఘటనలు ఎంత మధురమైన ఆనందానుభూతి నిస్తాయో, ఆనాడు కొంతగా తెలిసింది మోహనుకు. అప్పుడతను తన మిత్రుణ్ణీ, మిత్రునికి కాబోయే భార్యనూచూచి, వాళ్ళ ఆనందాన్ని చూచి తానూ సంబరపడుతూ తనకూ అట్టి అనుభూతి స్వవిషయంలో కావాలని రహస్యంగా కోరు కొన్నాడు.

ఆ విషయమంతా మనస్సులో ఒక్కసారి మెదలేసరికి ఒక్క సారి అలా తనపై మల్లికా ప్రసవ సౌరభభరితమైన మలయమారుతం మంద మందంగా ప్రసరించి, క్రమంగా నీటి అలలాగా దూర దూరంగా కదలి వెళ్ళినట్లయింది. చిరునవ్వులతో అతని ముఖం వికసించింది.

"ఇంకా నిలబడే ఉన్నారేమిటి? కూర్చో అమ్మాయి. కూర్చో నాయనా'' అని ఆవిడ ఇద్దరికీ ఆసనాలు చూపింది.

హైమవతమ్మగారు మోహన్ను కూర్చోమని, ఆవిడతో "అయితే ఇంతకూ మేం వస్తున్నట్లు బాబాయిగారు ముందుగా చెప్పనేలేదా ఏమిటి?" అన్నది.

ఆమాట కాముత్తయిదువ వెంటనే సమాధానం చెప్పలేదు.

మోహన్ అక్కడ మంచికుర్చీలున్నా వెంటనే కూర్చోక ముసలా యన ఇంకాలోపలకు రాలేదేమా అని ముఖద్వారంవైపు చూస్తూ ఒక్క క్షణం అలాగే ఉండిపోయాడు. ఆవిడ ఆ కుర్రవానివంకా, హైమవతమ్మ గారి వంకా చూస్తూ, ఏదో ఆలోచనలో పడి ఓక్షణం తర్వాత తెప్పరిల్లు కొని కూడా ఏం చెప్పాలో తోచక, ఏమని చెబితే మర్యాదగా ఉంటుందో

తెలియక తికమకపడ్డది. అసలు వీళ్ళు తనయింటికి ఎందుకు వచ్చారో-వారెవరో కూడా వెంటనే స్ఫురించ లేదావిడకు.

ఆవిడ అలాగా వెంటనే మాటాడకపోవడం చూచి హైమవతమ్మగారు "ఈ వెఱ్ఱిబాగుల మనిషి ఇంట్లో చెప్పకుండానే ఇంత హడావిడీ చేసిఉంటాడు'' అన్న నిర్ణయానికి వచ్చి "పోన్లెండి-చెప్పడం మరచారో ఏమో.'' అంటూ ముందుకువెళ్ళి "రండి పిన్నిగారూ లోపలకు వెళదాం'' అన్నదావిడతో.

తామిద్దరూ లోపలకువెళ్ళి, అన్ని విషయాలూ వివరంగా మాటాడుకొని పిల్లను మూడు నిషాల్లో ముస్తాబుచేసి, తీసుకొనివచ్చి చూపిద్దామనుకొన్నది హైమవతమ్మగారు. వాళ్లు నిర్లక్ష్యం చేస్తున్నారేమోనన్న భావం మోహనుకు ఎంతమాత్రమూ కలుగనీయకూడదని ఆవిడ లోలోపల ఎంతో తాపత్రయ పడవి అంమవల్లనే చనువుగా ఆవిడగారి చెయ్యి పుచ్చుకొని కాస్త త్వరత్వరగా లోపలకు అడుగులు వేసింది. గుమ్మం అవతలకు వచ్చాక నెమ్మదిగా "మాది ఏమి శాఖేరెండి. ఆ అబ్బాయి తండ్రీ మావారూ పెత్తండ్రి పినతండ్రి కొడుకులు. అతను మాయింట్లోనే ఉండి చదువుకొంటున్నాడు. చాలా బుద్ధిమంతుడు. నిన్న దాబాయిగారువచ్చి అన్నీ విచారించి అతన్ని చూచి వెళ్ళారు. నాతో అన్ని విషయాలూ మాట్లాడారులెండి. అయితే తెలియకడుగుతాను మీకు అలలు చెప్పనేలేదా ఏమిటండీ?'' అని అడిగింది హైమవతమ్మగారు. "ఏమిటి చెప్పలేదంటారూ?'' అని అసలేక అసలేక అన్నదాముసలాయన భార్య.

"అప్పుడే ఈ వియ్యపురాలితో పరిహాసాలు కూడానా! అదేనండీ పిల్లని చూట్టానికి తరలి వస్తున్నామని చెప్పలేదా అని అడిగాను. సరేపోన్లెండి. ఇప్పుడు మించిపోయిందేమీలేదు. ఒక్క నిమిషంలో ముస్తాబు చేయించేస్తాను. అదీ ఏదో లాంఛనం కనుకా. అందులోనూ

కొంత కొత్తవాళ్ళం కనుకాన్నూ, లేకపోతే ఇలావచ్చి చూడాలా ఏమిటి! మనంమనం మాట్లాడుకొని నిర్ణయాలకు వచ్చేవాళ్ళం. ఇంతకూ అమ్మాయి పేరేమిటన్నారూ? ఏదీ ఇంకా లోపలే దాక్కున్నదా ఏమిటి! మరీ అంత సిగ్గయితే ఎల్లాగండీ" అంటూ హైమవతమ్మగారు ఎంతో కలుపుగోలుగా, ఏదో మాటాడేస్తూనే ఉన్నది. కాని ఎదుటఉన్న మనిషి మొదట నిర్ఘాంతపోయి—అంతలో కొయ్యబారిపోయి, అంతలో మహాసముద్రపు పొంగులా ముంచుకొనివచ్చినఆవేశానికితట్టుకోలేక కూలబడిపోవడంగమనించనేలేదు. మరుక్షణంలో గమనించినా పరిస్థితిఎంతమాత్రమూ అర్థమే కాలేదు. "అరెరె అదేమి" అంటూ హైమవతమ్మగారు ఆశ్చర్యపడుతూ, ఖంగారు పడుతూ అడుగుతూనేఉన్నది, కాని ఆవిడ వినిపించుకోలేదు. పెద్దగా ఏడుస్తూ "అయ్యో! నా తల్లీ! నీకు పెళ్ళి సంబంధం తెచ్చాడే మీ నాన్న," అని తల బాదుకొంటూ దుఃఖపు పొంగులో మాటలురాక బొంగురుపోయిన కంఠంతో "నాకంత భాగ్యమా! అమ్మాయి లేదమ్మా లేదు" అని మళ్ళీ పెద్దగా ఏడ్చింది. హఠాత్తుగా ఏడ్పువినిపించేసరికి చరచరా లోపలకువచ్చి గుమ్మంలోనుంచే ఆ దృశ్యంచూచి నిర్ఘాంతపడి పోయాడు మోహన్. అతను వచ్చి చూచేసరికి ఆ ముసలావిడ క్రింద నేలమీద కూలబడిఉన్నది. ప్రక్కగా హైమవతమ్మగారు కూర్చుని ఆవిడని ఓదార్చాలని ప్రయత్నం చేస్తోంది. అతనికేమీ అర్థంకాక "ఇదేమిటండీ పిన్నిగారూ...ఎందుకావిడ" అని ఆగిపోయాడు. అతనికి మొదట ఆవిడకు మూర్ఛవచ్చిందేమోననీ. శారీరక దౌర్బల్యమేమైనా ఉన్నదేమోననీ అనుకొన్నాడు. హైమవతమ్మగారికి క్రమంగా విషయం అర్థమైంది. అవతలకు వెళ్ళమని అతనికి సంజ్ఞచేసింది. అతను ఆవిడ వైపు చూచేసరికే వాళ్ళవెనుక గోడమీద ఎత్తుగా వ్రేలాడతీయబడి ఉన్న పెద్ద సైజు ఫొటో ఒకటి కన్పించింది. కించిన్మాత్రంకూడా ప్రయత్నం లేకుండా మోహన్ ఆ పిల్లను వెంటనే పోల్చుకొన్నాడు. ఒక్కనిమిషం కన్నార్పకుండా ఆ ఫొటోవంకే చూస్తూ నిల్చున్నాడు అతను.

ఆడవాళ్ళిద్దరూ అతనలా చూడడం గమనించారు. అతన్ని చూచి మళ్ళీ పెద్దగా ఏడ్చిందావిడ. అతని మనస్సు ఒక్కసారి కలుక్కుమన్నది అతనాముసలిముత్తయిదువ దుఃఖంచూడలేక, ఆతల్లిఆక్రోశం

వినలేక, ఆ స్థితిని చూచి తట్టుకొనే శక్తి లేక, చప్పున అక్కణ్ణుంచి వీధిగుమ్మంలోకి వచ్చేశాడు. వెనుకనుంచి మాటలు వినపడుతున్నాయి. "చిన్నవాడు అబ్బాయి మనస్సుకూడా కష్టం కలిగించానమ్మా దౌర్భాగ్యురాల్ని-ఇదంతా మాఖర్మ. దాన్ని మొదట్లో వారి బావమరిదికే ఇద్దామనుకున్నాం. అది కృష్ణుడి పెళ్లామనే అంటూ ఉండేవారాయన. కాని వాడు వీ అందానికి నేను తగను అని ఖచ్చితంగా చెప్పేసి ఓ సత్యను పెండ్లాడేశాడు. అలా అనుకొన్న సంబంధం కుదరలేదు. అప్పటినుంచి సంబంధాలు ఇతరత్రా చూస్తూన్నాం. పెళ్ళి ప్రయత్నాలు చేస్తుండగా హఠాత్తుగా జబ్బుచేసి పిల్ల నా రుక్కమ్మ..." అని చెప్పలేక పెద్దగా ఏడ్చి. ఎంతో కష్టంమీద దుఃఖం ఆపుకొని "అప్పటినుంచి ఆయనకు మతి స్థిమితంగా లేదు మరీ ఈమధ్య ఎక్కువవుతున్నది. నిన్న దానిపుట్టినరోజు పండగ... ఆయన...'' అని ఇంక ఒక్కమాటకూడా చెప్పలేక వెక్కి వెక్కి ఏడ్వడం మొదలుపెట్టింది.

మోహన్ వీధి గుమ్మంలోనుంచే పిన్నిగారూ "మీరు తర్వాత కాస్త నెమ్మదిగా రండి, రిక్షా పంపిస్తాను. సరేనా?'' అని చెరచెరా ముందుకు వెళ్ళిపోయాడు ఆవిడ సమాధానం అయినా వినకుండా. అతను అంతకంతకు వేగంగా నడిచాడు. అంతవేగంగా నడుస్తున్నా విరియబూచిన నిత్యమల్లిలా అందంగా, నిత్య నూతన వధువులా ఆపిల్ల అతని కళ్ళముందు ప్రత్యక్షం అవుతూనే ఉన్నది. ఆ ఫోటో ఇంకా అతని మనస్సులో మెదలుతూనే ఉన్నది. నీళ్ళునిండిన కళ్లనోసారి అప్రయత్నంగా తుడుచుకొన్నా డతను. జరిగిన విషయమంతా ఒక్కసారి అతనికి జ్ఞాపకం వచ్చింది. నిజంగా జరిగిన ఒక వాస్తవ విషయం నిజమని అంగీకరించడానికి అతని మనస్సు గట్టిగా నిరాకరించింది. అతనేదో గొణుక్కుంటూ బాధపడుతూ ముందుకు సాగిపోయాడు.

జీవితంలో మలుపు

ఆ విషయంలో ఇతరులు ఎవరు ఏమని అనుకొన్నా మాధవయ్యగారు మాత్రం 'ఇంత ప్రమాదం జరిగిందే! ఈ కుఱ్ఱవాడు ఏమైపోతాడో!' అనుకొని భయపడ్డాడు. ఆయన ఎంతో బాధపడ్డారు. అన్నాళ్ళూ అతని కోసమై పడినశ్రమ అంతా ఇలా యథాయథలై పోతున్నదే అని ఆయన ఎంతో మథనపడ్డారు.

అంతలో ఆయనకు ఒక ఆశ కలిగింది. అది కేవలం ఆశమాత్రమే ఆ సంగతి ఆయనకూ తెలుసు. తెలిసికూడా అతనంటే ఉన్న అపేక్షకొద్దీ, జాలికొద్దీ ఆయనలా ఆశ పెంచుకొన్నారు. 'అవధాని ఈ గండంగడచి బయటపడతాడు. తప్పకుండా ఈ గండం గడుస్తుంది. నా మాట దక్కుతుంది. అనుకొన్నారాయన ఒకటికి రెండుసార్లు. పరాయిపంచన కాలం గడుపుతున్నా రోగం రొష్టూ లేకుండా ఉంటూ, బుద్ధిగా మెలగుతూ, క్రమంగా పైకివస్తున్నవాడికి హఠాత్తుగా ప్రమాదం జరిగేసరికి ఆయన మనిషి నిలువునా నీరై పోయారు. ఏమిచేయడానికీ వెంటనే ఏమీ తోచలేదాయనకు.

ఆయన భార్య రంగనాయకమ్మగారికి మొదట కోపంవచ్చింది. తర్వాత భయంవేసింది. 'నా ఇంట్లో ఉండగా అతనికి ప్రమాదం సంభవించిందే. పైగా ఆపని నేనుచెప్పానే! ఏదైనా అన్యాయం జరిగితే ఆ పాపం నాకు చుట్టుకొంటుందేమో!' అని భయపడదావిడ. 'లేనిపోని బెడద నా యింటికి వచ్చిపడుతోందే. దీనికి కారణం అతనేకదా' అని కోపగించుకొన్నది ఆవిడ. అతన్ని. అతన్ని తమఇంట వదలివెళ్ళిన అతనితండ్రిని మనసులో ఎన్నో అన్నది. అంతలో జాలిపడి, చేతులు

జోడించి అతనికి అగండం గడిచేలా చేయమని భగవంతుణ్ణి ప్రార్థించింది ఆపిల్లల గన్నతల్లి.

మాధవయ్యగారు ఆవిడ పరిస్థితి చూచి, ఆవిడకు కొంచెం ధైర్యం చెప్పి, తాను నిదానంగా, జాగ్రత్తగా ఆలోచించడానికి ప్రయత్నించారు. కాని అందుకు వ్యవధిలేదని అనిపించింది వెంటనే. దాంతో ఆయన మరీ గాభరాపడ్డారు.

జరిగిందేమో ప్రమాదకరమైన విషయం.
ఏమో ప్రాణాపాయమే సంభవించ వచ్చును.
పైగా అది జరిగికూడా కొన్నిగంటలు అయింది.
ఎలా పరిణమిస్తుందో ఏమో!

అలా అనుకొంటూ ఆయన గబగబా ఒకసారి ఇంట్లోకి, మరోసారి ఆతనుండే ముందుగది గుమ్మందగ్గరకూ వెళ్ళి వచ్చారు. ఆ విషయం ముందుగా ఆయనకే తెలిసింది. అతనే స్వయంగా చెప్పాడుకూడానూ.

ఆరోజు మధ్యాహ్నం అంతా తిరిగి, ఆయన మూడుగంటలకు ఇంటికి కాఫీ తాగుదామని వచ్చి, మళ్ళీ బయటకు వెళ్ళవలసిన పనిఉండి కూడా ఓపికలేక వెళ్ళలేక, అతన్ని ఆవలిమీద పంపుదామని ఆ గదిగుమ్మం దగ్గరకువచ్చిన మాధవయ్యగారు అతను ఏదో తపన పడుతున్నట్లు ఇట్టే గ్రహించారు. ఏమిటి విషయం, ఏం జరిగిందని పదిసార్లు అడిగారు. చెబితే ఏమంటారోనని, చెప్పక ఇంకా ఆలస్యంచేస్తే ఏం ప్రమాదం ముంచుకొని వస్తుందోనని భయపడ్డాడు అవధాని, అలా భయపడుతూనే అతను చెప్పక తప్పిందికాదు. క్లుప్తంగా చప్పున చెప్పేశాడతను. అతను అనుకొన్నదంతా అయింది. ఆయనకు మొదట చుర్రున కోపంవచ్చింది. "ఇంత అజాగ్రత్త వెధవ్వయితే ఎలారా!" అంటూ అతనిమీద ఎగిరిపడ్డారు. "మరి ఇంత సేపూ నాకెందుకు కబురుచెయ్యలేదు!"

అంటూ ముందు అతన్నీ ఆ తర్వాత భార్యనూ కేకలువేశారు. ఆయన క్షణకోపి మరుక్షణంలో ఆయన మెత్తపడిపోయారు. 'అవున్లే ఎక్కడ ఉన్నానో మీకు తెలియదుగా – పోనీ ఏదైనా ఉపాయం ఆలోచించబోయారా' అంటూ ఆదుర్దాపడ్డారు. "మీరు చెప్పేదాకా నాకూ తెలియదండీ" అంటూ మరింత గాభరాపడుతున్న భార్యను "ఏమే ఏంచేద్దామే, నువ్వయినా చెప్పవే" అంటూ మళ్ళీమళ్ళీ అడిగారు ఆయన.

మాధవయ్యగారు మళ్ళీ అతని గదిలోకి వచ్చి "ఎలా ఉందిరా" అని అడిగారు. అతను మూలుగుతూ సంజ్ఞచేసి బాధ తెలియచేశాడు. ఒక నిముషం అతనిదగ్గర కూర్చుని, రొమ్ముమీద నిమురుతూ ఆత్రినివంక ఆర్ద్రంగా, ప్రేమగా చూస్తూ "అంతబాధగా వుందేమిట్రా" అంటూ ఆదుర్దాపడ్డారు. అంతలో తాను విషయం తెలుసుకొన్న తర్వాతకూడా అన్ని నిముషాల – దాదాపు పదిహేను నిముషాలు గడిచిపోయాయని స్ఫురణకు వచ్చింది ఆయనకు. ఆయన వెంటనే బయటకు పరిగెత్తారు.

హఠాత్తుగా ఏదో ఆశాభావం హృదయంలో మెరుపులా మెరసి, ఏదో చిన్న ఉపాయం సమయానికి తోచి, ఆయన అలా పైఉత్తరీయం అయినా వేసుకోకుండా, కాళ్ళకు చెప్పులైనా తొడుక్కోకుండా, ఉన్నపళంగా బయలుదేరి, వైద్యుని ఇంటికి పరుగులేశారేకాని ఆయన మనసు వెనక్కులాగింది. అసలు–ఆయన మనిషిముందుకు–అతన్ని అక్కడలా విడిచిపెట్టి–వెళ్ళారేకాని మనసు అతనిదగ్గరే ఉన్నది. ఆయన అతని విషయం అంత గాభరాపడడానికి వాస్తవానికి అతను తనవైపుగానీ భార్యవైపుగానీ బంధువువేమీ కాదు. కాని ఆయన అలా చలించిపోయారు.

అప్పటికి అవధాని వయసు పదిహేను సంవత్సరాలు. సుమారైన ఎత్తు. కుఱ్ఱవాడు బక్కపల్చన. అతనిది గట్టిఒళ్ళు. పనికి బద్ధకించేవాడు

కాదతను. అందుకే అతని ఒళ్ళు గట్టిపడ్డది. కాలం ఎంతగడ్డుగా గడచినా అతను గత నాలుగు సంవత్సరాలలోనూ నాలుగు అంగుళాలు ఎత్తు ఎదిగాడు. మెట్టుపైమెట్టు ఎక్కుతూ ఉన్నత పాఠశాలా విద్యాధ్యయనం కొనసాగిస్తున్నాడు. మరో నాలుగేండ్లలో మరో నాలుగు అంగుళాలు ఎదక్కపోదు. కొంచెం ఒళ్ళూ రాకపోదు. అంతేకాదు గతంలో పోకడ దృష్ట్యా అవకాశాలు లభిస్తే అతను అన్ని విషయాలలోనూ పైస్థాయికి వెళ్ళగలడనే అనిపిస్తుంది ఎవరికైనా.

తలిదండ్రుల చాటునఉంటూ నిక్షేపంలా పాతికేండ్లు పైబడి, మీసాలు బారెడుపెరిగి, గడ్డం ముదిరేదాకా ఏ చదువో ఓ చదువు వెలగబెడుతూ, బస్తీలలో కాలం గడుపుతూ, ధనంవిచ్చలవిడిగా వ్యయంచేస్తూ మూడుపూటలా సుష్టుగా తిని యథేచ్ఛగా తిరిగే 'అదృష్టం' కొందరికే ఉంటుంది పరిమితమై. ఆ కొందరిలో అవధాని ఒకడుకాడు. దిక్కూ దివాణం లేకుండా ఎక్కడో ఏకాకిగా పెరిగి, అక్కడా ఇక్కడా వెట్టి వెంగళప్పలా తిరిగి స్వయంకృతాపరాధంవల్లనో, విధివశాననో జీవితం భ్రష్టం అవుతుండగా పాడుజీవితాలు గడుపుతూ, కొద్దోగొప్పో పైకివచ్చినా పైకి వచ్చినట్లే అనిపించక, ఏ కొంతకాలమో సుఖపడ్డా సుఖపడినట్లే అనిపించక, చివరకు ఎక్కడో ఏమూలనో కూలి రాలి పోయేవాళ్ళు మరికొందరు ఉంటారు. ఈ కొందరిలోనూ అవధాని ఒకడుకాడు.

అతనికి తల్లీ, తండ్రీ ఉన్నారు.

అతను సుష్టుగాతిని తిరగనూలేదు. ఏ విషయం పట్టించుకోకుండా ఇష్టానుసారంగా ఊరేగనూలేదు. కొందరు ఇతరులంతా అలా చూస్తుండగానే అతి సులభంగా అసలు ఏ ప్రయత్నం లేకుండానే అత్యున్నతస్థాయి అందుకొంటారు. కొందరు అమితోత్సాహంతో వెనుకముందులు చూచుకోకుండా మహాప్రవాహంలా ముందుకు తోసుకొనిపోతారు. వారిల్లో కొంత

మంది బాగా బాగుపడతారు. కొందరు నెమ్మదిగా భారంగా సింహాచలం కొండ మెట్లు ఎక్కినట్లుగా నడుస్తారు. అవధాని కొంతదూరం ప్రయాస పడుతూ నిస్పృహ, ఈర్ష్య వెంటరాగా 'ఏం కొండమెట్లు ఎక్కపోతేనేం పుణ్యమా పురుషార్థమా' అనుకొంటూ ఏదో తప్పనిసరి అయినట్లు ఎక్కే తైర్థికునిలా జీవితంలో మెట్లు గడిచాడు. అలా నడుస్తూనడుస్తూ ఒక మలుపులో - ఆ మలుపు తిరిగీతిరగ్గానే పరుగు అందుకొన్నాడు. అతని నడకే చిత్రమనిపించింది అందరికీ. అతను ఎప్పుడూ ఆరోగ్యంగా కన్పించేవాడు. కుఱ్ఱవాడు పచ్చనిపసిమి, భాగ్యవంతులఇండ్లలోపుట్టి ఎండ కన్నెరుగకుండా పెరిగిన ఆడపిల్లలకు మల్లే కావలసినన్ని పాలూ త్రాగుతూ కోరినప్పుడల్లా గడ్డపెరుగూ వేసుకొని తింటూ నెయ్యి నూనే కొంచెం ఎక్కువ తగులగా మరీ మిసమిసలు పోయే మేని పచ్చదనం కాదది. స్వతహాగా, పుట్టుకతో వచ్చిన రంగు అది. అలా ఉండేవాడతను.

ఒక పని మొదలు పెట్టాక దాని పరిపూర్తికి పట్టుదల అవసరం అని మాత్రం ఆయన గట్టిగా అనుకొన్నారు. అందుకే ఆయన ఎన్నడూ ఎవరినీ ఆశ్రయించని మనిషి, తన చిన్ననాటి స్నేహితుడైన మాధవయ్యగారిని కలుసుకొని ప్రాధేయపడ్డారు. ఫలితంగా మాధవయ్యగారు అతనికి ఉండడానికి తన ఇంట్లోనే ఒక చిన్న గది ఇచ్చారు. పూర్వం అది ముట్లగది. స్నానాదికాలకు తనతోపాటే ఎలా సర్దుకుపోవాలో చెప్పారు. అతనికి తిండి గడవడానికి ఉపాయం చెప్పారాయన.

అవధాని తండ్రి అన్నింటికీ సరే అన్నాడు.

కొడుకు చేత సరే అనిపించాడు. ఆయన కొడుకును మాధవయ్యగారికి వప్పచెప్పి ఇంటికి తిరిగి వెళుతూ "సరే వీణ్ణి నీకు అప్పగించి వెళుతున్నా. ఇది నీకు భారమని నాకు తెలుసు. మన స్నేహితులలోనే కొందరు స్థితిమంతులుఉన్నారు. సహాయం చేయగల వారూ ఉన్నారు. కాని వాళ్ళ సహాయం వద్దు. నువ్వు కష్టం సుఖం తెలిసిన వాడివి.

ఇక్కడ ఉంటే వాడికీ కష్టం సుఖం తెలుస్తుంది. ఎన్నడో ఒకనాడు నీ ఋణం తీర్చుకొంటాను. అసలది ప్రశ్నే కాదనుకో. ఇది తీర్చుకో కలిగే ఋణం కాదనుకో, కాని మాట సామెతకే అంటున్నాను. నా మనసుకు ఏదో తృప్తి కలిగించుకొనేందుకు అంటున్నా. నువ్వు అనుకొంటున్నట్టుగా అన్ని వారాలూ కుదిరి ఏదో ఒక విధంగా చదువుసాగుతుందా, సాగనివ్వు. అలా చదువు సాగుతుంటే వాడు ఎంత ఇబ్బంది పడినా పరవాలేదు. పడే కష్టమేదో ముందే పడితే మంచిది. చెడిబ్రతకడంమేలు నాలాగా బ్రతికి చెడడంకంటె. వాణ్ణి కాస్త దార్లో పెట్టు. ఇప్పట్లో వాడు సంపాదించి నాకు పెట్టవలసినస్థితి వాడికీలేదు. అటువంటి పరిస్థితి నాకూ లేదు. నేను ఏదో విధంగా ఇల్లు గడుపుకుపోతా. వాణ్ణి ఇక్కడఉంచుకో. వాడు మధ్యలో భయపడినా, బెంగపెట్టుకొన్నా, వాడికి తెలిసేలా ఒకటి మాత్రం స్పష్టంగాచెప్పు. ఒరేయ్ అబ్బి ఇంటికి వెళ్ళి మాత్రం ఏం బావుకొంటావ్. ఇక్కడే ఎలాగో గడిపి గట్టెక్కు అని గట్టిగా చెప్పు. ఒక వేళ ఎన్ని విధాల ప్రయత్నంచేసినా ఇక్కడ ఈ చదువు సాక్క పోతుందీ బెంగలేదు. ఏదైనా పనిలో ప్రవేశపెట్టు. పోనీ ఎక్కడయినా అచ్చాఫీసులో చేర్పించి పని నేర్పించు. నాన్నాళ్ళకు పొట్టపోసుకొనే శక్తి వస్తుంది." అన్నారు. అలా ఎన్నో చెప్పి కొడుకును వృద్ధిలోకి తీసుకొని వచ్చే బాధ్యత మాధవయ్య గారి మీద పెట్టి, ఆ గుమ్మం దాటి బయటకు వచ్చాక కళ్లు గట్టిగా తుడుచుకొని, నడి ఎండలో పడి, చెకచెకా నడిచి వెళ్ళారాయన.

ఆయనకు కాళ్ళకు చెప్పులులేవు.

ఒంటి మీద చొక్కాలేదు.

పైన ఎండ మండి పోతున్నది. వేద పండితుడు కనుక ఆయన ఎండలో అలా వెళ్ళినా పర్వాలేదు.

మాధవయ్యగారు గుమ్మంలో నిలబడి కొంత సేపు ఆయన వంకా, ఆ తర్వాత ఆయన వెళ్ళిన దారివంకా చూస్తూ ఉండిపోయారు. తనూ ఆయనా చిన్నప్పుడు ఒకే గ్రామంలో ఉన్నారు. అప్పుడు తమ ఇద్దరికీ ఎంతో స్నేహం. బాగా బ్రతికిన కుటుంబం ఆయనది. వేదాలు పోసిన గాదెవారి ఇల్లు. వారింట్లో గాదెల నిండా ధాన్యంకూడా మూలుగుతుండేది. అయితే ఆ ధాన్యం ముక్కిపోయేదికాదు. దాన ధర్మాలకు ఆ యిల్లు పెట్టింది పేరు. ఎక్కడెక్కడినుంచో పిల్లలు గోచీ పెట్టుకోవడం చేతకాని వయసులో వారింటికి చేరుకొని విద్యాధ్యయనం చేసి. పండితులై పట్టు పీతాంబరాలు ధరించి. పట్టు శాలువలు కప్పుకొని సంతోషంగా వెళ్ళారు. అది ఒక నాటి స్థితి. ఆయన తండ్రి హయాంలో చివరిరోజుల్లో ఆస్తి కరిగి పోయింది, ఆయన హయాములో పరిస్థితి దిగజారింది. వేదపండితులకు, ఏ నాడో దక్కిన ఈనాం భూములు లాక్కొన్నారు. పరిహారం ఇచ్చే ప్రశ్నే లేదని స్పష్టంగా చెప్పారు కూడా. అయితే ఆ తర్వాత గొప్ప జమీందారులు మొదలైన వారికి మాత్రం గుర్రపు పందాలలో మదుపు పెట్టేనిమిత్తం పౌమ్య ఉద్యమం క్రింది రాజ భరణాల పేరిట లక్షల కొద్దీ ధనం చిన్న మొత్తాలుగా అడగకుండానే ఇచ్చేశారు, ఉదారంగా.

అలా జరిగాక ఆయన పరిస్థితి మరీ అమోమయం అయిపోయింది.

మాధవయ్యగారు ఆయన పరిస్థితిని గురించే ఆలోచిస్తూ కొంత సేపు అక్కడే నిలబడి అవధాని విషయం భార్యతో చెబుదామని లోపలకు వెళ్ళారు

మాధవయ్యగారైనా ఏ మంత కలవాడుకాదు. మొదటి నుంచీ కూడా ఆయనది అతి సాధారణ కుటుంబం. ఆయన తండ్రి ఎన్నడో స్వగ్రామంలోఉన్న పొలం పుట్రా అమ్ముకొని బస్తీచేరి కొంతలోకొంత బాగుపడ్డాడు.

మాధవయ్యగారికి ఇద్దరు ఆడపిల్లలూ వారి తర్వాత ఒక మొగ పిల్లవాడు. ఇంకా సంతానం కలిగే సూచన్లే కన్పిస్తున్నాయికాని, అప్పట్లో ఆగేలా లేదు ఆ వ్యవహారం. పైగా బస్తీ కాపురం. చేస్తున్నదేమో మాస్టరు గిరీ. ఆయన భార్య ఎంత పొదుపుగా వాడినా డబ్బు చాలేదికాదు. అంతంతమాత్రపు సంపాదన ఆయనది. అందువల్లనే ఆయన తను ఉంటున్నది, సొంత ఇల్లు కనుక అవధాని ఉండడానికి ముందువసారాలో ఉన్నగది ఇవ్వకలిగారే గాని అతనికి తానుగా భోజన సౌకర్యం కల్పించ లేక పోయారు. అటువంటి సదుపాయం కల్పించాలని ఆయన హృదయ పూర్వకంగా ఆశించినా స్తోమతులేక అతనికి వారాలు కుదిర్చి పెట్టారు. సంసార పక్షంగా తనూ ఒక వారం ఇచ్చారు.

అవధాని కూడా అట్టే అభిమానాలకు పోయే కుఱ్ఱవాడుకాదు. అందువల్లనే మాధవయ్యగారు, దారి చూపిస్తే ఆ దారిన తల వంచుకొని ముందుకు నడిచాడు. మనసులో ఏమనుకొన్నా, ఇదికావాలి అది కావాలని తానుగా అడిగి వేయించుకోక పోయినా ఆయా ఇళ్ళలో అతను కొంత తృప్తిగానే తినేవాడు. తనకు వారాలుకుదిరిన ఇళ్ళల్లోఆడవాళ్ళు ఏ సినిమా లకో వెళితే, ఇక ఆ పూట భోజనం చెయ్యకుండానే గదికి తిరిగి వచ్చి, పడుకొనేవాడు. ఒక పూటా ఒక రోజూ భోజనం లేకపోయినంత మాత్రాన అస్తవ్యస్తమైపోయి తోటకూర కాడలా వాడి వేలబడి పోయేవాడుకాదు. ప్రొద్దుట అన్నం తినకుండా వచ్చేసినా సాయంకాలం దాకా అతను బడిలో అందరికీ మామూలుగానే కన్పించేవాడు. అలా చాలా సార్లు జరిగింది. అతని ముఖంలో ఉపవాసపు లక్షణాలు ఎన్నడూ కన్పించేవికావు. ఆ సంగతి మాధవయ్యగారికే తెలిసేదికాదు. కాని అతను మనసులో మాత్రం అందుకు బాధపడేవాడు. బడిలో అనేకమంది ఇతర పిల్లలలాగా మూడు పూటలా తిని, ఇస్త్రీ మడతలు, క్రొత్త బట్టలువేసుకొని తనూ తిరగలేక పోతున్నందుకూ. వాళ్ళందరికీ ఉన్న

భోగం తనకు లేకపోయినందుకూ, అతనికి కొంత అసూయ కొంత నిస్పృహ కలిగేవి. చిన్న వయసు కావటంచేతా దానటన చేత కాకపోవటంచేత వాటిని పైకి కన్పించనీయకుండా దాచుకోలేకపోయేవాడు. అంతే కాదు. బడిలో గొప్పఇంటిపిల్లలు ఎవరైనా తన దుస్తులు చూచి కానీ, తన వాలకంచూచికానీ నవ్వినా, వెక్కిరించినా అతను ఎంత మాత్రం సహించే వాడు కాదు. మళ్ళీ నవ్వే వాడు, మళ్ళీ వెక్కిరించేవాడు. వాదులాటకు, దెబ్బలాటకు సిద్ధమయేవాడు. ఫలితంగా తీవ్ర అవమానాలకు గురిఅయేవాడు. మొదట్లోఇలా చాలాసార్లు జరిగింది. ఆ విషయాలు మాధవయ్య గారి దాకా వెళ్ళాయి. ఆయన అతన్ని పిలిచి గట్టిగా మందలించేవారు. "ఒరేయి వెట్టి వెధవయ్యా నువ్వు అలా ఉడుక్కోకూడదురా, అసూయ మంచిదికాదురా. ఎవరు ఏమన్నా సరే దెబ్బలాటకు పోకూడదురా. దానివల్ల మనకే నష్టం" అంటూ అనేక విధాల హితబోధచేసేవారు. కాని ఆ బోధలు అతనికి అప్పట్లో సమంగా అర్థం కాలేదు,

ఆ సంవత్సరం నెలనెలా మాధవయ్యగారే తన జీతంలోనుంచి అయితేనేమి, దగ్గర మిత్రుల దగ్గర నుంచి విరాళాలు వసూలుచేసి అయితే నేమి అతని బడిజీతంకట్టి, చదవుకోడానికి పాతపుస్తకాలు సంపాదించి ఇచ్చి, బడిలోనూ ఇంటి దగ్గరా ఎలా చదువుతున్నదీ కనిపెట్టిఉంటూ అతనికి అన్ని విధాలా అండగా నిలిచారు.

అతికష్టంమీద ఆ సంవత్సరం గడిచింది.

అవధాని నాల్గవఫారంలోకి వచ్చాడు. బస్తీ జీవితానికీ బస్తీలో బసి చదువుకూ, వారాల భోజనానికీ,మాధవయ్యగారి కట్టుబాట్లకూ, అతను క్రమంగా కొంతలో కొంత అలవాటుపడ్డాడు. అవి కొంచెం కష్టమే అయింది. అతనికి ఇంటి దగ్గర పెద్దవాళ్ళ పరిస్థితి ఎలా ఉన్నా అతనికి మాత్రం అంతకాలం స్వేచ్ఛగా, సుఖంగా గడిచింది. బడికి వెళ్లినా

వెళ్ళకపోయినా ఎవరూ అడిగేవారుకాదు. ఇంట్లో తండ్రి దగ్గర సంస్కృతం బాగా నేర్చుకొన్నాడు. అక్కడబడిలో నేర్చుకోకుండానే కొత్తచదువు బాగానే అబ్బింది. తల్లీ తండ్రీ ఇద్దరూ కూడా గారాబమే చేశారు. అందువల్ల అతనికి అన్ని విధాలా హాయిగానే ఉంటూ వచ్చింది. కాని ఇక్కడి పరిస్థితివేరు. అందువల్లనే క్రొత్త పరిస్థితులకు సర్దుకొని పోవటం కష్టమైంది అతనికి. అదీకాక అతనికి కొంత ఊహ వచ్చింది.

తనతోపాటు చదువుకొన్నవాళ్లు ఎవరో కొందరు బస్తీకి పోయి ఉన్నతపాఠశాలలో చేరాలని తనూ అందుకు సిద్ధమయాడు. మొదట వద్దన్నాడు తండ్రి. అతను పట్టుపట్టాడు. దానికి అతని తల్లి ప్రోద్బలం కూడా తోడు అయింది. అందుమీదట అవధాని తండ్రి అన్నివిషయాలూ జాగ్రత్తగా పరిశీలించాడు. చివరకు సరే అన్నాడు.

ఆలా చదువుకోసం బెజవాడ చేరిన మొదటిరోజులలో తరచు ఇంటికి వెళ్ళి తల్లినీ తండ్రినీ, చెల్లెళ్ళ తమ్ముళ్లనీ చూడాలని అనిపించేది. అతనికి బెంగగానే ఉండేది. పగలేకను వెళ్ళి మళ్ళీ మరునాడే తిరిగి రావచ్చుకూడా. కాని రానూ పోనూ బస్సుచార్జీలు కావాలి. అతనిదగ్గ డబ్బు ఉండేదికాదు. మాధవయ్యగారిని అడిగే ధైర్యంలేదు.

ఆయనంటే గౌరవంతోపాటు భయంకూడా ఏర్పడింది అవధానికి.

లోపల ఆయనంటే భక్తిభావం స్థిరపడది అతనికి. ఆయన భార్యకుకూడా ఆయనంటే భయం. అందువల్లనే భర్తచేసే పనులలో కొన్నింటిని చాటుగా విమర్శించినా, ఆయన ఇంట్లో ఉన్నప్పుడు నోరెత్తేది కాదు. ఆ విషయం గమనించాక అతనికి మాధవయ్యగారంటే భయం ఎక్కువ అయింది. అతనికి ఆయనంటేనేకాక ఆవిడంటేకూడా భయం ఉన్నది. ఒకసారి తను వసారాలో ఉండగా ఆవిడ మాధవయ్యగారితో "అతన్ని ఈ ఏడాది మరెవరి ఇంట్లో అయినా ఉండమందురూ" అన్నది.

తన కూతురు పెద్దమనిషి కాబోతున్నదనీ, ముమ్మందు ఆ గది కావలసి వస్తుందనీ, పరాయికుఱ్ఱవాడు ఉండడంవల్ల ఇబ్బంది కలుగవచ్చుననీ అనుకొంటూ,

అవధాని నెమ్మదిగా బయటకు జారుకొన్నాడు.

"చూద్దాంలే'' అన్నారు మాధవయ్యగారు.

"చూద్దాంలే అంటే ఎలాగండీ? ఇల్లు చిన్నదయ్యె. నే నయితే నెలనెలా ఆ మూడురోజులూ ఎలాగో ఎక్కడో ఓచోట ఒదిగి కూర్చుని గడుపుకొస్తున్నా, పిల్ల ఎలా సర్దుకొంటుందీ?'' అన్నది ఆవిడ పెద్ద సమస్య వచ్చిపడినట్లు

ఆయన నెమ్మదిగా "ఎలాగో సర్దుకోవాలి మరి. పొమ్మంటే ఎక్కడికి పోతాడూ? ఆయన పిల్లవాణ్ణి నాకు వప్పగించి వెళ్ళాడు. వాడూ మన యింటి పిల్లవాడులా మెలుగుతున్నాడు. నువ్వు అలా అనకూడదు మరి'' అన్నారు ఆమెవంక అనునయంగా, బ్రతిమాలుతున్నట్టు చూస్తూ. కాని ఆవిడ వాదానికే సిద్ధపడడ. "మనకు వీలుకానప్పుడు ఎందుకీ లేనిపోని బెడద!'' అనేసిందీ ఆవిడ వెంటనే.

మామూలుగా అయితే ఆయనకు కోపం వచ్చేదే. కాని ఆ సందర్భంలో అలా జరగలేదు. అందుకు కారణం ఉన్నది. తను శాంతంగా, మంచిగా మాటాడి, నచ్చచెబితే తన భార్యకూడా అతన్ని దయగా చూస్తుందని అనుకొన్నారాయన. అందుకే "తీరిక ఉన్నప్పుడల్లా వాడు మన పిల్లవాణ్ణి ఎత్తుకొని ఆడిస్తున్నాడు. చెప్పగానే బజారుకు వెళ్ళి కూరలవీ తెస్తున్నాడు. బడినుంచి సాయంత్రం ఆటలకు పోకుండా సరాసరి ఇంటికి వచ్చి నువ్వు చెప్పిన పనులన్నీ చేస్తున్నాడు. జీతగాడుకూడా ఇంతలా పనిచెయ్య డనిపిస్తున్నది. ఇంటా బయటా బుద్ధిగా మసులుకొంటున్నాడు. అటువంటివాణ్ణి పొమ్మంటే బాగుంటుందా? నువ్వే చెప్పు? అదీకాక వా డిక్కడ లేకపోతే నీ కీ పనులన్నీ ఎవరు చేస్తారూ?'' అని అడిగారు.

"సరే, మీ యిష్టం. ఉంచుకోండి" అన్నది ఆవిడ మూతివిరుస్తూ, తనమాట నెగ్గడంలేదని కోపం వచ్చింది ఆవిడకు. ఆ మాటకు అయనకూ కోపం వచ్చింది. ఎఱ్ఱగా చూచారు. ఆవిడ వెంటనే అవతలకు వెళ్ళి పోయింది రుసరుసలాడుతూ.

మాధవయ్యగారి పట్టుదలవల్ల ఆ యేడుకూడా బాగానే గడిచి పోయింది. కోప్పడినప్పుడు కోప్పడినా, ఆయన అతన్ని ప్రేమగానే చూచారు. అడగకుండానే అతనికి చిల్లరడబ్బులు ఇచ్చేవారు. జేబులో డబ్బులు ఉన్నరోజున అతను బడిలో ఇతర పిల్లలలాగా తనూ అక్కడికి అమ్మవచ్చే చిల్లిగారెలూ, జంతికలూ కొనుక్కొని వాళ్ళ అందరి ముందూ, వాళ్ళు తన్ను రోజూ ఊరించినట్లే తనూ వాళ్ళను ఊరిస్తూ, తినేవాడు. తనదగ్గర డబ్బులు లేనప్పుడు వాళ్ళకు దూరంగా పోయి వాళ్ళ కంటె తను బీదవాణ్ణికదా అనుకొని బాధపడేవాడు. వాళ్ళనుచూచి ఈర్ష్య పడేవాడు. సెలవలు ఇచ్చి ఇవ్వగానే ఇంటికి పరుగెత్తాడు. ఆ సెల వలలో మాధవయ్యగారు గట్టిగా ప్రయత్నించి అతనికి పాఠశాలా నిర్వాహక వర్గం ఇచ్చే ఉపకారవేతనం సంపాదించారు.

అవధాని అంత తాపత్రయపడి ఇంటికి వెళ్ళాడేగాని అక్కడ పరిస్థితులూ బాగాలేవు. ఎన్నడో అతని అక్క పెండ్లికి చేసిన అప్పు సగమైనా తీరలేదు. ఆ పిల్లను ఏ పండుగకూ తీసుకొనిరాలేకపోయి నందుకు అతనితల్లి బాధపడుతున్నది. సెలవలకు ఇంటికివచ్చాడని కొడుకును చూచుకొని ఎంతో ఆపేక్షపడ్డదేకాని – ఎంతో సంబరపడ్డదేకాని ఓ పిండివంటచేసి పెట్టుకోలేకపోయింది అతని తల్లి. గత సంవత్సరం కంటె ఆ యింటిపరిస్థితి దిగజారింది. కాని అతను సెలవలు నిర్విచారంగా గడిపాడు. తనకు మంచిబట్టలు కుట్టిస్తేనేకానీ వీల్లేదని అతను పట్టుపట్టాడు. అతనితండ్రి తన క్రొత్త ఖద్దరుపంచ చింపించి రెండు చొక్కాలు కుట్టించాడు. అవి తీసుకొని తల్లిదగ్గరకు పోయి కళ్ళనీళ్ళు

పెట్టుకొని, తనకు బడికి వెళ్ళడానికి ఒక్క జతఅయినా మంచి రంగు బట్టలు కుట్టించమని అడిగాడు. ఎన్నాళ్ళనుంచో పసుపుకుండలో పదేసి ఉంచిన మెట్టెలు, పట్టాలు చాటుగా అమ్మించి కొడుక్కి క్రొత్త బట్టలు కుట్టించింది ఆవిడ.

బడి తెరుస్తున్నారనేసరికి ఆతనికి భయంవేసింది. స్వగ్రామం కంటె బెజవాడ ఎన్నోరెట్లు బాగున్నా, ఇంట్లోకంటె వారాల భోజనం మరింత రుచికరంగా ఉన్నా, అతనికి అక్కడికి వెళ్ళడం అంటే ఎంతో బాధ అనిపించింది. అందుకే ఒకటి రెండురోజులు ఆలస్యం చేశాడు. అతని తండ్రి అతికష్టంమీద ఎక్కడో పదిహూపాయలు తెచ్చి అతనిచేతికి ఇచ్చి "వెళ్ళు, నాయనా. ఆలస్యంచేస్తే మాధవయ్యగారికి కోపం వస్తుంది" అన్నాడు.

అంతకుముందు రోజుననే మాధవయ్యగారి దగ్గరినుంచి ఆయనకు ఉత్తరం వచ్చింది కూడా.

అవధాని ఆపూటే బయలుదేరి బెజవాడవచ్చాడు. అయిదవఫారం తరగతికి వెళ్ళి కూర్చున్నాడు. పాతవారాలలో రెండువారాలు పోయాయి. తను ఆలస్యంగా రావడంవల్లనే అలా జరిగిందని క్రమంగా తెలిసింది అతనికి.

క్రొత్తచోట మళ్ళీ ఆవారాలు సంపాదించడానికి పదిహేనురోజులు పట్టింది. వారాలు సంపాదించడం ఎంతకష్టమో తెలిసింది అతనికి. ఇంకా కొన్నివిషయాలు క్రమంగా తెలిశాయి. తను కేవలం మాధవయ్యగారి దయవల్లనే చదువుకొంటున్నాననీ, కష్టపడి చదవక తప్పదనీ, ఆ పరిస్థితులకు ఏదోలా సర్దుకొనిపోవడం తప్ప తనకు మరో గత్యంతరం ఏదీ లేదనీ అతనికి అర్థం అయింది.

మాధవయ్యగారివెంట సంచీపుచ్చుకొని బజారుకు వెళ్లేవాడతను. దారిలో ఆయన అతనికి ఇంగ్లీషువాక్య నిర్మాణంగురించి నూరిపోసేవారు. ఆయన అతనికి ఎక్కువ పనులు చెప్పేవారుకాదు. బడిలోకూడా తీరుబడి ఉన్నప్పుడు ఎక్కడో ఒకచోట కూర్చోపెట్టుకొని ఏదో ఒక పాఠం చదివించేవారు. కాని ఆయన భార్యమాత్రం అతన్ని ఊరికే కూర్చో నిచ్చేది కాదు. ఊరికే తిని ఇంట్లో ఉంటున్న పరాయివాడికి ఆ మాత్రం పనులు చెప్పి చేయించుకోవడం తప్పుకాదని ఆమె గట్టిగా అభిప్రాయ పడ్డది. అవధాని కిమ్మనకుండా ఆ పనులన్నీ చేసేవాడు.

పదిగంటలవేళల్లా అతను మాధవయ్యగారితో కలిసి బడికి వెళ్లేవాడు. వారాలు కుదిరిన ఇండ్లల్లో పదింటికి వంటకాలేనో, మరో ఇబ్బంది వల్లనో భోజనం చేసి రావడానికి వీలుకాకపోతే ముందు వేళకు బడికివెళ్ళి, మధ్యాహ్నం విశ్రాంతిసమయంలో తిరిగి అంతదూరం నడిచివచ్చి, గబగబా అన్నంతిని మళ్ళా బడికి వెళ్లేవాడు. రాత్రి భోజనంకూడా తరచు ఆలస్యం అవుతూ ఉండేది.

అతను కొంచెం పెందరాళే వెళితే "అప్పుడేం ఏం తొందరొచ్చిందయ్యా ఇంకా పసిపిల్లలకైనా పెట్టందే !'' అనేది ఒక తల్లి. కొంచెం ఆలస్యం అయితే "ఇపుడే నా నడుం వాలుద్దామనుకొంటున్నా. ఇంతలో నువ్వు తయారయ్యావ్'' అంటుంది మరో ఇంటావిడ. వాళ్ళ మాటలు బాగా అర్థమవుతూ వచ్చాయి అతనికి క్రమంగా. అందుకు అతను బాధపడేవాడు.

ఆలా భోజనం ముగించుకుని అతను గదికి చేరుకుని బుడ్డీదీపం పెట్టుకుని ఈతఆకుల చాప మీద కూర్చుని చదువు మొదలు పెట్టేవాడు. అంత ఆలస్యంగా చదువు ప్రారంభించిన కొద్దిపేపటికే నిద్ర వస్తున్నట్లు అనిపించేది అతనికి. కునుకుపాట్లు పడుతుంటే మాధవయ్యగారు వచ్చి కేకలు వేసేవారు.

"ఏమిరా ఈ ఊరు వచ్చింది వారం భోజనానికా చదువుకా" అని అనేవారాయన కసిగా. ఒక్కొక్కసారి ఆయన అలా అని లోపలకు వెళ్ళి లాంతరు తెచ్చుకొని, ఆ గదిలోనే కూర్చొని, కాంపోజిషన్ పుస్తకాలు దిద్దేవారు— అతన్ని ఏదో చదవమని చెప్పి. మరొక్కప్పుడు కూతుర్ని అక్కడకు పిల్చి ఇద్దరిచేతా లెక్కలు చేయించేవారు. పాఠాలు చదివించేవారు. ఏరోజూ రాత్రి పన్నెండు గంటలు కొడితేనేకాని అతన్ని నిద్ర పోనిచ్చేవారు కాదాయన. బడిలో కూడా అతని చదువు విషయం తోటి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకొనేవారు.

మాధవయ్యగారు ట్యూషన్లు చెప్పకపోవడంవల్లా, అన్ని విషయాలలోనూ నిక్కచ్చిగా ఉండడంవల్లా, బాగా చదువుకొన్నవాడనీ, నీతిమంతుడనీ, పేరు ఉండడంవల్లా, బడిలో అందరు ఉపాధ్యాయులకూ ఆయనంటే గౌరవం ఉంది. అందువల్లనే ఆయన అభిమానించిన అవధానిపట్ల వారుకూడా కొంచెం శ్రద్ధచూపడం జరిగింది.

మూడునెలల పరీక్షలలో అతనికి మార్కులు బాగానే వచ్చాయి. సెలవులలో ఇంటికి వెళతానంటే మాధవయ్యగారు వద్దన్నారు. అతను సరే అనక తప్పలేదు. పదిరోజులు సెలవులు వచ్చినా అతను ఇంటికి పోకపోవడం చూసి క్రొత్తగా వారం ఇచ్చిన ఒక ఇంటావిడ అతనికి వినిపించేలా "ఈ కుఱ్ఱవాడికి ఇంత తిండి దొరికితేచాలు ఇది ఇల్లూ వాకిలీ అక్కర్లేనట్లే ఉన్నదే" అన్నది. ఆవిడ ఎగతాళికే అన్నది. కాని అవధానికి కష్టం కలిగింది. ఇటువంటి ఎగతాళిమాటలూ, ఎత్తిపొడుపు మాటలూ అతనికి తరచు వినిపిస్తుండేవి. అతను ముఖం గంటు పెట్టుకొని ఇంటికి వచ్చేవాడు. అలాంటప్పుడు మాధవయ్యగారు "ఏరా అలా ఉన్నావేం?" అని అడిగేవారు. అతను వెంటనే సమాధానం చెప్పక పోతే "ఏంరా ఇంటికి పోవద్దన్నాననా? అంతేనా?" అని అడిగితే "కాదండీ" అనేవాడు అవధాని. దానిమీద పదిప్రశ్నలు వేసి మాధవయ్య

గారు అతని దగ్గరనుంచి సమాధానాలు రాబట్టేవారు. "ఊరికే తిని వాళ్ళ మీద పితూరీలు చెబుతున్నావా'' అని కోపగిస్తారేమోనని భయపడుతూనే అతను జరిగినదంతా చెప్పేవాడు. అందుకాయన చిరునవ్వునవ్వి "ఓస్ ఆమాత్రానికే నువ్వు ఇంత ఇదవ్వాలా? కొంచెం విసుక్కొంటారు, ఎగతాళికి ఏదో అంటారు. నువ్వు పట్టించుకోకూడదు. వంటమనిషి, పనివాళ్లూ ఉన్న ఇళ్లలో తప్ప ఇతరత్రా ఆడవాళ్ళు ప్రొద్దస్తమానం ఒళ్ళు విరుచుకొని పని చెయ్యవలసిందేనా? ఏదో ఓ మాట అంటే అది పెద్ద తప్పు విషయంకాదు. వాళ్ళు తమ పిల్లలను మాత్రం విసుక్కోరా కసురు కోరా. దానికి నువ్వింత బాధపడకూడదు తెలిసిందా'' అనేవారు. అలా అని ఒకక్షణం ఆగి 'ఒరేయి వాళ్లు ఈమాత్రం దయచూపినందుకు నువ్వు కొంచెం కృతజ్ఞతగా ఉండాలి. మనుష్యులు అతిశీఘ్రంగా మారిపోతున్నారు. పరాయివాళ్ళకి ఒక్కపూట అయితేమాత్రం ఎందుకు విస్తరెయ్యాలి? వెళ్ళి ఏ హోటలులో అయినా తినిరాకూడదా అంటున్నారు. అంతా వ్యాపార సరళిలో మాట్లాడుతున్నారు' అంటూ లోక పరిస్థితిని గురించి అవీ ఇవీ చెప్పేవారు. ఆమాటా ఈమాటా చెప్పి అతనికి ఉత్సాహం కల్పించి నెమ్మదిగా చదువులో పెట్టేవారు.

వారాలు ఇచ్చిన ఇళ్లల్లో ఆడవాళ్లే కాదు బడిలోకూడా అతన్ని కొందరు వెక్కిరించేవారు. ముఖ్యంగా గొప్పఇంటి పిల్లలు అతని దుస్తులు చూచి ఎగతాళి చేసేవారు.

అవధాని దుస్తులు తరచు మాపురంగులో ఉండేవి. అతనికి ఉన్నవే రెండుజతలు. ఒకజత ఉతికి ఆరవేసుకొని మరోజత కట్టుకొని బడికి వెళ్ళేవాడు. బట్టలు చాకలికి వేయకపోవడంవల్లా, పురపాలక సంఘంవారి దయవల్ల ఎన్నడో చెడిపోయిన రోడ్లమీద నుంచీ, ప్రక్కన కాలిబాటలమీదనుంచీ దుమ్మూ చెత్తా గాలికి లేచి బట్టలమీద పడుతుండడంవల్లా, అతను ఉతికి అరవేసుకొన్న చొక్కా, లాగూ ఆ తీరున ఉండేవి.

ఆ దుస్తులను చూచి పిల్లలు కొందరు నవ్వేవారు. అతను అటువంటి వాట న్నింటికీ బాధపడేవాడు. దీనికితోడు అతను తప్పనిసరిగా అడపాతడపా ఉపవాసం చెయ్యవలసి వచ్చేది.

వారం ఇచ్చిన ఇంటి ఇల్లాలు పిల్లలందరికీ సాయంత్రమే అన్నాలు పెట్టుకొని, అతని విషయం మరచిపోయి, ఏ సినిమాకో వెళితే, అతను భోజనం లేకుండా గదికి తిరిగివచ్చి, చదువుకొంటూ కూర్చుని ఏ తొమ్మిదో అయాక ఆకలివేస్తుంటే, పెట్టెలో దాచుకొన్న చిల్లర ఏ బేడో పావలో తీసుకొని, రోడ్డుమీదకు పోయి కేపలం బీదవాళ్ళకోసం చెట్టుక్రింద మురికి కాలవప్రక్కన తట్టలో పెట్టుకొని అమ్మే పునుగులూ, జంతికలూ కొను క్కొని అక్కడే నిలుచుని, ఎవరెన్నా చూస్తున్నారేమోనని అభిమానపడి, భయపడుతూ చప్పున తినేసి, వీధి పంపుదగ్గర చేతులు కడుక్కొని, కడుపునిండా నీళ్ళు త్రాగి, గబగబా గదికి తిరిగి వచ్చి, మళ్ళీ పుస్తకం తీసుకొనేవాడు. ఒక్క అరగంటకూడా కాకముందే అతనికి మళ్ళీ ఆకలి వేస్తున్నట్టు అనిపించేది. ''ఈ పూటకూడా మీ యింట్లోనే అన్నం పెట్టండి'' అని మాధవయ్యగారి భార్యను అభిమానం చంపుకొని అడుగ లేకపోయేవాడతను. ఆకలినీ కాదనలేకపోయేవాడు. 'అభిమానం కన్న ఆకలి గొప్పది.' 'వెధవ ఆకలి' అని అతను పదిసార్లు అనుకొనేవాడు.

అంత కష్టపడి అర్ధాకలితో మాడుతూ అక్కడ ఆ చదువు చదవక పోతేనేం అనిపించేది అతనికి తరచు. 'అసలు నావంటివాడు ఉంటేనేం పోతేనేం? అనికూడా అనుకునేవాడు అవధాని. అలా అనుకొనేసరికి అతనికి కళ్ళనీళ్ళ పర్యంతం అయేది.

ఆ పరిస్థితి అప్పుడప్పుడు మాధవయ్యగారు పసికట్టేవారు. లోపల మనిషి కరిగి నీరయేవారు. పైకిమాత్రం మండిపడేవారు. ఏదో అర్థం లేకుండా, వాళ్ళనూ వీళ్ళనూ కేకలు వేసేవారు అతని గదిలో కూర్చుని.

ఒక్కొక్కసారి అంతా నిద్రపోయాక అతన్ని నెమ్మదిగా వంటయింట్లోకి తీసుకొని వెళ్ళి కడుపునిండా అన్నం పెట్టేవారు.

ఒక్కొక్కప్పుడు ఆయనకు అతని ఉపవాసం సంగతి తెలిసేది కాదు తెలిసినా ఇంట్లోకి వెళ్ళి పరిస్థితి తెలుసుకొని వచ్చిన తర్వాత తెలియనట్లుండేవారు.

ఆయన అతన్ని తరచు మందలిస్తూ ఉండేవారు కొంచెం మంద కొడిగా కన్పిస్తే. చిన్నతనంవల్లా, ఇల్లువదలి వచ్చి ఇక్కడ ఇబ్బందులు పడుతూ చదువుకోవలసి రావడంవల్లా అతను అలా కన్పిస్తున్నాడని అనుకొని ఆయన అతన్ని ఒక్కొక్కప్పుడు గట్టిగా కోప్పడేవారు. "ఒరేయి మనం తిండికోసం కాదురా బ్రతికేది. బ్రతకడానికి తింటున్నాం. అది గుర్తుంచుకో. ఒకపూట తినకపోతే మరేం ప్రమాదం లేదు. ఈ వారా ఆవారా రేపు తినవచ్చు. కాని ఓపూట చదవకపోతే కుదరదు ఈరోజు మళ్ళీరాదు" అనేవారు. అని తనూ ఓ పుస్తకం తెచ్చుకొని అతనిదగ్గరే కూర్చుని ఆరాత్రి చాలా ప్రొద్దు పోయేదాకా చదువుకొనేవారు. అతన్ని గట్టిగా చదివించేవారు.

పరీక్షకు అది ముఖ్యం ఇది ముఖ్యంకాదు అనే విచక్షణ లేకుండా అన్ని పాఠాలూ అతనిచేత వప్పగించుకొనేవారాయన. కూతుర్నికూడా పిల్చి ఇద్దరికీ ఇంగ్లీషు, తెలుగు వ్యాకరణం చెప్పి గట్టిగా చదివించేవారు. అతను ఎప్పుడైనా పాఠాలు సరిగా వప్పగించకపోతే "ఒరేయి మీ తాతా మీ నాయనావాళ్ళు వేదాలు తల్లక్రిందుగావల్లించేవాళ్ళురా. అటువంటివంట పుట్టిన నువ్వు ఈ వెధవ ఇంగ్లీషు పాఠాలు, అరటి ఆవు తెలుగు పాఠాలూ వప్పగించలేవురా" అనేవారు. ఒక గంట తర్వాత ఆ పాఠం ఏదో రాక పోయిందా కొట్టినంత పని చేసేవారాయన.

అతను ఆ సంవత్సరం రాత్రిళ్ళు చదివిన చదువే చదువు.

అవధాని ఆ యేడు అయిదవఫారం బడిమొత్తంమీద ప్రథముడుగా ఉత్తీర్ణుడు అయాడంటే అదంతా కేవలం మాధవయ్యగారి చలవేనని అంతా అనుకొన్నారు. మాధవయ్యగారి భార్య తనధోరణిలో 'అంత నూరిపోస్తే ఎవరైనా అలా ప్యాసవుతారు. అంతచేటు కష్టపడి అతనికి చెప్పకపోతే ఆ చెప్పేది ఎవరికైనా ట్యూషను చెప్పకూడదూ, మరో నాలుగుడబ్బులు వచ్చునుగదా' అనుకొన్నది.

ఆ యేడు సెలవలకు అవధాని ఇంటికి వెళ్ళలేదు. వేసవికాలం అంతా అక్కడే గడిపాడు. అక్కడ ఉండి డబ్బు సంపాదించాలని బుద్ధి పుట్టింది అతనికి. ఒకరు ఉపాయం చెప్పారు. పిల్లలకు ట్యూషన్లు చెప్పి అయిదు ఆరు తరగతుల్లో బళ్ళల్లో చేర్పిస్తే బాగా లాభిస్తుందని చెప్పారు. అతను అపనే చేశాడు. వారాలు కుదిరిన కొన్ని ఇళ్ళల్లో పిల్లలకు ఉచితంగా ప్రయివేటు చెబితే వారు అతనికి సెలవల్లోకూడా అన్నం పెట్టారు. అదికాక ఇతరత్రా కుదిరిన ట్యూషన్లమూలంగా సెలవలు ఆఖరుకు అతనికి అరవైరూపాయల ఆదాయం లభించింది. అతను సంపాదించిన ట్యూషన్లలో ఒకటి మరీ మంచిది. అనుకోకుండా వెంకటప్పయ్యగారింట్లో ఇద్దరు చిన్నపిల్లలకు ట్యూషనుచెప్పే అవకాశం దొరికింది అదీ బహు చిత్రంగా దొరికింది. అతను ఒకరోజు మధ్యాహ్నం భోజనంకూడా చెయ్యకుండా ఎండలో తిరుగుతూ వారింటికివచ్చాడు.ఆయన బయట నిల్చున్నారు. నిండైన విగ్రహం. ముఖంలో వర్చస్సు కొట్టవస్తున్నట్లు కన్పిస్తున్నది. అతను మొదట ఆయన్ను చూచి ఆశ్చర్యపడ్డాడు. అతను ఆయన దగ్గరకు వెళ్ళి వినయంగా నమస్కారంచేసి, క్లుప్తంగా తనువచ్చిన పని చెప్పాడు. ఆయన వెంటనే "వికార్ ఆఫ్ వేక్ ఫీల్డు చదివావా?" అని అడిగాడు. అతను లేదన్నాడు. "అయితే నువ్వు ట్యూషన్ ఏం చెబుతావయ్యా" అని పెద్దగా నవ్వారు. మళ్ళీ అంతలో "భోజనం చేశావా?" అని అడిగారాయన. అతను మళ్ళీ లేదన్నాడు. ఆయన పూర్వంకంటె పెద్దగా

నవ్వుతూ, "అన్నం తిననివాడవు పాఠం ఏం చెబుతావోయ్" అన్నారు. ఒకక్షణం ఆగి "వికార్ ఆఫ్ వేక్ ఫీల్డు చదవలేదంటివి – అన్నం తినలే దంటివి. మరి నువ్వు ఎందుకు పనికివస్తావ్? వెళ్లు వెళ్లు" అన్నారు. అతను వెనుతిరిగి పోబోతుంటే కొంచెం కోపంగా చూస్తూ, "అటుకాదు – ఇటువెళ్లి – ముందు భోజనం చేసిరా. తర్వాత మాట్లాడు కొందాం" అని గుమ్మంలోనుంచే "ఈ అబ్బాయ్ వస్తున్నాడు. త్వరగా వడ్డించండే!" అని ఆయన మేడపైకి వెళ్లిపోయారు.

అవధాని అక్కడ ఎవరో దారిచూపిస్తే దొడ్లోకి వెళ్లి, చప్పున మళ్ళీ స్నానంచేసి, మరెవరో మడిబట్ట ఇస్తే కట్టుకొని, లోపలకు పోయి, భోజనానికి కూర్చున్నాడు. అతను ఆరోజు వారింట్లో ఏదో శుభకార్యం జరిగిఉంటుందని అనుకొన్నాడు మొదట. తలవంచుకొని విస్తట్లో వడ్డించిన వన్నీ తింటూ నెమ్మదిగా అడిగాడు "ఏమండీ, మీ యింట్లో ఏమైనా శుభకార్యం జరిగిందా" అని. ఆవిడ నవ్వి ఊరుకొన్నది. ఆవిడ అతనికి ఎంతో ఆదరంగా అవీ ఇవీ మారు వడ్డించింది. అతను గబగబా తింటుంటే "అదేమి టబ్బాయ్, అంత తొందర దేనికి. ఏమైనా అర్జంటు పనుందా" అంటే, అతను నెమ్మదిగా తను వచ్చిన పనిచెప్పి ఆ విషయం ఆయనతో మాటాడవలసి ఉన్నదని చెప్పాడు.

ఆవిడ "సర్లే బాబూ, నిదానంగా తిను. రేపటినుంచి వచ్చి చెప్పు. పిల్లలు ఇద్దరికీ నువ్వే చెప్పు. స్కూళ్లు తెరిచాక ఆయనకు కన్పడు. నీకు ఎప్పుడు బుద్ధిపుడితే అప్పుడు వచ్చి మాయింట్లో భోజనం అదీ చెయ్యి. బుద్ధిగా చదువుకొని, పైకి వచ్చే పిల్లలంటే ఆయనకు ఎంతో ఇష్టం" అన్నదావిడ.

వారి ఒక్క ఇంట్లో ట్యూషను చెప్పినందుకే ముప్పయి రూపాయలు వచ్చాయి. ఆయనభార్య అతనికి మంచి బట్టలుకూడా కుట్టించింది.

అవధాని కంటికి అలా సంపాదించిన అరవై రూపాయలు, అరవై వేలుగా కన్పించింది. ఆ డబ్బు పదిసార్లు లెక్కపెట్టాడతను. అందులో ముప్ఫయిరూపాయలు మాధవయ్యగారికి ఇచ్చి, మిగతా సొమ్ము తీసుకొని సరాసరి ఇంటికి వెళ్ళాడు. ఆరూపాయలన్నీ తల్లి చేతికి ఇచ్చాడు. ఇస్తూ, "అమ్మా ఈ ఏడు అక్కను పిలిపించి మంచి చీర పెట్టు" అన్నాడు. ఆమె "వద్దులేరా, నువ్వు ఖర్చులకు ఉంచుకో. ఇన్నాళ్ళు పిలవంది, ఇప్పుడుమాత్రం పిలవకపోతేనేం" అంటూనే డబ్బు తీసుకొన్నది. ఆవిడి ఆనందబాష్పాలు చూచి అవధాని ఉబ్బి తబ్బిబ్బు అయాడు.

అలా ఇంటికి వెళ్ళి, అతను స్వగ్రామంలో ఒక్క వారంకూడా ఉండలేదు. అతనికి దారిద్ర్యం అంటే బాగా అర్థంఅయింది. తలితండ్రుల పరిస్థితి చూచి అతను దిగాలుపడ్డాడు. ఆ స్థితిలో వాళ్ళకు సాయపడక పోగా, భారంగా ఉండటం ఇష్టంలేక, తల్లి ఇంకో రెండురోజులు ఉండరా అంటున్నా, వెంటనే బయలుదేరి, అవధాని బెజవాడ తిరిగి వచ్చాడు బరువెక్కిన హృదయంతో.

సెలవలలో ట్యూషన్లు చెప్పడంవల్ల ఆ అవసరం కలవారికి అతను పరిచయంఅయాడు. వారిలో కొందరు ఏడాదిపొడుగూతా అలా ట్యూషను చెప్పమన్నారు. అందుకు ప్రధానకారణం అంత చవగ్గా మరెవ్వరూ చెప్పకపోవడం. అవధాని అందుకు సిద్ధపడ్డాడు. కాని మాధవయ్యగారు అడ్డుపడి అతన్ని కొంచెం మందలిస్తూ, "నీ కిప్పటినుంచే డబ్బుయావ ఎందుకురా" అన్నారు.

"ఒరేయి అవధానీ నువ్వీయేడు బాగా కష్టపడి చదవాలి. నువ్వీ స్కూలుఫైనలు గడిచి గట్టెక్కావా, ఒక దారిలోకి వస్తావు. అందుకు మొదటినుంచీ దీక్షగా చదవాలి. ఆ ట్యూషన్లేమీ వద్దు. డబ్బుకు కక్కుర్తి

పతబోకు. ముందీ చదువుకానీ – అది తర్వాత చూచుకొందువుగాని''
అప్పికూడా అన్నారాయన.

అతను "అలాగేనండీ" అన్నాడు. అలా అనక తప్పిందికాదు అతనికి.

ఆ సంపాదన–అతి స్వల్పమే అయినా – అది కొనసాగితే ప్రతి రోజూ మధ్యాహ్నం ఉపాహారం సేవించే 'భాగ్యం' కలిగేది అతనికి. అది లేకుండా పోతున్నందుకు అతను బాధపడ్డాడు.

ఆ యేడు మొదటి మూడునెలలూ గడిచాయి.

o o o o

నెలలు గడుస్తున్నా గడపక అట్టే ఆగిపోతున్నట్లు అనిపించింది అవధానికి. మాధవయ్యగారు ఎప్పటిలాగే అతనిపట్ల శ్రద్ధ, దయ చూపుతూనే ఉన్నారు. ఆయనభార్య వీశైనన్ని పనులు చెబుతూనే ఉన్నది. అడపా తడపా ఉపవాసం చేసినా, మొత్తంమీద వారాల భోజనంవల్ల అతనికి ఆకలి తీరుతూనే ఉన్నది. వెంకటప్పయ్యగారింట్లో ట్యూషను చెప్పకపోయినా, వారం అంటూ ప్రత్యేకింగా కుదరకపోయినా వారింట్లో రాజాన్నభోజనం కోరినప్పుడల్లా లభిస్తూనే ఉన్నది అతనికి. వారం ఇమ్మని ఆయన భార్యను అడుగుదామని అతను ఎన్నోసార్లు అనుకొన్నాడు కాని అంతవాళ్ళను ఇంత స్వల్పమైన సహాయం అర్థించకూడదని అతను నిశ్చయించుకొన్నాడు. దానికితోడు ఆవిడ ఒకటి రెండుసార్లు అతని పరిస్థితి విచారించి "నువ్వీ సంవత్సరం మంచి మార్కులు తెచ్చుకొని ప్యాసుకా. ఆయనకు చెప్పి, నీకు పై చదువుకు సహాయం జరిగేలా చూస్తాను'' అని అన్నది. కాని ముందు ఆ సంవత్సరం ఎలా గడుస్తుందా అని అతను భయపడ్డాడు. అందుకు మొదటికారణం ఆకలి. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం ఎప్పుడుపడితే అప్పుడు వేళాపాళా లేకుండా అతనికి ఆకలివేసేది. 'దరిద్రపు ఆకలి' అనుకొనే

వాడే తను తరచు: 'దరిద్రుడికి ఆకలి ఎక్కువ అంటారు. నిజమే నన్నమాట!' అనుకొని విసుక్కొనేవాడు అవధాని.

కొన్నాళ్ళ తర్వాత కేవలం అతని అదృష్టవశాత్తు అది కొంచెం మరుగున పడ్డది. ఇంటిదగ్గర మాధవయ్యగారి పోరుకు తోడు బడిలో అతని తరగతికి వచ్చే పంతుళ్ళ హడావిడి అతనికి బాధకం అయింది. వారంతా రకరకాల హెచ్చరికలు చేయడం మొదలుపెట్టారు. ఎవరికివారు తాము బోధించే విషయం ముఖ్యం అన్నారు.

ఇన్ని చేసినా, ఎవరు ఏమి అన్నా అవధాని నడక మందకొండిగానే సాగింది. తను అట్టే తెలివైనవాడు కాదేమోనని అతనికి అనుమానం కలిగింది. అతని కంటెకి తరగతిలో చాలా మంది పిల్లలు ఉనకంటె ఎక్కువ తెలివైన వారుగా కనిపించారు. తన్నువారితో పోల్చుకొన్నాడు. ఫలితంగా మరింత నిరుత్సాహం కలిగింది అతనికి. భాగ్యవంతుల పిల్లలు సహజంగా తెలివైన వారుగా, అందమైన పిల్లలుగా, శుచి శుభ్రత కలి వారుగా, ఎంతో బుద్ధిమంతులుగా పరిగణింప బడటం అతను గమనించాడు. వారిలో కొందరికి ఇంటి దగ్గర ట్యూషన్లు ఉన్నాయనీ, తమదగ్గర అలా చదువుకొంటున్న పిల్లలపట్ల ఉపాధ్యాయులు అభిమానం చూపుతుంటారని కొందరు పిల్లలు చాటుగా చెప్పుకోవడం కూడా అతను విన్నాడు. వారంతా పెద్ద పరీక్షలలో ఉత్తీర్ణులై తాను ఒక్కడే తప్పి పోతానేమోనని అతనికి భయం కలిగింది. ఆ భయంతో, సంకోచంతో అతను శ్రద్ధగా చదువుకోలేక పోయాడు. అందుకే అతను మాధవయ్య గారి చేత చీవాట్లు తినడం మరీ ఎక్కువ అయింది

* * *

ఆరోజు ఆదివారం కావడం చేత అవధాని భోజనం కాగానే గదికి వచ్చి పడుకొని పుస్తకం చదవడం మొదలుపెట్టాడు. మాధవయ్యగారు ఇంట్లో లేకపోవడం వల్ల అతను పడుకొని చదవడానికి సాహసించాడు.

ఆయనకు అన్నీ నియమాలే. పడుకొని చదవకూడదు. ఉదయం నాలుగు దాటాక పడుకో కూడదు. తనకు చెప్పకుండా ఎక్కడికీ వెళ్ళకూడదు. సినిమా పేరే ఎత్తకూడదు. అతను మొదట ఆ విషయా లన్నీ ఒకసారిజ్ఞాపకం చేసుకొని పుటలవంక చూచాడు. కాని బుద్ధిపుట్టలేదు చదవడానికి. అతని మనస్సు ఎటో పరుగెత్తుతున్నది.

'డబ్బులేనివాడు చదువుకోకూడదు. అసలు బ్రతకనే కూడదు. మొండిగా బ్రతికి మాత్రం ఏం ప్రయోజనం?...' అతను ఆలోచనలో పడ్డాడు. చదువుకోడానికీ, బాగుపడడానికీ అవకాశాలులేక హోటళ్ళలో అక్కడా పనిలో చేరిన తన ఈడు కుట్రవాళ్ళు, బస్సుల దగ్గర పని చేసే పిల్లలు జ్ఞాపకం వచ్చారతనికి. వాళ్ళ దారిద్ర్యం అతనికి కళ్ళకు కట్టి నట్లు అయింది. అతనికి కళ్ళనీళ్ళ పర్యంతం అయింది. కష్టపడి చదువు కోకపోతే తన పరిస్థితీ అంతే అవుతుందేమో అనిపించే సరికి అతను బెంబేలు పడ్డాడు. "అబ్బెబ్బే నేను బాగా చదువుకుంటాను" అనుకొ న్నాడు వెంటనే. అంతలో మాధవయ్యగారి భార్య కేక విని, అవధాని ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు. రెండవ కేక విన్పించేలోగానే అతను ఆ గది గుమ్మం దాటాడు. గబగబా అతను చావడిలోనికి వెళ్ళి "ఏమి టండీ పిలిచారూ?" అని అడిగాడు వినయంగా. ఆవిడ ఒక చిన్న పని చెప్పింది.

ఆ గదిలో గోడలకు అక్కడక్కడ మేకులుకొట్టి పటాలు తగి లించాలి. అదీ అతను చేయవలసిన పని. ఎత్తైన ముక్కాలి పీట, సుత్తీ, ఆవిడ చేతికి ఇచ్చిన కొత్త మేకుల పొట్లం తీసుకుని ఆలస్యం చేయ కుండా అతను పని మొదలుపెట్టాడు.

ఒక్కొక్క పటానికి-పై వైపున ఒకటీ, క్రింది వైపున కొంచెం ఎడంఎడంగా రెండేసి మేకులుకొట్టి పటాలు తగిలిస్తున్నాడు. పటాలకు పై

వైపున కొక్కాలకు త్వైనుదారం కట్టి ముందుకు వాలుతూ ఉండేలా వాటిని వేలాడతీశాడు.

చిట్టచివరి పటం కోసం అలా మేకులు కొడుతుండగా ప్రమాదం జరిగింది. క్రింద ఉన్న పొట్లం నుంచి మూడు మేకులు తీసుకొని ముక్కాలి పీటమీద ఎక్కాడు. ముందు క్రింద వైపు రెండు మేకులూ కొట్టడానికి సిద్ధమయాడు. ఒక మేకు కొట్టాడు. రెండో మేకు చేతిలో పట్టుకొని, మరో మేకు పెదిమలతో గట్టిగా నొక్కి పట్టుకొని క్రింద వైపున రెండో మేకు కొడుతుండగా పైనుంచి జారి బల్లి అతని నెత్తి మీద పడ్డది. అతను అనవసరంగా ఖంగారు పడ్డాడు. ఒక్కసారి తల వెనక్కి విసురుగా విదలించుకొని, నెత్తిమీద పిండిముద్దలా పడ్డ బల్లి దూరంగా పడేలా చేశాడు. ఆ సమయంలో నోట్లో పెదిమల మధ్య అర అంగుళం మేకు ఉన్నదనే విషయం అతనికి జ్ఞాపకం లేదు. అతనికి అసలు ఆ స్ఫురణే లేదు. నున్నగా, తెల్లగా, వెండిలా మెరుస్తున్న ఆ మేకు అతనికి తెలియకుండా, తల విసిరినప్పుడు అంగిట్లో పడి చప్పున లోపలకు జారిపోయింది, కాని అది మింగినట్లే అనిపించలేదు అతనికి. అది అలా జరిగిపోయింది. కొన్ని క్షణాల తర్వాత అతనికి తల తిరిగి నట్లు ఒనిపించింది? క్రిందకు దిగాడు. ఇంతలో మేకు విషయం జ్ఞాపకం వచ్చింది. వెంటనే అనుమానం కలిగి 'అసంభవం, అది గొంతులోకి ఎలా పోతుంది? !' అనుకొంటూ ముందుకు వంగి అటూఇటూ చూచాడు. మేకు కప్పించలేదు. మేకులు ఉన్న కాగితం పొట్లం గాలికి నేలమీద ప్రాకుతోంది. అతను చావడి అంతా కలయచూచాడు. పొట్లంతీసి చూచి, చేత్తో నలిపి దూరంగా పారేశాడు. మళ్ళా ఆ కాగితంతీసి, మడతలువిప్పి చదునుచేసి 'ఛ' అనుకొంటూ చింపి అవతల పారేశాడు.

మొదలుపెట్టిన పని పూర్తి కాలేదు. అదే చిట్టచివరి మేకు. ఒక

వంక అనుమానం పీకుతున్నది. మరొక వంక ఆవిడ ఏమంటుందో అన్న భయం కలిగింది. ప్రక్కగదిలో ఉన్న ఆవిడకు వినిపించేలా 'ఆ పటం తర్వాత తగిలిస్తానండీ' అని చెప్పి అతను చరచరా తన గదిలోకి వెళ్లాడు. మళ్ళీ అంతలో అతను అంత హడావిడిగా చావడిలోకి వచ్చాడు

అతనికి అనుమానం స్థిరపడ్డది. భయం అతన్ని వణికించింది. "మరి నొప్పి పుట్టలేదేమిటి?– గొంతులో అడ్డుపడలేదేమిటి?" అనుకొన్నాడు. మరుక్షణంలో 'పిచ్చి ప్రశ్నలు' అనుకొంటూ లోపలకువెళ్ళి మంచినీళ్ళు అడిగి గ్లాసు అందిపుచ్చుకొని, కొంతసేపు ఒక్కొక్క గుక్కె నెమ్మదిగా, తర్వాత ఒక్క క్షణంలో మిగిలిన నీళ్ళన్నీ గడగడా త్రాగేశాడు. 'మరి ఏమి అనిపించదంలేదే!' అనుకొంటూ అతను మళ్ళీ తన గదికి వచ్చి పడుకున్నాడు.

నిల్చోలేక, కూర్చోలేక, పడుకున్నాడతను. కాళ్ళు చేతులు అసహ్యంగా వణుకుతున్నాయి. అంత భయం అతను ఎన్నడూ ఎరుగడు. అతనికా క్షణంలో ఏదో వికారపెడుతున్నట్లు కూడా అనిపించింది. రొమ్ము నొప్పిగా ఉన్నట్లు, బాధ ఎక్కువ అవవుతున్నట్లు అనిపించింది. మూలిగితే ఆవిడ ఏమన్నా అంటుందేమోనని అతను నెమ్మదిగా బయటకు నడిచాడు. ఆ వీధి మలుపులో కిల్లీకొట్టు దగ్గర ఆగి, రెండుసోడాలు త్రాగాడు. కొంతదూరం ముందుకు నడిచాడు అంతలో అలుపువచ్చింది. ఏమి అవాంతరం వస్తుందో అని మరీ భయపడి వెనుతిరిగి, గదికి వచ్చి వెల్లకిలా పడుకొని కళ్ళుగట్టిగా మూసుకున్నాడతను. లోపల ఆదుర్దా ఎక్కువ అయింది.

నిముషానికి ఓ ఆలోచన – క్షణానికో ఆలోచన భయపెడుతూ కారుమేఘాలను చీల్చుకొని దూసుకొనిపోయే మెరపులా మనసులో మెది

లింది. మనసు విచలితం అయింది. అతని మనోవీథిలో అకస్మాత్తుగా సుడిగాలి రేగింది. అది అంతలో చెలరేగింది. ప్రళయ ప్రభంజనాల విజృంభణలు – యమకింకరుల పోలిన వికృతరూపాలు తాల్చిన కారు మేఘాల కదలికలు – పట్టరాని ఔద్ధత్యంతో వరదవాగుల పరవళ్ళు – సంక్షోభం–నిరాశ – నిస్పృహ–నీరసం–మృత్యుభీకర కరాళ దంష్ట్రాగ్నుల విలయతాండవం – అతను ప్రత్యక్షంగా చూచినట్లే అనిపించింది. అతని హృదయం వికావికలు అయింది. ఒడలు కంపించింది. తల వేడెక్కింది. దిమ్మెక్కిపోయింది. నిట్టూర్పులు తనకే భరింతరానంత పెచ్చునయాయి. నరనరంలోనూ రక్తం గమనవేగం పదిరెట్లు పెంచుకొన్నది. నరాల ప్రతి మలుపులోనూ, ప్రతి రక్తనాళాల కేంద్రంలోనూ సుత్తిదెబ్బలు గట్టిగా వినిపించాయి. పది నిముషాలలో అమితనీరసం వచ్చింది. కొన్ని మైళ్ళదూరం ఎవరో తరుముతుంటే పరుగెత్తి వచ్చినట్లు అయింది. ముచ్చెమటలు పోశాయి. ఆ చిన్న మేకు అన్నకోశంనుంచి – చిన్న ప్రేవులను రెండుగా చీల్చుకొంటూ. గుండ్రంగా తిరుగుతూ నెమ్మదిగా ముందుకు సాగుతున్నట్లు అనిపించింది.

'ఈ పూటతో ఆఖరు ఈ దరిద్రుడు' అని ఎవరో గట్టిగా అన్నట్లే అనిపించింది అతనికి.

అతను పెద్దగా మూలిగాడు.

పనిమీద బయటకువెళ్ళి, తిరిగితిరిగి అప్పుడే ఇంటికివచ్చి చావడి లోకి వెళ్ళి, పది నిముషాలతర్వాత మాధవయ్యగారు అతని మూలుగు విని ఆ గదిలోకి వచ్చారు.

జరిగిన ప్రమాదం తెలుసుకొని ఆయన డాక్టరుకోసం వెళ్ళి తిరిగి వచ్చేసరికి ఆలస్యం అయింది. అతన్ని కదలకుండా పడుకోమని చెప్పి వెళ్ళారాయన. అతను కళ్ళు గట్టిగా మూసుకొన్నాడు.

మళ్ళీ అవే ఆలోచనలు.

o o o o o

అతనికి బ్రతుకుపై ఆశ కలిగింది. అపాయం వచ్చిపడుతున్న దేమోనన్న భయం ఎక్కువైనకొద్దీ అతనికి ఆ ఆశ పెరిగింది. ప్రాణం మీద తీపి తెలిసివచ్చింది అతనికి. ఎలాగైనా ఆ గండం గడచి బయట పడాలనే దృఢమైన ఆకాంక్ష, బలీయమైన వాంఛ కలిగింది. అంతలో దాన్ని బలహీనపరుస్తూ 'పోనీ పోతేమాత్రం ఏం ?'అని మరో ఆలోచన. అతను ఆ ఆలోచన వెలికిరాకుండా అణచివేశాడు. ఉండి ఏం సాధించాలి. పోతే సుఖపడిపోవూ' అని ఎవరో వికటంగా నవ్వుతూ అంటున్నట్లు అనిపించింది.

స్వగ్రామంలో కష్టంలో ఉన్న తలితండ్రులు, గత్యంతరంలేక బీదసంబంధం చేసుకొని దూరంగావెళ్ళిన అక్క, ఇక్కడ తనకు ఆశ్రయం ఇచ్చి, దారి చూపిస్తూ నెమ్మదిగా నడిపించుకొంటూ తను ముందుకు తీసుకొనివెళుతున్న మాధవయ్యగారు - జ్ఞాపకంవచ్చారు. దాంతోపాటు గడచిన జీవితం, పడినకష్టం, చదివిన చదువూ అన్నీ ఒకటి వెంట మరొకటి జ్ఞాపకం వచ్చాయి.

మరో కొద్దినెలలలో రాబోతున్న పెద్దపరీక్షల విషయం జ్ఞాపకం వచ్చింది. దాంతోపాటు మాధవయ్యగారు రోజూ అంటూవచ్చిన మాటలు అతని చెవులలో మారుమ్రోగాయి.

ఆ పరీక్ష ప్యాసయితే ఏదో చిన్న ఉద్యోగం- సంపాదన - సుఖ జీవితం-తలితండ్రులకు సహాయం-పెండ్లి-సంసారం - సాగిపోయాయి అతని ఆలోచనలు.

ఆశలు అలా అల్లుకొనిపోయాయి. గండం గడవాలని బ్రతకాలనే ఆ వాంఛను ఆ ఆశాలతను భయంకరమైన, బుసలు కొడు తున్న, భయం అనే విషసర్పం చుట్టుకొన్నది. దానినుంచి తప్పించుకొని బయటపడాలని ఆ వాంఛ విశ్వప్రయత్నం చేసింది. అది ఒక్కసారి

పెల్లుబికింది. అది ఊటజలంలాగా ఉబికి ముందుకు ఉరకలుపెట్టింది. దారిలో మధ్యలో, కొంతనీరు ఇంకి ప్రవాహం ఆగి, వేగం కుంటుపడినా, వెనుకనుంచి నిరంతరంగా వచ్చి కలుస్తున్న జలధారల తోద్రోపులతో పరుగెత్తే వాగులా సాగింది ఆ వాంఛ.

అతను ఒకసారి ఉలికిపడ్డాడు. చప్పునలేచి కూర్చున్నాడు. ఎక్కడలేని ధైర్యం వచ్చింది. ఇక నాకేం పర్వాలేదనుకొన్నాడు. 'నేను చావను-నేను చావను' అని గట్టిగా, పెద్దగా అనుకొంటూ గదిలో అటూఇటూ తిరగడంకూడా మొదలుపెట్టాడతను.

మాధవయ్యగారు డాక్టరును వెంటపెట్టుకొని అక్కడకు తిరిగి వచ్చేసరికి అవధాని లేచి తిరుగుతున్నాడు. అతనికి గాభరా అంతా పోయింది. ఆపైగా అతను నవ్వుతున్నాడుకూడాను.

"కదలకుండా పడుకోరా అంటే తిరుగుతున్నావేరా" అని మాధవయ్యగారు ఏస్తూనే అతన్ని కేకలువేసి "వీడేనండీ" అని వెంట వచ్చిన డాక్టరుకు చూపారు. ఆ వైద్యుడు అతన్ని పడుకోమని పది నిముషాలు పరీక్షచేసి, ప్రశ్నలువేసి సమాధానాలు రాబట్టుకొని, ఇంట్లోకి వెళ్ళి, అన్నీ స్వయంగాచూచి, అంతా నిర్ధారణ అయాక అతన్ని ఆసుపత్రిలో చేర్పించారు. అంతకంటె గత్యంతరం లేదన్నారాయన.

ఆ వైద్యుడు తిరిగివెళుతూ మాధవయ్యగారితో "మనం చెయ్యగలిగింది చాలాతక్కువ. ఎక్సరేలుతీస్తూ జాగ్రత్తగా పరిశీలిస్తారు. పెద్ద డాక్టర్నికూడా కలుసుకొని చెప్పాను. అతను అదృష్టం బాగుంటే బ్రతుకుతాడు" అన్నారు. అవధానిని ఆసుపత్రిలో చేర్చి హడావిడిగా మాధవయ్యగారు ఒకసారి ఇంటికివచ్చారు. డాక్టరు అన్నమాటలు భార్యతోచెప్పారు. ఆవిడ మరింత భయపడ్డది. అతనిక దక్కడనే అనిపించింది ఆమె మనస్సుకు. అది కేవలం తనమూలకంగానే జరిగిందని అనిపించింది ఆవిడకు. 'నేను మొదటినుంచీ చెబుతూనేఉన్నా మనకు

ఎందుకొచ్చినబెడద అండీ అని. ఈయనగారు విన్పించుకొన్నారుకాదు. ఇప్పుడీపని జరిగింది. ఏమిటి చెయ్యడం' అని ఆనాడు మనసులోనే మథనపడ్డది.

ఆవిడ మనసు కరిగింది.

త్వరగా ఇంటిపనిముగించి, భర్తవెంట ఆసుపత్రికి వెళ్ళింది. రాత్రి పది దాటింది. నర్సువచ్చి మాధవయ్యగారితో "ఇక మీరువెళ్ళండి. రాత్రిళ్ళ రోగిదగ్గర ఇంతమంది ఉండడానికి వీల్లేదు. అసలు ఎప్పుడో పంపించ వలసింది మిమ్మల్ని" అన్నది. మాధవయ్యగారి భార్య "అవునండీ మీరు వెళ్ళండి. ఇంటిపిగ్గర పెద్దవాళ్ళం ఎవరం లేకపోతే కష్టం" అన్నది. ఆయన నెమ్మదిగా బయటకువెళ్ళి. ముందుగదిలో ఉన్న డాక్టరుకు మరోసారి నమస్కారంచేసి, తన ఉద్దేశం అంతా తెలియచేసుకొని ఆయనదగ్గర సెలవుతీసుకొని ఇంటికి తిరిగివెళ్ళాడు.

ఆవిడ ఆరాత్రి అంతా అక్కడే ఉన్నది. మేల్కొనే ఉన్నది. కొంత సేపు అతనిదగ్గర కూర్చున్నది. కొంత సేపు ప్రక్క వసారాలో నేలమీద గోడకు చేరబడ్డది. ఒకటి రెండుసార్లు కునుకువచ్చింది. 'అతను ఒకవేళ ఆక్షణంలో గుటుక్కుమంటే !' ఆ ఆలోచనరాగానే ఆవిడ ఉలికి పడ్డది. అదే జరిగితే అతనితల్లి ఎంతబాధపడుతుందో అని ఆవిడ కాసేపు ఆలోచించింది. అంతలో ఆ తల్లి శోకాలు స్పష్టంగా వినిపిస్తున్నట్లే అనిపించింది ఆవిడకు. ఆవిడకు గడచినకాలం జ్ఞాపకంవచ్చింది. తను అతనిపట్ల ఎలా నిర్దయగా, నిర్లక్ష్యంగా ఉంటూ వచ్చిందీ ఆవిడకు అర్థం అయింది.

ఒంటిగంట దాటింది. అతను మళ్ళీమళ్ళీ పెద్దగా మూలగడం మొదలుపెట్టాడు. లోపల ఎక్కడో మేకు కదలుతున్నట్లు అనిపించింది. మనసులో భయం పొదరింట కన్పించిన చిన్న పాముపిల్లలా మెదిలింది. అది మెలికలు తిరిగింది. అంతలో ఆభయం కొరివిదయ్యం అనిపించింది.

అది హృదయపీఠంమీదకు ఉరికి, వెఱ్ఱిగా చిందులు త్రొక్కుతున్నట్లూ, పీక నులుముతున్నట్లూ అనిపించింది అతనికి.

ఒళ్ళంతా పగలకొట్టుకొనిపోతున్నట్లు అనిపించింది అవధానికి.

అతను పెద్దగా మూలిగాడు.

ఆ మూలుగు విని ఆవిడ గబగబా లోపలకు వచ్చి "ఏమిటినాయనా మూలుగుతున్నావ్ ? బాధగా ఉన్నదా ?" అని మళ్ళీమళ్ళీ అడిగింది. అతను "అవునండీ" అని మాత్రమే అనగలిగాడు. ఆవిడవెళ్ళి నర్సును పిల్చుకొని వచ్చింది. ఆ నర్సు ఎక్కడ నొప్పి అని అడిగితే అతను చెప్పలేకపోయాడు. కాని అతనిబాధ, అతని పరిస్థితి అర్థం అయింది ఆ నర్సుకు. ఆమెవెళ్ళి డాక్టరును వెంటనే పిల్చుకొని వచ్చింది. గుమ్మంలో మాధవయ్యగారి భార్య చేతులు జోడించి "ఏమండీ డాక్టరుగారూ కుఱ్ఱవాడు చాలా బాధపడుతున్నాడు. మీరు అతన్ని కాపాడాలి" అన్నది ఆ డాక్టరుతో.

"అయన మీరు గాభరాపడకండి. మేం మొదటే చెప్పాంకదా. అంతా అతని అదృష్టంమీద ఆధారపడిఉన్నది న్యాయంగా అయితే ఇటువంటికేసు ఇక్కడ చేర్చుకోరు. ఏ విశాఖపట్నమో తీసుకొనివెళ్ళ మంటారు. ఇది మరీ చిన్నఆసుపత్రి. కాని తప్పనిసరై చేర్చుకొన్నాం" అన్నారు.

పెద్ద డాక్టరుకు ఒక ఉపాయంతోచింది. అయన గ్లిసరిన్ ఇచ్చారు ఆ సాయంత్రమే.

నర్సు, ఆ వచ్చిన డాక్టరూకలిసి అతన్ని మళ్ళీ మళ్ళీ పరీక్షించి మార్ఫియా ఇంజక్షన్లు ఇచ్చారు. భయంవల్లగానీ, బాధవల్లగానీ అనుకోని ప్రమాదం మరేమైనా రావచ్చునని ఆ డాక్టరు అలా మత్తు కలిగించే మందు ఇచ్చారు.

ఆ డాక్టరు సరిగానే ఊహించారు.

నిజానికి అతనికి బాధ కంటె వెయ్యిరెట్లు భయం కలిగింది. పాము కాటు వేసిన మరుక్షణంలో మనిషిని నిలువునా ఊపివేసే భయం అది. వడవడలాడించి, కొన్ని క్షణాల తర్వాత గుండె కొట్టుకోకుండా నిలిపివేయగల భయం అది.

ఆ భయం అంతటిది.

ఆ డాక్టరుగారు ఆ పని చేయకపోతే అతను మేకు మింగటం వల్ల కాక కేవలం భయంవల్ల, హరీ అనే వాడేనని ఆ తర్వాత అందరూ అన్నారు.

బ్రతకడేమో అనుకొన్న అవధానికి ఆ గండం గడిచింది. ప్రొద్దుట ఆ మేకు బయటకు వచ్చేసింది. గడవదనుకొన్న ఆ కీత్రం రాత్రి గడిచింది. ఆ రాత్రి మాధవయ్యగారి భార్య అతనికి ఎన్నో విధాల పరిచర్య చేసింది. నర్సుకు అన్ని విధాలా సాయపడది అందుకు ఆ నర్సు డాక్టరు ఆవిడను అభినందించారు. ఉదయం ఏడు గంటలకు మాధవయ్య గారు వచ్చి పరమానంద భరితులు అయారు. ఆ పూట పది గంటలకు ఆవిడ అవధానిని వెంటపెట్టుకొని బండి చేయించుకొని సంతోషంగా ఇంటికి తిరిగి వెళ్ళింది.

ఆ రోజు నుంచి ఆవిడ అతన్ని ఎంతో దయగా చూచింది.

జీవితంలో ఒక మలుపు ఉంటుంది

అందరి జీవితాలలోనూ ఉంటుందా మలుపు. అది వారి జీవిత మార్గాన్నే మార్చివేస్తుంది.

హఠాత్సంభవమైన విచిత్రమైన ఒకానొక సంఘటన కారణంగా వారు ఆ మలుపు చేరతారు. అక్కడ పెద్ద సంఘర్షణ, అగ్ని పరీక్ష. వాటికి తట్టుకొని ఆ మలుపు తిరిగినప్పటి మంచి కొందరు గబ గబా

మెట్లుఎక్కి పైకి వెళతారు. వారు అలా చూస్తుండగా ఇట్టే తారాపథం అందుకొంటారు. మరి కొందరు ఆ మలుపు దాటీ దాటగానే పడిపోయి క్రిందకు జారటం మొదలుపెడతారు. జారిజారి ఎక్కడో పడి రాలిపోతారు.

అవధాని జీవితంలో ఇలాంటి మలుపుదాటాడు.

అతనికి భయం పోయింది.

ఎంత కష్టం అయినా ఓర్చుకోవడం అలవాటు అయింది.

ఆ సంఘటన మూలంగా అతనిలో ఎవ్వరూ. ఎన్నడూ ఊహించని పరిణామంవచ్చింది. అతను అతి శీఘ్రంగా, ఎవరూ అనుకోని విధంగా అభివృద్ధిలోకి వచ్చాడు.

బ్రతకడనుకొన్న తాను బ్రతికేసరికి, తన ప్రగాఢమైన ఆకాంక్ష ఫలించేసరికి, తన ఆశ నిజంఅయేసరికి అవధానికి ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది. ఎక్కడలేని పట్టుదల కలిగింది. అతని జీవితం క్రొత్త పద్ధతిలో సాగంది దానికి క్రొత్త ఒరవడికలిగింది.

అవధాని ఆ సంవత్సరం స్కూలు ఫైనలు పరీక్షలో రాష్ట్రం మొత్తంమీద ఉత్తమశ్రేణిలో ఉత్తీర్ణుడు అయాడు.

పులుకడిగిన ముత్యంలా మెరిశాడతను.

నీళ్లు విదలించివేసిన మల్లెచెండులా అందరినీ ఆకర్షించాడతను.

అతనికి అందరి సహాయం లభించింది. వెంకటప్పయ్యగారి భార్యతో తను పరీక్షలో ఎంత మంచి మార్కులు తెచ్చుకొన్నదీ వివరంగా చెప్పుకొన్నాడతను. ఆవిడ, భర్తతో చెప్పి, అతను పై చదువులు చదువుకోడానికి సాయంచేసింది. వెంకటప్పయ్యగారు రెండో కంటికి తెలియకుండా అతన్ని పట్నం పంపి బి. ఏ. చదివించారు. ఆ విషయం మాధవయ్యగారికి చివరకు ఎప్పుడో తెలిసింది. బి. ఏ. కాగానే అతను తన కా చదువు చెప్పించిన వారి సిఫార్సుతో, ఒక పెద్ద వ్యాపార సంస్థలో

నెలకు అరవై రూపాయలు జీతం వచ్చే చిన్న ఉద్యోగంలో చేరి, గబగబా పైకివచ్చి, రెండు మూడు సంవత్సరాలలోనే నెలకు మూడు వందల ఆదాయం సంపాదించే పెద్ద ఉద్యోగి అయాడు.

ఒక రోజున హఠాత్తుగా అవధాని మాధవయ్య గారి ఇంటికి బుట్ట నిండా పండ్లు విలువైన కానుకలుపట్టుకొనివచ్చి ఆయనకు నమస్కారం చేస్తూ "మాస్టారూ మీ ఆశీస్సులు ఫలించాయండి. నా కిప్పుడు నెలకు మూడు వందలు జీతం వస్తున్నది." అన్నాడు.

మాధవయ్యగారు పరమానంద భరితులయారు.

ఆయన భార్య ఆయన కంటె ఎక్కువ సంతోషిస్తూ "ముందు ఇవన్నీ మీ అమ్మకూ, నాన్నకూ ఇచ్చిరాకపోయావా" అంటే అతను "వాళ్ళకు చాల కాలంగా ఇస్తున్నానండీ, పట్నంవెళ్ళి ఇంటరులో చేరిన మరుసటి నెల నుంచీ సంపాదనకూడా మొదలుపెట్టాను'' అన్నాడు.

"ఎలా ఎలా'' అంటూ ఆవిడ ఆసక్తి కనపరచేసరికి అతను పట్నంలో తను ఎలా ట్యూషన్లు చెప్పిందీ, సెలవల్లో మారు మూల హోటళ్ళల్లో సర్వరుగా ఎలా పనిచేసిందీ, అడుశోర్నో వెంకటప్పయ్యగారు తను చదువుకొనడానికీ అంత పెద్ద పట్నంలో ఉండడానికీపంపిన డబ్బు ఎలా మిగుల్చుకొన్నదీ. తల్లికీ, తండ్రికీ, అక్కగారికీ, ఎప్పు డెప్పుడు ఎలా డబ్బు పంపిందీ వివరంగా చెప్పుకొనిపోతుంటే మాధవయ్యగారు అడ్డుకొని "ఇప్పుడెందుకు అవన్నీ జ్ఞాపకంచేసుకోవటం పైకి వచ్చావు మాకు అంతేచాలు'' అన్నారు సంతోషంగా చిరునవ్వు నవ్వుతూ.

*

అదృష్టవంతుడు

"రాజమ్మా నువ్వు వెళ్ళి కొన్నాళ్ళు పుట్టింట్లో ఉండిరా అమ్మా. అక్కడైనా ఈ దుఃఖం మర్చిపోగలుగుతావేమో—ఆ విషయం ఎలా ఉన్నా వాడి సంగతి మరీ అధ్వాన్నంగా ఉన్నది. వాణ్ణి మనం అదుపులో పెట్టలేకపోతున్నాం. వాడి చిన్న మేనమామ అయినా వాణ్ణి కాస్త అదుపులో పెడతాడేమో" అన్నారు సింహాద్రిగారు. అని కళ్ళనీళ్ళు తుడుచుకొన్నారు. తుడుచుకొన్నా కన్నీరు ఆగలేదు. బుగ్గలూ, ఒళ్ళూ బూరెల్లా పొంగిపోయి, వాచిపోయి, ముఖం కందగడ్డయి ఎదురుగా దెబ్బలు తిన్న పొగరుబోతు లేగదూడలా మొహం వ్రేలాడ వేసుకొని నిలబడ్డ మనుమణ్ణి చూచేసరికి ఆయనకు దుఃఖం పొర్లివచ్చింది.

"వాణ్ణి అంత చేటు కొట్టావెందుకే రాజమ్మా?'' అంటూ అతన్ని దగ్గరకు తీసుకోపోయారు.

కాని సుబ్బులు ఆయన దగ్గరకు పోలేదు.

పైగా వెనక్కు జరిగి నిలబడ్డాడు.

"పోనీ వాడికేం కావాలో ఇచ్చెయ్'' అన్నారాయన.

"పాపిష్టి వెధవకు పొద్దున్నే పెసరట్లుకావాలట! ఎక్కణ్ణించితెచ్చి ఇవ్వను. అయినా వీడికీ పెంకెతనం ఏమిటి! అసలే చచ్చి నే నేడుస్తుంటే ఈ ముదనష్టపు వెధవకు పిండివంటలు చేసిపెట్టాలట. వీడు నా కడుపున పడ్డప్పుడే ఆయనకు క్షయవ్యాధి కన్పించింది. వీడు పుట్టాడు ఇక వరసగా అన్నీ అరిష్టాలే. వీణ్ణసలు ఏం చేసినా పాపంలేదు. చూడండి ఎంత

ఆగం చేస్తున్నాడో'' అన్నది రాజమ్మ కొడుకువంక ఇంకా కసిగా చూస్తూ.

ఈ తిట్లూ, వాడి అల్లరీ ఆయనకు క్రొత్తఏమీ కాదు.

మరోక్షణం తర్వాత సింహాద్రిగారు "ఒరేయి సుబ్బులూ నా వెంటరా. నీ కెన్ని కావాలో అన్ని పెట్టిస్తా" అన్నారు.

కాని సుబ్బులు కదలలేదు.

ఆయన మాటమీద వాడికి నమ్మకం కలగలేదు.

వాడికి కొంచెం ఊహ వచ్చిన తర్వాత పండుగలకు పిండివంటలు చెయ్యలేదు ఆ ఇంట్లో. కనీసం ఇంత బెల్లపు పరివాన్నం కూడా వాడికి కన్పించలేదు. ఎప్పుడూ ఏడుపులూ, పెడబొబ్బలూ. మాసికాలు వచ్చినప్పుడు సుబ్బులు దొరికినన్ని గారెలు మాత్రం తిన్నాడు.

దొంగతనంగానో, వంటవాళ్లను బతిమాలో, పెట్టకపోతే తాకుతానని బెదిరించో, ఓ రెండు గారెలుతింటూంటే వాడి నాయనమ్మ చూచి అసహ్యించుకొనేది. చావలేక బ్రతుకుతూ, బ్రతికి ఉన్నంతకాలం ఆవిడ వాణ్ణి తిట్టి పోస్తూనే ఉన్నది.

"నువ్వు పుట్టాక అన్నీ అరిష్టాలే. కొంపలో అందర్నీ మింగి పుట్టావురా రాక్షసపు వెధవా'' అని తిట్టిన మనిషి తిట్టినట్లే ఉండేది. వాడు పుట్టాక జరిగినవన్నీ ప్రతిసారీ ఏకరువు పెడుతుండేది.

రాజమ్మకు నూడిదలు జరుగుతున్నరోజున సింహాద్రిగారి కూతురు ఒంటెడు నగలతో ఎవరినో తీసుకొని లేచిపోయింది. రాజమ్మకు రేపు కాన్పు వస్తుందనగా సింహాద్రిగారి పెద్ద కొడుకు మద్రాసులో హోటలుగదిలో చనిపోయినట్లు టెలిగ్రాం వచ్చింది. సుబ్బులు అడుగులు వెయ్యడం నేర్చిన రోజున సింహాద్రిగారి పెద్దకోడలు వైధవ్యం అనుభ

షించడానికి అత్తవారిల్లే కావాలా అని పుట్టింటికి వెళ్ళి, మళ్ళీ ఇటు తిరిగి చూడకపోవడమే కాకుండా మనోవర్తి దావా వేసింది.

సుబ్బులు నెమ్మదిగా అడుగులు వేస్తూ, నడిచి అన్ని గదులలోకీ వెళుతుంటే సింహాద్రిగారి భార్య వాడి ముఖం కన్పిస్తేనే మండిపడుతూ, అవతలకు తప్పుకొని తిరిగేది. సుబ్బులకు అయిదోఏడు వచ్చిన రోజున అప్పటిదాకా ఆ ఊళ్ళో పెద్ద ఆసుపత్రిలో క్షయవార్డులో ఉంటూ వచ్చిన వాడి తండ్రి ఇంక అక్కడ లాభం లేదన్నారని మదనపల్లి వెళ్ళాడు. ఆరో ఏడుకూడా దాటాక, వీణ్ణి కాస్త బళ్ళో వేస్తేనన్నా అల్లరి తగ్గుతుందేమో అనుకొని సింహాద్రిగారు ఏ హడావిడీ లేకుండా సుబ్బులును బళ్ళో వేశారు.

ఆరోజు వాడు రెండోపూట బడికి వెళ్ళడానికి వీలులేకపోయింది.

మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి ఒకవంక తల్లీ, మరోవంక తాత, నాయనమ్మా పెద్దపెట్టున ఏడుస్తున్నారు. సుబ్బులుతో వాడి నాయనమ్మే చెప్పింది 'ఓరి శనిపాతకపు వెధవా మీ నాయనకూడా పొయ్యాడురా' అని.

రెండో కొడుకు పొయ్యాక ఆవిడ మంచంఎక్కింది. ఏడ్చి, ఏడ్చి, కటిక ఉపవాసాలుచేసి రోగం తెచ్చిపెట్టుకొన్నది. ఇటు చిన్నకోడలు చేతా, అటు ముసలి భర్తచేతా సేవ చేయించుకొంటూ మంచం దిగలేదు. మంచం దిగకుండానే పరలోకయాత్ర చేసిందావిడ.

ఆవిడ పొయ్యాక ఆ ఇల్లు మరీ బావురుమన్నది. ఆవిడ ఉన్నంత కాలం ఏడుపులూ, తిట్లయినా వినిపిస్తుండేవి. అవి కూడా వినిపించకుండా పొయ్యేసరికి ఆ ఇంట్లో భరించరాని నిశ్శబ్దం ఆవరించింది. ముందు గదిలో సింహాద్రిగారు మంచం దిగేవారుకాదు. శారీరకంగా లేచి తిరిగే

ఓపిక ఉన్నా, ఎప్పుడూ అక్కడే పడుకొనేవారు. ఆయన కోడలు వంట ఇంట్లో ఒక్కర్తే కుమిలి కుమిలి ఏడుస్తూ, ఏదో వేళకు ఇంత వండి పడేస్తూ ఉండేది.

అంత పెద్ద ఇంట్లో అలా ఉండడం ఎంతో కష్టమనిపించింది రాజమ్మకు. ఒకటి రెండు గదుల్లో తాముండి, మిగతా ఇల్లంతా భాగాల క్రింద అద్దెకు ఇద్దామనుకొన్నది. కాని వెంటనే ఎవరూ ముందుకు రాలేదు. పైగా సింహాద్రిగారు ఆయా గదుల తాలూకు జ్ఞాపకాలు అడ్డు వస్తున్నాయని అందుకు ఒప్పుకోలేదు.

"ఈ కుంకను చూచుకొనే నే నీ వెధవ బ్రతుకు గడపాలి కాబోలు!" అనుకొని రాజమ్మ ఎప్పుడూ ఏడుస్తుండేది. కొడుకు కాస్త అల్లరి చేస్తే పట్టుకొని కొట్టేది. గారాబమన్నది ఎరక్కపోయినా సుబ్బులు అల్లరి క్రమంగా ఎక్కువ అయింది. దెబ్బ భయం పోయింది. ఓట్టు భయం వాడి నాయనమ్మ ఉన్నప్పుడే పోయింది. ఎన్ని తిట్టినా, ఎన్ని కొట్టినా అల్లరి మానేవాడు కాదు. కావాలన్నది ఇచ్చి తీరవలసిందే. ఎన్ని చెప్పినా, ఎన్ని కొట్టినా ఆ మాట మరచేవాడుకాదు. ఏడ్చేవాడూ కాదు.

సుబ్బులు ఒకసారి పంచదార పెట్టమంటే రాజమ్మ విసుక్కొని పొమ్మన్నది. కావాలని పట్టుపట్టాడు. ఆనాడు కొట్టింది, తిట్టింది. అన్ని దెబ్బలూ, అన్ని తిట్లూ తిని మళ్ళీ అదే కావాలన్నాడు. ఆవిడ కోపంగా ఒక్క విసురున వెళ్ళి ఆ డబ్బా తెచ్చి, వాడిముందు పెట్టి "బోర్లించుకు మింగరా" అన్నది. ఆ మాట అన్నదని సుబ్బులు డబ్బా ముందు నేలమీద బోర్లించి, కూర్చుని, బొక్కినంత బొక్కి, మిగిలింది పంట ఇల్లంతా విర జిమ్మి పోయాడు.

ఏది కావాలన్నా ఇదే తంతు. ఒక్కొక్కసారి సింహాద్రిగారు వచ్చి నాలుగు అంటించేవారు. అయినా అంతే. వాడి పట్టుదల మాత్రం

పడలేదికాదు. ఇన్ని జరిగాక కూడా చివరకు వాడు కోరింది తల్లే స్వయంగా ఇవ్వాలి.

వాడి వంటిమీద దెబ్బ వేసినప్పుడల్లా సింహాద్రిగారు తన గది లోకి వచ్చి, కంట నీరు పెట్టుకొనేవారు. తన పెద్ద కొడుకునూ, చిన్న కొడుకునూ తనూ, కూతుర్ని తన భార్యా ఎంత గారాబంగా పెంచిందీ జ్ఞాపకం వచ్చేది ఆయనకు. అంత పెద్ద ఉద్యోగంచేసి, అంత డబ్బు సంపాదించిన తన ఇంట్లో పుట్టిన ఈ కుర్రకుంక స్వల్పమైన...అతి చిన్న కోర్కె తీర్చలేకపోతున్నానే అని విచారపడేవారు. ఆ విచారంతో ఒకరోజున ఆయన సుబ్బులును ఏదో కారణంమీద కొడుతున్న రాజమ్మను వారించి, బలవంతాన వాణ్ణి తన గదిలోకి తీసుకొనివచ్చి డబ్బు ఇచ్చి బయటకువెళ్ళి ఏదైనా కొనుక్కోమని పంపారు.

ఇక అప్పటినుంచి సుబ్బులు ఆయన్ను వేధించడం మొదలు పెట్టాడు. తాతయ్యా రూపాయి ఇవ్వు—రెండివ్వు అంటూ. ఇప్పుడు కాదంటే ఊరుకోడు విసుగుపుట్టి ఒక దెబ్బ వేసేవారు ఆయన. ఒకటి కాదు పది దెబ్బలైనా తినేవాడేకాని అడిగిన ఆ రూపాయి ఇవ్వందే అవత లకు వెళ్ళేవాడు కాదు. ఏదైనా కొనుక్కొని తినడానికీ, ఏ పుస్తకమో కొనుక్కోడానికీ, చొక్కా కొనుక్కోడానికీ ఇదే పద్ధతి.

ఒకసారి రెండురూపాయలు అడిగాడు. ఆయన ఇవ్వనంటే ఇవ్వ నన్నారు. సుబ్బులు ఆవేశంగా వెళ్ళి, డాబా ఎక్కి, అక్కడ నుంచి బావిగట్టు మీదకుదూకుతానని బెదిరించాడు. "దిగిరారా ఇస్తా" అని ఆయన అంటే— "కాదు ముందివ్వు దిగుతా'' అన్నాడు సుబ్బులు.

సింహాద్రిగారు నిచ్చెనఎక్కి డాబాపైకివెళ్ళి వాడికి ఆ రెండు రూపాయలూ స్వయంగా ఇవ్వవలసి వచ్చింది.

అప్పటికి సుబ్బులుకు పదో ఏడు.

సింహాద్రిగారు చెప్పగా చెప్పగా, రమ్మనమనందే ఎంత పుట్టిల్లైతే మాత్రం వెళ్లవచ్చునా— వెళ్లనా అనుకొని బాధ పడుతూనే, చివరకు పుట్టింటికి ప్రయాణమైంది రాజమ్మ. వంట మనిషితో చెప్పవలసినవన్నీ చెప్పి, తీరా బయలుదేరేవేళకు "సుబ్బాలు" నేను రాను నువ్వుపో" అన్నాడు సింహాద్రిగారు. వచ్చి పది రూపాయలు ఇచ్చి అక్కడ నీకు బాగుంటుంది వెళ్ళమని ఎంతో నచ్చచెపితే తల్లి వెంట వెళ్ళాడు సుబ్బాలు.

ం ం ం ం

అలా వచ్చిన వాళ్ళను చూచి గుమ్మంలోనే రాజమ్మ తల్లి ఒక వంక కూతురుకు జరిగిన అన్యాయానికి పెద్దగా ఏడుస్తూనే మరో వంక సుబ్బాలును అంతకంటె పెద్దగా తిట్టిపోసింది. "ఈ శని వెధవను కూడా వెంట తీసుకొచ్చావెందుకూ: గొంతు పిసికి ఏ కాలువలోనో గిరాటేసి రాకపోయావా" అని అమాంతం వాడిమీదపడి "ఈ వెధవ పుట్టాడు, నా బిడ్డ మంగళసూత్రం తెగింది" అంటూ తలబొప్పికట్టేలా మొట్టికాయవేసింది. మంగళసూత్రాలు తీసేసేరోజున వచ్చివెళ్ళడం మళ్లీ తిరిగి చూడకపోయినందుకు రాజమ్మకు తల్లిమీద కోపం రాలేదుకాని ఆ విషయం ఒకసారి జ్ఞాపకంవచ్చేసరికి మనస్సుకు కష్టంకలిగింది. అంతలో ఆవిడ "ఈ వెధవమూలంగానే నిన్ను రమ్మనలేదే" అనే సరికి రాజమ్మకు తృప్తికలిగింది.

మరో నాలుగుదెబ్బలు పడేవేకాని ఇంతలో రాజమ్మ తండ్రి వచ్చి సుబ్బాలును దగ్గరకుతీసుకొని, 'అదేమిటే వాణ్ణి కొడుతావ్! వాడేంచేశాడే పసి వెధవ' అని భార్యను వారించాడు. ఆయన నెమ్మదిగా వాణ్ణి అవతలకు తీసుకొని వెళ్ళేదాకా ఆ ముసలావిడ తిట్లవర్షం కురిపిస్తూనేఉన్నది.

విషయం అంతా విని రాజమ్మ చిన్నన్న "మామగారు అంత దుఃఖంలో ఉన్నారు కాబట్టిగాని లేకపోతే వీణ్ణి అదుపులోపెట్టడం ఒక

లెక్కా. నువ్వా. అమ్మా వాణ్ణి ఆ తిట్టడం మానెయ్యండి మిగతా సంగతి నేను చూస్తా'' అన్నాడు. ఆ మాటనిని రాజమ్మ తండ్రి సంతోషిస్తూ "ఒరేయి వెంకట్రావ్ నువ్వు వాణ్ణి బళ్లోచేర్చి కాస్త వాడికో రెండు ముక్కలు చెప్పరా వాడే బుద్ధిమంతుడవుతాడు'' అన్నారు.

బళ్ళో చేర్చినంతమాత్రాన సుబ్బులు అల్లరిమాని బుద్ధిమంతుడు కాలేదు.

బడికి వెళ్లి కొందరితో తగూలాడి, మరి కొందర్ని తన్ని ఇంటి మీదకు తగూలు తెచ్చేవాడు సుబ్బులు. వాడికి ఈ పల్లెటూరి బడే అన్ని విధాలా నచ్చింది. బడి వెనుక చింతతోపు. ఆ వెనుక మామిడితోట నాను కొని పంట కాలువ. అవతల పల్లపుభూములలో కొబ్బరితోట. అతని స్వేచ్ఛావిహారానికి అవన్నీ అత్యంత అనుకూలంగా కన్పించాయి. కుంటరి పిల్లలను వెంటవేసుకొని వెళ్లి మామిడితోటలో మామిడి కాయలుకోసి ముక్కలుకోసి. అందరికీవిందుచేసేవాడు. కాలవలో ఈతలు కొట్టి అవతలకువెళ్ళి కొబ్బరిబొండాలుకోసి, పచ్చి కొబ్బరితిని కొబ్బరి నీరు త్రాగేవాడు. పట్టుబడితే తా నొక్కడే దెబ్బలుతిని ఇంటికి చేరుకొనే వాడు ఆలస్యంగా.

ఇంత అల్లరిచేస్తున్నా వీడికి చదువు ఎల్లా వస్తున్నదా అని ముస లాయన ఆశ్చర్యపడితే, ఈకుర్రకుంక ఇన్ని దెబ్బలు ఎలా తింటున్నాడో అని వాడి చిన మేనమామ జాలి పడ్డాడు. జాలిపడి, అతను సుబ్బులుకు బాగా చనువిచ్చి, మంచిమాటలతో వశపరచుకొని, ఇంటిదగ్గర పాఠాలు చెప్పడం మొదలుపెట్టాడు. చెప్పినవి చెప్పినట్లు పప్పచెప్పాడు సుబ్బులు. పట్టుదలకలిగితే ఇంపైన లెక్కలైనా సరే ఒక్కసారి ఏక బిగిని చేసి చూపేవాడు.

ఆయనకు వాడిమీద అందుకే అభిమానంఏర్పడింది. వాడికి ఆయన మీద గురి ఏర్పడింది. తోటల్లో దొంగతనంగా కాయలుకోసి

తెచ్చి ఇచ్చాడు సుబ్బులు. డాక్టరు ఇంట్లో వాళ్ళకు ధైర్యం చెపుతూ, రోగికి మందులూ, ఇంజక్షన్లూ ఇస్తూ సాయంకాలం దాకా అక్కడే ఉండి అక్కడ కన్పించిన అందరికీ 'ఆంటీ టైఫాయిడ్ ఇంజక్షన్లు' ఇచ్చాడు.

అందరూ చేయించుకొన్నారు. కాని సుబ్బులు మాత్రం చేయించు కోలేదు. "ఏం నొప్పి పుట్టదురా— మేమంతా చేయించుకోలా, పైగా నువ్వు ఎక్కువగా వాడి దగ్గరే ఉంటున్నావు. కనుక నువ్వు చేయించు కోవడం అవసరంరా సుబ్బులూ'' అని తాతగారు బ్రతిమిలాడి చెప్పినా, "ఓరి వెధవయ్యా నీ కొస్తే ఎవరు చేస్తార్రా" అని వీపు మీద రెండు అంటించి తల్లి కొట్టి చెప్పినా, అంత జ్వరంలో ఉండే "సుబ్బులూ నువ్వు నా మాట వింటావు గదూ! ఆ ఇంజక్షను చేయించుకో" అని వెంకట్రావు నెమ్మదిగా చెప్పినా, డాక్టరు గారు గుడ్లురిమి భయపెట్టి చెప్పినా, వాడు వినలేదు.

"నా కక్కర్లేదు'' అన్నాడు సుబ్బులు.

"కుర్రవాడితో ఇంత వాదన ఎందుకు ఒక్కసారి గట్టిగా అలా పట్టు కోండి క్షణంలో ఇంజక్షను ఇచ్చిపోతా'' అన్నాడు డాక్టరు చివరకు విసుగుపుట్టి. కాని ఆ పని ఎవరివల్లా కాలేదు. ఆయన ఆ ఇంజక్షను ఇవ్వకుండానే వెళ్ళవలసి వచ్చింది చివరకు.

ఆ రాత్రి దగ్గర కూర్చుని నెమ్మదిగా కాళ్ళు పిసుకుతుంటే సుబ్బులును మరింత దగ్గరగా తీసుకొని వెంకట్రావు బుజ్జగిస్తూ ''ఒరేయి సుబ్బులూ! ప్రతిదానికీ అంత పంతం ఎందుకురా? నీకు నేనంటే ఇష్టం ఏర్పడింది. అందుకే నాకు జ్వరం వచ్చినా ఎప్పుడూ నా దగ్గరే ఉంటు న్నావ్. ఇదేమో అంటుజ్వరం. అంటే తెలుసా— ఒకళ్ళ నుంచి మరొ కళ్ళకు వస్తుంది. నా నుంచి నీకు రావచ్చు. అందుకని రేపైనా ఆ ఇంజ క్షను చేయించుకో'' అని ఆయాసపడుతూనే అంత వివరించి చెబితే సుబ్బులు "నాకు రాదు చిన మామయ్యా'' అన్నాడు. ఎన్ని విధాల

మాట మార్చి చెప్పినా వాడు అదే సమాధానం చెప్పాడు. ఆయన కూడా చివరకు విసిగి ఊరుకున్నాడు.

రోజు రోజుకు జ్వరం హెచ్చుతోందేగాని తగ్గుముఖం పట్టలేదు. డాక్టరు రెండు పూటలా వచ్చి వెళుతున్నాడు. ఆయనకు సుబ్బులు మీద క్రమంగా జాలి ఏర్పడింది. వాడి తరహా చూచి ఆయన ఆశ్చర్యపడ్డాడు కూడాను.

మందు ఇవ్వాలంటే వాడే ఇవ్వాలి. ఒళ్లు తుడవాలంటే వాడే తుడవాలి. ముఖం కడుక్కోడానికి, ఆఖరుకు మలమూత్ర విసర్జనకు ఏర్పాటు చెయ్యాలన్నా సుబ్బులే చెయ్యాలి. మరొకళ్ళను చెయ్యనిచ్చేవాడు కాదు. అంతలో మళ్ళీ ఎంత జాగ్రత్త! ఎంత ఒడుపు! ఎంత ఓర్పు!

శిక్షణ పొంది, ఎంతో అనుభవంతోపాటు దయా దాక్షిణ్యాలు కల నర్సు కూడా ఇంత సేవ చెయ్యలేదు అనుకున్నాడు ఆ డాక్టరు. ఆ ప్రసక్తి డాక్టరు తెచ్చినప్పుడు వెంకట్రావు "కన్న తల్లి కూడా అసహ్యించుకోవలసిన పనులు వీడు మంచిపనిలా చేస్తున్నాడు! ఒక్క క్షణం విడిచిపోడు. ఏం కావాలి చినమామయ్యా అని అడిగినవాడు అడిగినట్టే ఉంటున్నాడు వీడు నిద్రపోవడంలేదు బొత్తిగా. మార్ఫియా ఐనా ఇవ్వండి'' అన్నాడు "నేనేం చేస్తే ఈ చిన్న సన్యాసికి నా రుణం తీరుతుంది'' అని మనస్సులో అనుకొంటూ ప్రక్కకు తిరిగి పడుకున్నాడు.

డాక్టరు ఆ గదిలో ఉన్నంత సేపూ ఎంత సేపైనా సరే సుబ్బులు అక్కడ గుమ్మంలో నిలబడే ఉండేవాడు. ఆయన వెళ్ళగానే దగ్గరకు వెళ్ళి వెంకట్రావుకు కాళ్ళు పట్టేవాడు. డాక్టరు చెప్పినట్టు నుదిటి మీద మంచుగడ్డలు నింపిన రబ్బరు సంచీ పెట్టేవాడు. సరిగ్గా వేళ ప్రకారం మందులు ఇచ్చేవాడు.

అర్ధరాత్రి దాటినా సరే ఆయన ప్రక్కలో కాస్త మెదిలితే చాలు సుబ్బులు మాట విన్పించేది "ఏం చిన మామయ్యా, నిద్ర పట్టలేదా?" అని.

అలా అదే పనిగా పరామర్శిస్తుండేవాడు సుబ్బులు. బొత్తిగా నిద్ర పోక, ఆరోగ్యం పాడు చేసుకొంటున్నాడని బాధ కలిగి వెంకట్రావు "అదే పడుతుందిలే—నువ్వు ఊరికే విసిగించక కాసేపు నిద్రపో" అనేవాడు కోపం వచ్చినట్లు నటిస్తూ, పెద్దగా.

వెంకట్రావు అలా ఒకటి రెండుసార్లు కావాలని విసుక్కొనేసరికి సుబ్బులు దగ్గరకువెళ్ళి "ఎందుకు చిన మామయ్యా నామీద కోపం వచ్చింది ?" అని అడిగాడు సుబ్బులు ఎంతో నెమ్మదిగా. దిక్కుముఖం పెట్టుకొని అలా అడిగేసరికి వెంకట్రావుకు జాలి వేసింది. అయినా ఇదే మంచి అవకాశం అనుకొని "అది కాదురా నువ్వు ఇల్లా నిద్రమాని నా దగ్గర ఉంటున్నావ్. పోనీ ఆ ఇంజక్షను చేయించుకోరా అంటే విన్నావా? రేపైనా చేయించుకోరా ఈ జ్వరం నీకు రాకుండా ఉంటుంది" అన్నాడు.

'అదా కోపం' అనుకొంటూ సుబ్బులు "నాకు రాదు చిన మామయ్యా" అన్నాడు వెంటనే.

"ఏం నువ్వు మాత్రం మనిషివి కావట్రా ? ఏమిటా మొండి ధైర్యం ?"

"అదికాదు చిన మామయ్యా, నాకు రాదు. వచ్చినా ఏం చెయ్యదు.''

పెద్దవాడిలా అలా సమాధానం చెప్పేసరికి వెంకట్రావు మోచేతి మీద కొంచెం పైకిలేచి, వాడివంక నిదానంగా చూచి "అదేమిట్రా అలా అంటావ్'' అన్నాడు ఆశ్చర్యపడుతూ.

"నేను...'' అంతే సుబ్బులు మరేమీ అనలేదు.

ఆయన వాడి కళ్ళల్లోకి చూచాడు. వాడు చెప్పబోయిన విషయమంతా చెప్పినట్లే అనిపించింది. ఆయన ఒకసారి వాడి వంక పరీక్షగా చూచాడు.

'సుబ్బులు గుండులా ఉన్నాడు. వాస్తవానికైతే నిండా పన్నెండేళ్లైనా లేవుగాని పదహారేండ్ల యువకుడులాగా—గుర్రంలాగా ఉన్నాడు. ముఖం చూచి పసివాడు అనుకోలేరనిపిస్తున్నది. అంత చిరుత వయసులో కూడా ముఖంలో ఏదో కరుకుతనం కన్పిస్తున్నది.'

'ఒక్కసారి ఆ కళ్ళల్లో ఎంత గాంభీర్యం. ఆ లేత బుర్రలో ఎన్ని ఆలోచనలు మెదులుతున్నాయో! తన్నేమీ చెయ్యదట! అందర్నీ చంపి పుట్టావురా అంటూ మాటికీ మాటికీ అందరూ తిట్టగాతిట్టగా, వాడికి కూడా తను నిజంగా అటువంటివాడినన్న భావం కలిగింది. అందుకే తనకు ఏ రోగం. జ్వరం రాదనీ, వచ్చినా ఏమీ చెయ్యదనీ చేసినా మరేమీ ఫర్వాలేదనీ వాడి ఊహ.....ఎన్ని ఊహలు. మనసులో ఎంత బాధగా ఉందో! పెద్దవాళ్ళయి ఉండి కూడా వీళ్ళు ఎన్ని అన్నారో— జరిగిన అన్యాయాలన్నిటికీ వీడా బాధ్యుడు! ఎన్ని అని, ఎంత బాధిస్తున్నారో!' అనుకొంటూ వెంకట్రావు ఎంతో బాధ పడ్డాడు.

ఆయనకు కళ్ళు చెమ్మగిల్లాయి.

మరో క్షణంలో కన్నీరు ధార కట్టింది.

అది చూచి సుబ్బులు గాభరా పడుతూ, కన్నీరు తుడుస్తూ "అదేమిటి చిన మామయ్యా..." అని ఆగి, ఏదో అడగాలనుకొని అడగడం చేతగాక, అడుగలేక తికమక పడ్డాడు. తన మాట మూలంగానే ఆయనకు కష్టం కలిగింది అనుకొని అంతలో మాట మార్చి 'నిద్ర పట్టించుకో చిన మామయ్యా' అంటూ కాళ్ళు పిసకడం ప్రారంభించాడు. "వీణ్ణి బాగా చదివించి తండ్రిలేని లోపం తీర్చి పెద్దవాణ్ణి చేస్తా" అనుకొంటూ వెంకట్రావు నిద్రపోయాడు.

మరో వారం గడిచింది.

ఆ వారాంతంలో జ్వరం తగ్గింది. "మీ అందరి అదృష్టం మంచిది. కష్టకాలం గడిచింది. ఇక ఫర్వాలేదు. మరో నాల్గు రోజులు

చూచి పత్యం పెట్టొచ్చు. జ్వరం తగ్గింది. రెండు రోజులు వరసగా రెండు పూటలా నార్మలుకు వచ్చాక పత్యం పెడుదురుగాని'' అన్నాడు డాక్టరు. దాంతో అందరికీ ధైర్యం వచ్చింది.

కాని సుబ్బులుకు మాత్రం అటువంటి ధైర్యం కలుగలేదు. పైగా ఆయన వంక పూర్వం కంటె ఎక్కువగా భయపడుతున్నట్లు చూడడం మొదలుపెట్టాడు. బాగా నీరసించి పోయిన రోగివంక చూస్తూ, తన కేదో అనుమానం కలిగినట్లు, ఆ గదిలో ఎక్కడో ఏ మూలో దయ్యం దాగి ఉన్నట్లు, తాను అవతలకు వెళితే అది రోగిమీద పడుతుందేమో అన్నట్లు భయపడుతూ సుబ్బులు ఆ గది విడిచి బయటకు రాలేదు.

వాడి వింత ధోరణి, వాడి భయం ఎవరికీ అర్థంకాలేదు. అర్థం చేసుకోవాలని ఎవ్వరూ ఒక్క రవ్వకూడా ప్రయత్నం చెయ్యలేదు 'పిచ్చి సన్యాసి ఏదో భయపడ్డాడు జ్వరం తగ్గదేమోనని' అనుకొన్నాడు వెంకట్రావు తండ్రి.

"రేపొక్క రోజు చూచి సత్యం పెట్టండి" అన్నాడు డాక్టరు.

ఆరోజు రాత్రి అందరూ నిశ్చింతగా పడుకొన్నారు. అర్ధరాత్రి వేళ అప్పుడే కునుకుపట్టిన సుబ్బులుకు కలలో ఎవరో మూలుగుతున్నట్లనిపించి, చప్పున మెలకువ వచ్చింది. ఒక్క గంతున లేచి కూర్చున్నాడు. గదిలో ఎక్కడో మూలుగు సన్నగా వినిపించింది.

నెమ్మదిగా మంచం దగ్గరకు వెళ్ళి "ఏమిటి చిన మామయ్యా మూలుగుతున్నావ్'' అని అడిగాడు సుబ్బులు. ఆయన వెంటనే సమాధానం చెప్పకపోయేసరికి అనుమానం కలిగి చెయ్యి పట్టుకొని చూస్తే చాలా వెచ్చగా ఉన్నది. ఒళ్ళంతా ఎక్కడ పట్టుకొని చూచినా సలసల కాగిపోతున్నది. గాభరాగా వెళ్ళి తాతగారిని పిలుచుకొనివచ్చాడు. సుబ్బులు వెళ్ళి లేపితే, ముసలావిడ "ఎవరికిరా జ్వరం" అంటూ సుబ్బులు చెయ్యి

పుచ్చుకొని "అవున్రా వేడిగా ఉందే—అదే పోతుందిలే పోయి పడుకో" అన్నది మరో వైపు తిరిగిపడుకొంటూ. "వాక్కాడు చిన మామయ్యకు" అని సుబ్బులు అంటే ఆవిడ అదిరిపడి, లేచి వెళ్ళి చూచింది. దాదాపు స్పృహ లేకుండా పడుకొని ఉన్న కొడుకు ఒళ్లంతా తాకి చూచి "వాడు వచ్చిలేపితే వాడికి జ్వరం వచ్చిందనుకున్నా వాడి చెయ్యి వేడిగా ఉండడం చూచి, అయ్యబాబో మళ్ళీ నీకే వచ్చిందిరా. ఇంకేముంది. జ్వరం తిరగ పెట్టేసింది" అంటూనే ఆవిడ ఏడ్పు మొదలు పెట్టింది. "ఊరుకోవే— ఏడ్వడం దేనికే అశుభం" అని ముసలాయన అంటున్నా, ఆవిడ ఏడ్పు మానలేదు. అది విని రాజమ్మ లేచి వచ్చింది. తల్లిని బలవంతాన ఇవతలకు తీసుకొనివచ్చి, వాపమీద కూర్చోపెట్టి తండ్రికి ధైర్యం చెబుతూ, చల్లని నీళ్ళల్లో ముంచిన గుడ్డ నుదిటిమీద ఆరగా ఆరగా వేస్తూ అన్నకు సేవ చెయ్యడానికి ప్రయత్నించింది రాజమ్మ.

గడియ గడిచిన కొద్దీ అందరికీ గాభరా ఎక్కువైంది.

ఎంత సేపటికీ వెంకట్రావుకు పూర్తి స్పృహరాలేదు. ఒకటి రెండు సార్లు కళ్ళు తెరిచి చూచాడు. ఏమిటో ఎవరి కోసమో వెతుకుతున్నట్లు చూచి మళ్ళీ కళ్ళు మూసుకొన్నాడు. ఆ రాత్రి ఎలా గడుస్తుందా అని వెంకట్రావు తండ్రి మథనపడ్డాడు. ఏం చెయ్యాలో ఏమీ తోచలేదు. అయనకేకాదు ఎవరికీ ఏమీ పాలుపోలేదు.

రెండు గంటలకు వారిఇంటి ముందు కారుఆగింది. డాక్టరు గబగబా లోపలకు వచ్చి, రోగిని పరీక్షించి వెంటనే ఇంజక్షను ఇచ్చి, మందు త్రాగించాడు. వెంట తెచ్చిన ఐస్ బాగ్ ఎలా నుదుటిమీద పెట్టాలో చూపిస్తుంటే వెంకట్రావు తండ్రి నెమ్మదిగా — ఆదుర్దానుంచి అప్పుడే కాస్త తేరుకొన్నట్లుగా ఆయాసపడుతూ "సమయానికి దేవుడిలా

వచ్చారు. ఎలా వచ్చారండీ—ఎవరు చెప్పారండీ" అని అడిగాడు. "అదేమిటీ — ఎవరో ఏమిటి — మీ సుబ్బులే వచ్చాడు. ఎంతో భయ పడుతూ, పరుగెత్తుకొని వచ్చాడేమో తెగ రొప్పుతూ చెప్పాడు. నువ్వంటే అడ్డు దార్ని వచ్చావ్ — నేను రావాలన్నా, వెళ్ళాలన్నా అయిదు మైళ్ళు వెళ్ళాలి. అయినా, ఇప్పుడేమిటి రేపు ఉదయం వచ్చి చూస్తానంటే కాదని కాళ్ళమీద పడపొయ్యాడు. ఏం కుర్రవాడండి వాడు. మరిచా చెప్పడం — అలా కాళ్ళమీద పడబోతుంటే వారిస్తూ జబ్బలు పట్టుకొన్నాను. వళ్లు వేడిగా ఉన్నది. పైగా గజగజ వణికిపోతున్నాడు. జ్వరం వల్లో, భయంవల్లో తేల్చుకోలేకపోయాను. బయలుదేరేదాకా ఒకటే ఊదర పెట్టాడు. తీరా బయలుదేరి నాతో రమ్మంటే మీరు ముందు పదండి అన్నాడు. నేను కూడా కదలేదాకా అక్కడే నిలబడి—ఆ తర్వాత మా అరుగుమీద కూర్చున్నాడు" అని డాక్టరు చెబుతుంటే ఒక్క ముసలాయన తప్ప మరెవ్వరూ వింటున్నట్టు కనిపించలేదు.

తెల్లవారుఝామున అయిదు గంటలకి 'నేను చెయ్యగలిగినదంతా చేశాను.' అనుక్రొంటూ రోగి గది బయటకు వచ్చి, డాక్టరు ముందు వసారాలో పడక కుర్చీలో నడుము వాల్చారు. కొంచెం విశ్రాంతికి ఉపక్రమించి కళ్ళు మూసుకొంటే ఆయనకు కునుకు పట్టింది.

తూర్పు తెలతెల వారుతుండగా ఇంట్లో అంతా ఒక్కసారి గొల్లు మన్నారు. డాక్టరు ఒకసారి లోపలకు వెళ్ళి చూచి బయటకు వచ్చాడు.

ఆ మరునాడు సాయంత్రం దాకా ఆ ఇంట్లో సుబ్బులు విషయం తలచుకున్నవారులేరు. ఆ పూట చీకటి పడుతుండగా ముసలాయనకు ఆ విషయం జ్ఞాపకం వచ్చి అందర్నీ అడిగాడు. మాకు తెలియదంటే మాకు తెలియదన్నారు. ముసలావిడ తెలియదని నిర్లక్ష్యంగా అనడమే కాక, "ఇంక వాడెందుకు కంటపడతాడూ వాడు నా ఇంట్లో అడుగుపెట్టి

నప్పుడే అనుకున్నా శని అడుగుపెట్టిందని. కాల్లోనక్కలా వాడు నాయన గదిలో కాచుక్కూర్చున్నప్పుడు నాకేదో భయం వేసింది. అపశకునం అను కొని ఆ భావం అణచుకొన్నా. ఆనాడే ఆ శని వెధవను బయటకు నెడితే ఇది ఇలా జరిగేది కాదేమో'' అంటూ సుబ్బులును ఎన్ని తిట్టిందో!

ముసలాయన మాటాడకుండా బయటకు వచ్చి బండి కట్టించుకొని బస్తీకి వెళ్ళి, డాక్టర్నుకలుసుకొని సుబ్బులు విషయం కనుక్కొన్నాడు. "నాకు అతను మళ్ళీ కన్పించలేదు. మొన్న ప్రొద్దున్న దాకా మా అరుగుమీదే పడుకుని ఆరు గంటలకు లేచి స్టేషను వైపుకు వెళ్ళిపోయాడని మా నౌకరు చెప్పాడు'' అని డాక్టరు అంటే ఇంక వివరాలు అడక్క ఆ ముసలాయనచెరచెరా స్టేషను వైపువెళ్లాడు. మళ్ళీ అక్కడ్నించి బండి కట్టించుకొని "ఆరింటికంటే మెయిలువేళ. విశాఖపట్నం వెళ్ళాడా ఏమిటి?' అనుకొంటూ ఇంటికి తిరిగివెళ్లాడు. "ఎక్కడికి వెళ్ళాడోఏమిటో, ఆదుర్దాగా ఉందే'' అంటే వాళ్లు ఏమి మాట్లాడక పొయ్యేసరికి ఆయనకు కోపం వచ్చి, "తల్లీకూతురూ ఒకటే మోస్తరు మనుష్యులు. పెద్దవాడు ఇల్లు వదలి వెళితే వాడేదో శాఖాంతరం చేసుకున్నాడని కోపంతో వాడి విషయం అనుకోనైనా అనుకోలేదు మీ అమ్మ. నువ్వూ అల్లాగే తయా రయావ్. పైగా జ్వరం వచ్చిన చిన్న సన్యాసి కన్పించడం లేదంటే నీకు చీమ కుట్టినట్లయినా లేదేమే'' అని రాజమ్మను కసురుకున్నాడు. ఆ మాట విని ముసలావిడ "కొడుకుపోయి నేనేడుస్తుంటే ఈ సాధింపు లేమిటి! ఆ ముష్టి వెధవ ఎక్కడికీ పోడు పడుకోండి. ప్రొద్దుపోయింది'' అన్నది.

ఆ మరునాడే సింహాద్రిగారి దగ్గరనుంచి తంతి వచ్చింది సుబ్బులు ప్రమాద స్థితిలో ఉన్నాడనీ, రాజమ్మను వెంటనే పంపమనీ.

రాజమ్మ మామగారింటికి వెళ్లేసరికి ఆయన గుమ్మంలోనే ఎదుర య్యారు. "ఎలాఉన్నాడండీ వాడికి. అసలు వాడు...'' అని ఆదుర్దాగా

అడిగితే "మరేం ఫర్వాలేదే దివ్వాళ—నిన్న నీకు టెలిగ్రాం ఇచ్చే వేళకు మరీ ప్రమాదంగా ఉన్నదన్నారు. పోదాం పద" అన్నారు సింహాద్రి గారు. "అదేమిటి? ఎక్కడికీ" అని రాజమ్మ అడిగితే "ఆసుపత్రికి—వాడు సరాసరి ఆసుపత్రికే వెళ్ళాడు వాళ్ళ కబురు చేస్తే నే నేను మొన్నా, నిన్నా చూచి వస్తున్నా నిన్న అంత జ్వరంలో ఉండి పిచ్చి చూపులు చూస్తూ కూడా నీ విషయం చెప్పాడు. అమ్మను పిలవద్దు తాతయ్యా అమ్మను రానివ్వకు ఇక్కడకు వస్తే అమ్మకు కూడా పాడు జ్వరం వస్తుందేమో అన్నాడు'' అంటూ వాడి పరిస్థితి వివరిస్తూ సింహాద్రి గారు కోడలును ఆసుపత్రికి తీసుకొని వెళ్లారు.

అక్కడ నర్సు రాజమ్మకు ధైర్యం చెప్పి "రాత్రి అంతా చిన మామయ్యా అని ఒకటే కలవరించాడండీ. పోనీ ఒకసారి పిలిపించండి" అని అంటే ఆ మాటకు రాజమ్మ ఏడుస్తూ "వీడైనా నాకు దక్కుతాడా అమ్మా" అని అడిగింది. విషయమంతా విని రాజమ్మను అవతలకు తీసుకువెళ్ళి ఓదార్చి, అనేక విధాల ధైర్యం చెప్పింది ఆ నర్సు.

ఇరవై రోజుల తర్వాత సుబ్బులు ఆసుపత్రి నుండి ఇంటికి తిరిగి వచ్చేసరికి అతని రూపమే మారి పోయింది. బక్క చిక్కిపోయాడు, జుట్టంతా ఊడిపోయింది. మనిషి వికారంగా తయారయాడు. వస్తూనే ఆకలి అంటూ వచ్చి, వంటఇంట్లో అన్నం గిన్నె కంచంలో బోర్లించుకొని, చింతకాయ పచ్చడి వేసుకొని అంత అన్నం తినేశాడు.

"ఏరా నాయనా, ఎంత జబ్బు చేసిందిరా — ఎలా అయిపోయావురా'' అని కళ్ల నీళ్లు పెట్టుకొని దగ్గరకు తీసుకోబోతే సుబ్బులు వెళ్ళలేదు.

అప్పుడేకాదు. ఆ తర్వాత కూడా వాడు చనువుగా ఆవిడ దగ్గరకు వెళ్ళలేదు. వాడు తన సానుభూతి, ప్రేమ కావాలనీ కోరాలనీ

అమ్మా తాతయ్యా గారింట్లో నన్నేమన్నా అన్నారా అనీ, చిన మామయ్యా నన్ను గురించి అడిగాడా అని వాడు స్వయంగా అడగాలనీ, అలా అడిగితే తను వాణ్ణి ఒళ్లో కూర్చోపెట్టుకుని ఓదార్చి, హృదయభారం తీర్చుకోవాలనీ అను కొన్నది రాజమ్మ. కాని సుబ్బులు అందుకు అవకాశం ఇవ్వలేదు.

రాజమ్మ ఆ విషయాలు, ఈ విషయాలు చెప్పుకొని మాటి మాటికీ గతం జ్ఞాపకం చేసుకొని ఏడుస్తుంటే ఒకసారి సింహాద్రిగారు "అమ్మాయి నువ్వు ఇంక ఏడవమాకు. అన్నింటికీ అందరి బదులు నేను ఏడుస్తాను. నేను ఇన్నివిధాల చిత్రవధ అయ్యాను. అయినా బ్రతుకు తున్నా. నే నేం చూసుకుని ఊరడిల్లాలి. చెట్టంత ఎదిగిన కొడుకులు పోయారు. భార్య పోయింది. కూతురు లేచిపోయింది. ముసలితనం వచ్చింది. ఈమధ్య దారిద్ర్యం కూడా చూస్తున్నా" అన్నారు.

ఆ మాటలు విని రాజమ్మ పెద్దగా ఏడ్చింది. కోడలు అల్లా ఏడుస్తుంటే ఆయనకు ఎంతో దుఃఖం వచ్చింది కాని కన్నీరు బయటకు పొర్రి రాలేదు. ఆయన కన్నీరు సంవత్సరాలుగా లోపలకు ప్రవహించడం మొదలుపెట్టింది. కన్నీటి చెరువు అయింది ఆయన హృదయం. ఎన్ని కొత్త వాగులు వచ్చి పడ్డా లోలోన ఇముడ్చుకొంటున్నది ఆ కన్నీటి తటాకం.

ఆయన మాటాడడం మానేశారు.

కనీసం సుబ్బులును అల్లరి చేయవద్దని చెప్పడం కూడా మానేశారు. వాడు ఎంత అడిగితే అంత ఇవ్వడం మొదలుపెట్టారు. "ఒరేయి సుబ్బులూ బయటకు వెళ్ళి ఏదైనా తిను. అమ్మ దుఃఖంలో ఉన్నది నీకేం చేసి పెడుతుంది" అని ఒక్కసారే అన్నారు. ఇక అప్పటినుంచి వాడికి ఏం కావాలంటే అదల్లా ఇవ్వడం మొదలు పెట్టారు. ఇల్లు గుండం అయి పోతుంది. వాడికి మళ్ళీ జబ్బుచేస్తుంది వద్దని రాజమ్మ అడ్డువచ్చింది. కాని ఆవిడ మాట సాగలేదు.

సింహాద్రిగారు తిరుగుతూ తిరుగుతూనే మంచం ఎక్కారు జబ్బేమీ లేకుండానే అలా శూన్యంలోకి చూస్తూ చూస్తూనే కన్ను మూశారు.

కర్మ అయిన మరునాడు "నేనింక వెళతానమ్మా వదినా. నాన్న బ్రతికి ఉండగా వచ్చి క్షమాభిక్ష వేడుకొనే భాగ్యం లేకపోయింది. ఆఖరి చూపు కూడా నాకు దక్కలేదు. సరే జరిగిపోయిన వాటికి ఇప్పుడు ఏడ్చి లాభం ఏముంది?'' అని సింహాద్రి గారి కూతురు ఒక్క క్షణమాగి ఏదో స్ఫురణకు వచ్చినట్లు "వదినా ఇంత ఇంటికి సుబ్బులు ఒక్కడు మిగిలాడు. వాణ్ణి నా వెంట పంపు తీసుకొని పోతా" అన్నది.

ఆ మాట విని రాజమ్మ ఆశ్చర్య పడ్డది. రాజమ్మ చాలా సేపటి దాకా మాటాడలేక పోయే సరికి సింహాద్రిగారి కూతురు మళ్ళీ అందుకుని "లేచిపోయి కులం మర్యాద పోగొట్టుకున్నదాన్ని నా వెంట పంపడం నీకు ఇష్టం అవుతుందని నేను అనుకోడంలేదు. కాని ఒక్క విషయం వదినా! నేను అన్నీ విన్నా. వాడి మూలంగా నీకూ, ఈ ఇంటికీ ఆఖరికి నీ పుట్టింటికి దరిద్రం చుట్టుకొన్నదని మా అమ్మా, మీ అమ్మా అందరూ అన్నారట. నువ్వూ అన్నావట. అనగా అనగా వాడికీ అదే నమ్మకం కలిగింది. వాడు అక్కడికి వెళితేనే వాడి చిన మామయ్య పోయాడుట. వాడు ఆ విషయం చెప్పుకొని ఎంత ఇదయ్యాడో. సరే ఆవన్నీ ఎందుకులే. విన్నేమో అంటున్నానని మాత్రం అనుకోకు. నాకు వాడి విషయం దిగులుగా ఉన్నది. అక్కడ నాకు నా అనే వాళ్లు అంటూ ఎవరూ లేరు. నాకు కాస్త తోడుగా ఉంటాడు. ఇంత బలగం, ఆస్తి పేరు ప్రతిష్ఠా ఉన్న ఈ ఇంటికి వారసుడుగా మిగిలింది వాడొక్కడే. వాణ్ణి కనిపెట్టి ఉండవలసిన బాధ్యత, హక్కు నాకూ ఉన్నది. పైగా వాడు నాతో వస్తానంటున్నాడు. ఇక్కడే వుంటే నువ్వు కూడా దక్కవని వాడికి భయం ఏర్పడింది." అని చెప్పడం ఆపి, క్షణం తర్వాత మళ్ళీ అందుకొని "వదినా! నువ్వా పుట్టెడు దుఃఖంలో ఉన్నావని

పుట్టింటివార్ని చూద్దామా వారూ అదే పరిస్థితిలో ఉన్నారు. వాడికి చదువు సంధ్యా చెప్పించి, ఓదార్లో ఎవరు పెడతారు. నా మాట విను. నా వెంట రానీ వాణ్ణి. ఆడపిల్లయితే నాబోటి దాని దగ్గర ఉంటే పెళ్ళి పెటాకూలు ఎలా అవుతుందని దిగులు పడచ్చు మగబిడ్డ. ఆ దిగులేం లేదుకదా. అదీకాక నాకు మరో భయం పట్టుకొన్నది_ వాడికాజ్వరం మళ్ళీ వస్తుందేమోనని. ఈ ప్రాంతాలలో ఈరకం జ్వరాలు చాలా మందికి వస్తున్నాయనీ, కొన్ని కుటుంబాలు యిలా కూలిపోతున్నాయనీ విన్నాను. వీణ్ణి దక్కించుకోనీయ్ నన్ను" అన్నది.

రాజమ్మ ఆవిడ మాటలు విని కాకపోయినా, కొడుకు పట్టుదల చూచి వాణ్ణి ఆవిడతో పంపక తప్పలేదు.

o o o o

బొంబాయి వచ్చిన కొద్ది రోజులకే సుబ్బులు, ప్రవర్తన పూర్తిగా మారిపోయింది. మేనత్త గీచినగీటు దాటకుండా నడుచుకోవడం మొదలు పెట్టాడు. వచ్చిన వారంలోనే "మామయ్య గారితో నాకు పరిచయం చెయ్యత్తయ్యా - ఆయన గొప్ప డాక్టరటగా" అంటే ఆవిడ సుబ్బులుకు ఆయనతో పరిచయం చేసింది అలా కలిగిన పరిచయాన్ని ఇట్టే పెంపొందింపుకొన్నాడు సుబ్బులు.

అతను ఆయన దగ్గర అతి తక్కువ కాలంలో ఎంతో చనువు సంపాదించాడు. కొద్ది రోజులలో ఆయనతోపాటు రోగులను చూడడానికి వెళ్ళడం మొదలుపెట్టాడు. అలా వెళ్ళినప్పుడు అతను ఆయనకు ఎంతో సహాయంగా ఉండేవాడు

సుబ్బులు తనయందు ప్రదర్శిస్తున్న వినయవిధేయతలు, రోగుల పట్లచూపుతున్న సేవాసక్తి డాక్టరుగారిని ముగ్ధుణ్ని చేశాయి. అవకాశం

చిక్కినప్పుడల్లా అతను ఆయన్ను ఏన్నో ప్రశ్నలు వేసేవాడు. ఎప్పుడు అడిగినా జ్వరాలను గురించీ, రోగ నిదానం గురించీ అడిగేవాడు. ఒక సారి అతను ఏదో విసుక్కున్నట్టుగా డాక్టరు గారితో "వెదవ టైఫాయిడ్ జ్వరం వస్తే మనుష్యులు చావటమేమిటండీ! దానికి మంచి సరియైన మందు లేదండీ?" అని అడిగాడు సుబ్బులు.

ఆ అడిగిన ధోరణి చూచి ఆయన ఆశ్చర్యపడుతూ "లేదబ్బాయి ఇప్పుడిప్పుడే ఈ విషయమై పరిశోధన ప్రారంభమైంది. ఎవడో కని పెడతాడు మహానుభావుడు" అన్నారు.

"ఆ మహానుభావుడు ఒక్కరవ్వ ముందే పుట్టి ఆ మందు కని పెట్టి వుంటే మా నాన్నకు వ్యాధి నయమయేది. మా చిన మామయ్య బ్రతికేవాడే" అంటూ ఏదో ఆలోచనలో పడి ఆయనవంకే చూస్తున్నా ఏటో చూస్తున్నట్లున్న సుబ్బులు కళ్ళల్లోకి ఆశ్చర్యంగా చూశారు డాక్టరు గారు. అతని కన్నులు అశ్రుపూరితం కాలేదు. మొదట ఏ భావం పైకి ప్రస్ఫుటం కాలేదు. లోతుకు తీసుకొని పోతున్నాయి అతని కళ్ళు. తీసుకొని వెళ్ళిన మేరకు మించి పరిశీలించారు డాక్టరుగారు. ఆయనకు అతను పూర్తిగా అర్థమయాడు.

ఆ సమయంలో అతనికి మంచి ఆలోచన వచ్చింది. అంతలో అది స్థిరపడింది. దానికి డాక్టరు గారు పైకి ఏమీ అనకుండానే ఒక స్థిర రూపం కల్పించారు. ఆయన దో యథాలాపంగా అన్నమాట పట్టుకొని సుబ్బులు ఆయేడు మెట్రిక్ పరీక్షకువెళ్ళి ఉత్తీర్ణుడయ్యాడు. అందుకు సంతోషించి అతని మేనత్త కళాశాలలో చేర్పిపుస్తకాలు కొనిఇస్తే దీక్షగా చదివి ఊరికే ఉత్తీర్ణుడవడం కాక స్కాలర్‌షిప్పు కూడా సంపాదించాడు. డాక్టరుగారు. తనపలుకుబడి ఉపయోగించి సీటు ఇప్పిస్తే. మేనత్త ఆర్థిక

సహాయం చేసి ఆదుకుని ప్రోత్సాహిస్తే అతను వైద్యకళాశాలలో చేరి నిద్రాహారాలు మాని చదివాడు. అన్ని సంవత్సరాల వైద్య విద్యాధ్యయనం ఒక్క సంవత్సరంలో పూర్తి చేశాడా అని పించింది అతని మేనత్తకి. "అత్తయ్యా! ఇక్కడ నా చదువు అయిపోయింది'' అన్నాడతను.

సుబ్బులు కృతజ్ఞత చెప్పుకుంటూ "కన్న తల్లికీ, తండ్రికీ, తాతకూ, ప్రేమ చూపి ఆదరించిన చిన మామయ్యకూ ఋణపడలేదు కాని నీకు చాలా ఋణపడ్డాను అత్తయ్యా, ఎల్లా తీర్చుకోను నీ ఋణం!'' అన్నాడు.

"అదేమిట్రా అల్లా అంటావ్, ఏదో నీ అదృష్టం బాగుంది. వచ్చావ్ కష్టపడి చదువుకొన్నావ్ ప్యాసయ్యావ్. ఇందులో నేను చేసిందేముంది'' అన్నది సింహాద్రిగారి కూతురు మేనల్లుడి వంక గర్వంగా చూస్తూ.

ఆవిడ చేసింది ఏమున్నదో అతనికి తెలుసు. అందుకే అతను వెంటనే "నాకు తెలియదా'' అన్నాడు. ఆవిడ సంతోషంతో పొంగి పోతూ, చిరునవ్వు నవ్వుతూ "నువ్వు ఎమ్. డి. కూడా కా'' అన్నది. అతను అయాడు. అయిన తర్వాత ఇన్నాళ్లుగా అతన్ని బాధిస్తున్న ఆంశం బహిర్గతం అయింది. దేనికి ఇంత ఆదుర్దాగా ఇంత పట్టుదలగా ఈ చదువు చదివిందీ అతనికి అర్థమైంది.

అతను పరిశోధన ప్రారంభించాడు. సుబ్బులు పరిశోధనలో చూపిస్తున్న దీక్ష చూచి ఆ పరిశోధనా సంస్థ అధికారులు ఎంతో మెచ్చుకొని ఉన్నత స్థాయి పరిశోధన నిమిత్తం విదేశాలకు పంపారు.

అతను అమెరికా వెళ్ళాడు. తనకు కావిలసిన మందు కనిపెట్టి తిరిగి వచ్చాడు.

గొప్ప పరిశోధకుడుగా, గొప్ప వైద్యుడుగా పేరు ప్రఖ్యాతులు సంపాదించి తిరిగి వచ్చిన సుబ్బులును చూచి అతని మేనత్త ఎంతో పొంగిపోయింది. ఆనందాశ్రువులతో నిండిన కళ్లు తుడుచుకుంటూ అతని చెయ్యి పుచ్చుకొని "నాయనా నువ్వు ఒక్క పది సంవత్సరాలు ముందు పుట్టి ఈ మందు కనిపెట్టి ఉంటే మా చిన్నన్న బ్రతికేవాడు—మీ చిన మామయ్యా బ్రతికేవాడు'' అంటూ పొర్లివస్తున్న దుఃఖం ఒక్కసారిగా ఆపుకొని "పోన్లేరా — ఆ విషయం మనం మర్చిపోదాం. మనకు లోకం నిండా చిన్నన్నలూ, చిన మామయ్యలూ ఉన్నారు. వాళ్ళ కోసం వినియోగించు ఈ మందు'' అన్నది. ఆవిడ వెళ్ళి తీసుకొని వస్తే వచ్చిన రాజమ్మ కొడుకును అమాంతం కౌగలించుకొని "ఎంత వాడివయావురా. అవును మీ అత్తయ్య అన్నట్లుగా ఎవరి అదృష్టం వారిది—అత్తయ్య మాటే నిజంరా— నువ్వు నిజంగా ... సుబ్బులూ నువ్వు నిజంగా అదృష్టవంతుడివిరా'' అన్నది.

పగ అడగించుటెంతయు శుభంబు

తరగతినుంచి ఉపాధ్యాయుల గదిలోకివచ్చి గణితబోధిని, డస్టర్, విరిగిపోయిన సుద్దముక్కలు బల్లమీద పడేసి, ఒక్కక్షణం విశ్రాంతి తీసుకుందామని అలా కుర్చీలో కూర్చున్నానో లేదో "మిమ్మల్ని హెడ్ మాస్టర్‌గారు రమ్మంటున్నారండీ" అంటూ బడి నౌకరు ప్రత్యక్ష మయాడు.

"వస్తా. పద'' అని అతన్ని పంపించాను.

ఇంతలో "వినదగు నెవ్వరు చెప్పిన" అన్నారు శాస్త్రిగారు చిరు నవ్వు నవ్వుతూ. ఆయన మా పాఠశాలలో ఆంధ్రోపాధ్యాయులు.

"వెంటనే వెళ్ళకపోతే ఆయన అపార్థం చేసుకోడానికి అవకాశం కల్పించిన వా రవుతారు'' అన్నారు రామారావుగారు ఇంగ్లీషులో. ఆయన మా బళ్ళో ఇంగ్లీషు టీచరు. ఆయన ఎమ్.ఏ. కాని అదృష్టం బాగుండక బడిపంతులుగా పని చేయవలసి వచ్చింది.

నా కెదురుగా కూర్చుని, చుట్ట కాలుస్తూ, "ఆలస్యం అమృతం విషం" అని పెద్దలు ఊరికే అనలేదండీ. పోనీ, ఓసారి వెళ్ళిరాకూడదూ'' అని శాస్త్రిగారు మళ్ళీ హెచ్చరించిన తర్వాత నేను నెమ్మదిగా బయలు దేరాను ఈసారి పిలవనంపిన కారణం ఏమై ఉంటుందా అనుకొంటూ.

"రండి. రండి. మీకోసమే ఎదురు చూస్తున్నాను. వస్తారో రారో అనుకొంటూ ఉండగా వచ్చారు'' అంటూ గుమ్మంలోనే స్వాగతవచనాలు పలికారు మా ప్రధానోపాధ్యాయులు.

ఆయన స్వాగత వాక్యాల తీరే అంత. రావడం ఇంత ఆలస్యమైనదేమని అడగడానికి ఆయన అవలంబించే పద్ధతే ఇది. నాకు ఇదేమీ క్రొత్త కాదు.

మొదటిరోజులలో పిలిచిన వెంటనే వెళ్లేవాణ్ణి. తరగతి విడిచిపెట్టి, పాఠం మధ్యలో వదిలివేసి వెళ్ళిన సందర్భాలూ ఉన్నాయి. కాని తర్వాత తర్వాత ఆయన ధోరణి అర్థంఅయాక—పిలిచి చెప్పేమాటలు ఎప్పుడు విన్నా ఫరవాలేదనే నిర్ణయానికి వచ్చాక - ముందు పని ముగించుకొని వెళ్ళడం మొదలుపెట్టాను. ఇవాళకూడా అలాగే జరిగిందని ఆయన అనుకొని ఉండవచ్చు.

"క్లాసునుంచి ఇప్పుడే వచ్చాను. ఎందుకో పిలిచారట" అంటూ నేను ఆయనవెంట లోపలకు నడిచాను. ఆయన వెళ్ళి తన కుర్చీలో సుఖాసీను లయారు. ఆ కుర్చీలో సుఖంగా కూర్చొనడానికి, హాయిగా ఆనుకొనడానికి మంచి మెత్తలు అమర్చుకొన్నా రాయన. అలా కూర్చొని ఆయన ఒకసారి రెండు కళ్ళూ మూసుకొని మౌనముద్ర వహించారు.

ఒక్క-క్షణం వేచి ఉన్నాను.

ఇంకా కొంతసేపు నేను మాటాడకుండా అలాగే నిలబడిఉంటే ఆయన నా విషయం మరిచిపోయి. ఓ కునుకుతీసే ప్రమాదం ఉన్నదని అనిపించి "అయ్యా, నన్ను ఎందుకో పిల్చారు...!" అన్నాను. హెడ్ మాస్టర్‌గారు ఒక్క-సారి కళ్ళు తెరిచి "అవునవును" అని మళ్ళీ మౌనం వహించేసరికి, నాకు కొంచెం చిరాకువేసింది.

ఆయనఅంటే మొదట్లో నాకు ఎంతో గౌరవం ఉండేది. స్వయంగా చెప్పుకోదగిన పాండిత్యం, ప్రతిభా లేకపోయినా ఆయన పండిత కుటుంబంలో జన్మించారు. ఈ తరంలో పెద్ద ఆస్తిపాస్తులు

లేకపోయినా ఆయనకు మంచి పలుకుబడిమాత్రం ఉన్నది. ఇవన్నీకాక ఆయన మంచి విగ్రహపుష్టి కలవాడు. మంచి రంగు. అందమైన మగ వాళ్ళంటే నాకెందుకో ఒక విధమైన గౌరవం. ఆ గౌరవం ఆయన ఇంగ్లీషు ధారాళంగా మాటాడడంతో మరికొంత పెరిగింది. అది ఇంకా పెరిగి భక్తిభావంగా మారేదేకాని, ఆయన స్వభావం తెలిసిరావడం ఒక ఆటంకం అయింది.

ఏదో సుడిఉండి, అదృష్టం కలిసివచ్చి హెడ్‌మాస్టర్ అయాను అనుకోక తనంత పండితుడూ, ప్రతిభావంతుడూ, పరిపాలనాదక్షుడూ, అపూర్వ అనుభవశాలీ మరెక్కడా లేనందువల్లనే తన కా పదవి లభించిందని అనుకోవడం, కమిటీవారు విశ్వప్రయత్నం చేసినమీదట తను ఆ పదవి స్వీకరించడం జరిగిందని అనడం, అందుకు అనుగుణంగా ప్రవర్తించడంతో వచ్చింది చిరాకు. ఒక వ్యక్తి మహా ప్రతిభాశాలి, అధిక వ్యుత్పన్నుడో అయితే ఆ ప్రతిభావ్యుత్పత్తులు విద్యాధ్యయనదశ లలో ఏదో ఒక దశలో, ఏదో ఒక సందర్భంలో వెల్లడిఅయి తీరతాయి. ఆ వ్యక్తి బి.ఏ. పరీక్షలో రాష్ట్రం అంతటిలో ప్రథముడుగా ఉత్తీర్ణుడు కావడమో, ఎమ్.ఎ. లో విశ్వవిద్యాలయం అంతటికీ ప్రప్రథముడుగా ఉత్తీర్ణుడు కావడమో జరుగుతుంది. మా హెడ్‌మాస్టరుగారి విషయంలో అటువంటిదేమీ జరగలేదు. పైపెచ్చు ఇంటర్, బి.ఏ. లు రెండింటిలో కూడా అయన మార్చి, సెప్టెంబరు, మార్చి, పరీక్షలకు హాజరై, తద్రూ పేణా విశ్వవిద్యాలయానికి విరాళం కొంచెం ఎక్కువగానే ముట్టజెప్పి ఉత్తీర్ణులయారు. విశ్వవిద్యాలయం వారు ఈ పరీక్షలు రహస్యంగా నిర్వ హించరు. కనుక, మాకందరికీ ఈ విషయాలు తెలిశాయి. అయినా మాకు హెడ్‌మాస్టరు కనుక మే మెవరమూ ఆ విషయాలు ప్రస్తా వన వచ్చినప్పుడు కూడా ఎత్తము. మరో విశేషం, ఆయన కూడా ఈ విషయాలు మాకు తెలియవన్నట్లుగానే ప్రవర్తిస్తారు.

ఆయన నాకంటే అయిదు సంవత్సరాలు పెద్ద. మా అన్నగారి కంటె మూడేండ్లు పెద్ద. మాఅన్నగారికీ, నాకూ రెండేండ్లు వార. ఆయన బి.ఏ. పరీక్షకు మా అన్నగారితోనూ హాజరయారు; నాతోనూ హాజరయారు.

మా హెడ్‌మాస్టరుగారు నాకంటె వాస్తవానికి అయిదు సంవత్సరాలు మాత్రమే పెద్ద అయినా, ఓ ఇరవై సంవత్సరాలు పెద్దఅయినట్లు ప్రవర్తించేవారు. అందుకు కూడా నేను ఆట్టే పట్టించుకొనేవాణ్ణి కాదు. ఆ పెద్దరికం ఎప్పుడూ ఆయనకే కట్టబెట్టేవాణ్ణి. ఉపాధ్యాయుల సమావేశాలలోనూ, ఇతర సందర్భాలలోనూ "మేము చదువుకొనే రోజుల్లో పాఠ్యగ్రంథాలు, పరీక్షలు మహాకఠినంగా ఉండేవి. ఆ ప్రమాణాలు ఇప్పుడు పడిపోయాయి'' అంటూ ఉపన్యాసాలు ఇచ్చినప్పుడు ఆయన వాక్చాతుర్యానికి అబ్బురపడ్డానేగాని మరో ప్రసక్తి తెచ్చేవాణ్ణి కాను. నాతో స్వయంగానూ ఆ మాట ఎన్నోసార్లు అన్నారు. అప్పుడు కూడా నేను మరోమాట అనలేదు. అటువంటి పెద్దరికం ప్రదర్శించడం కోసమనే ఆయన నన్ను అంతసేపు నిలబెట్టారు. "కూర్చోండి'' అంటే తమ పెద్దరికానికి ఏమి భంగం గలుగుతుందో అని ఆయన భయం.

కొన్ని నిముషాల తర్వాత ఇక లాభంలేదని నేనే "పిలిచిన పనేమిటో సెలవిచ్చారుకాదు'' అన్నాను.

అందుకాయన "మొన్న రావుగారూ, కృష్ణయ్యగారూ మా ఇంటికి వచ్చినప్పుడు మన సెక్రటరీగారి పెద్దబ్బాయి నా కేదో కబురు చెప్పడానికి వచ్చాడు'' అంటూ ప్రారంభించారు నెమ్మదిగా.

ఆయన ఏ విషయమైనా ప్రారంభించే పద్ధతే అది. ఎక్కడో మొదలుపెట్టి ఏమేమో చెబుతూ, స్వీయ వైభవం, తనకూ, కమిటీ పెద్దలకూ మధ్య నానాటికీ దృఢతరం అవుతున్న స్నేహసంబంధం మాటల

మధ్య వెల్లడిచేస్తూ. ఎప్పటికోగాని అసలు విషయానికి రారు. వారూ, వీరూ వస్తున్నారు; తమరు మా దర్శనానికి రావడం లేదేమని అలా పరోక్షంగా అడగడ మదీ అయాకగాని అసలు ప్రశ్న వెయ్యరు. నా కీ తంతు తెలుసు కనుక "నాకు మళ్ళీ మూడో గంట క్లాసు ఉన్నదండీ. విషయం చెప్పి పంపిస్తే కాసేపు విశ్రాంతి తీసుకుంటాను'' అన్నాను: అంటూ ప్రాధేయపడ్డాను. ఆ పూట నా అదృష్టం బాగుంది. ఆయన వెంటనే అన్నారు :

"అచ్చే. మరేమీ లేదండీ. మిమ్మల్ని అభినందిద్దామని పిలిచాను. గత ఆదివారం బహిరంగసభలో మీరు చాలా చక్కగా ప్రసంగించారటగా. తెలుగులోనేకాక, ఇంగ్లీషులోకూడా అనర్గళంగా మాట్లాడారని వా రంతా చెబితే నేను మొదట్లో నమ్మలేదు సుమండీ. మీకు నా హృదయ పూర్వక అభినందనలు.'' చివరి రెండు మక్కలు ఇంగ్లీషులో ఎంతో గంభీరంగా పలికారు.

"చాలా థాంక్స్."

అలా కృతజ్ఞత చెప్పుకొని "మరి సెలవు''అని నేను గుమ్మందాకా వచ్చాను. ఆయన చప్పున లేచివచ్చి నా భుజంపై ఎంతో ఆప్యాయంగా, తాతగారు మనుమణ్ణి తడుతున్నట్లుగా తట్టి "మీకు ఉజ్జ్వల భవిష్యత్తు ప్రాప్తించాలని నా కోరిక'' అన్నారు చిరునవ్వు నవ్వుతూ.

నా మొహం! ఉపాధ్యాయుడుగా ఉన్న నాకు ఉజ్జ్వల భవిష్యత్తు ఎక్కడుంది? ఆయన నా తరఫున ఊహించిన, ఆకాంక్షించిన ఉజ్జ్వల భవిష్యత్తు ఏమిటో నా కా క్షణంలో అర్థంకాలేదు.

నాకంటే వయస్సులో చాలా పెద్దవాడులా ప్రవర్తించడం అంటే ఇదే. అయినా పదవి రీత్యా పెద్ద కనుక, దీవించడం, మంచి కోరడం సహజంగానే ఉన్నాయనుకొని సరిపెట్టుకొని, మరోసారి కృతజ్ఞత తెలుపు

క్లావి _ నేను బయటకు రాబోతుంటే ఆయన హఠాత్తుగా స్వరం హెచ్చించి, "ఆరోజున మనం డి. ఇ. ఓ. గారికి ఇచ్చిన విందులో నన్ను గురించో, పోనీ మన స్కూలును గురించో రెండు మాటలు చెప్పమంటే భయమనీ, సభాకంపం ఉన్నదనీ అన్నారే" అని ఆగి, అసలు విషయం బయటపెట్టి "ఇంతకూ మీరు ఆ పార్టీలో చేరారన్న మాట?" అని ప్రశ్నించారు.

" నే నెందుకండీ ? కృష్ణయ్యగారూ, రావుగారూ ఉన్నారుగా. వారిని ఆదేశించక పొయ్యారా ?'' అనేసరికి ఆయన రుసరుస లాడుతూ "వాళ్లేం మాట్లాడుతారో నే నెరగనా ! అయినా వారి విషయం ఎందుకు ? మిమ్మల్నిగదా నేను అడిగింది. ఆనాడు మీరెందుకు మాట్లాడ లేదనికదా మిమ్మల్ని నే నిప్పుడు అడుగుతున్నది. దానికేమిటి మీ సమా ధానం ?'' అని రెట్టించి అడిగారు.

'అభిమానం చూపడానికి వారూ, పని చెయ్యడానికి మేమూనా ? మీ అభిమానులైతే బడికి గంటల తరబడి ఆలస్యంగా రావచ్చునా ? క్లాసు వదిలేసి సొంత పనుల మీద ఊరిమీద తిరగడానికి వారికి మీరు ప్రత్యేక అనుమతి ఇవ్వడమా ? బెంచీబిలు వెయ్యడం దగ్గరనుంచి అద్దమైన పనులకూ మేం కావాలా ? పోనీ ఈ పని కూడా మీ అభి మానులకే చెప్పక పోయారా ? స్తుతి ఫలం వారికే దక్కనీయక పోయారా ?' అని నాలుగూ అందామనిపించింది. ఆయనతో అటువంటి ప్రసంగం చెయ్యడం మంచిదికాదని, అది అధిక ప్రసంగం అవుతుందని గ్రహించి "అబ్బే, ఇటీవల అభ్యాసం చేస్తే సభాకంపం అదీ పోయిం దండీ, అందువల్ల అక్కడ మాట్లాడగలిగాను" అని మాత్రమే సమా ధానం చెప్పి "మీరు నన్ను పిల్చిన పని ఇంతేకదా. మరి సెలవు'' అని చెప్పి బయటకు వచ్చేశాను అయన నా వంక కొరకొర చూస్తున్నా లెక్కచెయ్యకుండా.

అప్పటి నుంచి ఆయనకు నా మీద కోపం ఎక్కువ అవుతూ వచ్చింది. ఆయనకు నా మీద ముందు నుంచీ కోపం ఉన్నది. దానికి కారణాలు కూడా నాకు తెలుసు. ముఖ్య కారణం నేను తన్ను ఆశ్రయించక పోవడం. ఈ రోజులలో ఆశ్రయించడం పెద్ద తప్పుకాదనీ. ఏంతో మంది ఏదో ఒక సందర్భంలో ఎవరినో ఒకరిని ఆశ్రయిస్తూనే ఉన్నారనీ నాకూ తెలుసు కాని అడ్డమైన ప్రతి చిన్న విషయానికీ కన్పించిన ప్రతి వాణ్ణీ ఆశ్రయించడమూ, ఇక వాణ్ణి ఇంతవాడివి, అంతవాడివి అని స్తుతించడమూ నాకు గిట్టదు. కాని మా హెడ్‌మాస్టరుగారికి అటువంటి వాళ్ళంటేనే ఇష్టం; ఆపేక్ష.

రోజూ స్తోత్రపాఠాలు వల్లించే అభిమానులు బడికి ఆలస్యంగా వచ్చినా ఫర్వాలేదు. వాళ్ళు బళ్లో పాఠాలు చెప్పకపోయినా, కోర్సు పూర్తి కాకపోయినా ఇబ్బందిలేదు. "చరిత్రేకదా. జాగ్రఫీయేకదా! పిల్లలు ఇంటి దగ్గరే చదువుకోవచ్చు. వాళ్లే చదువుకుంటారు" అంటారాయన. అదే మరొకరు చెప్పే విషయమైతే అది ఎంతోముఖ్యమనీ, ఆ పాఠం ఆ రోజే చెప్పాలనీ, పాఠాలన్నీ ఒక్కసారే చెప్పేస్తే పిల్లలకు మనసుకు ఎక్కదనీ, జీర్ణం కాదనీ, పైవాళ్ళ దృష్టిలోకి వెళితే బాగుండదనీ ఇలా ఎన్నో అంటారు. అదీ ఆయన వరస. ఇతరులు సెలవు పెడితే. అకారణంగా పెట్టారనీ, వారు సెలవు పెట్టినందు వల్ల బడిలో పని చెడిపోయిందనీ వ్యాఖ్యానం చేస్తారు. అదే తన అభిమానులయితే వారి పట్ల ఎంతో సానుభూతి ఒలకపోస్తారు. "పాపం కృష్ణయ్యగారు సెలవు పెట్టారు. పాపం, ఆయన భార్యకు బాగాలేదట. ఆయన డబ్బుకు ఇబ్బంది పడుతున్నారట!" అంటూ అడగని వాళ్ళకు కూడా చెబుతారు. తమతోపాటు మేమంతా కూడా సానుభూతి చూపాలని ఆశిస్తారు.

ఒకసారి ఒక మాస్టరుగారు సెలవుపెట్టారు. దానిమీద రాద్ధాంతం చేశారు. హెడ్‌మాస్టరుగారు. "సెలవుపెట్టడానికైనా అర్థం ఉండాలి.

పైగా ఒంట్లో బాగాలేదని అబద్ధం చెప్పడం దేనికి?" అంటూ శాస్త్రిగారితో వెటకారంగా మాటాడితే ఆయనకు చిరాకువేసి "మొన్నరావు గారూ. కృష్ణయ్యగారూ ఇద్దరూ కలసి ఒక్కసారే ఒంట్లో బాగాలేదని సెలవు కూడా పెట్టకుండా వెళ్ళిపొయ్యారే. వాళ్ళిద్దరి క్లాసులూ నన్ను చూడమని పురమాయించారు. మరిఅప్పుడు తమరేం వ్యాఖ్యానం వేయలేదేమండీ?" అని అడిగారు.

"అనవసరంగా వాళ్ళ ప్రస్తావన తెస్తా రెందుకండీ? ఇద్దరికీ ఒక్కసారి తలనొప్పి రాకూడదా. ఏమిటి? అడిగే వెళ్ళారు" అన్నారు హెడ్ మాస్టరు గారు. అందుకు శాస్త్రిగారు నవ్వుతూనే "మీరు ఉపాధ్యాయులను రెండు వర్గాల కింద విభజించి చూస్తున్నారు. తమ ఆశ్రితులు ఒకవర్గం, ఇతరులు మరొక వర్గం. విభజించి పాలించే తెల్లవాడి సూత్రం పాటిస్తున్నారు. అది ఎవరికీ మంచిది కాదు'' అన్నారు.

దానితో హెడ్‌మాస్టరుగారికి శాస్త్రిగారిమీద పట్టరాని ఆగ్రహం వచ్చింది. అప్పటి కప్పుడు ఏమీ అనలేదుగాని. ఆ రోజు నుంచి చీటికీ మాటికీ శాస్త్రిగారిని మందలించడం ప్రారంభించారు. శాస్త్రిగారు పాఠాలు సరిగా. శ్రద్ధగా చెప్పడంలేదనీ. 'నోట్స్ ఆఫ్ లెసన్సు' వ్రాయడంలేదనీ విమర్శించడం మొదలుపెట్టారు. శాస్త్రిగారు ఆయనకు సమాధానం చెప్ప లేదు. కాని హెడ్‌మాస్టరుగారి ధోరణి మాత్రం మారలేదు.

ఒకరోజున ఉపాధ్యాయుల సమావేశంలో హెడ్‌మాస్టర్‌గారు శాస్త్రిగారిని మనస్సులో పెట్టుకొని తెలుగుకు సంబంధించిన బోధనస్థాయి పడిపోయిందనీ. ముఖ్యంగా వ్యాకరణం సరిగా బోధించడం లేదనీ. పైపెచ్చు లోపభూయిష్ఠంగా ఉంటున్నదనీ అన్నారు. శాస్త్రిగారు ఉండబట్టలేక "సోదాహరణంగా వివరిస్తే సంతోషిస్తాము" అన్నారు.

హెడ్‌మాస్టరుగారు అలా తాము స్వయంగా వివరించవలసి వస్తుందని ముందుగా ఊహించలేదు. అందువల్లనే కొంచెం తికమకపడి

మళ్ళీ సర్దుకుని "వివరాలు ఎందుకులెండి. మిమ్మల్ని ప్రత్యేకించి ఉద్దేశించి నేనేమి అనలేదు. ఊరికే మాతృభాష బోధన స్థాయి పెరగాలని చెప్పడానికి ప్రస్తుత స్థితి వివరించాను" అని తప్పించుకోవడానికి ప్రయత్నిస్తే శాస్త్రిగారు ఆ ప్రయత్నం కొనసాగనీయలేదు.

"అయ్యా రంగారావుగారూ ! మీరు చెప్పుడు మాటలు విని తప్పుడు విమర్శకు దిగకండి. అది తర్వాత చూచుకొందాం అసలువిషయానికిరండి. వ్యాకరణ బోధన లోపభూయిష్టంగా ఉన్నదని అన్నారు. మేము ఏమిటి తప్పు చెప్పాము ? అందులో తమకు కన్పించే తప్పు నేను చేశానూ అంటే అది నిజంగా విచారించవలసిందే" అంటూ శాస్త్రిగారు నిగ్గదీశారు.

హెడ్‌మాస్టరుగారు సాధారణంగా అటువంటి సందర్భాలలో మంచి లౌక్యం ప్రదర్శించి తప్పుకొనేవారు. కాని ఆనాడు ఆయన లౌక్యం పని చెయ్యలేదు. ఎల్లాగయినా తనది పైచేయి అనిపించుకోవాలని శాస్త్రిగారితో వాదనకు దిగారు. తాను విన్న విషయాలు సొంతంగా ఆలోచించి చెబుతున్నట్లు నటిస్తూ, దాంతో పెద్ద రభస అయింది.

శాస్త్రిగారు అలంకారం వ్యాకరణాలలోనే కాక సాహిత్యంలో కూడా కూలంకషమైన పాండిత్యం సంపాదించిన వ్యక్తి. ఆంధ్ర సాహిత్యమే కాక, ఆంగ్ల సాహిత్యం కూడా మథించిన దిట్ట. దానికి తోడు ఆయన మంచి వక్త. కాని ఆయన సాధారణంగా వాదనకు దిగరు, దిగారా మరి వదలరు.

ఆనాడు సరిగ్గా అదే జరిగింది. చివరకు హెడ్మాస్టరుగారు తల వంచవలసి వచ్చింది. ఆయనే కాదు మేమంతా కూడానూ. ఆంధ్ర

సంస్కృత ఆంగ్ల వ్యాకరణ శాస్త్రాలను పోల్చి చెబుతూ శాస్త్రిగారు పాండిత్య వైభవం ప్రదర్శిస్తుంటే, మేమంతా వినయ వినమ్రులమైనాము.

శాస్త్రిగారు వాదన, ప్రసంగం ముగిస్తూ, "అయ్యా హెడ్‌మాస్టరు గారూ! ఇంకెప్పుడూ దయచేసి ఇలాంటి రిమార్కులు చెయ్యకండి. తెలియనప్పుడు గుంభనగా ఉండడం మంచిది" అన్నారు.

హెడ్‌మాస్టరుగారు ముఖాన గంటు పెట్టుకొని సమావేశం నుంచి వెళ్ళిపోయారు.

o o o

ఆనాటి నుంచి శాస్త్రిగారి మీద కక్ష సాధించడానికి హెడ్‌మాస్టరు గారు ఎన్నో ప్రయత్నాలు ప్రారంభించారు. తన అభిమానుల సంఖ్య పెంచడానికి కృషి చేశారు. ఆయన మీద కమిటీవారితో ఏవేవో పితూరీలు చెప్పారు. కార్యదర్శిగా ఉండి శాస్త్రిగారు నిర్వహిస్తున్న ఉపాధ్యాయ సహకార సంఘాన్ని గురించి, ఉపాధ్యాయ మహాసభలో ఆయన వహించిన పాత్రను గురించి విమర్శించడం, లేనిపోని అభాండాలు వెయ్యడం సాగించారు.

శాస్త్రిగారు ఇదేమీ పట్టించుకోలేదు. హెడ్‌మాస్టరుగారు అంటున్నమాటలు వినిపించినా, వినిపించనట్లు నటించి తగవురాకుండా తప్పించుకొని పోవడం చూచి మేమంతా ఆశ్చర్యపడ్డాము.

కాని శాస్త్రిగారు ఊరుకొన్నా, హెడ్‌మాస్టరుగారు మాత్రం ఊరుకోలేదు. ఒకసారి శాస్త్రిగారు పది నిమిషాలు ఆలస్యంగా వచ్చేసరికి నానా హడావిడీ చేసి ఉపాధ్యాయుల గది దగ్గరే కాపువేసి ఆయన వచ్చిరాగానే "ఏమండీ, శాస్త్రిగారూ, ఇంత ఆలస్యంగా వచ్చారూ? మీరు స్కూలు విషయం శ్రద్ధ వహించక సహకార సంఘం అంటూ అనవసరపు పనులన్నీ నెత్తిన వేసుకు తిరుగుతున్నారు. పోనీ, అదే

మీకు లాభదాయకంగా ఉంటే, ఇంక ఈ ఉద్యోగం ఎందుకండీ ?'' అన్నారు.

శాస్త్రిగారు నవ్వుతూ "మంచిమాట అన్నారు, మీనోటి వాక్యాన అది లాభదాయకమైతే ఈ ఉద్యోగం మానెయ్యవచ్చు" అని వెళ్ళిపోతుంటే హెడ్‌మాస్టరుగారు "ఏం గిట్టుబాటు కావడంలేదా ?" అన్నారు.

శాస్త్రిగారు అప్పటికీ నవ్వుతూనే "మరే'' అంటూ ముందుకు సాగారు.

"అదేమిటి అలా సెలవిస్తున్నారు ! దిట్టంగా సంపాదిస్తున్నారని విన్నానే?'' అంటూ హెడ్‌మాస్టరుగారు అభాండాలు వెయ్యడానికి సిద్ధపడే సరికి, శాస్త్రిగారు వెనుదిరిగి ఒక్క క్షణం ఆగి "మరీ కుర్రతనంగా మాటాడకండి. ఇదేం స్కూలు డబ్బుకాదు కాజేయడానికి అని నేనంటే మీరు బాధపడతారు. పిల్లి కళ్ళుమూసుకొని పాలుతాగుతూ, తన్నెవ్వరూ చూడలేదనుకొంటుందట. కాని అదే నయం. దానికి దొరికిన కాసిని పాలు తాగేసి చక్కాపోతుంది. ఇతరులెవ్వరో తాగేస్తున్నారని అభాండాలు వెయ్యదు. అయినా మీ విషయం నాకు అనవసరం. అడిగారు కనుక నా విషయం చెబుతాను. ఇది మంది సొమ్ము. నయాపైసల దగ్గరనుంచి సరయిన లెక్కచూపాలి. అన్నిటికీ మించి ఇది బీదవారైన తోటి ఉపాధ్యాయుల సొమ్ము. ఏదైనా పొరపాటు జరిగితే నలుగురూ నన్ను నిలవేస్తారు. అదలా ఉంచండి. నాకు నిజంగా వ్యాపారం చెయ్యాలనీ, బాగా డబ్బు గడించాలనీ ఉంటే సొంత వ్యాపారం పెట్టుకోగలను ఇంక ఈ వివరణ మానేస్తాను. అయినా చెప్పుడు మాటలు వినకండి స్వామీ అంటే వినరుకదా?'' అని ఆయన సమాధానం కోసం ఆగకుండా చెరచెరా తమ తరగతికి వెళ్ళిపోయారు.

శాస్త్రిగారు వెళ్ళిపోయాక హెడ్‌మాస్టర్‌గారు ఎన్నెన్నో అన్నారు. "గుమ్మడికాయల దొంగ అంటే బుజాలు తడుముకున్నాడట వెనకటి ఒక పెద్దమనిషి" అంటూ శాస్త్రిగారిని విమర్శిస్తూ పాత జోక్సు, విట్సు వేసి, నవ్వేవారు లేకపోయేసరికి తనే పెద్దగా నవ్వి ఒక సారి అందరివంకా చూచి నిరుత్సాహపడి వెళ్ళిపోయారు తమ గదికి.

ఇక ఆ క్షణం నుంచి ఆయనకు శాస్త్రిగారిమీద పగ ఏర్పడింది. పెట్టుతియ్యలేకపోయానే అని ఊరికే మథనపడడం ప్రారంభించారు. తన వర్గం మనుషులను తరుచు సమావేశపరిచి పగసాధించే మార్గాలు వివరించారు. కృష్ణయ్యగారూ, రావుగారూ ప్రోద్బలమానం ఆయనకు చెరో ప్రక్కనా చేరి మంట చల్లారకుండా అప్పుడో నాలుగు, అప్పుడో నాలుగు సమిధలు వేస్తూ వచ్చారు

హెడ్‌మాస్టర్‌గారు పాఠశాల నిర్వహణలో తనతో ఎవరూ సహ కరించడం లేదని అదే పనిగా సణగడం మొదలుపెట్టారు. ఆ మాటలే కృష్ణయ్యగారి నోటివెంటా, రావుగారి నోటివెంటా కొంచెం హెచ్చు స్వరంలో వినిపించసాగాయి. ఈ ఆర్భాటానికి కొంత కారణం లేక పోలేదు.

శాస్త్రిగారు పూర్వంనుంచీ పాఠశాల అభ్యున్నతి కోరి ఒకరు చెప్పినా, చెప్పకున్నా అనేకమైన పనులు చేసిపెట్టేవారు. మంచి మాటలు చెప్పి, మా అందరిచేత కూడా పనులు చేయించేవారు. టైమ్‌టేబిల్ వెయ్యడం, పరీక్ష పేపర్లు ఏయే తరగతికి ఎన్నికావాలో లెక్కకట్టడం, ఆఫీసు రికార్డులలో కూడికలు, తీసివేతలు సరిగా ఉన్నాయో లేదో చూడడం మొదలైన పనులు నేను చూచేవాణ్ణి. ఇంగ్లీషులో జరిగే ఉత్తర ప్రత్యుత్తరాలకు సంబంధించిన వ్యవహారమంతా రామారావు మాస్టర్‌గారు చూచేవారు. శాస్త్రిగారు పరీక్షలు నిర్వహించడానికి సంబంధించిన పను

లన్నీ స్వయంగా చూచేవారు పాఠశాల మొత్తంమీద ఎక్కడా ఎవ్వరూ కాపీ కొట్టకుండా కట్టుదిట్టం చేసేవారు. మామూలు స్కూలు పరీక్షలు కూడా ఒక యజ్ఞంలా నిర్వహించే వా రాయన. హెడ్‌మాస్టర్‌గారు "ఓ కే," "థాంక్స్" అంటూ ఉండడంతో సరిపోయేది.

అది పూర్వపు పరిస్థితి. అటువంటి స్థితి సాగనీయడంచేతనే శాస్త్రి గారికి పలుకుబడి పెరుగుతున్నదనీ, అందువల్లనే ఆయనకు "అహం కారం" వచ్చిందనీ హెడ్‌మాస్టర్‌గారు దురభిప్రాయపడ్డారు. అన్ని పనులూ తానే స్వయంగా నిర్వహించడానికి పూనుకొన్నారు. అందుకు కావలసిన సామర్థ్యం ఉంటే అంతా బాగానే ఉండేది. ఆయనలో లోపించిందల్లా అది ఒక్కటే. అసమర్థతను కప్పిపుచ్చుకోడానికి విసుగు, కోపం ప్రదర్శించడం. ఆ కారణంగా వారిమీదా, వీరిమీదా విరుచుకొని పడడం, పెద్ద బరువు భారంతో, బృహత్తరమైన బాధ్యతలతో సతమత మవుతున్నట్లు నటించడం, కొందరు తనతో సహకరించడంలేదని విమర్శించడం ఎక్కువ అయేసరికి మాకూ అసహ్యం వేసింది. 'తమతో సహకరించడమంటే తమవెంటపడి తిరుగుతూ చెప్పినా చెప్పకపోయినా, విసుక్కున్నా, కసురుకొన్నా తమరు చెయ్యవలసిన పనులన్నీ చేసి పెట్టడమేనా?' అని ఒకసారి అడిగివద్దామనిపించింది నా మట్టుకు నాకు.

o o o o

అర్థ సంవత్సరపు పరీక్షలు వచ్చాయి. మా మీద నమ్మకంలేక పరీక్షాపత్రాలన్నీ మా హెడ్‌మాస్టర్‌గారూ, కృష్ణయ్యగారూ, రావుగారూ కలిసి స్టెన్సిళ్ళమీద వ్రాసి, సైక్లోస్టైల్ చేయించడానికి పూనుకొన్నారు. ఈ పనికి కొంతమంది బడిపిల్లల సహాయం కోరారట హెడ్‌మాస్టర్ గారు. వాళ్ళు ముందుకు వచ్చేసరికి "కొంతమంది ఉపాధ్యాయులకంటే మీరేనయం" అని వాళ్ళను ఉబ్బేసి వాళ్ళచేత పని చేయించుకొన్నారట. అంతవరకు బాగానే ఉంది. అలాఅని మేముకూడా అనుకొన్నాము. కాని

తీరా పరీక్షలు ప్రారంభమైన నాడు ఊళ్లోనూ, పాఠశాలలోనూ, గోడల మీదా, నల్లబల్లలమీదా ఎక్కడచూస్తే అక్కడ పరీక్షాపత్రాలు ప్రత్యక్ష మయాయి. పైగా ఆ పత్రాలక్రింద వెంకట్రావుగారి సహాయంతో, కృష్ణయ్యగారి సహాయంతో అని సిరాతో వ్రాశారు.

హెడ్మాస్టర్‌గారు స్కూలంతా చిందులు తొక్కారు. వాళ్ళమీదా, వీళ్ళమీదా కేకలు వేశారు. కృష్ణయ్యగారినీ, వెంకటరావుగారినీ పిలిచి "మీరింత అసమర్థులని అనుకోలేదు" అంటూ తిట్టిపోశారు. వారిని వెంట పెట్టుకొని ఉపాధ్యాయుల గదికి వచ్చి నానా హంగామా చేశారు. పెద్ద అల్లరి అయిపోయింది. తమ ప్రతిష్ఠకు భంగకరమని ఆయినా అనుకో కుండా జరిగినదంతా రిపోర్టు చేస్తే సెక్రటరీగారు స్వయంగావచ్చి మా అందరిచేతా మళ్ళీ ప్రశ్నపత్రాలు వ్రాయించి,ప్రతులు తయారు చేయించి, పంపకం జరిపించి వెళ్ళారు.

వెళ్లేముందు ఆయన హెడ్‌మాస్టర్‌గారితో "మీరు పరీక్షలు కూడా నిర్వహించలేరా? ఈ భాగ్యానికి నన్ను పిలవకపోతే శాస్త్రిగారిని సాయం అడక్కపోయారా ?'' అన్నారు.

దానితో హెడ్‌మాస్టర్‌గారికి కోపం వచ్చింది. తనముందు శాస్త్రి గారిని ప్రశంసించేసరికి ఆయనకు ఉక్రోషంకూడా వచ్చింది. అది చెప్పి పుచ్చుకొని వెంటనే "ఆయన్నెలా పిలుస్తానండీ. ఈ అప్రతిష్ఠకు కారణం ఆయనేగా. ఏదోవిధంగా నన్ను అల్లరిపెట్టాలనే ఆయన ఈ పాడుపని చేశారు'' అన్నారు.

హెడ్‌మాస్టర్‌గారు ఆరోజు సాయంత్రం ప్రెసిడెంట్‌గారి ఇంటికి వెళ్ళి శాస్త్రిగారి మూలంగానే పరీక్షాపత్రాలు బయటపడ్డాయనీ, ఆయన మూలంగానే బళ్లో క్రమశిక్షణ నశించిపోతున్నదనీ ఫిర్యాదుచేశారు. ప్రెసిడెంటుగారు అంతా విని "బలమైన సాక్ష్యాధారాలు లేకుండా మీరిలా అనడం భావ్యంగా లేదు. మీరు వెళ్లిరండి'' అని సాగనంపారట.

హెడ్‌మాస్టర్‌గారికి ఆ మోతాదు చాలలేదు. పైపెచ్చు సాక్ష్యం సంపాదించి, శాస్త్రిగారిని దండిద్దాం అని ప్రెసిడెంటుగారు అన్నట్లు భావించుకొని, తనంతటతానే ప్రోత్సాహం కల్పించుకొని, తాను శాస్త్రిగారి మీద చేసిన ఆరోపణలకు సాక్ష్యాలు, ఆధారాలు కల్పించడానికి వెంటనే ప్రయత్నం ప్రారంభించారు. కక్ష సాధించడానికి అది మంచి అవకాశం అనుకొన్నారు.

ఆ ప్రయత్నం ఫలప్రదం కాకముందే ఆయన శాస్త్రిగారితో ముఖాముఖి యుద్ధానికి సిద్ధపడ్డారు.

ఉపాధ్యాయుల సమావేశంలో హెడ్‌మాస్టర్‌గారు ఏదో సాధారణ విషయం ప్రస్తావిస్తున్నట్లు మొదలుపెట్టి అంతలో దురుసుతనం ప్రదర్శిస్తూ "తప్పులు చెయ్యడం ఎవరికైనా సహజమే కాని, కనీసం బయట పడ్డాకయినా క్షమాపణ వేడుకోవడం ఉత్తముల లక్షణం" అన్నారు శాస్త్రిగారివంక తీక్ష్ణంగా చూస్తూ.

శాస్త్రిగారు మరోవైపు చూస్తూ ఉండిపోయేసరికి ఆయన "మీరేమంటారండీ, శాస్త్రిగారూ" అని రెట్టించి అడిగారు.

"ఇందులో నేనేమంటానండీ. అవును, కరెక్ట్ అంటాను" అన్నారు శాస్త్రిగారు.

హెడ్‌మాస్టర్‌గారు వెంటనే అందుకొని "అది మీ విషయమే అనుకోండి. అప్పుడేమంటారు?" అన్నారు.

"నా విషయమైనా అంతే, మరొకరి విషయమైనా అంతే" అని వెంటనే సమాధానం చెప్పారు శాస్త్రిగారు.

దారిలోకి వచ్చారనుకొంటూ హెడ్మాస్టరుగారు "అన్నంత తేలిక కాదండీ. శాస్త్రిగారూ! ఒకవేళ మీరే తప్పు చేశారనుకోండి. వెంటనే క్షమాపణ చెప్పుకోడానికి సిద్ధపడతారా?" అన్నారు.

"చెప్పాను కదండీ, రంగారావుగారూ ? అయినా ఎందుకీ ముసుగులో గుద్దులాట. అసలు విషయం చెప్పండి. నే నేమిటి తప్పుచేశాను ? అందరం ఇక్కడే ఉన్నాము కనుక, అదేదో ఇప్పుడే తేల్చుకోవచ్చు" అన్నారు శాస్త్రిగారు నిదానంగా.

హెడ్మాస్టర్‌గారు వెంటనే అందుకొని "అంత ఏమీ తెలియనట్లు మాటాడకండి. నామీద కోపం చొప్పున కుర్రముూకను దగ్గరకు చేర్చి పరీక్ష పేపర్లు అందరికీ చెబుతారా ? ఇది తప్పుకాదూ ? ఇందుకు మీరు క్షమాపణ చెప్పుకోనక్కర్లేదూ?'' అన్నారు.

శాస్త్రిగారు నెమ్మదిగాలేచి నిలబడి "అయ్యా, హెడ్మాస్టర్‌గారూ నాకీ లౌక్యాలూ, అవీ సరిగా అర్థంకావు. అంతకంటే ముఖ్యంగా పగ సాధించడం అంటే నాకు బొత్తిగా గిట్టదు. 'పగయడగించు టెంతయు శుభంబు' అన్నారు తిక్కనగారు. అది మంచి హితోక్తి. అందువల్ల పగ వద్దంటున్నాను. అది మన ఉభయులకూ శ్రేయస్కరం కాదు. మీరు తొందరపాటున పొరపాటు మాటలు మాటాడేస్తున్నారు. మీ పొరపాటు క్షమించదగిన వయస్సు నాకున్నది కనుక ఈ విషయం ఇంతటితో వదిలేస్తాను. ఒక్క షరతు. ఆధారరహితమూ, మీదుమిక్కిలి అన్యాయమూ అయిన మీ నిందారోపణ వెంటనే ఉపసంహరించుకోవాలి'' అన్నారు శాస్త్రిగారు గంభీరంగా.

హెడ్మాస్టర్‌గారు "ఏమండోయ్, ఏదో చమత్కార సంభాషణ ప్రారంభించారే! తప్పు చేశారుకదా, క్షమాపణ చెప్పుకొంటారా లేదా అని నే నడిగితే నే నేదో క్షమాభిక్ష వేడుకోవాలన్నట్లు మాటాడేస్తున్నారే?" అన్నారు విషపునవ్వు నవ్వుతూ – కోపంగా చూస్తూ.

శాస్త్రిగారు కండువా భుజంమీద వేసుకొని, గొంతు సవరించుకొని "ఇప్పుడర్థమైంది. ఏదో అన్యాపదేశంగా మాటాడుతున్నారని అను

కొన్నాను. సరే. అన్నదేదో అన్నారు. ఉపసంహరణ ప్రసక్తి లేదు కనుక రుజువు చెయ్యండి" అన్నారు.

హెడ్‌మాస్టర్‌గారు ఈసడింపుగా "ఏమిటండీ రుజువుచేసేది? ఇల్లాంటివాటికి రుజువు లేముంటాయి? అందుకేగా మీకీ దుర్బుద్ధిపుట్టింది? ఎంతవయస్సు వస్తేమాత్రం ఏంలాభం?'' అని ఇంకా ఏదో అనబోతుంటే శాస్త్రిగారు అడ్డువచ్చి "రంగారావుగారూ, ఒక్క మాట వినండి. ఇప్పటిదాకా మీ పదవిని గౌరవించి మీరన్నమాటలు పడ్డాను. రుజువు చెయ్యమనీ, రుజువు లేకుండా ఇలాంటి ఆరోపణలకు దిగవద్దనీ మనవి చేశాను. కాని మీ ధోరణి బాగా లేదు. ఏదో విధంగా కక్ష సాధిద్దామనీ, నన్ను వాగించాలనీ చూస్తున్నారు. ఇంక ఒక్కమాట సహించను. మీ మర్యాద మీరు కాపాడుకోండి'' అన్నారు.

హెడ్‌మాస్టర్‌గారికి పట్టరాని ఆగ్రహం వచ్చేసింది. వెనకా ముందూ చూచుకోక కోపంగా, పెద్దగా "షటప్'' అని అరిచారు.

శాస్త్రిగారు గబగబా ముందుకువెళ్ళి ఆయన ఎదుట నిలబడి "హెడ్మాస్టర్‌గారూ, కొంచెం మర్యాద నేర్చుకోండి మీరుగాని, నేనుగాని బజారు మనుష్యులం కాము. ఆ విషయం మరిచిపోకండి. 'షటప్' అంటే 'యూ షటప్' అనే ధైర్యం నాకు లేకకాదు ఊరుకొనేది. అది మన సంస్కారానికి అడ్డు వస్తుంది. దీనిమీద మాటలు పెంచను మీకో నమస్కారం. నేను వెళుతున్నా. మీరు కమిటీవారితోనూ, ప్రభుత్వం వారితోనూ చెప్పి, నా తప్పేదో రుజువు చేసుకొని, నామీద అవసరమైన చర్య తీసుకోండి" అని ఆయన చెరచెరా వెళ్ళిపోయారు.

o o o o o

సరిగా ఆ మరునాడే మా హెడ్‌మాస్టర్‌గారు ముందుగా ఎవ్వరికీ కాగితంమీద రిపోర్టు వ్రాసి పంపకుండానే, ఏ విషయమూ రుజువు చేయ

కుండానే స్కూలు సెక్రటరీ గారితో లాలూచీఅయి శాస్త్రిగారిని ఉద్యోగం నుంచి తీసివేస్తున్నట్లు 'ఆర్డరు' పుట్టించారు. మేమంతా భయభ్రాంతుల మయ్యాము.

కాని శాస్త్రిగారు మాత్రం తొణకలేదు. బెణకలేదు.

ఆయన మా అందరితోపాటు ఉపాధ్యాయుల గదిలో ఉండగా ఆ ఉత్తరువు పుచ్చుకొని బడినౌకరు వచ్చాడు. అది ఆయనకు స్వయంగా అందజేసి "తమరేదన్నా మాట్లాడవలసింది ఉంటే వచ్చి మాట్లాడమన్నా రండీ'' అని చెప్పి వెళ్ళాడు.

శాస్త్రిగారు ఉత్తరీయం భుజాన వేసుకొని, ఆ ఆర్డరు కాగితం చేతబుచ్చుకొని, ఒక్కమాటైనా అనకుండా ఇంటికి చక్కాపోయారు.

ఈ దౌర్జన్యాన్ని అరికట్టడం ఎలాగా అని మేమంతా ఎంతో మధనపడ్డాము. ఎంతో చర్చించాము. సాయంకాలం నలుగురమూ కలిసి సెక్రటరీగారి ఇంటికి వెళ్ళి, ఇది అన్యాయమనీ, శాస్త్రిగారి కీ విషయంలో ఎటువంటి ప్రమేయంలేదనీ, ఇది నియమ నిబంధనలకు విరుద్ధమనీ మనవి చేశాము.

"అవన్నీ హెడ్మాస్టర్‌గారు చూచుకొంటారు. నాకేం తెలియదు'' అన్నారాయన అక్కడనుంచి ప్రెసిడెంట్‌గారి ఇంటికి వెళ్ళాము కాని ఆయనకూడా చెప్పిందంతా విని "వాళ్ళుకూడా అన్ని విషయాలూ చెప్పి వెళ్ళారు. ఈ దశలో నేను ప్రమేయం పెట్టుకోవడం బాగుంటుందా ? అయినా మీరు ఇంతమంది వస్తున్నారు. అసలు మనిషి ఆ శాస్త్రిగారు ఎందుకు రారు ? పోనీ, ఆయనవస్తే ఆ హెడ్మాస్టర్ కుర్రాణ్ణి కూడా పిలిపించి ఏదో విధంగా రాజీ చేద్దునుగా'' అన్నారు.

ఆమాటమీద ఏదో ఆశ కలిగి శాస్త్రిగారి ఇంటికివెళ్ళి జరిగినదంతా ఆయనకు వివరించి చెప్పాము. చివరకు నేనే ధైర్యంచేసి "ఏమండీ,

శాస్త్రిగారూ! మీరూ, ప్రెసిడెంటుగారూ చిరకాల మిత్రులు. ఒకసారి వెళ్ళివస్తే...'' అని సూచించాను. శాస్త్రిగారు విని ఊరుకొన్నారు

చివరకు అది ఒక కేసు అయింది. డి.ఇ.ఒ. ఆఫీసునుంచి హెడ్ మాస్టర్‌గారికి సంజాయిషీ చెప్పుకోవలసిందిగా కోరుతూ పత్రాలు వచ్చాయి. హెడ్‌మాస్టర్‌గారు ఉన్నవీ, లేనివీ పది కల్పించి శాస్త్రిగారు ఉపాధ్యాయులు హెడ్మాస్టరుపై ఎదురు తిరిగేలా చేశారనీ, స్కూల్లో క్రమశిక్షణ లోపించడానికి ఆయనే ప్రధాన కారణమనీ, ఆయన పరీక్ష పత్రాలు బయటపెట్టి పాఠశాల ప్రతిష్ఠ పోగొట్టారనీ, అదేమని తాను అడిగితే ఉపాధ్యాయులందరి సమక్షంలోను తన్ను నానామాటలూ అని చాలా అవినయంగా, అమర్యాదగా, అసభ్యంగా ప్రవర్తించారనీ రిపోర్టు వ్రాశారు. రావుగారూ, కృష్ణయ్యగారూ అందుకు సాక్షి సంతకాలు చేశారు.

అటు తర్వాత శాస్త్రిగారు కోర్టుకు వెళ్ళక తప్పలేదు. నేను పట్నంవెళ్లి ప్లీడరుగారితో మాటాడి కేసు ఒప్పగించి వచ్చాను.

ఆ వచ్చిన క్షణంనుంచి హెడ్‌మాస్టర్‌గారు నామీద కారాలూ మిరియాలూ నూరడం ఎక్కువైంది. ఒకసారి ఆలస్యంగా వచ్చాననీ, మరోసారి ముందుగా వచ్చికూడా క్లాసుకు ఆలస్యంగా వెళ్ళాననీ, అవనీ, ఇవనీ సాధింపు మొదలుపెట్టారు. నాకు 'ఎట్రాన్స్‌పర్బ్స్' వెయ్యడం మరీ ఎక్కువైంది. కావాలని తన అభిమానులను అక్కడికీ ఇక్కడికీ పంపి, వాళ్ళ తరగతులకు నన్నుపంపడం, వాళ్ళు చెప్పే పాఠాలుకూడా నేను చెప్పాలని పట్టుపట్టడం మొదలుపెట్టారు.

హెడ్‌మాస్టర్‌గారు నన్నేకాదు, తనపక్షం వహించడంలేదని అనుమానం కలిగినవారిని అందరినీ ఇదేవిధంగా వేధించడం మొదలు పెట్టారు. శాస్త్రిగారి కేసుకు సంబంధించిన వ్రాతకోతలన్నీ రామారావు

పోయింది. మా బళ్ళో ప్రాథమిక తరగతులకు వెళ్ళే ఉపాధ్యాయులను ఆయన మరీ హడలగొట్టారు. వాళ్ళముందు 'వసారా ఉపన్యాసాలు' ఎక్కువయ్యాయి. దీనికితోడు ఆయన దన్ను చూచుకొని, ఆయన బల హీనత ఆసరా చేసుకొని రావుగారూ, కృష్ణయ్యగారూ విచ్చలవిడిగా మా మీదురేమిటి? అన్నట్లు ప్రవర్తించారు వారిద్దరూ క్లాసులకు వెళ్ళడమే మానివేశారు. ఎంతసేపూ హెడ్ మాస్టరుగారి గదిలో కూర్చుని ఆయన గారితో ఆ మాస్టరు ఇలా అన్నాడనీ, ఈ మాస్టారు అలా అన్నాడనీ పితూరీలు, ఎవరెవరో కుట్రలు పన్నుతున్నారనీ, ముందుగా కుట్రలు భగ్నం చేయాలనీ హెచ్చరికలు చెయ్యడం వారి పని అయిపోయింది.

అక్కడ వ్యవధి చాలక, వారు ఇద్దరూ హెడ్‌మాస్టర్‌గారి ఇంటికి వెళేవారు. పొద్దుట, సాయంత్రం బజార్లలో కూడా ఆయనవెంట వారిద్దరూ ఏదో గుసగుసలాడుతూ కన్పిస్తుండేవారు. వాళ్ళు చెప్పేవన్నీ నమ్మేవారు మా హెడ్‌మాస్టర్‌గారు. అలా నమ్మి, నన్ను కొన్నిసార్లు ప్రత్యేకంగా పిలిపించి "ఏదో కుట్ర జరుగుతున్నదటగా, నామీద ?" అని అడిగారు.

అలాంటప్పుడు నాకు నవ్వూ వచ్చేది, చిరాకూ పుట్టేది. అటువంటి దేమీ లేదని సర్ది చెప్పేసరికి నా తల ప్రాణం తోకకు వచ్చేది.

అలా ఆయన దగ్గరకు వెళ్ళిన ప్రతి సందర్భంలోనూ నేను ఆ అవకాశం వినియోగించుకొని శాస్త్రిగారి విషయం ప్రస్తావించి అది మంచి పని కాదనీ, ధర్మం కాదనీ, ఎంతటివారికైనా పట్టువిడుపులు ఉండాలనీ, తెగేదాకా లాగటం కనీసం లౌక్యం కాదనీ ఎన్నో విధాల మనవి చేశాను. కాని ఆయన వినలేదు.

క్రింద కోర్టులో ఆయనకు గెలుపు లభించేసరికి అంతిమవిజయమే లభించినంతగా పొంగిపోయారు. స్కూలులో సొంత ఖర్చుతో టీపార్టీ చేశారు. దానికి నేను హాజరుకానందుకు ఆ మరునాడు నామీద మండి పడ్డారు.

శాస్త్రిగారు కేసు హైకోర్టుకు తీసుకొని వెళ్ళారు. కేసు హైకోర్టుకు వెళ్ళడంతో కక్ష సాధిద్దామనుకొన్న హెడ్‌మాస్టర్‌గారికీ, ఏదో తన ఆశ్రితుడైన హెడ్‌మాస్టర్ పరువు కాపాడడానికి ప్రాకులాడుతున్న సెక్ర

టరీగారికీ, తమాషా చూద్దామనుకొంటూ వచ్చిన కొంతమంది స్కూలు కమిటీ మెంబర్లకూ గుండెల్లోరైళ్ళు పరుగెత్తాయి "క్రిందకోర్టులో అయితే వాళ్ళనూ, వీళ్ళనూ పట్టుకొని వ్యవహారంలో పై చెయ్యి అనిపించుకొని రాగలిగాము కాని, హైకోర్టులో నెగ్గడం ఎలా" అని వారంతా దిగులు పడ్డారు కూడా. దీనికితోడు ఈ కోర్టు తగాదాకు అయ్యే ఖర్చు స్కూలు శాశ్వత నిధులనుంచి భరించడానికి వీల్లేదని ప్రెసిడెంటుగారు ఆంక్ష పెట్టే సరికి, వారంతా మరీ ఇరకాటంలో పడ్డారు. ఆయన ఇంకోమాట కూడా అన్నారు: "శాస్త్రిగారి డబ్బు ఖర్చు అవుతున్నదంటే నాకు మనస్సులో కష్టంగా ఉన్నది. అది వేరే విషయం. ఆ డబ్బు వ్యక్తిది. కాని ఇది మందిది. ఊళ్లో పిల్లలకు విద్యాసౌకర్యం కల్పించడానికి కష్టపడి ఈ సొమ్ము పోగుచేశాము కాని, హైకోర్టులో వ్యాజ్యాలాడడానికి కాదు."

పాఠశాల తరఫున వాదించడానికి, కేసు నడపడానికి హైకోర్టు లాయరుకు పెద్ద మొత్తం ఫీజు ఇవ్వవలసి వచ్చింది హెడ్మాస్టర్‌గారు చిక్కుసమస్యే ఎదుర్కోవలసి వచ్చింది అందులోనూ ఒంటరిగా.

ఆయన ఒక పథకం వేశారు. సైన్సు మాస్టరుగారు సెలవుమీద ఉండటం ఆ పథకం వెంటనే అమలు జరపడానికి మరింత అనుకూలించింది. పాఠశాల ప్రయోగశాలలో వాడుకనిమిత్తం ఒక్కసారే రెండు సూక్ష్మదర్శినులు, బడిపిల్లలకు వినోదం కల్పించేందుకు ఒక మంచి రేడియో కొన్నామన్నారు. వాటి తాలూకు రశీదులు మాత్రం రైటరుగారు మా అందరికీ చూపించారు అకారణంగా. రెండోవారంలో అవి మూడూ పోయాయన్నారు. ఎవరో దొంగలు ఎత్తుకుపోయారంటే అంత రభస కాకపోను. ప్రయోగశాల నౌకరుమీద ఆ నేరం మోపి, అతన్ని పిలిపించి హెడ్‌మాస్టర్‌గారు గుడ్లెర్రజేసి, తిట్టి ఉద్యోగంనుంచి తీసివేస్తానని బెదిరించి తనే వెళ్ళి రిపోర్టు ఇచ్చి రావడంతో గొడవ జరిగింది.

హెడ్‌మాస్టరుగారు కనీసం కృష్ణయ్యగారినీ, రావుగారినీ కలుపుకోవలసింది ఈ వ్యవహారంలో. ప్రెసిడెంటుగారు వారి నిద్దరినీ విడివిడిగా పిలిచి అడిగితే తా మా వస్తువులు బళ్ళో ఎక్కడా చూడనేలేదని చెప్పి వచ్చారు. దానితో అసలు సంగతి బయటకు వచ్చింది. ఆ వస్తువులు కొన్నట్లు దొంగరశీదులు పుట్టించి, ఆ డబ్బు ప్లీడరుకు ఇచ్చి వచ్చి అవి

పోయాయనీ, నౌకరు కాజేశాడనీ హెడ్మాస్టరుగారు అంటున్నారని అంద రికీ అనుమానం కలిగింది.

ప్రెసిడెంటుగారు నన్ను పిలిపించారు. నేను వెళ్ళాను ఆ వెళ్ళడం మా హెడ్‌మాస్టరుగారు చూచారు. "నిజానిజాలు నాకు తెలియవు. మీరు స్వయంగా విచారించండి" అని, ప్రెసిడెంటుగారి దగ్గరనుంచి వెంటనే బయటపడగలిగాను కాని, మా హెడ్‌మాస్టరుగారి వద్దనుంచి మాత్రం అంత సులభంగా బయటపడలేకపోయాను.

నేను అక్కడినుంచి వచ్చి రాగానే నన్ను మా హెడ్‌మాస్టరుగారు తన గదికి పిలిపించడం. "ప్రెసిడెంటుగారు తమర్నేమడిగారండీ? తమ రేం చెప్పారండీ?" అంటూ గుచ్చిగుచ్చి ప్రశ్నించడం జరిగింది. నేను జరిగింది చెప్పాను. ఆయనతో అన్న ఆ రెండుమాటలూ ఈయనకూ చెప్పాను.

"నిజానిజాలు నాకు తెలియవని వచ్చేస్తారా? ఇదేనా మీరు నా ఎడల చూపవలసిన మర్యాదా, కృతజ్ఞతానూ? అవకాశం వచ్చినప్పుడు ఆయనకు మీనాద కలిగిన అనుమానం పోగొట్టడానికి మీరు శాయశక్తులా ప్రయత్నించవద్దూ? ఇదేనా మీరు చేసే ఉపకారం?'' అంటూ నామీద కోపం ప్రదర్శించడం ప్రారంభించారు.

ఒకసారి ఆయనవంక చూచాను. ఆయన నిజంగానే కోపంతో వణికిపోతున్నారు. ఆయన ధోరణి, ఆయన వాలకం చూస్తే నాకు అస హ్యమూ వేసింది, జాలీ కలిగింది. ఆ కోపం, ఆ వణకడం అదీ ఒక విధమైన దౌర్బల్యమని నా విశ్వాసం. అందుకే నాకు జాలి కలిగింది.

వాస్తవానికి ఆయనమీద కక్ష సాధించడానికి నాకది మంచి అవ కాశం. ప్రెసిడెంటుగారితో బళ్లో అందరూ అనుకొంటున్న మాటలు చెప్పి ఆయన అనుమానం ధృవపరచడానికి గొప్ప అవకాశమే లభించింది. కాని అది పద్ధతికాదనీ, శాస్త్రిగారు అనుక్షణం బోధించే పగసాధించడం మంచిదికాదన్న సిద్ధాంతం అసలు జరపాలనీ అనుకోవడంచేత అటు వంటి ఉద్దేశాన్ని మనస్సులోకి రానివ్వలేదు. అయినా మా హెడ్‌మాస్టరు గారికి నాయందు సదభిప్రాయం కలగలేదు.

"మీ రెందుకో అకారణంగా కోపగించుకొంటున్నారు. ఆ గొడ వేదో మీరూ, మీరూ చూచుకోండి" అని నేను లేచి వెళ్ళబోతుంటే ఆయన పెద్దగా "మాటిమాటికి ఇదొకటి నేర్చుకొన్నారు—మాటమధ్యలో లేచిపోవడం. భయం, భక్తీ ఉన్నవాళ్ళెవరూ ఇలా చెయ్యరు. మొదటి నుంచీ మీ ప్రవర్తన ఇలాగే ఉన్నది. మేము ఉద్యోగంనుంచి బర్తరఫ్ చేసిన శాస్త్రిగారిని వెనకేసుకొస్తూ ధర్మపన్నాలు చదివారు. నాకు వ్యతిరేకంగా పనిచేస్తున్న ఉపాధ్యాయ సంఘానికి కార్యదర్శి అయ్యారు. ఇవ్వాళ ఆయన పిలిస్తే వెళ్ళి, నామీద మరింత అనుమానం కలిగేలా మాట్లాడి వచ్చారు. అదేమండీ అంటే చప్పుడుకాకుండా జారుకొంటున్నారు. ఇదేమన్నా పెద్దమనిషి తరహాగా ఉన్నదా అంటాను. నిజానిజాలు తెలియవంటే అర్థం ఏమిటి? అసలు మీరు నాతో సంప్రదించకుండా, నా అనుమతి లేకుండా ఇక్కడ పని వదిలిపెట్టి ఆయనగారి దగ్గరకు ఎలా వెళ్ళారు? మీ కసలు సెన్సు ఉన్నదా" అంటూ రెచ్చిపోయి అసభ్యంగా సందర్భా సందర్భాలులేకుండా కేకలు వెయ్యటం, మాటలు తూలడం మొదలుపెట్టారు.

ఆయన కుసంస్కారం చూచేసరికి నాకు నవ్వువచ్చింది. ఆశ్చర్యం వేసింది ఎవరో విద్యాగంధం లేనివాళ్ళు అలా ప్రవర్తించడం చూచాను. అటువంటి సందర్భాలను గురించి విన్నాను. కాని బాధ్యత, గౌరవం కల పదవిలో ఉన్న మనిషి, అందులో ఉపాధ్యాయుడు, మీదుమిక్కిలి ప్రధానోపాధ్యాయుడు ఇలా ప్రవర్తించడం ఎంతో ఎబ్బెట్టుగా కనిపించింది. ఏహ్య మనిపించింది కూడానూ.

ఆ మనిషికి సమాధానం చెప్పడం నా గౌరవానికి, సంస్కారానికి భంగకరమనిపించి, వెంటనే లేచి "నమస్కారమండీ. మీ ప్రవర్తన, మీ ఎతులు, మీ మాటలు నాకు అర్థం కావడంలేదు" అని బయటకు దారి తీశాను.

అంతలో మా హెడ్‌మాస్టరుగాలు చాలా విచిత్రమైన పని చేశారు. గబ గబా నాకంటె ముందు నడిచి గుమ్మందాకా వచ్చి పెద్దగా "ఏమిటీ, నన్ను రాస్కెల్, ఫూల్ అంటారా? అని, దొంగలా దాటుకోవాలని

చూస్తున్నారా? అరే ప్యూన్, మిస్టర్ రైటర్! ఈయన్ను బయటకు గెంటండి'' అని కేకలు పెట్టాడు.

అంత హఠాత్తుగా ప్లేటు మార్చి నాటకం ఆడేసరికి, నేను నిర్ఘాంత పోయాను. ఉన్నవాణ్ణి ఉన్నట్టు నిలువునా స్తంభించిపోయాను మరో నిమిషం తర్వాత కాబోలు బయటవున్న నౌకరూ, రైటరుగారూ అక్కడకు రావడం, వాళ్ళతో హెడ్‌మాస్టరుగారు అంతకుముందు నన్ను అన్నమాటలు మళ్ళీ అని నన్ను బయటకు గెంటమని ఆజ్ఞాపించడం జరిగాయి మాటలు వినిపిస్తూనే ఉన్నాయి కాని, ఏమిటో అర్థం కాలేదు. కళ్ళు తిరుగుతున్నట్లు అనిపించింది. రైటరుగారు నన్ను నెమ్మదిగా ఉపాధ్యాయుల గదికి చేర్చి మిగతా ఉపాధ్యాయులతో అన్ని విషయాలూ చెప్పివెళ్ళారు.

కుర్చీలో కూర్చుని బల్లమీద తల ఆనించి అర్ధగంటసేపు విశ్రాంతి తీసుకొంటేనే కాని, మిత్రులైన కొంతమంది ఉపాధ్యాయులు ఉపచారాలు చేస్తేనేకాని నాకు తెలివి రాలేదు.

తెలివి వచ్చాక జరిగినదంతా అందరికీ చెప్పాను. అది విని వారంతా అప్పటి కప్పుడు సెక్రటరీగారితోనూ, ప్రెసిడెంటుగారితోనూ చెప్పివద్దాం, పదమన్నారు. "ఇంత దౌర్జన్యం ఎక్కడా వినలేదు. ఇవ్వాళ మీ కయింది, రేపు మా కవుతుంది. ఊరుకోడానికి వీల్లేదు పదండి'' అని నన్ను బలవంతపెట్టారు. కాని స్కూలు వదిలిపెట్టేదాకా అక్కడే ఉండి, తరువాత సరాసరి ఇంటికి వెళ్ళాను.

కాస్త పెందరాళే నిద్రపోదామనుకొని అందుకు ఉపక్రమిస్తూ ఉండగా శాస్త్రిగారు వచ్చారు. వస్తూనే "ఏమయ్యా, ఇంత పని జరిగితే ఆయనే వెళ్లి రిపోర్టు ఇచ్చేదాకా వేచిఉన్నావా? మరీ ఇంత అయోమయం అయితే ఎల్లా? ఇదంతా లౌక్యం అనుకొంటున్నాడాయన. ఇది లౌక్యం కాదు. పచ్చి రౌడీతనం. దౌర్జన్యానికి దిగాడాయన. ఈ రౌడీతనం ఇవ్వాళ నీముందు ప్రదర్శించాడు. రేపు అందరితోనూ ఇల్లాగే చేస్తాడు. దౌర్జన్యం అరికట్టవలసిందే. పోదాం పదండి. ప్రెసిడెంటుగారింటికి. నేనూ వస్తాను'' అన్నారు. "వద్దులెండి. ఆయనగారు ఏం చేస్తారో చూద్దామని వుంది'' అంటే "వెధవ ఉద్యోగంకోసం కాదయ్యా ఉపా

ధ్యాయుల మర్యాదా, గౌరవమూ కాపాడడంకోసం మనం ఆయనగారి దౌర్జన్యం అరికట్టాలి. ముందు నడవండి'' అంటూ నన్ను బలవంతాన ప్రెసిడెంటుగారి ఇంటికి తీసుకొని వెళ్ళారు.

మేము ఆయనతో అన్ని విషయాలూ వివరంగా మాటాడి ఇంటికి వచ్చేసరికి చాలా పొద్దుపోయింది.

○ ○ ○ ○ ○

ఆ మరునాడు బడికి వెళ్ళి వెళ్ళగానే హెడ్‌మాస్టరుగారు పంపిన కాగితం అందింది. క్రితంరోజు నా ప్రవర్తన బాగాలేదనీ, వెంటనే వచ్చి లిఖితంగా క్షమాపణ అందచేసుకోకపోతే పై అధికారులకు రిపోర్టు చెయ్యడం, నామీద క్రమశిక్షణ చర్య తీసుకోవడం జరుగుతాయనీ వ్రాశారు అందులో. రావుగారూ, కృష్ణయ్యగారూ ఎంతో భయపడు తున్నట్లు నటిస్తూ, నా దగ్గరకు వచ్చి "ఈ విషయంలో మా మాట వినండి. ఆయన కోపంగా ఉన్నారు వెళ్ళి ఓ ముక్క అనేసి రండి. మీ మంచి కోరే చెబుతున్నాము'' అన్నారు.

నాకు నవ్వు వచ్చింది. ఎంత పెద్ద ఎత్తు వేశారా అనిపించింది. మిగతా ఉపాధ్యాయులంతా "ఇది కేవలం అన్యాయం. ఇంత దౌర్జన్యానికి పూనుకొంటారని మేం కలలో ఊహించలేదు. ఇంక మే మెవరమైనా కానీ, ఆయన గదిలోకి ఒంటరిగా వెళ్ళగలమా ?'' అన్నారు. ఎంతో మథనపడ్డారు వారంతా, ఏమి చెయ్యడానికీ తోచక.

సాయంకాలందాకా నేను ఆయనకు సమాధానం వ్రాసిపంపలేదు. ఆ రోజుకు పని పూర్తి అయినతర్వాత వెళ్ళబోతూ ఇందులో నేను చెప్ప దగిన సంజాయిషీ ఏమీలేదనీ, కపట నాటకం ఆడి నన్ను చకితుణ్ణి చేసి నందుకు అభినందిస్తున్నాననీ వ్రాసి ఆ కాగితం నౌకరుకు ఇచ్చి ఇంటికి వెళ్ళిపోయాను.

మర్నాడు నేను క్లాసుకు వెళుతుంటే ఉపాధ్యాయుల గది గుమ్మం దగ్గరే అటకాయించి మా హెడ్‌మాస్టర్‌గారు చేసిన ఆగం ఇంతా అంతా కాదు. "మీకు మర్యాద ఉన్నదా? నేను ఏదో పోనీలే పాపం. తోటి మాస్టర్‌అని క్షమాపణ చెప్పుకోడానికి అవకాశం ఇస్తుంటే, ఇదా మీరు చెప్పే సమాధానం.'' అంటూ బొబ్బలుపెట్టారు.

ఏదో విధంగా భయపెట్టి నన్ను లొంగదీయాలని ఆయన విశ్వ ప్రయత్నం చేశారు. ఎన్నెన్నో అసందర్భపు మాటలు అన్నారు. మధ్యలో శాస్త్రిగారి ప్రస్తావన తెచ్చి ఆయనకు పట్టినగతే నాకూ పడు తుందని బెదిరించారు. నాకు నిజంగా పట్టరాని అసహ్యం కలిగింది. కోపం వచ్చింది. ఆయన నోటికి తాళం వెయ్యడానికి ఏదో ఒకటి అందామని గట్టిగా అనిపించింది. ఇదంతా కేవలం నన్ను రెచ్చగొట్టడానికే చేస్తున్నా డనీ. అందుకే ఆయన ఇంత నీచానికి దిగారనీ. ఆయన మాటలకు నేనూ రెచ్చిపోయి ఆయనలాగే ప్రవర్తిస్తే ఇద్దరం సమానం అవుతామనీ నాకు స్ఫురణకు రావడంచేత అసహ్యం, కోపం అణుచుకొన్నాను. కొంతసేపు అరిచి ఆయనే వెళ్ళిపోయారు. మధ్యాహ్నం మూడింటికల్లా నన్ను సస్పెండుచేస్తూ ఆర్డరు పుట్టించుకొని వస్తానని బెదిరించి మరీ వెళ్ళారు.

అందరూ నిజంగానే భయపడ్డారు. నాకూ మనస్సులో కొంత భయం కలిగింది 'పాముతో పనికదా' అనీ. ఏమి జరిగినా ఆశ్చర్య పడనక్కర్లేదనీ అనుకొన్నాను.

o o o o o

సాయంత్రం చివరిగంట అయాక మేమందరం ఉపాధ్యాయుల గదికి వస్తున్నాము. ఇంతలో మా హెడ్‌మాస్టరుగారి గదిముందుకు ఓచిన్న కారు వచ్చి ఆగింది. కారులోనుంచి ముందు ప్రెసిడెంటుగారు, తర్వాత సెక్రటరీగారు, ఆయన వెనక కాశ్మీరు శాలువ కప్పుకొని శాస్త్రిగారు దిగారు.

ఏమా ఇది అని మేమంతా అక్కడికి వెళ్ళాము.

ప్రెసిడెంటుగారు నిజంగా గొప్ప లౌక్యు లనిపించుకొన్నారు ఉపా ధ్యాయులందరినీ అక్కడికక్కడ వెంటనే సమావేశపరిచి ఆ సమా వేశంలో క్రమశిక్షణ, పాఠశాల అభివృద్ధి వంటి సాధారణ విషయాల గురించి రెండు మాటలు చెప్పి, ఏదో ప్రసంగవశాత్తు చెబుతున్నట్లుగా "శాస్త్రిగారు హైకోర్టులో నెగ్గారు రేపటినుంచే స్కూల్లో చేర్చుకోమనీ, గత సంవత్సరం జీతం లెక్కకట్టి ఇమ్మనీ కోర్టువారు ఉత్తరువులు జారీ చేశారు. ప్రభుత్వం కూడా హైకోర్టు ఆజ్ఞను గౌరవించి తదను గుణంగా నడుచుకోవలసిందే" అని అసలు విషయం చెప్పి హెడ్‌మాస్టర్

గారిని దగ్గరకు పిలిచి శాస్త్రిగారితో కరచాలనం చేయించి "ఇంక మీరు మిత్రులు కండి.' అని క్షణం ఆగి, హెడ్‌మాస్టర్‌గారితో ప్రత్యేకంగా "శాస్త్రిగారు కోర్టుకువెళ్లి గెల్చాలని కక్ష పెట్టుకోకండి. ఆయన వ్యాజ్యం ఆడింది నామీద. ఈ స్కూలు స్థాపించడానికి మొదట నడుంకట్టింది మేం ఇద్దరమే. ఆ విషయాలు మా తరంవారికి తెలుసు. మొదట్లోనే నేను కల్పించుకొని సరకపోవడం నాదే పొరపాటు. నా పొరపాటుకు నేను విచారిస్తున్నాను'' అన్నారు.

మేమంతా సంతోషం పట్టలేకపోయాము.

ఆయన విశాల హృదయం కలవారని అప్పుడు మాకు స్పష్టమైంది ఆ వ్యవహారానికి సంబంధించిన ఇతర లాంఛనాలు పూర్తి అయాక, ఆయన నన్నూ, హెడ్‌మాస్టరుగారినీ, సెక్రటరీగారినీ ప్రక్క గదిలోకి తీసుకొనివెళ్ళి నాముందే హెడ్‌మాస్టర్‌గారిని మందలిస్తూ "ఇదేమీ బాగాలేదు మిస్టర్ రంగారావ్. సెక్రటరీగారు ఈ విషయం కూడా నమ్మేవారే కాని మీరు సాక్ష్యం పెట్టుకొందా మనుకొన్న రైటర్ గారూ, నౌకరూ—వాళ్ళే అసలుసంగతి బయటపెట్టారు ఇలాంటి పిచ్చి వేషాలు వెయ్యకండి. చేతిలో కాస్త అధికారం ఉన్నదికదా అని మరీ అంత పెచ్చు మీరిపోతే...'' అని హెడ్‌మాస్టర్‌గారు వ్రాసి పంపిన రిపోర్టు చింపివేస్తూ—"సరే, దీనికేం కానీండి. మరోసంగతి కూడా బయటపడది. దొంగ రసీదులు పుట్టించి నోరులేని బంట్రోతుమీద దొంగతనం ఆరోపించి తప్పుకొంటారా? నేనూ, సెక్రటరీగారూ అన్నీ విచారించాము. ఇంక అవన్నీ ఎందుకు? మీకు వారం రోజులు గడువు ఇస్తున్నా. అవి తెచ్చి వాటి స్థానంలో ఉంచండి'' అని హఠాత్తుగా మాటాడడం మానివేసి, కోపంగా వెళ్ళిపోయారు ఆయన సెక్రటరీగారిని చెయ్యి పుచ్చుకొని వెంట తీసుకొని వెళ్ళారు.

o o o o o

హెడ్‌మాస్టరుగారూ, రావుగారూ, కృష్ణయ్యగారూ, ముగ్గురూ కలిసి ఒకరోజు రోజంతా ఆలోచించారు. రావుగారూ, కృష్ణయ్యగారూ అంత డబ్బు తమ దగ్గర లేదన్నారు హెడ్‌మాస్టర్‌గారు డబ్బు లభించే ఉపాయం కనిపించక, మార్గం తోచక చాలా తికమకపడ్డారు. వారినీ,

వీరినీ తమ అభిమానులందరినీ అడిగిచూచారు. ఒక స్థితిలో రావుగారి ద్వారా నన్ను అడిగించారు అంతా కాకపోయినా కొంత ఇవ్వగలిగిన స్థితిలో ఉన్నా, ఇటువంటి మనిషికా ధనసహాయం చెయ్యడం! అనుకొని ఊరుకొన్నాను. 'అయినా పిలిచి అడిగినప్పుడు చూద్దాంలే' అని కూడా అనుకొన్నాను. హెడ్‌మాస్టరుగారి తరఫున రావుగారు నన్ను డబ్బు అడిగి వెళ్ళడం చూచి మిగతా ఉపాధ్యాయులంతా "మీ రేమైనాసరే ఊరికే ఇవ్వకండి. కనీసం మనిషికి పశ్చాత్తాపం కలిగితేకాని, మనం ఎవ్వరం ఏ విధమైన సహాయం చెయ్యకూడదు" అన్నారు.

మరునాడు బడికి వచ్చేసరికి సరికొత్త విషయం తెలిసింది. శాస్త్రిగారు నోటు వ్రాయించుకొని క్రితం రాత్రి—రాత్రికి రాత్రి—అంత డబ్బూ—వెయ్యి రూపాయలు హెడ్‌మాస్టరుగారికి ఇచ్చేశారనీ. ఆయన ఆ డబ్బు పుచ్చుకొని పట్నం వెళ్లారనీ తెలిసేసరికి నాకు శాస్త్రిగారిమీద నిజంగా కోపమే వచ్చింది.

శాస్త్రిగారు ఎందుకిలా చేశారా అని మిగతా ఉపాధ్యాయులంతా ఆశ్చర్యపడ్డారు.

శాస్త్రిగారు ఎప్పుడు వస్తారా, ఎప్పుడు నాలుగూ అడుగుదామా? అని ఎదురు చూచాను. ఆయన ఉపాధ్యాయుల గదిలో అడుగుపెట్టగానే నాకంటే ముందుగా ఇతర ఉపాధ్యాయులంతా "ఏమండీ, ఇలా చేశారేం?" అని అడిగారు. నేనింకా ఎన్నో అడుగుదామనుకొంటున్నాను. కాని శాస్త్రిగారు చాలా గంభీరంగా "అది పద్ధతి" అని ఒక క్షణం ఊరుకొని, నే నేదో గునుస్తుంటే ఆప్యాయంగా నా భుజంమీద చెయ్యివేసి "పాముకు పాలు పొయ్యడం తప్పే. కాని అదే మన దేశాచారం. సమయం వచ్చినప్పుడు మన సంస్కారం ఏమిటో రుజువు చేసుకోవాలి. కాని, కక్ష కట్టకూడదు. అదీకాక ఆయనగారి ఆట కట్టిందికదా? ఇంక పాతవన్నీ మరిచిపోదాము. పైగా ఆయనా చిన్నవాడు, పిల్లలు కలవాడు. పొట్టమీద తగిలే ప్రమాదం వచ్చినప్పుడు మనం కాకపోతే మరెవ్వరు ఆదుకొంటారు" అని వివరించేసరికి నేను మరోమాట అనలేకపోయాను. శాస్త్రిగారు నెమ్మదిగా చుట్ట నోట్లో పెట్టుకొని అంచులు కొరుకుతూ "పగ యడగించు టెంతయు శుభంబు" అన్నారు.

ప్రతిఫలం

రామారావు ఉద్యోగరీత్యా బదిలీమీద వెంకటాపురం వెళ్ళవలసివచ్చింది. అది బొత్తిగా కుగ్రామమని తెలిసింది. అందువల్లనే అతను ముందు తను ఒక్కడే పోయి, కొంపా గోడూ కుదిరాక వీలునుబట్టి భార్యాపిల్లలను తీసుకొనివెళ్ళడం మంచిదని అనుకొన్నాడు. అలా ఒక నిర్ణయానికి వచ్చినప్పటినుంచీ అక్కడ తాను ఒంటరిగా గడపడం ఎలాగా అన్న దిగులు పట్టుకొన్నది అతనికి.

సన్నగా, నాజూకుగా కన్పించినా రామారావు మంచి సత్తువకల మనిషే. పైకి కొంచెం మెతగ్గా, అమాయకంగా కన్పించినా అధైర్యపడే మనిషికాదు; వ్యవహారదక్షత లేని వాడు కాదు. కొంచెం ముందుచూపు కలవాడే. అందువల్లనే అతను అరణ్య మధ్యములో ఉన్నదా అనిపించే ఆ గ్రామానికి వెంటనే బయలుదేరి వెళ్ళాడు.

వెంకటాపురం చేరుకొన్న కొద్దిసేపటికే రామారావుకు అక్కడి పరిస్థితులు అర్థం అయాయి. ఆ ఊళ్ళో అద్దెకు ఇచ్చేపాటి పెద్ద ఇల్లే లేదు ఉన్నవన్నీ చిన్న ఇళ్ళు. వాటిలో ఎక్కువ పాకలు; పది పన్నెండు పెంకుటిళ్ళు; నాలుగో అయిదో మిద్దెలు. ఊరుమొత్తంమీద పెద్దడాబా ఒక్కటే ఉన్నది. అది ప్రకాశం అనే కంట్రాక్టరు సర్వసౌకర్యాలతో అందంగా, అత్యంత ఆధునికంగా కట్టుకొన్న భవనం. అతనుతప్ప అక్కడ మరెవ్వరూ బయటవాళ్ళకు ఆశ్రయం ఇవ్వరు. ఇచ్చేపాటి స్తోమతు లేకపోవడమే అందుకు ప్రధాన కారణం. అలా ఆశ్రయం ఇవ్వ కలిగినవాడు అతను ఒక్కడే. ఈ వివరాలతోపాటు ఆ మనిషి చండ ప్రచండుడనీ, పరాయివాళ్ళను అనవసరంగా గుమ్మంలో అడుగు పెట్ట నీయడనీ రామారావుకు తెలిసింది. కాని ఆయన ఆశ్రయం కోరకపోవడ్ర

మరింత ప్రమాదకరమనీ, ఆయన ఆసరా లేనిదే ఎవ్వరూ ఆ గ్రామంలో ఏపనీ చెయ్యలేరనికూడా అతను విన్నాడు.

అతను అన్నీ విని జాగ్రత్తగా ఆలోచించాడు. వెంటనే ఒక నిర్ణయానికి వచ్చాడతను. ఆ మరుక్షణంలో బయలుదేరి, గబగబా నడచి, ప్రకాశం ఇంటికి వెళ్ళాడు. గేటు తీసుకొని బయటకు వెళుతున్న నౌకరును ఆపి, ఆ యింటియజమాని లోపల ఉన్నాడా అని అడిగాడు. అతను అలా అడుగుతుండగా ప్రకాశం నెమ్మదిగా డాబా వ్సరా చివరకు వచ్చి ''ఎవరది ? ఏం పనిమీద వచ్చావయ్యా ?'' అని పెద్దగా అడిగాడు.

రామారావు ప్రకాశాన్ని దూరం నుంచే చూచాడు. ఒక్కక్షణం ఎవరో జ్ఞాపకం వచ్చారు అతన్ని చూడగానే. రామారావుకు గౌరవంతో పాటు ఒక విధమైన భయం కలిగింది. అతను తాడి చెట్టంత ఎత్తుగా ఉన్నాడని అనిపించింది. మళ్ళీ అంతలో దట్టంగా గుమ్మటంలా ఎదిగిన గున్నమామిడిలా ఉన్నాడనికూడా అనిపించింది.

ప్రకాశం మంచి ఎత్తరి.

ఆ ఎత్తుకు తగ్గట్టు అతను లావుకూడాను. కాని అతను లావు పాటి మనిషి అనిపించడు. మెలితిరిగిన దండలు.కండలుపట్టిన ఒళ్ళు, నిమ్మ పండు వంటి శరీర ఛాయ; ఒడలంతా ఒక వింతైన నైగనిగ్యం. విశాలమైన నుదురు. పెద్దక్రాపు. ఆకర్ణాంతములా అనిపించే పెద్ద కళ్ళు. కోటేసేసి నట్లున్న పొడుగైన ముక్కు. ఆ కనుముక్కు తీరు అందమైనది. క్రమంగా విల్లులా వంగి,కొంచెం ఒత్తుగా కండ్లకు తగుమాత్రం దూరంగా ఉన్న కనుబొమల మూలంగా ముఖానికి అందం, తుమ్మెదరెక్కలలా నల్లగా, ఒత్తుగా ఉన్న బుట్టమీసాలమూలంగా గాంభీర్యం కలిగాయి. ఆ కన్నులలోని ఒక వింత కాంతి, ఒక క్రొత్త వెలుగుమూలంగా ఆకర్షణ అబ్బింది. అతను పలనాటి తెలుగుజోదులా కన్పించాడు.

అంతలో ఆతను గంభీరంగా కళ్ళు పెద్దవిచేసుకొని చూచాడు. అతని కళ్ళల్లో ఎఱ్ఱజీర కనిపించింది. మోర ఎగురవేస్తూ, ఉండిఉండి ఉరిమి చూస్తూ అతను అలా అడిగేసరికి, నిద్రాభంగం కలిగించినందుకు హూంకరిస్తున్న సింహం ఎదుట వెనుకకాళ్ళమీద నిలబడి, ముందుకాళ్ళు చేతుల్లా ఎత్తి నమస్కరిస్తున్న ఉడతలా ఒణుకుతూ, చేతులు కట్టుకోబోతూ, నమస్కారం చేయబోతూ ఉన్న రామారావు కొంతసేపటిదాకా, నోరు మెదపలేకపోయాడు. తర్వాత నమస్కారం చేసి, విషయం చెప్పడానికి ప్రయత్నం చేశాడు. కాని అతను మాట తడబడ్డాడు.

అంతలో ప్రకాశం అక్కడినుంచే "ఆఁ ఆఁ, అర్థమయిందిలే. ఇక్కడకు క్రొత్తగా ఆఫీసరుగా వచ్చావుకదూ! సరే సరే, భోజనం అయిందా?" అన్నాడు

ఇలా అంటూ అతను వసారా మెట్లు దిగి, గేటుదగ్గరకు వచ్చాడు. అతను రామారావువంక ఒక్కక్షణం తేరిపార చూచాడు. మరుక్షణంలో ఆ ప్రాంతం అంతా దద్దరిల్లిపోయేలా పెద్దగానవ్వడం మొదలుపెట్టాడు. ఆ సమయంలో అక్కడే కొంచెం దూరంగా, క్రోటన్ చెట్ల వెనుక నిలబడిఉన్న అతని భార్య, భర్త ఎందుకలా నవ్వుతున్నారా అని ఆశ్చర్యపడుతూ, నెమ్మదిగా అక్కడకు వచ్చింది.

ఆమె రామారావును చూడగానే గుర్తు పట్టింది.

ఆమె నెమ్మదిగా ముందుకు వచ్చింది. ప్రకాశం నవ్వడం మాని, అతని భుజంపై చెయ్యివేసి, "అరె బక్కోడా! నువ్వా! రామారావ్వు కదూ? నేను ప్రకాశాన్ని - పోల్చుకోలా?" అన్నాడు.

సావిత్రి మరో అడుగు ముందుకు వేసి, చిరునవ్వు నవ్వుతూ, "ఏమండీ రామారావుగారూ! బాగున్నారా?" అన్నది.

రామారావు అప్పటికి తేరుకొంటూ ''అరే, మీరా! మీరు సావిత్రి కదూ?'' అన్నాడు. ప్రకాశం మళ్ళీ పెద్దగా నవ్వుతూ, "అయితే నువ్వు మా ఇద్దరికీ పరిచయం అన్నమాట. మనం ఇద్దరం బి.ఏ. కలిసి చదువుకోలేదుటయ్యా! ఏం, ఇప్పుడైనా జ్ఞాపకంవచ్చిందా?'' అన్నాడు. అతను సమాధానం చెప్పకముందే సావిత్రి మాట అందుకొని, "ఆయనకు ఏమీ జ్ఞాపకం లేనట్టుందిలెండి. మేం ఇద్దరం కలసి చిన్నప్పుడు హైస్కూల్లో నాలుగేళ్ళు చదువుకొన్నాం. మనం అంతగా మారిపోయామన్నమాట; కాని ఆయన ఏ మాత్రం మారలేదు. సరే, సరే, రండి; ముందు లోపలకు రండి'' అన్నది.

సావిత్రి రామారావును లోపలకు ఆహ్వానించింది.

* * *

రామారావుకు సావిత్రిని చూడగానే తన భార్య జ్ఞాపకం వచ్చింది. అతని భార్య కురూపేమీ కాదు. తనకు అన్నివిధాలా నచ్చిన రూపు రేఖలూ, గుణగణాలూ ఉండడంవల్లనే అతను ఆమెను వివాహం చేసుకున్నాడు. ఆమె ఒకరకంగా అందమైనదే. కాని సావిత్రి అందం వేరు.

సావిత్రి చాలా అందకత్తె.

ఆమె నిజంగా విద్యుల్లత.

నిలువెల్ల పూచిన పూలతీపె ఆమె.

ఆమె ఎప్పుడూ ఎంతో ప్రసన్నంగా కన్పించేది. మొదట్లో కొన్ని రోజులు ఆమె రామారావు ముందుకు వచ్చి మాటాడడానికి జంకుతున్నట్లు కన్పించింది. అది నాగరీకం కాదనీ, పైగా చిన్ననాటి స్నేహితుని ముందుకు రాకపోవటం మర్యాద కాదనీ ప్రకాశం ఆమెను మందలించాడు. ఫలితంగా ఆమె రామారావుతో ఆమాటా ఈమాటా మాటాడడం మొదలు పెట్టింది.

పదిరోజుల తరువాత రామారావు వేరే వంట చేసుకొంటానన్నాడు. అలా వీల్లేదన్నది సావిత్రి. ఆ ఊళ్ళో ఉన్నంతకాలం అక్కడే ఉండాలనీ, తమతోపాటే తినాలనీ ఆమె పట్టుపట్టింది. "మీకోసం ప్రత్యేకం యేమన్నా చెయ్యాలా ఏమన్నానా. వంటమనిషి వున్నది; పనివాళ్ళున్నారు. అదనంగా మాకు కాగల ఖర్చుకూడా ఏమీలేదు. కనుక మరోమాట చెప్పకండి" అన్నది సావిత్రి.

"అవును. అది మనకు మర్యాదకూడానూ" అన్నాడు ప్రకాశం.

అన్నివిధాలా వసతి కుదిరినప్పటినుంచీ రామారావు అక్కడ ఉద్యోగరీత్యా నిర్వహించవలసిన పనులు ప్రారంభించాడు. ఆయా ప్రణాళికలు రూపొందించాడు అందులో వేటికి ముందు ప్రాధాన్యం ఇవ్వాలో నిర్ణయించుకొన్నాడు. గ్రామంలో నలుగురినీ సంప్రదించాడు. ఇతర పథకాలతోపాటు కార్యాలయం ఏర్పాటు చేయాలనీ, సమావేశాలు జరపడానికి వీలుగా ఉండే భవననిర్మాణ కార్యక్రమం ప్రారంభించాలనీ కూడా నిర్ణయం అయింది. అందుకు ప్రకాశం మద్దతుకూడా లభించింది.

అన్నిపనులూ సక్రమంగా జరిగితే ఒక్క ఏడాదిలోనే తనకు తప్పక పైపదవి లభించగలదని రామారావు ఆశించాడు. ఆయా విషయాలన్నీ సావిత్రికి వివరంగా చెప్పి, తనకు త్వరలో 'ప్రమోషను' రాక తప్పదని ఉబ్బిపోయాడు. అతను ఇంటికి వ్రాసిన ఉత్తరాలలోకూడా ఈ విషయం ప్రస్తావించాడు.

సావిత్రి అతను చెప్పినవన్నీ విని చిరునవ్వు నవ్వేది. ఆమె నవ్వితే ఎంతో అందంగా ఉండేది. బొడ్డుమల్లెలు అప్పటికప్పుడు అలా చప్పున విరిసించినట్టు ఉండేది.

రామారావుకు ఆ చుట్టుపట్టు లన్నీ క్రమంగా పరిచయం అయినకొద్దీ మొదట్లో ఉన్న దిగులు పోయింది. విసుగూ విరామం లేకుండా

తిరుగుతుండే రకరకాల మోటారువాహనాల రణగొణధ్వనులతో హడావిడిగా ఉండే బస్తీ జీవితానికి అలవాటుపడినవాడు కావడంచేత అతను మొదట్లో ఆ ప్రశాంత వాతావరణం చూచి కొంత భయపడ్డాడు. నెమ్మదిగా ఆభయం పోవడమేకాక; కేవలం ఎత్తయిన రాతికట్టడాలు చూచి అబ్బురపడుతుండే మనిషి. పల్లెపట్టుల రమణీయమైన ప్రకృతిదృశ్యాలు చూచి మురిసిపోవడం మొదలుపెట్టాడు.

ఆ ఊరు కావడానికి చిన్నదే అయినా ఎంతో పొంకంగా ఉన్నది. బాటలన్నీ తీర్చిదిద్దినట్టుగా ఉన్నాయి.

ఆ గ్రామానికి అర్ధమైలు దూరంలో తూర్పువైపున ఏరొకటి ఉన్నది. ఊళ్ళో అందరూ ఏటినుంచే మంచినీరు తెచ్చుకొంటారు. వేసవికాలం మంచినీటికోసం ఏటిగట్టున త్రవ్విన బావి ఉన్నది. పడమటి వైపున చింతతోపుకు ఆవల దూరదూరాన ఎత్తయిన కొండ. కొండమీద దట్టమైన అడవి; కొండను ఆనుకొని నాలుగయిదు ఎకరాలమేర ఆక్రమించుకొన్న చెరువు. గ్రామంలో బాటలకు ఇరుప్రక్కలా ఖాళీజాగాలలోనూ, గ్రామంచుట్టూనూ ఎన్నోరకాల చెట్లు ఉన్నాయి.

రామారావు ప్రకాశంతో కలిసి కొండమీదకూ, చెరువుగట్టుకూ, ఏటిఒడ్డుకూ షికారుకు అనేకసార్లు వెళ్ళివచ్చాడు. ఒకటిరెండుసార్లు వారి వెంట సావిత్రికూడా వెళ్ళింది. అలా వెళ్ళినప్పుడు సావిత్రి రామారావుతో ఇంతకుముందుకంటె ఎక్కువ చనువుగా, కలుపుగోలుగా మాటాడింది. ఎదుట కన్పించిన ప్రకృతిదృశ్యాలను ఎన్నోరకాలుగా అభివర్ణించి వాటి పట్ల తన ప్రగాఢమైన అభిమానం వ్యక్తం చేసింది. అందుకు ప్రకాశం సంతోషించాడు.

రామారావుకు మొదట్లో ఉన్న బెదురు పోయింది. రాత్రిళ్ళు నక్కల కూతలూ, దూరంనుంచి అడవిజంతువుల అరుపులూ వినిపిస్తే అతను

ఇప్పుడు పూర్వంలాగా భయపడడంలేదు. పైగా అతనికి నూతనోత్సాహం కలిగింది. బస్తీలో ఉన్నప్పటికంటె ఇక్కడకు వచ్చినతర్వాత తన ఆరోగ్యం ఎంతో మెరుగయిందని అనిపించింది అతనికి. ఒంటరిగా ఉంటున్న అతనికి మరికొంత ఉత్సాహం కల్పిద్దామనే ప్రకాశం అతన్నీ, సావిత్రినీ వెంటతీసుకొనివెళ్ళి తను పెద్ద ఎత్తున కంట్రాక్టుపనులు చేస్తున్న ప్రదేశాలు చూపించాడు.

ప్రకాశం దాదాపు ప్రతిరోజూ పగలు అక్కడకూ, ఇక్కడకూ వెళ్ళి వస్తూండేవాడు. పని ఉన్నా లేకపోయినా అలా వెళ్ళేవాడు అతను.

కొన్నిరోజుల తర్వాత సావిత్రి రామారావుతో మరింత చనువుగా మాటాడడం మొదలుపెట్టింది. మొదట్లో ప్రకాశం ఇంట్లో ఉన్నప్పుడే అతనితో అలా మాటాడేది. ఇప్పుడు అలాకాదు; భర్త ఇంట్లో లేనప్పుడు రామారావు కూర్చునే గదిలోకి వెళ్ళి, దూరంగా నిలబడి చాలాసేపు కబురు చెప్పడం మొదలుపెట్టింది. ఒకటికి రెండుసార్లు పండ్లు, ఫలహారాలు, కాఫీ, పాలు, ఓవల్టిన్ తెప్పించి ఇచ్చేది. క్రమంగా లోకవ్యవహారాలతో పాటు తన సంసారానికి సంబంధించిన విషయాలుకూడా చెప్పడం ఆరంభించింది. మొదట్లో ప్రకాశం గుణగణాలు ఘనంగా ప్రశంసించింది. తర్వాత తర్వాత అతని లోపాలు ఎత్తిచూపుతూ సాధింపు ప్రారంభించింది.

ప్రకృతిదృశ్యాలూ, ప్రశాంత వాతావరణమూ అంటే ఎంత అభిమానం ఉన్నా అంత ఆస్తి ఉండీ, అంత పెద్దచదువులు చదువుకొనీ, అంత పలుకుబడి సంపాదించీ ప్రకాశం ఆ కుగ్రామంలో ఉండవలసిన అవసరం ఏమున్నదనీ, నగరంలో ఉంటూ, కావాలనుకున్నప్పుడు ఇటు వంటి ప్రాంతాలకు వచ్చిపోకూడదా అనీ ఆమె వాదించింది. ఆమె ఆవిషయంలో తన వాదంగురించీ, భర్తకు ఆ విషయం నచ్చచెప్పడానికి

తను చేసిన విఫలప్రయత్నాలగురించి వివరిస్తూ, ఐ స్త్రీజీవితంపట్ల తనకు గల వ్యామోహం అభివ్యక్తం చేసింది.

మరికొంచెం చనువు ఏర్పడిన తర్వాత తానేమో సర్వాలంకార సంశోభితయై, అచ్చంగా అచ్చరలా కన్పిస్తూ, ఒయారంగా, అంచకొా- అంచలా ముందు నడుస్తూ, విశాలంగా అందంగా ఉన్న ఇల్లంతా అతనికి ఒకటికి రెండుసార్లు చూపించింది.

ఆ ఇంట్లో ఎక్కడ చూచినా రకరకాల కుర్చీలు, బల్లలు, సామానులు; అవన్నీ ఖరీదైనవి. పెద్దనగరాలలో భాగ్యవంతుల ఇండ్లల్లో ఉండే సామగ్రులవి. గోడలపైన అక్కడక్కడ అందమైన నగిషీపని చేసిన చట్రాలలో ఫొటోలు, ప్రకృతి దృశ్యాలు చిత్రించిన వర్ణచిత్రాలు. వాటిలో కొన్ని అజంతాచిత్రాల ప్రతిరూపాలు. అక్కడక్కడ బల్లలపైనా, టీపాయిలపైనా అపురూప కళాఖండాలు అమర్చిఉన్నాయి. ప్రతి గదిలోనూ విద్యుద్దీపాల ఏర్పాటుకూడా ఎంతో అందంగానూ, ఆకర్షణీయంగానూ ఉన్నది.

ఆ ఇంట్లో దాదాపు పదిగదులు ఉన్నాయి. ఆగాగదులు కాక వంటకూ, భోజనాలకూ వెనుక వేరే పెంకుటిల్లు ఉన్నది. ఇంటివెనుక ఆవరణలో వంటఇంటికి దూరంగా పనివాళ్ళకోసం కట్టిన చిన్నచిన్న పెంకుటిళ్లుకూడా పొంకంగా ఉన్నాయి. పశువుల శాల క్రింద నేల కొంతభాగం గచ్చు చేసి, పైన సిమెంటురేకులు వేసి, దిట్టుదిట్టంగా కట్టారు. అందులో అయిదు ఆవులూ, దూడలూ, పదిగేదెలూ, పదిజతల ఎడ్లూ ఉన్నాయి.

ఇంటి వెనుకవైపు ప్రహరీగోడ ఎత్తు ఎక్కువ. ముందువైపు ప్రహరీగోడ ఎత్తు చాలాతక్కువ. ఇంటివెనుకగోడ ఆనుకొనే ఎకరం మేర తోట. అందులో పూలమొక్కలతో సహా రకరకాలచెట్లు ఉన్నాయి.

సావిత్రి ఇల్లూ, తోటా అతనికి చూపడానికి సంబరపడ్డది.

ఆవిడ తనకున్న రకరకాల నగలూ, ఆభరణాలూ, చీరలూకూడా చూపించి. ఏదోసందర్భంలో "ఇవన్నీ నాకేం తక్కువలేవు" అనంది. అలా అంటూ ఆవిడ కొంత గర్వంకూడా కనబరచింది.

నవ్వుతూ, సరదాగా, వినువుగా మాటాడుతూ సావిత్రి అతనికి ఇంకా ఎన్నో విషయాలు చెప్పింది.

"ఆయన బయట వాళ్ళతో పీళ్ళతో ఒక్కొక్కప్పుడు కోపంగా, పరుషంగా మాట్లాడినా ఇంట్లోమట్టుకూ ఎప్పుడూ చక్కగా నవ్వుతూ మాట్లాడతాడు ఎప్పుడూ శాంతంగా ఉంటారు. ఎన్నెన్నో పుస్తకాలు కొనితెచ్చి చదువుకొంటుంటాడు. అందమైన దారువిగ్రహాలూ, సామానులూ కొండు డబ్బుపోసి తెస్తారు. అవన్నీ నాకూ ఇష్టమే. అందే క్రమంగా అభిమానం కలిగింది. అయితే ఒకటి–తను ఏంచేసినా కిమ్మన కూడదు ఆయనకు అనుగ్రహం కలిగినా ఉగ్రహం వచ్చినా పట్టలేం అలా అని ఆయన ఎన్నడూ దౌర్జన్యానికి దిగేమనిషికాదు. అంతేకాదు. బయట తిరుగుడుకూడా ఉన్నది. కాని ఆయన నన్ను ఒకతైనే ప్రేమిం చానని అంటారు. అది నిజంకూడానూ. వీటికి తోడు ఆయనకు త్రాగుడు కూడా అలవాటు అయింది. కాని ఆయన తాగుతారని ఎవ్వరూ అనుకోరు. తాగినంతమాత్రాన ఆయన తాగుబోతూ కాదు–తిరిగినంత మాత్రాన ఆయన తిరుగుబోతూ కాదు.

ఒక్కొక్కసారి ఆయన ఇవన్నీ మరచిపోయి వారాలతరబడి ఎక్కడికీ వెళ్ళకుండా ఇంటిపట్టున ఉండి తోటపనులూ, వ్యవసాయం పనులూ చూచుకొంటారు. 'వద్దండీ డబ్బు ఇలా అనవసరంగా ఖర్చు చెయ్యొద్దు. తర్వాత మనం ఇబ్బందిపడవలసి వస్తుందేమో' అని నేను అన్నప్పుడల్లా ఆయన పిత్రార్జితమైన ఆస్తి ముట్టుకోవడం లేదనీ, పైగా అది ఎంతో పెరుగుతున్నదనీ, నేనుకనుక కొడుకుల్నీ కూతుళ్ళనూ

కనే స్తే ఆ క్షణంనుంచీ ఇవన్నీ మానేసి వాళ్ళకోసం ఇంకా ఎక్కువధనం కూడబెడతాననీ అంటారు. మరి పది సంవత్సరాలయింది. నాకు ఇంత వరకు అటువంటి అదృష్టం...'' అంటూ ఆమె మాటాడడం మానేసి ఒక క్షణం మౌనం వహించి, అంతలో సిగ్గుపడిపోయి, చప్పున వెను తిరిగి ఆవలకు వెళ్ళిపోయింది.

రామారావు అప్పటిదాకా తల వంచుకొని ఆవిడ మాటలు వింటూ కూర్చున్నవాడల్లా తల ఎత్తి ఆమె వెళుతున్నవైపు చూచాడు. మధ్యలో సంభాషణ ఆపేయడం, అలా సిగ్గుపడడం, చప్పున కొంగు లాక్కొని ఒళ్ళంతా కప్పుకొని, వెనుతిరిగి నెమ్మదిగా వెళ్ళడమదీ అతనికి ఒక చమత్కారంగా కన్పించింది.

ఆమె అలా వెళుతూ వెళుతూ వెనుతిరిగి, తనవంక చూచి, చిరు నవ్వు నవ్వినట్లు అనిపించింది అతనికి. అలా అనిపించేసరికి తనపైకి మల్లెపూలు విసరివేసినట్లు అయింది.

అదంతా ఒక్కక్షణం.

మళ్ళీ అంతలో ఆమె తనవంక చూచి అలా నవ్వలేదనీ, తల వంచుకొనే వెళ్ళిందనీ అతనికి జ్ఞాపకం వచ్చేసరికి అతనిమనస్సు కలుక్కు మన్నది. విచ్చిన గులాబీపువ్వు ఉన్న రెమ్మఒకటి ఎవరో తనపైకి గురి పెట్టి సుతారంగా విసరగా, దారిలో పువ్వు రాలిపోయి రెమ్మ ఒక్కటే వచ్చి ముఖంమీద పడగా, సన్ననిముళ్ళు తన చెక్కిలిపై అలా ఒకసారి తాకినట్టు అయింది.

అతను అప్రయత్నంగా అరచేతితో ముఖం తుడుచుకొన్నాడు.

* * *

సావిత్రి రామారావుతో అలా చాలాసార్లు ఎంతో చనువుగా, ఏకాంతంగా సంభాషణ జరిపింది. ప్రతిసారీ ఆమె సంభాషణ ఎన్నడో చిన్ననాటి తమ స్నేహం దగ్గర ప్రారంభమై, అలా అలా అనుకోకుండా కొనసాగి, సంతానం విషయందాకా వచ్చి ఆగిపోయేది. ఆమెకు సంతానం కలుగక పోవడానికి కారణం ఏమిటా అని అతను పదే పదే అనుకొన్నాడు. ఒకసారి వైద్యపరీక్ష చేయించుకోమని ఆమెతో చెప్పాలని అతను చాలాసార్లే అనుకొన్నాడు. కొన్నిసార్లు ఆ మాటలు నోటిదాకా వచ్చాయికూడానూ. కాని ఆమె అపార్థం చేసుకొంటుందేమో నని భయపడి ఊరుకొన్నాడు. ఆ విషయం ఆలోచించినకొద్దీ అతనికి ఆమెపట్ల జాలి కలిగింది. హృదయంలో ఆమె అంటే ఉన్న అభిమానానికి అది తోడు అయింది. ఆమె ఎదుటకు వచ్చినప్పుడల్లా అతనికి ఆ విషయం జ్ఞాపకం వచ్చేది.

ముప్ఫయిఏళ్ళు నిండినా పిల్లలు కలుగకపోవటంవల్ల మనిషి చెక్కుచెదరలేదు. ఎన్నడూ పనిపాటలు చెయ్యవలసిన అవసరం లేకపోవడంవల్ల ఆమె పరమ సుకుమారవతి అయింది. ఆ సౌకుమార్యానికి సౌందర్యపోషణా, అలంకారాలూ తోడుఅయ్యాయి. బాగా భాగ్యవంతుని భార్యకావటంచేత అందుకు అవకాశం కలిగింది

ఆమె మోము ఎప్పుడూ మందహాస సుందరం; పున్నమనాటి చంద్రబింబ సదృశం.

ఎంతటిన్నా ఎదిగిని దనిపిస్తుంది సావిత్రి. మల్లెకు ఆమె ప్రతిస్పర్థి – లావణ్యంలోనూ, సౌకుమార్యంలోనూ కూడా.

ఆమె చిన్నప్పుడు అంత అందకత్తె కాదు. వయసు వచ్చినప్పుడు వయసు వచ్చిన పిల్లమాత్రమే. భర్త సాంగత్యంవల్ల ఇంత అందం వచ్చింది. మెరుపు వచ్చింది. తనూవిలాసం అబ్బింది సాన పట్టిన మకరాంకుశస్త్రం అయింది. సంపదవల్ల రకరకాల విలువైన

అందాల ఆభరణాలు ధరించి క్రొత్త క్రొత్త అలంకరణలు చేసుకోడానికి మంచి అవకాశం కలిగింది. నాగరీకం నేర్చింది.' అనుకొన్నాడు రామారావు.

ఆమె సౌకుమార్యం అతన్ని ఆకర్షించింది. ఆమె అలంకరణ అతన్ని అలరించింది. ఆమె చనువు, నాగరీకం, సంభాషణాధోరణీ అతన్ని కవ్వించాయి.

ఆమె రోజూ చాలా ఖరీదైన జరీఅంచు పట్టుచీరలే కట్టేది. ఎప్పుడూ చక్కగా అలంకరించుకొనే కన్పించేది. నిత్యం ఉదయం, సాయంత్రం తలలో పూలు దండిగా పెట్టుకొనేది. అదంతా తన్ను ఆకర్షించడానికేమోనని అనుమానంకూడా కలిగింది అతనికి.

సావిత్రి ఎప్పుడు అవకాశం దొరికినా ఏదో విషయంపై సంభాషణ అల్లుకొని పోయేది. ఆవిడ ఎప్పుడూ ఎంతో మధురంగా మాటాడేది. ప్రకాశం ఇంట్లో ఉన్నంత సేపు భార్యఎదురుగా కూర్చుని, ఆవిడమాటలు వినడానికి ఆసక్తి కన్పరచేవాడు. మధుర కావ్యగానం విన్నంతగా సంతోషించే వాడుకూడానూ.

ఆమె అలా ఏదో తనతో ఏకాంతంగా మాటాడుతూ ఉండగా ఒకసారి, రామారావు మధ్యలో అడ్డుకొని "ఇతర విషయాలు ఎలా ఉన్నా మీరు మాటాడుతుంటే ఏదో పాట పాడుతున్నట్టు ఉంటుంది." అన్నాడు నెమ్మదిగా. అలా అంటూ అతను ఆమెవంక ఒకసారి అభిమానపురస్సరంగా చూచాడు. అలా చూస్తూ అతను అప్రయత్నంగా మందహాసం చేశాడు

ఆమె గమనించింది !

మొదట ఆమెకూడా అప్రయత్నంగా చిరునవ్వు నవ్వింది. అంతలో అతని మందహాసం కాంక్షాసమ్మిశ్రితం అనిపించింది ఆమెకు మరుక్షణంలో ఆమె కావాలని చిరుకోపం ప్రదర్శించింది.

అంతలో ఆమె వెనుదిరిగి నెమ్మదిగా అవతలకు వెళ్ళిపోయింది.

అలా జరిగినతర్వాత రామారావు సావిత్రితో కొన్నిరోజులదాకా మాటాడలేదు. ఆమె తన్ను ఒక విధంగా గట్టిగానే హెచ్చరించినట్లు, ఒకరకంగా మందలించినట్లు అనిపించింది అతనికి. అందుకే ఆమె ఎదుట పడ్డా అతను పలుకరించలేదు. ఆమెను కన్నెత్తి చూడలేదు; తప్పుకొన్నాడు.

కాని...కాని...

ఆమె తలనిండా తాల్చిన మల్లెపూల సువాసనలు అతన్ని చుట్టివేస్తూనే ఉన్నాయి. ఆమె కాలిమెట్టెల సన్నసవ్వడులు అందెల రవళులై మృదుమధుర ఝుంకారములై అతని హృదయంలో ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. ఆమె చూపులు తుమ్మెదల బారులై అతన్ని మభ్యపెడుతూ మాటిమాటికీ మీదమీదకు వస్తూనే ఉన్నాయి. అతని మనస్సంతా ఆమెను గురించిన ఆలోచనలతో నిండిపోయింది. అగరుపత్తుల పొగ. సర్వ సుందరగా అలంకరించిన శోభనపుగది అంతా అలముకొన్నట్లుగా, క్రొత్తగా వికసించిన పూల పరిమళం ఉద్యానవనమంతా పరివ్యాప్తం అయినట్లుగా ఆమె రూపలావణ్యం గురించీ, ఆమె చిరునవ్వుల సోయగం గురించీ, విలక్షణమైన ఆమె ఆకర్షణ గురించీ కలిగిన ఆలోచనలు అతని మనస్సు అంతా అలముకొన్నాయి. అవి అలవోకగా అలముకొన్నాయి. అతనికి అదే ధ్యాస అయింది. అతనికి అది ఒక వ్యామోహం అయింది.

ఆమెను కలుసుకోకుండా, ఆమెతో మాటాడకుండా, ఆమెవంక చూడకుండా అలా తప్పుకు తిరుగుతున్నకొద్దీ అతనికి ఆ వ్యామోహం అధికాధికం అయింది.

పదిరోజులు అలా గడిచేసరికి ఇంక ఆమెను చూడకుండా ఉండలేననుకొన్నా డతను. అతనికి మనసులో బాధగా అనిపించిందికూడానూ.

హృదయంలో ఎక్కడో మధుకీల రగుల్కొన్నట్లు అనిపించింది. ఆమె ప్రవర్తన అతనికి మరీ వింతగా కన్పించింది. ఆమెకూడా తనలాగే లోపల బాధపడుతూ, పైకి తేలకుండా తన ఎదుట పడకుండా తప్పించుకొని తిరుగుతున్నట్లు కన్పించింది

ప్రకాశం ఇంట్లో ఉన్నప్పుడుకూడా సావిత్రి అలాగే ప్రవర్తించడం మొదలుపెట్టింది. ఏదో తప్పు చేసిన దానిలాగా దూరంగా తొలగి పోయింది. కారణం ఏమిటని ప్రకాశం అడుగుతాడేమో నని రామారావు భయపడ్డాడు. కాని సావిత్రి మాత్రం అటువంటి భయాలేమీ పెట్టుకోలేదు. రామారావు తన్నేమో బాధిస్తున్నట్లు, రక్షణకోసమన్నట్లు ప్రకాశం ప్రక్కన చేరినట్లు కన్పించింది.

రామారావు అక్కడ ఉద్యోగరీత్యా నిర్వహించవలసిన పనుల పట్ల ఎక్కువ శ్రద్ధ వహించాడు. తాను ఉండవలసిన అవసరం లేక పోయినా పనిగట్టుకొని వెళ్ళి, చిన్నతరహా నిర్మాణ కార్యక్రమాలు అమలు జరుగుతున్న చోట ఎక్కువసేపు ఉండివచ్చాడు. అయినా అతనికి ప్రొద్దు పోలేదు. అక్కడ తాను ఒంటరిగా ఉంటున్నట్లూ, బొత్తిగా తోచకుండా పోయినట్లూ అతను బాధపడ్డాడు. అతను ఒకటి రెండుసార్లు ప్రకాశంతో కలిసి పెద్దఎత్తున కంట్రాక్టుపనులు జరుగుతున్న చోట్లకు వెళ్ళివచ్చాడు. అతనికి ప్రకాశం మళ్ళీమళ్ళీ ఆ ప్రదేశాలన్నీ చూపించాడు. ప్రకాశంతో అలా ఊరికే తిరగడం తప్ప రామారావుకు కాలక్షేపం కాలేదు.

ప్రకాశం మితభాషి.

ఎవరైనా మాటాడుతుంటే ఎంతసేపయినా ఓపిగ్గా వింటాడు అతను

రామారావు ప్రకాశంతో ఏదో విషయంమాటాడుతూ, మధ్యలో స్వవిషయం ప్రస్తావించాడు. తనకు అక్కడ ఏమీ తోచడంలేదని చెప్పి,

"నీ పలుకుబడి ఉపయోగించి నన్ను ఇక్కడనుంచి బదిలీ చేయించు" అన్నాడు.

ప్రకాశం నవ్వి ఊరుకున్నాడు.

రామారావు మళ్ళీ అడిగాడు.

ప్రకాశం నవ్వుతూ, "పోనీ, కొంచెం ఔషధం సేవిస్తావా?" అని అడిగాడు నెమ్మదిగా.

వెంటనే రామారావు "వద్దువద్దు," అంటే అతను పెద్దగా విరగబడి నవ్వుతూ, "అంత భయమా?" అన్నాడు. మరో క్షణం తర్వాత అతను మాట మారుస్తూ "ఇక్కడ తోచక పోవడం ఏమిటి? ఒకసారి అటు చూడు" అన్నాడు.

'ఎటు చూచినా సర్వరమణీయమయిన ప్రకృతి దృశ్యాలు. అక్కడి ప్రకృతి సౌందర్యం సందర్శిస్తూ హాయిగా ఎంతకాలమైనా గడపవచ్చు. ఇంటిదగ్గర ఏ గదిలో అయినా కూర్చుని చదువుకోవచ్చు. ఇంట్లో కావలసినన్ని పుస్తకాలు ఉన్నాయి. ఇంట్లోనో, తోటలోనో కూర్చుని బొమ్మలు గీయవచ్చు. కవిత అల్లుకోవచ్చు. పాటలు పాడుకోవచ్చు. గ్రామంలో ఎన్నో నిర్మాణ కార్యక్రమాలు నిర్వహించవచ్చు. ఇతనికి తోచకపోవడ మేమిటి?' అనుకొన్నాడు ప్రకాశం. అతను కొద్ది నిమిషాల తర్వాత తల వంచుకొని కూర్చున్న రామారావు భుజం మీద చేత్తో తడుతూ, "పోన్లే, రేపటినుంచి ఇంట్లో మనం చదరంగం ఆడుకొందాం," అన్నాడు.

ఆ మరునాటినుంచి ఇంట్లో ఉన్నప్పుడు తీరిక వేళల్లో ప్రకాశం రామారావుతో ఆట వేయడం మొదలు పెట్టాడు. కొన్నాళ్ళు అలా సాగింది. అలా ఆట మొదలు పెట్టినరోజుననే ప్రకాశం అతనితో

"నువ్వు కోరిన ప్రకారం గ్రామంలో భవననిర్మాణానికి మంజూరు సంపాదించాను. ఇంక నీకు కావలసినంత పని," అన్నాడు.

రామారావు సంతోషించాడు.

'బయట చేతినిండా పని ఉంటుంది. ఇంట్లో ఆటమూలంగా కొంత కాలక్షేపం అవుతున్నది.' అనుకొని సావిత్రి విషయం మర్చిపోవడానికి ప్రయత్నించాడతను. ఇతర ఏపనులయినా తనప్రమేయం లేకుండానే అతిశీఘ్రంగా జరిగిపోతున్నాయి. కాని అతను అతి కష్టంగా, రహస్యంగా చేస్తున్న ఆ ప్రయత్నం మాత్రం కొనసాగలేదు. అతనుఇంట్లో ఉన్నప్పుడు సావిత్రి ఆ చాయలకే రావడంలేదు. కాని అతనికి మాత్రం ఆమె ఎప్పుడూ తనముందే ఉన్నట్లు అనిపించింది.

ఒకరోజు చదరంగం ఆట సాగుతుండగా ప్రకాశానికి బయట నుంచి పిలుపు వచ్చింది. కాని ప్రకాశం ఆటలోనుంచి లేపలేదు. ఆ వచ్చిన మనిషి లోపలకు వెళ్ళి, ఆ విషయం సావిత్రితో చెప్పి, ప్రకాశం వెంటనే అక్కడకు రావలసిన అవసరంగురించి వివరించాడు. సావిత్రి ఆ మనిషిని పంపి, కొన్నిక్షణాల తర్వాత వంటమనిషిని పిలిచి, రెండు కప్పుల కాఫీ తీసుకొని వెళ్ళి ముందుగదిలో ఇచ్చిరమ్మని చెప్పింది. ఆవిడ వెళుతుండగా "ఆయన్ను ఓసారి ఇటు వచ్చివెళ్ళమని చెప్పండి"అని కూడా అన్నది సావిత్రి.

పదినిముషాల తర్వాత ప్రకాశం అక్కడకు వచ్చేసరికి సావిత్రి ఆ గదిలో పెద్ద పందిరిమంచంమీద పడుకొని ఉన్నది. అతను లోపలకు వస్తూనే ఆటలో ఉండగా పిల్చినందుకు కొంచెం కోపగించుకొంటూ, "ఎందుకో రమ్మన్నావుట!" అన్నాడు.

సావిత్రి మాటాడలేదు.

పైగా మరో వైపు తిరిగి పడుకున్నది.

అతను విసురుగా ముందుకు వచ్చి ఆమె బుజాలు పట్టుకొని తన వైపుకు త్రిప్పుకొంటూ కొంచెం పెద్దగా, "ఏం, ఆటలో ఉన్నామని కూడా తెలియదా నీకు ?'' అన్నాడు.

సావిత్రి ఫక్కున నవ్వింది. ఆమెవంక ప్రకాశం కోపంగా చూస్తూ, "ఎందు కలా నవ్వుతావ్ ?" అన్నాడు.

"మీరు చేతులు విడిచిపెట్టండి. నాకు చక్కిలిగింతగా ఉన్నది'' అన్నది సావిత్రి నెమ్మదిగా లేచి కూర్చుంటూ.

"అబ్బ ! అంత చిన్నపిల్లవేం !'' అన్నాడు ప్రకాశం.

ఆమె అతని ముఖంలోకి చూస్తూ, చిరునవ్వు నవ్వుతూ, "కాక ముసలి దాన్నా" అన్నది. అతనికి కోపంఅంతా పోయింది.

కొన్నిక్షణాల తర్వాత అతను, "సరేగాని, పని ఏమిటో చెప్పు" అన్నాడు.

ఆమె లేచి, నెమ్మదిగా అతని దగ్గరగా వచ్చి నిలబడి, "అదేం ఏంలేదు. మీరు వెంటనే అక్కడకు వెళ్ళకపోతే పని ఆగిపోతుందట. దానివల్ల మనకు చాలా నష్టం వస్తుందట కూడానూ. అదీ కాక అనుకొన్న నాటికి పని యథావిధిగా పూర్తి కాకపోతే మీకు అందరి మీదా కోపం వస్తుంది. ఇవన్నీ నాకు తెలుసు. అందువల్ల మీరు ఒక్కసారి అలా వెళ్ళిరండి" అన్నది. అతను ఒక్క నిముషం అక్కడే నిలబడి ఎటో చూస్తూ ఆలోచనలోపడ్డాడు అంతలో అతను ఆలోచనలో నుంచి తెప్పరిల్లుకొని "నిజమే; నువ్వు బాగా జ్ఞాపకంచేశావు. ఇవ్వాళ చాలా అర్జంటుపనే ఉన్నది. సరే వెళతాను. అయితే ఓపని చెయ్యి. ఆట పూర్తిచేసివెళ్ళు'' అన్నాడు.

ప్రకాశం హడావిడిగా బయటకు వెళ్ళాడు.

సావిత్రి నెమ్మదిగా తీరుబడిగా ముందుగదిలోకి వచ్చి ఆట ముందు కూర్చున్నది.

వచ్చిన పదినిముషాలకే ఆట కట్టించేసిందిసావిత్రి. ప్రకాశం వెయ్యవలసిన ఎత్తులన్నీ చెప్పివెళ్ళాడనుకొన్నాడు రామారావు. అతనికి కోపం వచ్చింది. మాటామంతీలేకుండా మరోఆట వేశారు. అదీ అంతే అయింది. రామారావుకు రోషంకూడా వచ్చింది. వెంటనే మరోఆట వేశాడు. ఈసారి అతను ప్రతిఎత్తుకూ ఎంతోవ్యవధి తీసికొన్నాడు. కాని చివరకు గెలుపు ఆమెదే అయింది.

ఇక ఆరోజునుంచీ ప్రకాశం ఇంట్లో ఉన్నప్పుడూ, లేనప్పుడూ కూడా వారు అలా ఒకటి రెండుఆటలు వెయ్యడం జరుగుతూ వచ్చింది.

మొదట కొన్నాళ్ళు అతను ఆమెవంక కన్నెత్తి చూడలేదు. తర్వాత తర్వాత అందుకు అతనికి ధైర్యం వచ్చింది. ఆమె చూడనప్పుడు అతను ఆమెవంక చూడడం, ఒకరికొకరు పట్టుబడడం, తల వంచేసుకోవడం, ఎంతసేపూ ఎత్తు వెయ్యకపోవడం, ఏదో తప్పు చేసినట్టు పశ్చాత్తాప పడడం చాలాసార్లు జరిగింది.

అది రోజూ పరిపాటి అయింది.

ఆరోజు ప్రకాశం తూర్పు తెలతెలవారకముందే నిద్రలేచి హడావిడిగా స్నానాదులు పూర్తిచేశాడు. ఆరు గంటలు కాకముందే ఫలహారం చేయించుకొని తిని, కాఫీ తాగి బయలుదేరాడు. వెళుతూ వెళుతూ సావిత్రితో చెప్పివెళ్ళాడు అన్ని విషయాలూ క్లుప్తంగా.

కొండప్రక్కగా క్రొత్తగా వేస్తున్న రోడ్డుపని దాదాపు పూర్తి అయింది. ఆ గ్రామాన్ని బస్తీతో కలుపుతూ వేసినరోడ్డు అది. దారిలో అక్కడక్కడ చిన్నచిన్న వంతెనల నిర్మాణం కూడా పూర్తి అయింది. కాని అక్కడా ఇక్కడా కొన్ని చిల్లరపనులు మిగిలి పోయాయి. అవన్నీ ఆపూట పూర్తి అవుతాయి. అంత పెద్ద కంట్రాక్టుపని పూర్తి అయిన సందర్భంగా పట్టణంలో పెద్దవిందు ఏర్పాటుచేశాడు ప్రకాశం. అతను చాలామంది పెద్దవాళ్ళను ఆ విందుకు ఆహ్వానించాడు.

విందుకు సాధ్యమైనంత ముందుగా రమ్మనమనీ, మూడింటికే ఇంటికి కారు వస్తుందనీ, పెద్దగా అభ్యంతరం లేదంటే రామారావును కూడా తీసుకొనిరమ్మనమనీ సావిత్రితో చెప్పివెళ్ళాడు ప్రకాశం.

సావిత్రి గుమ్మందాకా వచ్చి భర్తను సాగనంపుతూ, "పోనీ మీరే ఆయన్ను స్వయంగా పిల్చివెళ్ళకూడదూ? అదీకాదూ ఇప్పుడే వెంటతీసుకొనివెళితే మరీ సంతోషిస్తారేమో ఆయన" అన్నది.

ప్రకాశం ఒక్కక్షణం ఆగాడు. "అవును మంచిమాటే చెప్పావు. కాని ఇది వ్యవహారం. దీనివల్ల అందరికీ ఉపయోగమే. అయితే మనకు ఎక్కువలాభిస్తుంది. అందువల్ల తప్పని సరిగా కొందరికి కొంతకొంత ముట్టచెప్పాలి. ఇటువంటివన్నీ అతనికి గిట్టవు. అదీ కాక విందుకు వచ్చే వాళ్ళల్లో కొందరు అతని పైఅధికారవర్గంలోనివారు కావచ్చు. అందువల్ల అతను భయపడ వచ్చు. సరే ఇవన్నీ ఎందుకులే-మన ఇద్దరిలో ఎవరు పిలిస్తే ఏముందీ, రమ్మను. వస్తేతీసుకొనిరా," అని అతను గబగబా ముందుకు నడిచాడు.

సావిత్రి ఆపూట ఉదయం పదిగంటలనుంచే హడావిడిపడ్డది. తలంటి పోసుకొని, జుట్టుతుడుచుకొని, బాగా ఆరాక, వదులుగా జడ

వేసుకొన్నది. మధ్యాహ్నం పెందరాళే భోజనం చేసి, కాసేపు విశ్రాంతి తీసుకొన్నది. రెండుగంటలకు రామారావు ఆటకు కూర్చుంటే, సావిత్రి అక్కడకు వచ్చి ఎంతో ఒయారంగా నిలబడి, "ఇంక నేను ఈ మూగ నోము సాగించలేను. మీరూ మాట్లాడండి" అన్నది. మరోక్షణం తర్వాత ఆమె ఆతనికి ఎదురుగా ఉన్న చదరంగం ఆదే ఆట్టా, పావులూ తీసి దూరంగా పెట్టి, కుర్చీ లాక్కొని అతనికి ప్రక్కగా కూర్చుని, ప్రకాశం పూర్తిచేసిన రోడ్డునిర్మాణం గురించి వివరిస్తూ, దానివల్ల గ్రామంత్వరలో ఎంతో అభివృద్ధి చెందుతుందనీ, బస్సులుపడే అవకాశం ఉన్నదనీ, తను కారులో అనుకొన్నప్పుడల్లా బస్తీకి వెళ్ళిరావడానికి వీలవుతుందనీ అన్నది. కొండప్రక్కగా గ్రామంవైపునా, కొండవెనుక గ్రామానికి దూరంగానూ ఉన్న భూములకు ఇలా రోడ్డుసౌకర్యం కలగడంమూలంగా గిరాకీ పెరుగుతుందనీ, అందులో చాలాభాగం అయిదారు సంత్సరాల క్రిందట ప్రకాశం చవగ్గా కొనడం జరిగిందనీ చెప్పింది. ఆ భూములు వ్యవసాయంక్రిందకు తీసుకొనిరావడానికి కృష్ణాజిల్లానుంచి కొందరు రైతులను వారి కుటుంబాలతోసహా ఆ గ్రామానికి తరలించుకొనిరావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయనీ, ఆ బృహత్కార్యక్రమానికి ప్రభుత్వ సహాయంకూడా తప్పక లభిస్తుందని తనూ, ప్రకాశం గట్టిగా ఆశిస్తున్నామనీ అంటూ సావిత్రి తన భర్త ఆదర్శాలనుగురించి విపులీకరించింది.

రామారావు ఓపికగా విన్నాడు. అవీ ఇవీ చెప్పి చివరకు విందుకు తనతో రమ్మని ఆహ్వానించింది సావిత్రి. 'అతను రానన్నాడు. ఆమె బల వంతంచేసింది. కాని అతను రానంటే రానన్నాడు. ఆయన స్వయంగా పిలవలేదని కోపమా అన్నది. విందుకు మీ అధికారులెవరైనా వస్తారని భయమా అన్నది. మీకు అంత అర్జంటుపనులు ఏమన్నా ఉన్నాయా అన్నది. నాతో ఒంటరిగా కారులో రావడానికి అభ్యంతరమా అని అడిగింది.

అన్నింటికీ అతను కాదన్నాడు. మరయితే రావడానికికేమని అంటే, ఆతను రానని మాత్రమేఅన్నాడు. పోనీ కారు మళ్ళీపంపమంటారా అని అడిగితే వద్దన్నాడతను.

"మీరీపూట నాతో రావడమే బాగుంటుంది. ఎవరైనా ఏమైనా అనుకొంటారేమోనని భయపడవలసిన అవసరం ఎంతమాత్రమూలేదు'' అని ఆగింది. క్షణంతర్వాత నెమ్మదిగా "ఆయనకు ఇటువంటి పట్టింపులేమిలేవు. ఉంటే మీరు ఇక్కడ ఇన్నాళ్ళు ఉండేఅవకాశం లభించేదే కాదుకదా ! అదీకాక ఇల్లాంటి సందర్భాలలో ఆయనహడావిడిగా ఉంటారు. నాతో ఎక్కువ మాట్లాడే అవకాశం ఉండదు. మీరు వస్తే మనం కాస్త మాట్లాడు కొంటూ ఉండవచ్చు" అనికూడా అన్నది సావిత్రి.

అన్నీ విని రామారావు రానన్నాడు.

సావిత్రి ఒంటరిగా వెళ్ళడానికేసిద్ధపడ్డది. ఆవిడ మూడింటికే ముస్తాబు ఆయింది. నాలుగింటికి కారు వచ్చింది. సావిత్రి బయలుదేరివెళుతూ అతని గదిలోకి వచ్చి, "సరే, మీరురానట్టేకదా : మరి నేను వెళ్తున్నాను. రాత్రికి మాకోసం ఎదురుచూడకండి. మీరు పెందరాళే భోజనం చేస్తారని వంటావిడతో చెప్పివెళుతున్నా.'' అని నెమ్మదిగా, ఒయ్యారంగా అడుగులో అడుగు వేసుకొంటూ నడచివెళ్ళింది కారుదగ్గరకు.

సావిత్రి బయటకు వెళ్ళినప్పటినుంచీ రామారావుకు తోచలేదు. ఊళ్ళోకివెళ్ళి అక్కడపనులు ఎలాసాగుతున్నదీ చూచివచ్చాడు. సాయంత్రం తోట అంతా ఒకసారి తిరిగివచ్చాడు. కొంతసేపు ముందు గదిలో కూర్చుని అక్కడ కన్పించిన మాసపత్రికలూ, పక్షపత్రికలూ.వారపత్రికలూ, దినపత్రికలూ–ఇంగ్లీషువీ, తెలుగువీ అన్నీతిరగేశాడు, లోపల

నుంచి ఓపుస్తకం తెచ్చుకొని చదవడానికి ప్రయత్నించాడుకాని ఆప్రయత్నం విఫల మైంది. మనసు ఎందుకో ఆరాటపడుతున్నట్టు అనిపించింది అతనికి. 'ఛ ఏమిటిది !' అనుకొన్నాడు. 'అయినా ఈ ఊళ్ళోనాకి ఉద్యోగంఏమిటి. కావాలని కల్పించుకొంటేకాని పనిలేదే: ఇక్కడకునన్ను పంపించారేమిటి? అని బాధపడ్డాడు. 'సావిత్రి నాతోఅలామాటాడకుండా ఉంటేనే బాగుంది. ఉండిఉండి మళ్ళీ ఎందుకివాళ మాటాడిందో !' అనుకొని మహాగింజు కున్నాడతను. ఎన్నెన్నో ఆలోచనలు అతన్ని పరిపరివిధాల కలవర పెట్టాయి. కొన్ని ఆలోచనలు అతన్ని భయపెట్టాయి. మరికొన్ని అతన్ని రెచ్చకొట్టాయి ఒకసారి ఎవరికీ చెప్పకుండా అప్పటికప్పుడు బయలుదేరి అక్కడనుంచి పారిపోవాలనికూడా అనిపించిందతనికి.

రాత్రిఎనిమిదికూడా కాకముందే భోజనానికి రమ్మని పిలుపు వచ్చింది. అతను వెళ్ళలేదు. మళ్ళీమళ్ళీ పిలుపు వచ్చింది. ఆపూట భోజనం చెయ్యననీ, ఏవైనా పళ్ళూ పాలు పంపమనీ నౌకరుచేత వంట మనిషికి కబురుచేశాడతను. ఆ పూట వాటితోనే సరిపెట్టుకొన్నాడు. తన గదిలోకి వెళ్ళి పడుకొన్నాడు. అరగంట తర్వాత మళ్ళీ చావడిగదిలోకి వచ్చి, అక్కడ సోఫాలో విశ్రాంతిగా కూర్చుని నిద్రపోవడానికి ప్రయత్నించాడు.

తొమ్మిది కావస్తుండగా నౌకర్లంతాఒకళ్ళొకళ్ళే నెమ్మదిగా వెనక ఇళ్ళల్లోకి వెళ్ళారు. అతను ఒంటరిగా అక్కడేకూర్చుని కళ్ళుగట్టిగా మూసుకున్నాడు. పదిఅయింది. కాలంకంటెముందుగా పరుగెత్తుతోంది అతని మనస్సు. అతనికి ఎంతకూ నిద్రరాలేదు.

సావిత్రికూడా రాలేదు.

పన్నెండు గంటలు కొట్టింది అతనికి ఎదురుగా ఉన్న గోడ గడియారం. అతను నెమ్మదిగా లేచి తన గదిలోకి వెళదామనుకొంటుం

డగా ఒక్కసారి గుప్పున అత్తరువాసన వచ్చింది. అంతలో వేయిమల్లెల నవపరిమళం అతన్ని ముంచెత్తింది. మరుక్షణంలో వెల్లివిరిసిన గులాబీల గుబాళింపు-సువాసనల వెల్లువలవెనుక గాజుల గలగలలు-కాలిమెట్టెల సన్న సవ్వడులు. నవ్వుతూ, హడావిడిగా, ఆర్భాటంగా ఆ చావిడిలోకి వచ్చింది సావిత్రి.

అక్కడకు చాలా ఆర్భాటంగా వచ్చింది సావిత్రి.

ఉద్యానవనంలోకి క్రొత్తగా వసంతం వచ్చినట్లుగా వచ్చింది ఆమె. క్రొత్తగా వయసువచ్చిన ఆడపిల్లకు ఎక్కడలేని అందం అంతా ఒక్కసారే వచ్చినట్లుగా వచ్చింది ఆమె. పండుగకు పుట్టింటికి వెళ్ళి పట్టుచీర కట్టుకొని, ఆర్భాటంగా అత్తవారింటికి తిరిగివచ్చిన క్రొత్తకోడలులా వచ్చింది సావిత్రి.

వస్తూనే అతన్ని చనువుగా పలుకరించిందామె. "మీరు రాలేదుకాని, విందుబాగాజరిగింది. చాలా సరదాగా గడిచింది" అన్నది ఆమె.

విందు గొప్పగా జరిగింది.

సావిత్రి ఎంతోసంతోషించింది.

ఆమె సంతోషంతో అంతలాపొంగి పోవడానికి మరో కారణం కూడా ఉన్నది. విందుకు వచ్చినవాళ్ళలో కొందరు ఆమె వంక కన్నార్పకుండా చూచారు. కొందరు ఆడవాళ్ళుకూడా ఆమెను ఎన్నోవిధాల మెచ్చుకొన్నారు. అందరి కళ్ళూఆమెమీదే ఉన్నాయనిపించింది ప్రకాశానికికూడా. అతను కూడా అందరిముందూ ఆమె అందచందాలు అభినందిస్తూ "ఏమిటి, ఇవ్వాళ ఇంత అందంగా కనిపిస్తున్నావ్ ? క్రొత్తకళ వచ్చింది నీ ముఖంలో'' అన్నాడు. ఆ మాటలకు సావిత్రి ఉబ్బి

పోయింది. అంతేకాదు, కొన్ని నిమిషాల తర్వాత అతను ఆమె ఒంటరిగా కన్పించినప్పుడు, ఆమె కళ్ళల్లోకి చూస్తూ, "విజంసావిత్రీ! నువ్వు ఇవాళ చాలా క్రొత్తగా వున్నావ్. అదుగో ఆయన స్వయంగా నన్ను అడిగారు, 'ఎవరావిడ' అని ఆశ్చర్యంగా. నేను చెప్పాను. నీకీ మధ్య పతిభక్తి ఎక్కువ అయింది. దానిఫలితమా ఏమిటి?" అన్నాడు.

సావిత్రి మొదట సిగ్గుపడ్డది.

ఆమె లోలోపల గర్వపడ్డది కూడానూ.

అంతలో అక్కడకు ఎవరో వచ్చారు. ప్రకాశం ఆయన్ను తీసుకొని అవతలకు వెళ్ళాడు.

విందుకు వచ్చిన ముఖ్యఅతిథికూడా సావిత్రిని అభినందించాడు ఆయన తనదగ్గరఉన్న గులాబీదండలన్నీ ఆమెకు కానుకగా ఇచ్చాడు అలా ఇస్తూ, ఇవి ఈమె దగ్గర ఉంటే ఆమె సహజ సౌందర్యానికి నవ పరిమళం అబ్బినట్టు అవుతుందనుకున్నారాయన చిరునవ్వు నవ్వుతూ. ఆయన పాశ్చాత్య దేశాలలో పర్యటించివచ్చిన ప్రముఖ పారిశ్రామికవేత్త. ప్రకాశానికి ఆయన సన్నిహితమిత్రుడుకూడానూ. ఆయన అభిమానానికి సావిత్రి మరింత గర్వపడ్డది.

మరికొంత సేపైన తర్వాత ప్రకాశం సావిత్రిని ప్రక్కవసారాలోకి పిల్చి, వెంట తీసుకొనివచ్చిన కళాకారుణ్ణి ఆమెకు పరిచయం చేస్తూ, "ఈయనపేరు రాజుగారు; చాలాగొప్పవాడు. ఈయన మంచివక్త. గొప్పకవి. అంతకంటే గొప్ప చిత్రకారుడు. ఈయనకు నిన్ను చూచి చిత్రం గీయాలని అభిలాషకలిగింది. ఆయనకు అటువంటి అభిప్రాయం కలగడమే గొప్ప అదృష్టం. ఒక్కసారి అలా కూర్చో. ఆయన నీ బొమ్మ గీస్తారు. నువ్వే ఆశ్చర్యపడతావు. నేను ఆయన వేసిన సుప్ర

సిద్ధ చిత్రాలు కొన్ని ఇంతకుపూర్వం చూచాను." అని చెప్పి తిరిగి అతిథుల దగ్గరకు వెళ్ళారు.

ఆయన దూరంగా నిల్చున్నారు.

ఆయన ఖరీదైన గ్లాస్కోధోవతి కట్టాడు. పల్చని సిల్కులాల్చీ వేశాడు. జరీ కండువా వల్లెవాటుగా వేసుకొన్నాడు. నొక్కులనొక్కుల పెద్దక్రాపు చక్కగా దువ్వుకొన్నాడు. తాంబూలం సేవిస్తూ, విడవకుండా ధూమపానం చేస్తున్నాడు. ఆయన ఎంతో నిర్భయంగా ఆమెవంక చూచాడు. 'ఆ చూపులో ఎంత ప్రగాఢమైన ఆకాంక్ష' అనుకొన్నది సావిత్రి. ఆయన చూపులతో ఆమెను వేధించాడు. ఆమెకు మొదట కోపం వచ్చింది. మరుక్షణంలో ఏదోబాధగా అనిపించింది ఆమెకు. ఆయనలో ఏదో విలక్షణమైన ఆకర్షణ కన్పించింది. అంతలో ఆమె హృదయము పరవళ్ళు త్రొక్కింది. లోలోన అణగిమణగి దాగిఉన్న ఒకానొక భావం రెచ్చగొట్టబడినట్లు అనిపించింది ఆమెకు. ఆయన ఆమెను చూచి నవ్వాడు. ఆమెకు పరమానందం కలిగింది. చిత్రంగా ఆమెవంకచూచి వెక్కిరించాడు; కవ్వించాడు. "కూర్చోండి." అన్నాడాయన. ఆమె కూర్చున్నాక ఆయన ముందుకు వచ్చి ఆమెవంక కొన్నిక్షణాలు కన్నార్పకుండా చూచాడు. ఆమెలో ఏమో విద్యుద్దీపాలు వెలిగించినట్లు అయింది. ఆయన ఆమె కళ్ళల్లోకి ఒకసారి విచిత్రంగా చూచాడు. ఆమెలో ఏదో మధుకీల రగుల్కొన్నట్లు అయింది. ఆయన ఆమెను నఖశిఖ పర్యంతం పరీక్షగా చూచాడు. అతిశీతల జలసమృద్ధమైన సరోవరంలో దిగినప్పుడు సర్వశరీరం జివ్వున ఒకసారి జలదరించినట్లు అయింది ఆమెకు. ఆయన ఆమెచుట్టూ చూచాడు, ఏదో చమత్కారంగా. ఒకసారి హఠాత్తుగా అర్ధ లిప్తకాలం చప్పున గట్టిగా ఆలింగనం చేసుకొని విడిచిపెట్టినట్లు అయింది ఆమెకు.

ఆయన ఆమెకు ఎదురుగా కుర్చీలో కూర్చొని కొంతసేపు కళ్ళు మూసుకొన్నాడు. ఆతర్వాత ఒక దళసరి కాగితముపై ఆమె ముఖ చిత్రం గీచాడు. ఆ చిత్రం చూచి ఆమె ఆశ్చర్య పడ్డది. ఆయన ఆచిత్రం ఆమెకు ఇస్తూ, "మీరు క్షమించాలి. నావల్ల అపరాధమే జరిగింది. ఆ విషయం ఇప్పటిదాకా నాకూ తెలియదు. ఇంక నే నటు రాను. మీరు నాకో ఉపకారం చెయ్యాలి. నే నిలా వెళ్ళినట్టు కొంతసేపుదాకా ఎవ్వరితో చెప్పకండి." అన్నాడు.

అలా అని ఆయన గబగబా బయటకు వెళ్ళిపోయాడు.

సావిత్రి ఆ చిత్రం అందరికీ చూపించి. అందరూ సంతోషించారు. ఆ చిత్రంమిషతో ఆమె అందచందాలు ప్రశంసించారు. ప్రకాశం రాజు గారిని ఘనంగా సన్మానిద్దామని అనుకొన్నాడు; కాని ఆయన కన్పించలేదు.

* * *

సావిత్రి రామారావుకు ఎదురుగా నిలబడి విందువిశేషాలు వివరించింది. అతను ఆమెవంక కన్నార్పకుండా చూస్తూ ఉండిపోయాడు.

రవ్వల దుద్దులవంక, రాళ్ళ నెక్‌లేస్ వంక, పట్టుచీరవంక, తలలో మల్లెపూల చెండ్లవంక. చేతిపై పేర్చుకొని తెచ్చిన గులాబీ పూలమాలల వంక అలా చూస్తున్నాడని అనుకొన్నది ఆమె మొదట. కాని మరుక్షణంలో అతను తన ముఖంవంకే, తన కళ్ళల్లోకే అలా చూస్తున్నాడని ఆమెకు స్పష్టమయింది. ఆతను దిగ్భ్రాంతి చెంది, మైమరచి, కళ్ళు వప్పగించి చూస్తున్నాడు. తన సర్వసౌందర్యం వెన్నెలగా మార్చి, తానేమో చకోరంగా మారి, వెన్నెలను తనివితీర గ్రోలుతున్నాడా అనిపించింది ఆమెకు. అలా అనిపించేసరికి ఆమె పట్టరానంత సంతోషంతో పొంగిపోతూ, చిరునవ్వు నవ్వుతూ, అప్రయత్నంగా

ముందుకు వచ్చి, చనువుగా అతని రెండుచేతులూ పట్టుకొని "ఏమిటి ఇవ్వాళ అంతా నావంక ఇలా చూస్తున్నారు ?" అన్నది. మెత్తని ఆమె అరచేతుల మృదుస్పర్శకు అతను నిలువునా పులకించిపోయాడు. అలా స్పర్శ కలిగినంత సేపూ అతని మనస్సు పరవళ్ళు త్రొక్కింది. మనసు ఆకర్షణకు లొంగిపోయింది. అప్పటివరకు మనసును అదుపులో పెట్టుకొందామనే అనుకొన్నాడతను. వ్యామోహాన్ని జయిద్దామనే అనుకొన్నాడు. కాని అదంతా ఆమె చేతి స్పర్శకలగనంత సేపే. ఆమె తన్ను తాకిన వెంటనే జయాపజయాల ప్రశ్నే లేకుండాపోయింది. అతనికి మనస్సంతా మబ్బు క్రమ్ముకొనిపోయింది. ఆవేశం మైకంలా వస్తునట్లుకూడా అనిపించింది.

ఆ ఆవేశం చిత్రమనిపించింది.

ఒకసారి బలవద్విషసర్పం తన్ను క్రమంగా చుట్టేసుకొనిపోతూ, నిలువునా నులిమివేస్తున్నట్టు ఉన్నది. ఒకసారి మహానదిలో జలప్రవాహం తనను సుడిగుండంలోకి లాక్కొనివెళ్ళి, గిరగిరా త్రిప్పి, కళ్ళు తిరుగుతున్న సమయంలో తనను అమాంతం ఏపాతాళానికో అదిమివేస్తున్నట్టున్నది. ఒకసారి ప్రళయపవనాల వేగాన దారంతెగిన గాలిపటంలా తను ఎగిరి పోతున్నట్టు ఉన్నది. ఒకసారి పెనుసుడిగాలిలో తవిలి కొన్ని క్షణాలు గిఱ్ఱున బొంగరంలాగా తిరిగి, అంతలో ఆకాశంలోకి ఎంతో ఎత్తుకు రావిఆకులా ఎగసి, దూరదూరాలకు కొట్టుకొని పోతున్నట్టున్నది. వింతవింత వైవశ్యం కలిగింది అతనికి. అంతులేని ఆనందం అర్ణవమే అయింది.

ఒకనిముషం తర్వాత అతని చేతుల స్పర్శకు ఆమెకూ అలానే అనిపించింది. ఊహాలోకంలో, మధురమైన స్వప్న జగత్తులో, హాయిగా స్వేచ్ఛగా విహరిస్తున్నట్టు అనిపించింది ఆమెకు. ఆమె ఎంత సేపైనా

అలాగేఉండిపోయేదేమో! కాని . . . కాని ఆతనికి ఆవేశం పట్టరాక పోయింది. అతను ఆమెచేతులు విడిపించుకొని ఆమెభుజాలు స్పృశింప బోయాడు. ఒక్కవేటున ఆమెను తనపైకి లాక్కొని గాఢాలింగనంలో బిగించేవాడే!

ఆతను అందుకు ఉద్యుక్తుడు అయాడుకూడానూ.

ఆమెకు చప్పున మెలుకువవచ్చినట్లు అయింది. మరుక్షణంలో దూరంగా జరిగి "అరే ఏమిటిది?" అంటూ ఆమె వెనుతిరిగి నెమ్మదిగా నడిచి, కిటికీ దగ్గరకు వెళ్ళి, కొంతసేపు బయటకు చూస్తూ నిలబడ్డది.

బయట చక్కని, చిక్కని వెన్నెల. ఆకాశం స్వచ్ఛంగా ఉన్నది. ఎంతో గంభీరంగా ఉన్నది. వియత్తలంనుంచి పాలుధారలు కడుతున్నట్లు వెన్నెలలు ప్రసరిస్తున్నాయి. వెలుగు వాగులై ప్రవహిస్తున్నాయి. వెన్నెల సర్వప్రపంచాన్నీ ముంచెత్తుతోంది. ప్రకృతి సమస్తం వెన్నెలలో తడిసి, పులుకడిగిన ముత్యంలా క్రొత్త మెరుపులతో వింతసొగసులు పోతున్నది.

తోటఅంతా నిశ్శబ్దంగా ఉన్నది. మూగనోముపట్టిన ముగ్ధలా ఉన్నది. తోటలో మలయమారుత ప్రసారానికి మల్లె, మాలతి, సన్న జాజులు తలలూపు తున్నాయి. ఆ పూదోట బాటలకు ఇరుప్రక్కలా పొదరిండ్లు గుసగుసలు పోతున్నాయి. ఉండిఉండి సుమపరిమళం గుప్పున నలువైపులా ఎగచిమ్మినట్టు ఒకసారి పైకెగసి ఉద్యానవనమంతా పరివ్యాప్తంఅవుతున్నది. ఊరికి కొంచెందూరంగా ప్రవహిస్తున్న సెలయేటి నీటి అలల గలగలలు వెన్నెల రూపు గొన్న అభిసారికల కాలిఅందెల రవళులలా విన్పిస్తున్నాయి. గాలి తాకున కొమ్మల రెమ్మల కదలికల వలన వెలువడిన సన్నసవ్వడులు విరహిణుల వేడినిట్టూర్పులలా విన్పిస్తున్నాయి.

వెన్నెలను చూచి సావిత్రి మురిసి పోతూ, ఈరుగాలికి రేగి ముఖంపై పడుతున్న ముంగురులు సవరించు కొన్నది.

మల్లెపూల నవపరిమళం, మత్తెక్కించే మరువపంతావి, సంపెంగల సువాసనలు మెల్లగా వీచే చల్లని గాలులతో కలిసివచ్చాయి. గాలులు మెల మెల్లగా వీచినప్పుడవి వేరువేరు సువాసనలు అనిపించాయి. అంతలో గాలి గట్టిగా వీచింది. ఆసువాసనాలహరులన్నీ కలసి పోయాయి. వాటి సమాహారపరిమళం మరీక్రొత్తగా ఉన్నది.

అతను ఆమెవంకే చూస్తూ ఉండిపోయాడు. ఆమె వెనుతిరిగి చూడలేదు.

కొంతసేపుతర్వాత అతను నెమ్మదిగా 'సావిత్రీ' అన్నాడు. ఆమె కదిలింది. కొన్ని క్షణాలతర్వాత ఆమె వెన్నెల వంకే చూస్తూ, తనలో తానే మాటాడుకొంటున్నట్టుగా, 'ఆయన ఎవరో అచ్చంగా మీలాగే ఉన్నాడు. అబ్బ నన్ను ఎంతవేధించాడు ! కాని ఆయన ఎంత గొప్ప వాడు ! ఆయన ఎంత గొప్పగా చిత్రించాడు నాచిత్రం !'' అన్నది.

రామారావు కొన్ని క్షణాలు తలవంచుకొన్నాడు. ఏదో ఆలోచనలో పడ్డాడు. అంతలో తెప్పరిల్లుకొన్నాడు. 'ఆయన ఎవరో అచ్చంగా మీలాగే ఉన్నా' రన్నమాటలు మళ్ళీ వినిపించి నట్లనిపించింది అతనికి. అను మానం కలిగిం దతనికి.

"ఏమిటి ఇదంతా నిజమా ?'' అని అడిగాడు రామారావు.

సమాధానం రాలేదు.

అతను తలఎత్తి చూచాడు. ఆమె అక్కడ కన్పించలేదు. కొన్ని క్షణాల క్రితం ఆమె అక్కడినుంచి ప్రక్కగదిలోకి వెళ్ళినట్లు ఏదో లీలగా జ్ఞాపకం వచ్చిందతనికి. అతను అటు చూస్తుండగానే-కళ్ళు పెద్దవి

చేసుకొని, పిచ్చిగా ఆమెవంక చూస్తుండగానే అటు వెళ్ళింది సావిత్రి. కాని ఆతను గమనించలేదు. మనసు ఎక్కడో ఉన్నది. మరికొన్ని క్షణాలతర్వాత ఆమె అలా అవతలకు వెళ్ళినట్లు నిర్ధారణ అయింది. ఆతను కొంతసేపు ఆమె వెళ్ళిన దారివంకే చూస్తూఉండిపోయాడు. ఆగుమ్మం అపవర్గదుర్గకవాటం అనిపించింది. ఆమె వెళ్ళినదారి నిత్యం నవవసంతశోభ వెల్లివిరిసేనందనవనానికి వెళ్ళే బాటలా కన్పించింది. ఆమెను వెనక్కు పిలవాలని అనిపించింది అతనికి. కాని అది సాధ్యం కాలేదు. మాట పెకిలిరాలేదు. అంతలో ఆమెను అలా పిలవడం వెళ్ళి పోయిన వసంతాన్ని వెనక్కు పిలవడం వంటిదని అనిపించింది.

అలాఅని ఆతనికి గట్టిగా, స్పష్టంగా అనిపించింది.

సావిత్రి ప్రక్కగదిలోకి వెళ్ళి, అక్కడ పెద్దసోఫాలో విశ్రాంతిగా కూర్చుని ఆలోచనలో పడ్డది.

రామారావు ఇక్కడ ఈ గదిలోనే కూర్చున్నాడు.

ఆమె కళ్ళు తెరచుకొనే చాలా మత్తుగా ఉన్నది. అతను కళ్ళు మూసుకొనే ఎంతో మెలకువగా ఉన్నాడు.

ఆమె అక్కడా, అతను ఇక్కడా ఒంటరిగా కూర్చుని తీవ్రంగా ఆలోచిస్తూనేఉన్నారు. ఏవేవో ఆశలు పెంచుకొంటూనేఉన్నారు. పట్ట రాని ఆవేశాలను అణచివేసుకోవాలని విశ్వప్రయత్నం చేస్తూనేఉన్నారు. రకరకాల భయాందోళనలకు గురిఅవుతూనేఉన్నారు.

అతని హృదయం ఆకాశం ఎత్తున ఉప్పొంగి పోతోంది. వరద దలలో ఉరకలు పెడుతున్న గోదావరిలా ఆమె హృదయం పరవళ్ళు త్రొక్కుతున్నది.

వారి ఇద్దరి హృదయాలూ పొంగిన రెండు మహానదులై అయాయి.

అవి ఒకదానికొకటి సమానాంతరంగా ప్రవహించాయి.

తెల్లవారింది. సావిత్రి చెరచెరా ఆతను కూర్చున్న గదిలోకి వచ్చింది. ఆతను తలఎత్తి ఆమెవంక చూచాడు. ఆమె కళ్ళు ఎఱ్ఱగా ఉన్నాయి. ఆమె చెక్కిళ్ళుకూడా ఎరుపెక్కాయి. రుసరుసలాడుతూ ఆమె ఆతనివంక కోపంగా చూచింది. మరుక్షణంలో తన కోపమంతా ప్రదర్శిస్తూ పెద్దపెద్ద అంగలువేస్తూ, అడుగులు గట్టిగావేస్తూ, ఆమె అక్కడనుంచి లోపలకు వెళ్ళిపోయింది.

*　　*　　*　　*　　*

ఆ గదిలో బల్లమీద కాగితాలూ పుస్తకాలూఅవీ చక్కగా సర్ది ఉన్నాయి. ఎన్నడూ అలా తీర్చిదిద్దినట్టులేవు. రామారావు నెమ్మదిగా బల్ల దగ్గరకు పోయి చూచాడు.

ఎవరో సర్దారు.

అవును, సావిత్రే సర్దిఉంటుందనుకొన్నాడు ఆతను. అంతలో ఆతనికి బల్లపైన ఉన్న కాగితం ఒకటి కనిపించింది. ఆతను చప్పున అది తీసుకొని చూచాడు.

బదిలీఉత్తరువది.

పై పదవిలో నియమిస్తూ ఆతన్ని అక్కడనుంచి బస్తీకి బదిలీ చేస్తున్నట్టు అందులో వివరించారుకూడానూ. తన కళ్ళను తనే నమ్మలేకపోయాడు. ఒకటి రెండుసార్లు అది చదువుకొన్నాడు. మొదట ఆతను సంతోషించాడు. అంతలో ఆతను భయపడి పోయాడు. మళ్ళీ బల్లవంక చూచాడు ఆ కాగితం అక్కడికి ఎలా వచ్చిందా అని సంశయిస్తూ. బదిలీ ఉత్తరువు ఉన్న కాగితంక్రింద మరో కాగితం అతని కంటపడ్డది.

'ఇదేదో ఉత్తరమల్లేఉందే.' అనుకొంటూ అతను దాన్ని ఆత్రంగా తీసుకొన్నాడు.

'రామారావ్ !' ఈవారంనుంచీ నీ కీ విషయం చెబుదామను కొంటున్నాను. నువ్వు ఒట్టిబక్కాడివి. ఏంభయపడిపోతావోనని చెప్ప లేదు. నువ్వు సావిత్రితో నామీద పిర్యాదు చేశావటగా. అది సరిగ్గా పిర్యాదు అనడానికి వీల్లేదనుకో, కాని మొత్తం మీద అది అటువంటి దేగా. అది కారణంగా నిన్ను ఇక్కడనుంచి బదిలీ చేయించాను. ప్రమో షనుకూడా వచ్చింది. ఆ పత్రాలు అవీ చూచావుగా. పెళ్ళాంపిల్లలకోసం నువ్వు అంత దిగులుపడ్డావేం. మరి నాతోనే ఎందుకు చెప్పలా ? ఈ మాట అంటే నేను నవ్వు తాననికూడా అన్నావుటగా ! మరి అది మాత్రం నిప్పుదా !... కాని అది పరిస్థితి సరిగా అర్థంచేసుకొన్నదిలే. అన్నట్టు మరిచాను; మరో విషయం చెప్పనా ? దగ్గరవాడవు కనుక చెబుతాను. ఆమధ్య దానికి 'భక్తి' ఎక్కువయింది. అది కారణంగా కాబోలు కొన్నాళ్ళు ఇంట్లో ఎవరితోనూ మాటాడడం మానేసింది. సరే అవన్నీ ఎందుకుగాని, మొన్న ఆ మధ్య విందు అయిన కొద్దిరోజులకు కాబోలు నే నే అడిగాను-మరినీకీసారి ఏం బహుమానం కావాలని. మీకే నేను బహుమానం ఇవ్వబోతున్నానన్నది. నెమ్మదిగా శుభవార్త బయట పెట్టింది. మరి ఇప్పుడు చెప్పు ఏం కావాలో అన్నాను వెంటనే. నీకు ప్రమోషను ఇప్పించి తిరిగి మీ ఊరికి బదిలీ చేయించమని అది కోరింది. ఫలితంగా ఇలా జరిగింది.

రామారావ్ నువ్వు ఒట్టి భయస్తుడవని నాకు తెలుసు. దాని మనసూ తెలుసు నాకు. అందుకే-ఎటువంటి అనుమానాలకు ఆస్కారం లేదు-నాకన్నీ తెలుసుకనుక. అది నిన్ను ఇంటికి పంపమని గట్టిగా కోరింది. అదీకాక అంతకుముందు నువ్వూ అడిగావు-ఏలాగో ఓలాగు

బదిలీ చేయించమని. అప్పుడు నేను పట్టించుకోలేదు. నీ మీద ఉండే అభిమానమే అందుకు కారణం. సరే ఇప్పుడు నీ కోరిక నెరవేరింది.

నీకు జ్ఞాపకం ఉందీ . . .

నేను కంట్రాక్టుపనులు ప్రారంభించిన క్రొత్తరోజులలో నువ్వు నాకో చిన్న సాయం చేశావు. అప్పుడే డబ్బు ఇస్తానంటే వద్దంటే వద్దన్నావు. ఆపని మూలంగా ప్రభుత్వానికి నష్టంకానీ లాభంకానీ లేదు. 'రూల్సు' అంగీకరిస్తాయి కనుక చేశానని వాదించావు. ఏదో భయపడి డబ్బు వద్దంటున్నావని వచ్చేశాను అప్పుడు. అబ్బో! అది ఏనాటి విషయం! నేను ఇప్పుడు బాగా పైకి వచ్చాను. ఈ విధంగా నీకు ప్రతిఫలం చెల్లించుకోకలిగినందుకు సంతోషం.

మనం ముగ్గురం సహాధ్యాయులం.

ఒకరిమనసు ఒకరు తెలుసుకొన్న వాళ్ళం. అందువల్ల నువ్వు అనవసరపు విషయాలేమీ మనసులో పెట్టుకోకు. భార్యాపిల్లలతో నువ్వు అన్ని విధాలా సుఖపడాలనే అదీ నేనూ కోరుతున్నాం.

—నీ మిత్రుడు
ప్రకాశం.

ఉత్తరం చదవడం పూర్తి అయేసరికి రామారావుకు కాళ్ళు వణకడం మొదలు పెట్టాయి. అతనికి భయంవేసింది, అతనికి కోపం వచ్చింది; మరుక్షణంలో బాధ కలిగింది. పదినిమిషాలదాకా అతను స్తబ్ధంగా ఉండిపోయాడు. కొంతసేపు తర్వాత తేరుకొని, ధైర్యం తెచ్చుకొని, ముందుకు వెళ్ళి, అక్కడ కుర్చీలో కూర్చున్నాడు. ప్రకాశాన్నీ, సావిత్రినీ సరిగా అర్థంచేసుకోడానికి ప్రయత్నించాడు.

ఆమె ఎత్తుగడ అర్థం అయింది. అతను చప్పున కుర్చీలోనుంచి లేచి నిలబడ్డాడు. ఆమె తనను వెళ్ళమన్నట్టు అనిపించింది. అతను అప్పటి కప్పుడు ప్రయాణమయాడు. మంచిబట్టలు వేసుకొని, నౌకరును పిలిచి సామాను సర్దించాడు. పెట్టె, బెడ్డింగు నౌకరు తీసికొని వెళ్ళి బండిలో పెట్టాక, అతను నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకొంటూ తలవంచు కొనే ప్రకాశం ఉన్న గదిలోకి వెళ్ళాడు. ఒక క్షణం దూరంగా నిలబడ్డాడు అతను.

"సెలవు మరి" అన్నాడు రామారావు అతికష్టంమీద. అతనికి మాటలు ఒకపట్టాన పెకిలిరాలేదు.

"శుభం" అలవోకగా పలికాడు ప్రకాశం.

"ఒక క్షణంతర్వాత క్షేమంగా వెళ్ళిరా" అనికూడా అన్నాడు అతను.

ప్రకాశం ఎంతో ప్రసన్నంగా, ప్రశాంతంగాకూడా కన్పించాడు. అతను చిరునవ్వు నవ్వుతూ ఏవిధమైన కోపం లేకుండా, ఎంతో సహ జంగా అన్నాడా మాటలు. అతను నిండుహృదయంతో వీడ్కోలు చెప్పినట్లు అనిపించింది రామారావుకు. అతని చిరునవ్వు ఎంతో మైత్రీ రమ్యంగా, హృద్యంగా ఉన్నది. మళ్ళీ అందులో ఎంతో అనునయం ఉన్నది. హుందాగా కూడా ఉన్నది ఆ చిరునవ్వు.

రామారావుకు హృదయం తేలిక పడ్డది.

అతనికి కృతజ్ఞతాపూర్వకంగా నమస్కారంచేసి నెమ్మదిగా వీధి గుమ్మం వైపు వెళుతుంటే "దానితోకూడా చెప్పివెళ్ళవయ్యా–అదిమన మర్యాద" అన్నాడు ప్రకాశం కొంచెం పెద్దగా, శాసిస్తున్నట్లుగా. అది

పితృవాక్యంలాభావించి, వెంటనే వెనుదిరిగి, లోపలకు వెళ్ళాడు రామారావు.

అతను సావిత్రి ఉన్న గదిలోకి వెళుతూ ఆమెను ఎన్నో అడుగుదామనుకొన్నాడు. ఆమె ఫిర్యాదు స్వరూపం ఏమిటో అర్థంచేసుకోడానికి ప్రయత్నించాడు. తను ఏమీ అడుగక ముందే ఆమె తానుగా ఏమో చెబుతుందనీ ఆశించాడు. కాని, తీరావెళ్ళాక, ఆమెముందు ఏమీ మాటాడలేక పోయాడు.

అతన్ని చూచి. సోఫాలో కూర్చున్న మనిషిలేచి నిలబడ్డది. ఆమె కొంత సేపు మాటాడలేదు. మొదట ఆమె అసలు అతనివంకే చూడలేదు, అతను నెమ్మదిగా ముందుకువచ్చి ఆమెకు ఎదురుగా నిలబడి "మరి నాకు సెలవుఇప్పిస్తే వెళతాను'' అన్నాడు.

సావిత్రి కొన్నిక్షణాలు అలాగే నిలబడి, నెమ్మదిగా వెనుతిరిగి, సోఫా దగ్గరకువెళ్ళి. అక్కడ దిండుక్రిందబెట్టిన కాగితం ఒకటితెచ్చి, అతని చేతికి ఇచ్చింది. తలవంచుకొని అతనిముందు నిలబడ్డది. కొన్నిక్షణాల తర్వాత ఆమె నెమ్మదిగా మాటాడింది. "దీనికి ఒక సుప్రసిద్ధ చిత్రకారుడు గీచిన ముఖచిత్రం ఆధారం. అదినాది. ఇది మీది. ఇది కూడా అంత గొప్పచిత్రమే. ఇది నాఅభిమానానికి చిహ్నంగా మీదగ్గర ఉంచుకోండి. ఇకమీరు వెళ్ళండి. మీకు అన్నివిధాలా శుభం కలుగుతుంది'' అని ఆమె వెనుతిరిగింది.

మున్ముందుగా అతనికి ఆమె అభిమానం అర్థమయింది. ఒక్కసారి విద్యుదాఘాతం తగిలినట్లుగా అతను స్తంభించిపోయాడు. మరు నిముషంలో అతను తేరుకొన్నాడు. ఒకానొక మధురమైన భావం కలిగింది. హృదయభారం తగ్గింది. అతను నెమ్మదిగా వెనుదిరిగి, తలవంచుకొని, మధురభావనలో మునిగిపోతూ ముందుకు నడిచాడు. అగదిగుమ్మం

దాటాక అతనికి చేతిలోఉన్న చిత్రం విషయం జ్ఞాపకం వచ్చింది. అతను చప్పున అది పైకిఎత్తి దానివంక చూచాడు.

ఆతను చకితుడయాడు.

అది ఆతనిభార్య ముఖచిత్రం.

అతను కొంతసేపు అక్కడే నిలబడిపోయాడు. కొద్ది నిముషాల క్రితం సావిత్రి అన్నమాటలు నెమ్మదిగా జ్ఞాపకం చేసుకొన్నాడు. అంతకంటె నెమ్మదిగా ఆ మాటలు అర్థం చేసుకొన్నాడు. అతనికి ఒక అనుమానం కలిగింది. అంతలో అప్పటిదాకా తన గదిలో బల్లమీద ఉన్న తన భార్యఫొటో సామాను సర్దుకొనేటప్పుడు తనే స్వయంగా పెట్టెలో భద్రపరచిన విషయం జ్ఞాపకం వచ్చేసరికి అతనికి మొదట కలిగిన అనుమానం నివృత్తి అయింది.

రామారావు నవ్వుకొంటూ గబగబా వీధిగుమ్మంవైపుకు నడిచాడు.

-. (ooOoo) :-